

జ్ఞాన యోగం
విచారణ
జీవన వేదం



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020050018257

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

సమన్వయగ్రంథమాల. ౧.

జీవనవేదము.

(శ్రీమదాచార్యకేశవచంద్రుని నిజానుభవసిద్ధస్వకీయజీవనతత్త్వము.)

కవుకొండల సాంబశివరావుచే

వంగభాషనుండి యాంధ్రీకరింపఁబడి,

శ్రీ సుజనరంజనీముద్రాక్షరశాలయందు

పోతాప్రగడ బ్రహ్మానందరావుగారిచేఁ

ముద్రితమై

యనువాదకునిచేఁ బ్రకటింపఁబడియె.

కాకినాడ.

1911.

విషయసూచిక.

ఉద్బోధన.

హా ! జీవనవేదమా ! నీకు నమస్కారము. మదీయహృదయానందమా ! నీకు నమస్కారము. తిరిగి నిన్నును నొక పుత్తలికముఁ జేతునే ! ఛీ ! ఛీ ! తిరిగి యాచర్విత చర్వణమార్గమునందుఁ బడను. అయినను నీకు నమస్కరింతు. మదీయ నవజీవనంబునకుఁ గారణంబవీవ. ఏమని చెప్పుదు, తల్లీ ! నాఁడు నిన్ను నమ్ముకొనుటఁ బట్టియే, యింటనుండి బయల్వెడలనడంచి, యరణ్యములపాల్చేసితివి ! కాని యీశ్వరప్రసాదముచేఁ దిరిగి గృహముఁ జేరితిని. అప్పటినుండియు నెన్ని చెరువుల నీరు ద్రాగించితివి. ఇంకను ద్రాగుచున్నాను. ఇంకెల్లకాలము ద్రాగుదును. తల్లీ ! నిజముగ నీవు జీవనమునకు వేదంబవు. భవద్దివ్యశక్త్యావేశమునఁ బడి, మత్తుఁడై, యీతుచ్ఛమానవుండు నీకాంధ్రభాషానూతనవసనంబును ధరియింపనిచ్చె. నీవీనూతనవస్త్రధారణమునం దెల్లకాలము విలసిల్లుచుండుము. ఈ యొక జీవనము నే కాక యింకను నాంధ్రదేశమందలి నానామానవుల ప్రాణములను గలవరపెట్టుము. దేశంబంతయుఁ ద్వదీయవజ్రాఘాతమునఁ బడి నవజీవనధారి యగుఁ గాక ! వంగదేశములో నెంతెంతమంది జీవనముల నీవు దద్దఱిలఁ జేయుచున్నావు. ఇంకను జేయుము. దీర్ఘాయుష్మంతురాలవై చిరకాలము వర్ధిల్లుము. భగవానుఁడు నిన్నాశీర్వదించును గాక !!

హా ! కేశవచంద్రా ! హా ! బ్రహ్మానందా ! హా ! మదీయాచార్యోత్తమా ! నీకు నమస్కరింతు. నన్నే నాఁడు పట్టితివో కాని, నీవు గట్టిగఁ బట్టితివి. ఇఁక వదలునట్లు లేవు. నాకును వదలించుకొన నిష్టము లేదు. చిరకాలము పట్టియుండుము. నీ వెన్ని సత్యములఁ దెల్పితివి. ఎన్నిటికర్థమును జెప్పితివి ! ఎన్ని సమస్యలఁ దెగఁగొట్టితివి ! ఎన్ని తత్త్వముల

బోధించితివి! ఎంతమంది సాధుసాధకుల, యాచార్యుల, ధర్మప్రవర్తకుల దివ్యదర్శనంబునకు మూలసూత్రింబులఁ దెలియఁబఱచితివి! నీకు నమస్కారము. నేఁడేలోకమునను న్నావో నేనెఱుంగ. ఎక్కడనున్న నేమి దీర్ఘాయుష్మంతుఁడవై వెలుంగుము. నీబంధుగులగు నీశామోశాలును (Jesus and Moses), బుద్ధసాక్రెటీసులును, మహమ్మదుచైతన్యులును, ఋషిప్రవరాదులును జిరకాలము నీతోడ వర్ధిల్లుదురుగాక !

హా! భగవానుఁడా! నీకు నమస్కారము. నన్నుఁ జిరకాలము నీకీర్తిత దాసుఁడుగఁ జేసియుంచుకొనుము. నేనెన్నఁడును జెడత్రోవలఁ బోకుందునుగాక! నీకును నాకును మధ్య నేదియు నడ్డము రాకుండును గాక! తండ్రీ! నన్నింకెన్నఁడును వదలకుము. వదలకుము. తండ్రీ! వదలకుము. ముమ్మాటికిని వదలకుము. ఎల్లకాలము నీక్రోడమందుంచు కొనిజోకొట్టుము. నాఁడు మహారణ్యములోఁబడి పలుసంశయములకుఁ బాలై, త్రోవఁగానకున్న పుఁడీజీవనవేదంబును జేతఁబట్టించితివి. ఏ నాఁడు పట్టించితివో కానియిది వదలకున్నది. ఎన్నఁడును వదలనీకుము. తండ్రీ! నేఁడీకార్యంబును నీవీదుర్నీతిపరునిచేఁ జేయించుకొంటివి. వీఁడును గృతార్థుఁడయ్యెను. ఈగ్రంథరాజంబును జదివి యందఱును గృతార్థులగుదురుగాక !

నవవిధానమా! నీకు నమస్కారము! నిన్నాశ్రయించితి. ఆశ్రయించినవారిని వదలుట న్యాయమా! అట్లైన నాకన్యాయముఁ జేయక సదాయాశ్రయమిమ్ము. బ్రహ్మసమాజమా! నీకును నమస్కారము. బ్రాహ్మభ్రాతలార! మీకును నమస్కారము. ఎల్లకాలము మీకు దాసుఁడను. మనుష్యమాత్రుండను. ఈదాసుని నాశీర్వదించి, వీనిసేవలగ్రహింపుఁడు. ఇతఁడును గృతార్థుఁడగును; మీకును పకారంబగు. మన

యాంధ్రదేశపు బ్రహ్మసమాజములందింకను నూతనజీవన సంచారం బగుచుండుట లేదు ఇకార్యంబునకై యీ దాసుఁడు చేయు యత్నము లందుఁ దోడ్పడుఁడు. ఈగ్రంథమును జదివి నవజీవనవస్త్రధారుల రగుఁడు. ఈషోడశోపదేశంబులును భారతవర్షీయ బ్రాహ్మసమాజంబున నచ్చటి వేదినుండి ప్రోక్తంబులయ్యె. అందు మొదటిది బెంగాలీ. శ. ౧౮౦౪. సll శ్రావణము. ౭వ తేదీకి (దాదాపు) సరియైన క్రీ. శ. ౧౮౮౨. సll జూలై. ౨౩వ తేదీనాఁడారబ్ధమయ్యె. ప్రథమాధ్యాయం బుఁ జదివితిరేని స్వాభావిక ప్రార్థనయెట్టిదో యెఱుంగఁగల్గుదురు. ప్రార్థనాశీలురరగుదురు. ద్వితీయాధ్యాయంబు జీవనమునందలి నానా పాపములఁ బ్రదర్శింపఁజేసి మిమ్ములఁ జక్కజాగరూకులనుగాఁ జేయును. మీరచ్చటనుండ బయలుదేఱి, తృతీయఘట్టంబునకుఁ బోయి చేరితిరేని యక్కడ నగ్ని మండుచుండును; అక్కడనే జాగ్రత్తతో మెలంగ వలయును. అనేకులా ప్రజ్వలితాగ్నిలోఁ బడిపోదురు. కాని తిన్నఁగఁ జుక్కానిని ద్రిప్పుకొనఁగలిగితిరేని, మీయోడ భద్రంబైయుండు. మీరగ్నిమయోత్సాహమును దాల్చియుందురు. అక్కడనుండి మెల్ల మెల్లన జరిగిపోతిరేని, చతుర్థస్థానంబునకుఁ బోయి చేరుదురు. ఇక్కడ వైరాగ్యంబున కర్థంబు తెలియును. ఇది వైరాగ్యపర్వంబు. ఇంకను బోండు. పంచమాధ్యాయంబున నొకవైపున నధీనమునుండియు, మఱియొకవైపున స్వేచ్ఛాచారమునుండియుఁ దప్పించుకొని యథార్థ స్వాధీనపక్షులై విహరింతురు. షష్ఠాధ్యాయమున వివేకంబును బట్టు కొందురు. దీనియాథార్థ్యమును జక్కఁగఁ గ్రహింపుఁడి. దీనిని గొందఱాత్మసాక్షి యందురు. దీని నిజానిజములు తెలియవేని బలు మోసం బునఁ బడుదురు. కాన నీయధ్యాయంబును జాలుమాఱు పఠింపుఁడి. ఈవివేకంబునే మీరు పట్టుకొనఁ గల్గితిరేని మీనావ కెన్నండును భయమును

మాటలేదు. సప్తమాధ్యాయంబున యథార్థ భక్తినిజూతురు. అష్టమాధ్యాయంబున వాస్తవిక లజ్జాభయంబుల ప్రకృతిని జూడనగును. నవమాధ్యాయం బతిమధురంబు. దానిని దిన్నగఁ జదివితిరేని మీకు బ్రహ్మదర్శనంబగును. త్వరపడుఁడు. దశమాధ్యాయంబద్భుతంబు. ఇదిమీకుఁ బట్టెనేని మీరిఁకఁ బార్థివగణనంబును మానుదురు. ఏవిషయమునందును భావనకు సందియరు. పరిపూర్ణవిశ్వాసులరగుదురు. ఏకాదశాధ్యాయంబు మీజీవనములందు జీర్ణితంబయ్యెనేని మీరిఁక సకలసద్విషయములందును జయమునేపొందుచుందురు. ద్వాదశాధ్యాయంబు నవవిధానమునకుఁ గొంతవఱకర్థంబుఁ దెల్పు. త్రయోదశాధ్యాయంబు ధర్మజీవనంబునఁ గ్రమముగఁ బరిపక్వంబగు భావత్రయంబుఁజూపు. చతుర్దశాధ్యాయంబు మీమీజాతుల నిర్ణయించు. పంచదశాధ్యాయంబుమిమ్ములవినీతులఁజేసి సకలజడజీవపదార్థముల యొద్ద శిక్షఁగఱపఁజేయు. షోడశాధ్యాయంబు జీవనవేదంబు యొక్క మర్మంబుఁదెల్పు. ఈగ్రంథరాజంబుయొక్క వాస్తవంబిది. దీనిచే మీరు ధన్యులరగుదురుగాక !

హా ! ప్రతాపచంద్రా ! ఈసందర్భంబున నిన్నును దేవలసియున్నది. శ్రీకేశవచంద్రుఁడు నీకుసఖుండనియు, నాచార్యుండనియు, నేతయనియు, నీవేకదా చెప్పితివి. అవ్వాని జీవనమునందనేకములగు వింతవింత ఘటనములు ఘటిల్లెఁగదా ! ఎన్నెన్ని గందరగోళములు జరుగలేదు ! ఒక్కొకతఱి యెట్టినమన్యులుద్భవింపలేదు ! ఆయన జీవనముననేకులు గ్రహింపఁజాలరైరి. పలువురు పలువిధములుగఁ బల్కిరి. ఎవరికేదితోఁచెనో వారద్దాని నుడివిరి. కేశవచంద్రుఁడిదంతయుఁజూచి కడువిలపించినదియు నీవెఱుంగవే ! నీవుమాత్రమాయన జీవనమును జక్కఁగ గ్రహింపఁగల్గితివా ! ఆయన యంత్య

కాలమునకొక సంవత్సరమున్నరకుఁ బూర్వమాయన డార్జిలింగులో వాయుపరివర్తనార్థమై యుండు సమయమున నొక్కనాఁడు నీవా మహాపురుషుని చెంతఁజేరి, "ఆచార్యా! మీజీవనోపాయమెట్లు జరుగుచున్న" దని (అనఁగా మీయిల్లెట్లు గడచుచున్నదని) యడిగితివి కదా! ఆమాటలువిని బ్రహ్మానందుఁడు తనజీవనములోని సామాన్య విషయములగురించియుఁ దనయాప్తమిత్రులకుఁగూడఁ దెలియకుండుటకుఁజింతిల్లి, యిప్పటికినీతో మాత్ర మావిషయమై శ్రీకాంతిచంద్రునికిఁ దప్పయింకెవరికిని దెలియదనియు, నాతఁడే యాసంగతుల గురించి యించుక తెలుపఁగలుగుననియుఁ, దక్కినవారు చెప్పఁబూనుట యనుచితమనియుఁ జెప్పుచుఁ, దాను లోలోపలఁ దనజీవన మిటివాటికే నానావిధములగు మిథ్యాకల్పనలతో నింపఁబడినదనియుఁ దానే త్వరలో నాత్మజీవనసూత్రములను వ్యక్తీకరింపనియెడల నింకను హాని వాటిల్లుననియు గ్రహించి, ఆయనకుండు స్వభావరీతి నీనానావిషయముల నీశ్వరసాన్నిధ్యమునఁ బెట్టి, యాసందర్భంబున నెట్లుమెలంగవలయునో తెలిసికొనుటకై యెంతయో ప్రార్థించి, తనమనోవేదనల వెలిపుచ్చెను. ప్రతాపచంద్రా! ఈ వేదనల యొక్కఫలమే కదా యీమనజీవనవేదము. కావున దీనికి నిమిత్త కారణుండవైన నీకును ధన్యవాదముల నర్పింతు.

హా! నాగేంద్రచంద్రమిత్రా! నీకును నమస్కారము. "నూతన వార్తా" లేఖకుండగు నాప్యారీమోహన్ యీజీవనతత్త్వోపదేశ దినములలో నెడనుండెనో కాని నీవానమయమున కాదుకొని, యీ షోడశోపదేశంబులను లిఖించియుండవైతివేని మాగతియేమి కావలసి యుండెనో! ఈదుర్భగుని గతియేమగునదో! కావున నీకును నమస్కారము. ఈమానవుఁడు నిన్నెప్పుడును స్మరించు! ఈగ్రంథమును గొనియాడు నెల్లవారును నిన్నును నాశీర్వదింతురుగాక !

ఇంక నందఱకు నావందనములనర్పించెద. శ్రీ కేశవచంద్రునిం గన్నతల్లీ! నావందనములు. నాకునవవిధాన ధర్మసమస్యలకర్థముల సూచించినయార్యులార! నావందనములు. నాకీవంగభాషంగఱపిన మిత్రులార! నావందనములు. నన్నుసంవత్సరత్రయంబు నవకాశీ ఘట్టంబుననుండంగంజేసినపెద్దలార! నావందనములు. దీనిని వెలిగింప నిమిత్తకారణుండవైన నామిత్రమా! నావందనములు. దీనిని సంస్కరించినపూజ్యులార! నావందనములు. దీనినిముద్రింపనుత్సాహపఱచిన స్నేహితులార! నావందనములు. దీనినిముద్రింపించినముద్రాధిపతీ! నావందనములు. ఇందలియచ్చుందప్పులను సంశోధించినమాన్యులార! నావందనములు. ఈముద్రణభారమునువహించిన బంధువా! నావందనములు. ఈపొత్తముం జదువుపాఠకులార! నావందనములు. ఇంకనెంతెంతమందిని వదలివేసితినో యామీకందఱకు నావందనములు. ఇంకను ననేకవిధములుగ నీకార్యమునందుందోడ్పడిన జడములని పిలువంబడు నానాపదార్థములార! మీకును నాసంపూర్ణవందనములు. అన్నిటిని ఘటిల్లంజేయు నాయీశ్వరా! నీకు మదీయమనఃపూర్వక పిసిత వందనంబు!!!

బ్రహ్మప్రచారాశ్రమము.
మచిలీపట్నము.
౧౦ వ సెప్టెంబరు, ౧౯౧౧.

ఇట్లను వాదకుండు.

జీవన వేదము

ప్రథమాధ్యాయము.

ప్రార్థన.

భానువారము ౨ శ్రావణము-౧౮౦౮ శకము.

శ్రీ వేద నుండి జీవన గ్రంథము యొక్క మహిమను వర్ణించి యనేక దినము లయినది. సకల గ్రంథముల కంటె శ్రేష్ఠ గ్రంథము జీవనము. విశ్వాసి జీవనము, సాధకుని జీవనము, సర్వ శ్రేష్ఠము. సకల వస్తువుల కంటె నాదరణీయము స్వకీయ జీవనము. బ్రహ్మాండపతి మనుష్య జీవనమునే కనుక వేద వేదాంతముల కంటె శ్రేష్ఠముగా రచన చేసి యున్న యెడల నాత్మ జీవనమును భక్త మండలిలో వ్యక్తీకరించుట యెల్ల విశ్వాస పరులకును గర్తవ్యము. అందుచేతనే పరమేశ్వరుని యాదేశము వలన నీవ్యక్తి యొక్క జీవ చరిత్రము సల్లేఖింపఁ బూనుచున్నాను. ఆలోకేశుఁడు గణేశుఁడు, పరేశుఁడు, మహేశుఁడు, ఎవ్వఁడో వానిని స్మరించి ఆయన శ్రీ పాద పద్మములకుఁ బలుమాఱు ప్రణమిల్లి యీ సుమిష్ట మధుమయ కార్యము నందు దిగుచున్నాను.

నా జీవన వేదము యొక్క ప్రథమ విషయము ప్రార్థన. ఎవరును సహాయము చేయనప్పుడు, ఏ ధర్మ సమాజము నందును సభ్యుఁడు గాఁ బ్రవేశింప నపుడు, నానా ధర్మములన్ను బరిశీలించి యేదో యొక ధర్మమును స్వీకరింప నపుడు, సాధు సాధకుల శ్రేణిలోఁ జేర నపుడు, ధర్మ జీవనము యొక్క యా ఉషఃకాలమున "ప్రార్థన చేయుము. ప్రార్థన చేయుము" అను నీ భావము, అను నీ శబ్దము అంతరంగమున నావిర్భవించెను. ధర్మమన నేమో యెఱుఁగను; ధర్మ సమాజ మెక్కడ నో యెవ్వరును జూప లేదు ; గురు వెవ్వరో

యెవ్వరును జెప్ప లేదు. విపత్సంకటముల త్రోవలో నండగా నుండ నెవ్వారును సాహసింప రైరి. నా జీవనములో నట్టి సమయము నందు దివ్యాలోకనము యొక్క ప్రథమాభాసస్వరూపమైన, "ప్రార్థన చేయుము. ప్రార్థన కంటె వేఱు గతి లేదు" అను నీ శబ్దము వినంబడుచుండెను. ఏల ప్రార్థన చేయ వలెనో, దేని నిమిత్తము ప్రార్థన చేయ వలెనో, యదియును జక్కఁగా నెఱుఁగ నైతి; తర్కించు సమయమును అప్పటికి రాలేదు. ప్రార్థన యెందులకుఁ జేయ వలయునో జిజ్ఞాస చేయఁ దగినట్టి పురుషు లెవ్వరును గనఁ బడ లేదు. ఎవరు ప్రార్థన చేయు మన్నవారు? దీనిని గుఱించియు నెవ్వరిని నడుగ లేదు. భ్రాంతి కావచ్చునను సందేహమును గలుగ లేదు. ప్రార్థన చేసితిని. శంకు స్థాపన కాలమున మందిర సౌందర్యము నెవరు చింతింతురు? కిటికీల కేరఁగు వేయింతు నని మనుష్యుఁ డప్పు డాలోచించునా? అప్పుడు నిశ్చల భావముతోఁ గేవలము పునాదినే వేయవలెను. "ప్రార్థన చేయుము; బ్రతుకుదువు; పరివర్తన చక్ర నగును; సర్వార్థములును సమకూఱును." అను నీ వాక్ఝరియే జీవనము యొక్క పూర్వ దిక్కు నుండి పశ్చిమ దిక్కునకును, ఉత్తర దిక్కు నుండి దక్షిణ దిక్కునకును బ్రవహించుచుండెను. ఈ భావనలో నిరంతరము మునింగి యుంటిని; ఈ కర్మములోనే మగ్నుఁడ నైతిని. ప్రార్థన గురువు; అసహాయ జనులకు నపార సహాయము. ఈ యొక్కనినే యెఱిఁగి యుంటిని; ఈయొక్కనిలోనే పరిచయము కలిగినది; ఇంకెవరి నెఱుఁగ నైతిని. ధర్మ బంధు లెవరును లేరు.' ఆకసము వైపునకుఁ జూచు వాఁడను గాని, ఏ విధానమును గూర్చియు విను వాఁడను గాను, ఎట్టి ధర్మ తత్త్వమును గ్రహింపఁ గలవాఁడను గాను. చర్చికి* వెళ్ళనా, లేక మసీదునకు వెళ్ళనా, 'దేవాలయమునకు వెళ్ళనా,

* క్రైస్తవుల దేవాలయము.

లేక బౌద్ధుల దళములోఁ గలసి పోనా, యను నట్టి దేనినిగుఱించియు నాలోచించువాఁడను గాను. ప్రథమమున నే, వేద వేదాంతముల కంటె కొరాన్* పురాణముల కంటె, శ్రేష్ఠమైన యే ప్రార్థన కలదో దానినే యవలంబించితిని. నేను విశ్వాసిని, తర్కింతును ; దానిపై నింకను విశ్వసింతును. ఒకమాఱు విశ్వసించిన యెడ, విఁకఁ దిరుగను. చూచి యొక్క క్షణములో తత్త్వము గ్రహించితిని. కాని దాని లోఁతు అందినదా? విచారణలో నీప్రశ్న పుట్టెను. "అందినది ; ఇంకను నడు." అను నీప్రత్యుత్తరము దొరకెను. ఉదయమున నొకటియు, రాత్రి మఱియొకటియు వ్రాసి ప్రార్థన సాధన చేయుట కారంభించితిని. క్రమముగా నుషఃకాలము నుండి ప్రాతఃకాలమునకుఁ జేరితిని. క్రమమునఁ బొద్దెక్క నారంభించెను. నలుదిక్కులు నంధకారమున నాచ్ఛన్నమై యుండెను ; ఇపుడు తెల తెల నాయెను. ఇల్లు, వాకిలి, దొడ్డి, తోవ, సమస్తము దృశ్యమయ్యెను. ఈప్రార్థనఁ జేయఁ జేయ సింగపు బలమును, దుర్జయ బలమును, మేర మీఱిన బలమును పొంద నారంభించితిని. ఇప్పు డున్న దాశరీరము కాదు. ఆ భావ మిప్పుడు లేదు. మాటలలో నెట్టి పటుత్వము! ప్రతిజ్ఞలో నెట్టి బలము ! అనుటయే చాలు! ప్రతిజ్ఞ చేయుటయే చాలు ! పాపమునకుఁ బిడికిలి చూపు వాఁడను ; పిమ్మటఁ బ్రార్థన చేయువాఁడను. సందేహము, అవిశ్వాసము, పాపము, ప్రలోభనము—వీనిని భయంకరమగు సంకల్ప మూర్తిచే జడిపించువాఁడను. ప్రార్థన చేయుదు నన్నంత మాత్రాననే అన్నియు భయపడునవి. ఈశ్వరుని పదతలమునఁ బెనఁకువతోఁ గూర్చుండి నట్లుగానే ఏదోకొంత లభించినది. కొంత కావలెను ; ఇచ్చువా రెవరు ? ఎక్కడకు నెళ్లవలెను ? ఎవరు మార్గముఁ జూపుదురు ? పాపము నెవరు దూరము చేయుదురు,-

* మహమ్మదీయుల వేదము.

అన్ని విషయములలోను సహాయము ప్రార్థన. అప్పుడు కేవలము ప్రార్థనా ధనమే నాకుండెను; కేవలము దాని మీఁదనే యాధారపడి యుండువాఁడను. సుఖము కావలెనన్నఁ బ్రార్థన యొద్దకే వెళ్ళువాఁడను. సాయము కావలసియున్నఁ బ్రార్థన యండనే చేరువాఁడను. ప్రార్థన నాకు "మాకున్న ధనమంతయు నాకొక్క నీలమణి యే" యని లోకులు సామెతగఁ జెప్పుకొను నట్లుండెను. మీ యాప్తుఁడు కేవల మీ యొక్క పరమ సహాయమునే కలిగియుండెను. ఏ పుస్తకము చదువ వలయునో దేనిని గూర్చి యాలోచింపవలెనో, ఎవరి యొద్దకు వెళ్ళవలయునో, ఏమియు నెఱుఁగను. అట్టి యవస్థలో పడియుండని యెడలఁ, బ్రార్థన మీఁద నింత విశ్వాసము జనియించి యుండునని తలంపను. ఎవరు గాని యేమైనను అన్న యెడల నిమీలిత నేత్రుఁడనై "ప్రార్థనా! ఎక్కడ నున్నావు? విపత్కాలమందు దగ్గఱకు రా!" యనువాఁడను. భాషాబద్ధముగఁ బ్రార్థన చేయుదమన్న బాంగాళమునఁ* బాండిత్య ముండునది కాదు. అయినను భావము నాఁపుకోలేక కిటికీ యంచు మీఁదఁ గూర్చుండి నేత్రములను తెఱచి యేదో ఒక్క మాట నుడువువాఁడను. అంతకే యానందము అమితము. ఒక్క నిమిషములో మహామూల్యరత్నలాభము. రత్నము దొరకుటచే నెవరి కీయను? ఎవరి వద్దకు వెళ్ళి చెప్పను? అప్పుడు ఈ ప్రకారముగనే కాలము గడచెను. ఇందుచేతనే ప్రార్థన నింతగాఁ బ్రేమింతును. మీ కెట్టి బంధువులో ప్రార్థన నాకంతకంటె నధిక బంధువు. అదృశ్యుఁడైనప్పటికిని నే నాయనను నా బంధువుగనే యెంతును. ప్రార్థన తక్క మఱి యెవరును లేనట్టి సమయమును నాకుండెను; అందుచేతనే నేను మీ యందఱికంటెఁ బ్రార్థనకే యెక్కువ

* వంగభాష.

ఋణబద్ధుఁడ ననుకొనరాదు. ప్రార్థన చేయఁగనే యుత్తరమును విన నగునని నేనెఱుఁగుదును. ఈశ్వరాదేశమత మీవిధముగఁ బ్రథమము నుండియు హృదయమున నిహితమై యున్నది. ఏధర్మ మవలంబింపవలెనో, ఉద్యోగమును వదలుకో వలయునో, వదలుకో రాదో, ధర్మప్రచారకుఁడను కావలయునో, కారాదో, ప్రార్థనయే సూచించునది. భార్యతో నెట్టి సంపర్క మ్ముండవలయునో, ప్రార్థనయే నిర్ధారణ చేయునది. ధనముతో నెట్టి సంబంధమో, ప్రార్థనయే నిరూపించునది. ఆదేశ విషయము నప్పుడు విశేషముగఁ దలంచువాఁడను కాను. ప్రార్థన చేసినఁ బ్రత్యుత్తరము వచ్చుననియుఁ, జూడఁ దలఁచినఁ జూడ నగు ననియు, వినఁ దలఁచిన విన నగు ననియు మాత్ర మెఱుఁగుదును. ప్రార్థన చేయఁ జేయఁ బది సంవత్సరములు పాఠశాలలో న్యాయశాస్త్రము, విజ్ఞానశాస్త్రము, మొదలైన కఠినములగు శాస్త్రములను సమస్తము నధ్యయనము చేసినట్లు బుద్ధి వికసించెను. "నీకుఁ బుస్తకము లక్కఱలేదు; మఱే యేమియు నక్కఱలేదు; నీవు కేవలము ప్రార్థనయే చేయువోయి!" అని నాతో నీశ్వరుఁ డనువాఁడు. ప్రార్థన చేసి యాదేశము కొఱకుఁ బ్రతీక్షించువాఁడను. "ఏది? ఉద్యోగము వదల వలయునో లేదో యింకను జెప్పలేదే? అదెట్లు సమకూడునో సూచింపలేదే?" అని మఱేమియు లేక యీప్రకారమే చేయుచుండువాఁడను. కాలక్రమమున బ్రాహ్మసమాజమునఁ జేరితిని, సాధకుఁడ నైతిని, ప్రచారకుఁడ నైతిని, ఉపదేశించుట కారంభించితిని, అన్నియు నయినవి. జీవన మిప్పు డున్నట్లుగా నున్నది ప్రార్థనమును పాటించుట చేతనే. మిత్రుల యవస్థ మందముగా నున్నట్లు నాకుఁ గన్పట్టుచున్నది కూడఁ బ్రార్థనమును మన్నించుటను బట్టియే. ప్రార్థన విషయమైన మోసమును మన మండలి నుండి పాఱఁ ద్రోల

వలయును. ప్రార్థన చేసి, ఎవఁడు ఆ దేశము కొఱకు నిరీక్షింపఁడో, అతఁడు వంచకుఁడు. అంతర్బాహ్యము లెవనికి సమానావస్థలో లేవో, ఎవఁడు బహుభాషియో, ఎవఁడు తన మనస్సునా ప్రార్థన సమయము ముందుంపవలసిన రీతి నుంపఁడో, అతఁడు వంచకుఁడు. ప్రార్థనావస్థ మహా కఠినావస్థ. ఎవఁడు బహు భాషాప్రవాహములోఁ బడి పోవునో అతఁడు వంచకుఁడు. ఉదయమునఁ బ్రార్థించిన విషయమును సాయంసమయమునకు జ్ఞాపక ముంచుకో లేనివాఁడు, భానువారమునఁ బ్రార్థించినది మంగళవారమున నెవరైన నడిగిన యెడలఁ జెప్పలేని వాఁడు వంచకుఁడు. మానధనముల కొఱకు, సంసారము కొఱకు, లేక పదునాల్గు వీసములు ధర్మమును, రెండు వీసములు సంసారము కొఱకు, అథవా పదునేను వీసములు నిహ పారత్రిక సద్గతి కొఱకును, అఱవీసము సంసారము కొఱకు, ఎవఁడభిలషించునో ప్రార్థన విషయమున నతఁడు వంచకుఁడు. ఒక్క దమ్మిడీదైన సంసారమునకుఁ గాను ఎవడుఁ కోరునో వాని సమస్త ప్రార్థనయు విఫలమని యనుభవమార్గమునఁ దెలిసి కొంటిని. కావున ప్రార్థన నతి విమలముగా నుంపుము. అట్లయిన, చివరకు ఇహ లోకమునకుఁ బరలోకమునకు సమస్త పృథివికి నధికారి వగుదువు. ఒకటి, రెండు, మూఁడు, నాలుగు అని చక్కఁగ లెక్కపెట్టి, గుణించి, మొత్తమెంతైనదో తప్పి పోకుండునట్లుగఁ జెప్పనైనరీతిని ప్రార్థనాసత్యములను అట్లే తెలుపనగును. ఇది నాకుండినది గాదు, ఇదిగో! ఇప్పుడు లభ్యమైనది; నే నిదివఱ కెక్కడ నుండు వాఁడను గాను, ఇదిగో! ఇప్పుడు వచ్చి చేరితిని. ఈహేతువుఁ బట్టియే: ఎవ్వరి యింట వ్యాధి మూలమునఁ గాని, విపత్తు చేతఁ గాని లేమిడి వలనఁ గాని కష్టము కలుగుచున్నదో, వారి కదే ప్రార్థన చేయ మిక్కిలి మంచి సమయమని పలుమాఱు

బంధుజనులకుఁ దెలుపు చుందును. విపత్సమయమునఁ బ్రార్థన మహా గభీరముగ నగును. ఎవ్వఁడైనను ఏయాపద యందైన నున్నపుడు, నవ్వుచు నవ్వుచుఁ బోయి యీశ్వరుని సమీపించి, "నాకీ దుఃఖ మేల? ఈయవస్థలో నాకు వైరాగ్యమును గలుపుము" అని మనస్సు విప్పి చెప్పిన పక్షమున వానికి వెంటనే యిహ పర సుఖములు చేకుఱును. పారత్రిక మంగళమునే కాంక్షింపుము. నీవు కాంక్షించునది యదొక్కటియే యైనను దాని మూలముననే యన్నియు సమకూరఁ గలవు. గృహములయందు వివాదములు గాని, మతవిషయికమైన కలహములు గాని పొడమి నప్పుడు ఈశ్వర సంతాన సముదయము కేవలము ప్రార్థనయే చేయవలయును. ప్రార్థన చేయుము శాంతి వెంటనే స్థాపితమగును. ఇందులకే మిత్రుల కెప్పుడును ప్రార్థన చేయుఁడని చెప్పుదును. వారు చేయరు; అందుచేతనే యంత కష్టముల పాలగుచున్నారు. ఈజీవనను యొక్క ప్రాథమికాంశమును వర్ణించితిని: ప్రార్థన యెట్టి వస్తువో గుర్తెఱిఁగి దాని నాదరించితిని. దార పుత్త్రుల కంటె నదియే ప్రియ మైనదని, యదియే యుత్కృష్ట ధర్మ గ్రంథమని, సకల ధార్మిక విషయముల లోను, సర్వ సాంసారిక సంబంధములలోను, అయ్యదియే సార వస్తువని గ్రహించి యీ ప్రార్థన నందఱును గౌరవింతురు గాక.

ద్వితీయాధ్యాయము.

పాపబోధము.

భానువారము ౧౫ శ్రావణము-౧౮౦౪ శకము.

అనంతర కథ యేమని భక్తమండలి జిజ్ఞాస చేసెను. ప్రథమమునఁ బ్రార్థన; జీవన గ్రంథము యొక్క ద్వితీయాంశ మేమి? భక్త బృందమా! వినుము. ద్వితీయ విషయమును గురుతర విషయమే. ఈ విషయమునఁ గూడ నాకును నితరులకును విశేషానైక్య మున్నట్లు చూడ నగును. పాప బోధము నా యందు మహా ప్రబలము; పలు జీవనము లందింత ప్రబలము కాదు. పాపమన నేమి? ఏమి చేసినఁ బాప మగును? ఇదంతయు విచారింపఁగా నాకుఁ బాప బోధము కలుగ లేదు. పాప దర్శనము వలనఁ బాప బోధ మైనది. చెప్ప పాటు కాలములోఁ బాపమును సహజముగఁ జూచితిని. పూర్వోక్తావస్థలో నెవరును గురువై వచ్చి పాప బోధమును కలిగించి యుండలేదు; నాపాపము యొక్క ప్రబలతమ సాక్షిని నేనే యైతిని. "పాపోహమ్, పాపోహ"మ్మని మనస్సెప్పుడును ఇట్లే పలుకునది. ప్రాతఃకాలమున నిద్ర నుండి మేల్కని, హృదయ మేమాట నైనఁ జెప్పుచుండిన యెడల నది యింకేమియుఁ గాదు. "పాపోహ"మ్మనునది యొక్కటే. ప్రాతఃకాలమునఁ, బూర్వాహ్ణమున, నపరాహ్ణమున, అష్టప్రహరములును, ఎంత వఱకు జాగ్రదవస్థలో నున్న నంతసేపును,— పాప బోధమే. చోరత్వమునకు, బందిపోటుతనమునకు, పరద్రవ్య హరణమునకు సామాన్యముగా నిఘంటువులందుఁ బాపమనఁబడును. ఎవ్వాఁడు మీ సమక్షమున నిప్పుడు మాటలాడుచున్నవాఁడో, అట్టి యీతని నిఘంటువులోఁ బాపమనఁగా గ్లాని; పాపమనఁగా వ్యాధి; పాప

మనఁగా నస్వస్థావస్థ; పాపమనఁగా దౌర్బల్యము; పాపమనఁగాఁ బాపము చేయునట్టి శీలము. నేను కేవలము పాపమునే పాపమని యెంచి నిశ్చింతతో నుండలేదు; పాపశీలము నెక్కువ భయముతోఁ జూచితిని. ఈ శబ్దార్థమును నేను స్వయముగాఁ జేయలేదు; వివేకము యొక్క దీప్తి హృదయమునఁ బడినపుడు చిన్ని చిన్ని వస్తువులు వేన వేలున్నవని కనిపెట్టితిని. స్థూల సూక్ష్మములైన వస్తువు లనేకము లున్నవి. జడత్వము, దౌర్బల్యము, ఆసక్తి, ఎన్నెన్ని హృదయములో నున్నవి? ఆత్మ యొక్క మధ్య స్థానము నందున్నయు నెంత ప్రచ్ఛన్నముగా నున్న వన్న, వివేకము యొక్క దీప్తి జ్వలించి యుండని యెడల నేదియు నగపడనిదే. ఒక్కొక్క దినము సుందరము నందలి గ్యాసు దీప మేవిధమున గప్పు గప్పుమని మండునో వివేకము యొక్క దీప్తి ఆవిధముగనే హృదయములో మండెను. చూచితిని; అంతయుఁ బాపమే! శరీర మున్నపుడు, కామ క్రోధముల మూలము నున్నది. ఇట్లనుట చేతఁ బాపమే మనుష్యుని భావిజన్మమును నిర్ధారణ చేయునను మతమును మాత్రము మన్నించు వాఁడను గాను. పాపము చేయునట్టి శీలముతో జన్మ కలుగునని మాత్రము మన్నింతును. శారీరక ప్రవృత్తు లెప్పుడున్నవో, అపుడు పాపము యొక్క మూలమును అచటనే యున్నది. నేను పాపము చేయఁగలను; ఏమి చేయఁగలను? మిథ్యావచనము పలుకఁగలను; దొంగతనము చేయఁగలను. దొంగతనము చేయఁగలనా? అదెట్లు? ఎవరి యైశ్వర్యము నైనఁ జూచి హరింపఁ గోరిన యెడల, "అది నాదగును గాక! అతనికి లేకుండును గాక!" అను నీ భావ మొక్క నిమేష మైనను గలిగిన యెడల, నప్పుడే దొంగతన మైనది. మిథ్యావచనమును జెప్పఁగలుగు నదెట్లు? ఎన్నఁడైనఁ బ్రాణ సంకటమునఁ బడినపుడు, అసలు సంగతి సరిగా నెఱుఁగకున్నను మిథ్యా వచనమును జెప్పినను

జెప్పవచ్చును. కేవల మిథ్యను జెప్పక పోయినను, శ్రోత యొక్క మనస్సున మిథ్యా భావమును బుట్టించు నట్టి యస్పష్టపు మిథ్యను దేనినైనను జెప్పినఁ జెప్పవచ్చును. మిథ్యను పల్కఁ గలుగున దెట్లు? మాటలలోఁ గాదు, మనసులో. ఇంతకును నేను జోరుఁడనా? హస్తమునఁ గాదు, హృదయమున. ఏ నిర్లిప్తస్థితియం దున్నానో యంతకంటె నధికుఁడ ననుకొనిన యెడల నప్పుడే యహంకార పాపమైనది. "చదువను, వ్రాయను నీకుఁ దెలిసినది తక్కువ. నాకుఁ దెలిసినది యెక్కువ!" అను నిట్టి తలంపు పుట్టినదే పాపము మనసులో నన్నధికముగాఁ బ్రేమించుకొన్న యెడను, నన్యులను బ్రేమించుట తక్కువై, ఆత్మసుఖము మీఁద దృష్టి యధికముగాఁ బడినయెడను, స్వార్థపరత్వ పాపములో నప్పుడే పాపుఁడ నైతిని. లోపల నరక కీటములు నిక్కముగా జలజలలాడుచున్న వేమో యన్నట్లు పెద్ద పెద్ద దీర్ఘాతి దీర్ఘములైన పాపాకృతులను గంటిని; ప్రత్యహము నాకు నూఱు పాపములకుఁ దక్కువ చేయుచుండనని యిప్పుడు తెలిసి కొంటిని. ఈజీవనములో నెంత పాపము చేసితినో గణించితి నేని, ఈ నలుఁబది నాలుగు వత్సరములలోఁ బది లక్షల పాపములు చేసితి నన్నను నత్యుక్తి గాదు. మనస్సునఁ బాప బోధ మెంత యధికమున్న చిన్ని చిన్ని పాపములను సహిత మది దప్పుమని పట్టివేయుచుండును. ఆపాపబోధము కష్టమును గలిగించుచున్నది. పరుల పాపములను గణించు నిమిత్త మెవరో నామనసును నియోగించి నట్లున్నది. ఉదయము నుండి యపరాహ్ణము వఱకును గేవలము పాపమునే గణించుచున్నాను. ఇదిగో! స్వార్థపరత్వమునఁ బడితిని. దాని తరువాత నిదిగో! అభిమానము కలిగినది; దాని తరువాతఁ బరద్రవ్యము మీఁద నాసక్తి పుట్టినది; దాని తరువాత మిథ్యను వచింప నిచ్ఛ గలిగినది; దాని తరువాత డబ్బు మీఁదను బిచ్చ

పుట్టినది; దాని తరువాత మఱి నలుగురికి సౌఖ్యము కలిగించు ప్రయత్నము కన్న నాత్మ సుఖమ్ము కొఱకైన యత్న మెక్కువైనది. ఈలాగున గణింప గణింప సంధ్య యైనది; రాత్రి యైనది; ఇంక నంతము కాలేదు; ఈ పాపగణనము బుద్ధిగతము కాదు, హృదయ గణనము. దీనిచే హృదయ జ్వాల పుట్టును. "ఇంత యహంకారము కూడదు; ఇంత స్వార్థ పరత్వ మన్యాయము," అని బుద్ధి బోధించు నది యనుకొందువేమో! అది కాదు. హేతువాదుల మాటలు నావద్ద దుర్బలములు. ప్రకృత విషయమేమి? పాపబోధ మైనట్లుగానే కష్టము, జ్వాల. ఏవిధమున సాలెపురుగు యొక్క విస్తీర్ణ మైన జాలమున నీఁగ యేవైపునఁ బడినను సాలెపురుగు దానిని కనిపెట్టి ఝుక్కై పట్టునో, ఆవిధముననే ఆత్మిక స్నాయువను పదార్థమే యున్నయెడ దాని జాలమునఁ బాపము పడినంతనే మనస్సు కనిపెట్టి పట్టుకొనఁ గలదు. జీవనములో నెక్కడ నే యాందోళనము జరుగుచున్నదో, ఎక్కడ నే కర్తవ్యము చేయఁబడ లేదో, యునర్వ నుచితమై యుండిన దేది యింకను నకృతమై యున్నదో, ఎక్కడ ధర్మము తృణీకరింపఁ బడినదో, జీవనము యొక్క యే స్థానమందు దుర్బలత్వమో, చైతన్య శీలమైన మనస్సు చప్పున చూడఁగలదు; చూచినట్లుగనే, "ఆహా! అంధకారములో నివన్నియు నున్నవి! అట్లయిన బందిపోటు దొంగను గూడఁ గావచ్చునే! పది వేల రూప్యములను జూచినతోనే లోభమా? పరద్రవ్యమున నింత లాలసయా?" అనుకొనును. ఈపాపము నింకను ఎంత దూరము విస్తరింపఁ జేయఁ గలను. గంగ వలె;— సముద్రము వలె;— మహా సముద్రము వలె;— పెక్కు లేల? నేను జేయలేని పాపము లేదు. అసాధు శీలము పోని యెడలఁ బాప ముండనే యున్నది. ఇదిగో! నేను శీఘ్రముగఁ బరుని సాధువని యెంచ లేనే. ఇందు చేతనే నేటి వఱకును

నన్నెవ్వరు పాపివని లజ్జితునిఁ జేయ లేక పోయిరి; ఇఁక ముందైనఁ జేయఁ గలుగుదు రనుటయు నల్పమే. అంతరంగమున నెవఁడు పది వేల పాపములను స్వయముగా గణించెనో, ఎవఁడు పేరుపెట్టి యాసకల పాపములను జెప్పఁ గలఁడో వాని నెట్లు లజ్జితునిఁ జేయ నగును? ఎవఁడు బందిపోటు దొంగతనము చేసి వచ్చెనో వానిని ఒక పైస దొంగలించి నట్టు నిందించిన నేమగును? బందిపోటు దొంగకు నొక పైస దొంగిలించిన దోష మిడిన పక్షమున వాఁడు, "ఎంత సామాన్యపుఁ బాపము మాట చెప్పినాఁడోసి!" అనును. ఎవని పాపబోధము జీవనము నందంతట నోతప్రోత భావమునఁ బాపమును దర్శించు చున్నదో యట్టి వానినిఁ బాపి వనుట కఠోరము గాని, తీక్ష్ణ దుర్వాక్యము గాని కాదు. నన్నుఁ బాపి వందువేని యది శిక్షఁ గొఱకుఁ గావచ్చును. నా వివేకము కడు వాఁడి. దీని యొక్క కోఁతశక్తి భయానకము. తీక్ష్ణముగాఁ బాపమును గ్రహింపఁ గలదు. గ్రహించి నంతనే కోయ నుద్యమించును. ఇదిగో! ఒక పాప మైనది. వెంటనే వివేకము దానినిఁ బట్టుకొనినది. ఎవరి మీఁద నైన దయఁ జూపఁ బోయి యొక్కింత న్యాయ విధి నతిక్రమించితి నేని అహోరాత్రము లిఁక నాకు శాంతి లేదు. న్యాయపరత్వము పదునాఱు పాళ్లను మేలుకొని కూర్చుండి యున్నది. భృత్యునకు జీతమిచ్చుట యొక్క దినము విలంబ మయ్యె నేని, "అరే! పాపీ! అన్యాయ వ్యవహారమా?" అని వివేకము వెంటనే అనును. "ఈదినము ఇయ్య లేనైతి; రేపిత్తును" అని యంటినేని, "నీ వీదినమున దింటి వేవిధమున? నీవు ధనికుఁడవై కడుపార భుజించు చున్నావు; దరిద్ర భృత్యునకు వేతన మియ్య వైతివిగా? ఎంత యన్యాయము!" అని వివేకమనును. కలకత్తా వదలి బేల్ఘరియా * వెళ్లినను, స్థలము

* కలకత్తా యొక్క శివారు.

వదలి నాక మీఁదఁ దిరిగినను—ఏమి చేసినను వివేకము వదలదు. ప్రత్యుత్తరము చెప్పవలెను. ప్రత్యుత్తరము చెప్పలేకున్నాను. చిన్న విచారణాలయము హృదయ మధ్యమునఁ దెఱవఁబడియే యున్నది. పాప మూలమున నేను గురు భారాక్రాంతుఁడను. "నీవింత పాపమును జేయుదువా! నవవిధాన వాదివయ్యు హృదయమున నింత పాపమా?" అని మీ రనవచ్చును. చూడుఁడు! మఱి మీరిట్టి మనుజుని గౌరవింతురు! ఇదంతయు మీరు చూడలేదు. మీరెఱుఁగరు. ఇదిగో! జ్వాలయు కష్టమును; ఈశ్వరుఁడు ధన్యుఁడగుఁగాక! పృథివి మీఁద నిట్టి సుఖియుఁ గడు నరుదే. నా నరక కీటములా జలజలమనుచున్నవి; నాలుకలోఁ బాపము; కర్ణములోఁ బాపము; కంటియందుఁ బాపము; కాని దీనివల్ల నగుచున్న దేమి? అగుచున్నది ఉపకారము. పాపబోధమే లేకుండిన యెడ నిక్కడ నుండువాఁడను గాను. ఇచటికి రాఁగలిగి యుండను. నా జాగ్రన్నరకము జాగ్రత్స్వర్గమునకుఁ గారణము. అస్వస్థ శరీరములో నే భాగమున నేరోగమో, ఎక్కడ వేదనయో, ఏమి బాధయో సులభముగాఁ దెలియదు. సహజముగా వ్యాధిని గనుఁగొన వీలులేదు; కాని స్వస్థశరీరములో నెక్కడ నేమాత్రము చెదరినను వెంటనే తెలియ నగును. ఇది మంగళ చిహ్నమే. ఏలయన;—దీని నేను వెంటనే ప్రార్థన చేయుటకును, యోగములో దిగుటకును గోరిక కలుగును. కేవలము పదిమాఱ్లు పాపము చేయు స్వభావమే యుండియున్నఁ, బది పాప కారణములే యుండియున్న వాని నతిక్రమించిన తోడనే జగత్తులో నావంటి సాధువు లేఁడనుకొనువాఁడను. సాధువు నైతి ననుకొంటిని. అదియే నిజమైన పక్షమున నాజీవనము సమాప్తిం జెందునదియే; కాని ప్రతి మాసమును, ప్రతి దినమును వివేకము ఆత్మోన్నతి యొక్క నూతన పథమును బ్రదర్శించును. కేవలము పాప బోధమును బుట్టించును.

శరీరమా యొక్క జ్వాలచే నే మనుజుఁడైనను గోల్దీఘి * నుండి లాల్దీఘి * కిని, లాల్దీఘి నుండి గోల్దీఘికినిఁ గేవలము పరుగిడిన యెడ వాని యవస్థ యెట్లుండునో ఈ వీని యవస్థయు నట్లే యున్నది. అనుదినమును జ్వాలచే నిట్లు కొట్టుకొన వలసి వచ్చుచున్నది. ఒక వైపునఁ బాపము; అందు మీఁద మఱల నవిశ్వాసము. "భగవంతుఁ డెక్కడ నున్నాఁడా? జీసను సజీవుఁడై యున్నాఁడా? చైతన్యునిఁ జూడ నగునా?" ఈలాగున ననుకొనిన తోడనే, "ఆరే! అపరాధీ! చైతన్యునిఁ జూడలేవు? గౌరాంగుఁడై యెవఁడు నాట్యము చేయుచున్నాఁడో, ఆయనను జూడలేవా? జీసను లేఁడుగా?" అని యెవరో యందురు. ఆ మాత్రము చేతనే యీ ద్రోహికి దుఃఖము! ఈశ్వరుఁడు వదలలేదు. ఈ పట్టణము నుండి యా పట్టణమునకు, ఆ పట్టణము నుండి యీ పట్టణమును—ఇట్లు జూచుచుండఁగనే, శాంతిపురినిఁ బ్రవేశించి, శాంతాగారమున నానందము నొందితిని. జ్వాల శాంతించిన దంటిని. రోగి కాని యెడల స్వస్థత యొక్క సుఖము నెవరైన గ్రహింపఁ గలరా? దారిద్ర్యము ననుభవింపని యెడల సంపద యొక్క సౌఖ్య మెట్టిదో యెఱుఁగ నగునా? జ్వాల నివృత్తమైన నెట్టి సుఖమో దానినిఁ గంటిని. గడియారమూ యొక్క ముల్లేవిధముగ "టక్కు, టక్కు" మని కొట్టు కొనునో, అట్లే "నీకు సాధన ఏ మాత్రమును గాలేదు; ఏమాత్రమును గాలేదు; లేశ మాత్రమును గాలేదు." అని మాటిమాటికి నెవరో యనుచుందురు. గుఱ్ఱమును కొరడాతోఁ గొట్టినట్లే నన్నును నీ యంతరంగ వాక్కులు కొరడాతోఁ గొట్టుచుండును. కాని యాశ్చర్యమిది! నేను ఏడ్తును!

* ఈ రెండును కలకత్తా యందలి విహారస్థానములు. వీని మధ్య చిన్న జలాశయ మొక్కొకటి యుండును.

తిరిగి నవ్వుదును! ఎంత రోషమునో యంత నవ్వుదును. కడు నేడ్తును. కడు నవ్వుదును. ఔషధమును పుచ్చుకొనుటచే శరీరము స్వస్థతఁ జెందెనేని దాని నెవరు సేవింపరు? ఇందుచేతనే నే నెపుడును బంధుజను లందఱితోను "ఏమోయి! నీవు పాపివి. నీవు అలసుఁడవు. నీవు అపరాధివి" అనియే చెప్పుచుందును. కాని యీ నామాట యొక్కరును చదివినట్లున్నది. ఎవరును వినరు. మీరు పాపులని మీరెఱుఁగరా? నేనందును భయానక పాపమని; మీరందురు పాపమని. నేనందును మహా పాపమని; మీరందురు దోషమని. నేనందును దోషమని; మీరందురు కూడని పనియని. పాప జనిత జ్వాల లేదని నేను ముఖముఁ జూచి తెలిసికొనుచున్నాను. ఎవనిలో జ్వాల యున్నదో వాఁడుపేక్షగా నుండలేఁడు. ఆతఁడు నిర్యత్నుఁడై యెట్లుండఁగలుగును? "పాపినై యుంటిని; ఇపుడు పాపిని గాను, సాధువు నైతిని." అని మీరనుకొనుచున్నారు. నవవిధానము వైపు మీకు దృష్టిలేదు. క్రీస్తు వాదుల యర్థమున, బుద్ధ వాదుల యర్థమున, ఇంక ననేకుల యర్థమునఁ బరిత్రాణమన్న నేమియో మీ యర్థమునను నంతె యగుచున్నది. హరి పాదసన్నిధిని నాకింకను ముక్తి లాభము కలుగనేలేదు. బ్రాహ్మ సమాజములో మహాపాపి, ఈ పాతకి, ఈ వేదస్థితవ్యక్తి. అలంకారము కాదు; పద్యము కాదు; యథార్థము. నా యొక్క మనస్సే యిందులకు సాక్ష్యమిచ్చుచున్నది. పృథివి మీఁద నిట్టి యపరాధుల సంఖ్య యత్యల్పము. నాలో నంతయుఁ బాపమే. అన్యుల కేది యొక్క పాపమో నాకది నైదు పాపములు. ఇతరుల యర్థమున నేది పాపమే కాదో, అది నా యర్థమునఁ బాపము. ఇతరుల నేవిధముగ విచారణ చేయుదురో యావిధముగా నన్ను విచారణ చేయుటకు వీలు లేదు. ఇందుచేతనే విశ్వన్యాయాధికారి యొక్క మాట జ్ఞప్తికి వచ్చినతోడనే సర్వ

శరీరము కంపింప నారంభించును. మాటలు ఏమాత్రము మృదువుగా నుండక పోయినను, వెంటనే న్యాయాధికారి మదీయ హృదయాంతరాళమున "నీ మాట లేల మృదువుగా లేవు! అందఱి తోను నమృత వాక్కుల నేల పలుకవు?" అనును. ఏమాట నైనను గొంచెము మృదువు తప్పి పల్కితినేని వెంటనే తాపము కలుగ నారంభించును. రాత్రియంతయుఁ దాపమే. నాలుగైదు దినముల వఱకుఁ, బది దినముల వఱకుఁ గూడఁ దాపమే. కేవలము సత్యవాదినైనఁ జాలదు; అమృత భాషివి గూడఁ గావలయునని యాత్మ శాసించును. కొంచె మెవరినైన నసంతోష దృష్టితోఁ జూచి యుంటినేని వెంటనే పరితాపము కలుగ నారంభించును. కొంచెము కన్నెత్తి చూచితినని గూడ దోషమే? నవవిధాన వాది పక్షమున నిది మహాదోషము. దోషమును ఖండింపుఁడని నవవిధానములోని యున్నత పదధారుల కందఱకుఁ జెప్పుదును. వ్యభిచారము దోషమని మీరందురు; కాని, ఎవరైన స్త్రీజాతివిషయమునఁ గొంచె మాసక్తిఁ జూపినఁ, గొంచె మెక్కువ సేపు స్త్రీల సమక్షమున నుండఁ గోరిన, ఏమి ఘోరమని నేనందును. చోరత్వము పాపమని నీవందువు; ఇది మోశా నాటి మాటయని నేనందును. నీవు డబ్బు గిబ్బు విషయమై అధికముగ మననము చేసి యింకను ధనార్జనము చేయుచున్నావుగా? ఎట్టి ఘోరము! నీ వింకను నుద్యోగము చేయుచున్నావా? నీ విట్టి పామర విషయములను గుఱించి భావించుచున్నావా? ధ్యానము చేయునట్టి యా యైదు నిముసములలోఁ గూడ రెండు నిమిషములను దొంగిలించి నీవు పిల్లల నెట్లు పోషింతునా యని భావించుచున్నావా? డబ్బు ఎక్కడ నుండి వచ్చునని వ్యాకులపడుచున్నావా? మఱుసటి దినము కొఱకుఁ జింతించుచున్నావా? పాప జ్ఞానము మనలో బాగుగ వర్ధిల్లుఁ గాక! పాపము కంటె బుణ్యముత్కృష్ట

వస్తువని మీ రెఱిఁగినదియే. పాపజ్ఞాన ముదయించినఁ గలుగు దుఃఖము, తాపము, జ్వాలయు మనకు సంప్రాప్త మగుఁ గాక ! మన తల్లి యతి దయావంతురాలగుటచేతనే కష్టము తరువాత సుఖము నుంచినది. చేతిలో కొయినా (క్వినైన్) యున్నపుడు, ఔషధమున్నపుడు జ్వరము వచ్చిన రానిమ్ము! పాపజ్ఞానము తాపమును గలిగించెనేని యది సుఖమునకుఁ గారణమగును. యోగీశ్వరు నెపుడెఱుఁగుదుమో, యోగానందము నెపుడాస్వాదనము చేసితిమో, అపుడు కష్టమేమున్నది? సుఖము రానున్నపుడు దుఃఖ మన్న భయమేమి? ఇందుచేతనే హరి గొప్పయో, యముఁడు గొప్పయో నే నిపుడు జిజ్ఞాస చేయుట లేదు. హస్తమున లక్షపాపములు నున్నవి; కోటి యౌషధములు నున్నవి. లక్ష లక్ష సైతానులను ఇప్పుడే నాశనము చేయుదును. ఎవఁడు విశ్వమాతకుఁ బ్రాణమును సమర్పించెనో వానికిఁ బాపమన్న భయమేమి? సైతానునకు బలమెక్కడిది! బంధుజనులారా! అంధకారమును గుఱించి చెప్పినట్లే యాలోకనమును గుఱించి కూడఁ జెప్పితిని. పాపము చేసినపుడెల్ల మీ ప్రాణము తట తట కొట్టుకొనుఁగాక! తటతట కొట్టుకొన్నట్లుగానే శాంతిదేవి మిమ్ములను సమీపించి మీకు శాంతిని ప్రసాదించును!

తృతీయాధ్యాయము.

అగ్నిమంత్రదీక్ష.

భానువారము ౨౨ శ్రావణము-౧౮౦౪ శకము.

జీవన భాగవతము యొక్క తృతీయ పరిచ్ఛేదము, అగ్నిమంత్రదీక్ష. "హే! ఆత్మన్! ధర్మజీవనము యొక్క బాల్యకాలము నందు నీ వేమంత్రమున దీక్షితుఁడ వైతివి?" అని జిజ్ఞాస చేయుదునేని "అగ్నిమంత్రమున" అని యాత్మ యుత్తర మిచ్చును. బాల్యకాలము నుండియు నేను అగ్నిమంత్రము యొక్క ఉపాసకుఁడను; అగ్నిమంత్రము యొక్క పక్షపాతిని. అగ్నిలో మనికియే, పరిత్రాణోపాయ మని నా యనుభవము. అగ్ని మంత్రమనే నేమి? శీతలత్వ మన నేమియో తెలిసికొనఁ దలఁచిన ఉత్తాప మన నేమియో తెలిసికొనవలయును. సత్య మంత్రమన నేమియో యెఱుఁగ దలఁచిన నగ్ని మంత్ర మననేమియో యెఱుఁగ వలయును. నే నెఱుఁగుదును; కొందఱ జీవనములో శీతలత్వ ముండును, అగ్ని యుండదు; మఱి కొందఱి జీవనములో నగ్ని యుండును, శీతలత్వ ముండదు. అనేకులది శీతల స్వభావము; మనస్సులోఁ గేవలము శాంతి. వారు కార్య విహీనులు; వారి పనులు శైత్య మయములు. గతి మృదువు; మాటలు అగ్ని విహీనము; హృదయమునఁ దేజము అల్పము; చక్షువులు కోమలములు—ఈ లక్షణము లన్నియు నుండిన శైత్య ప్రధాన జీవనమని నిర్ధారణ చేయుదును. శీతలత్వమునే వ్రతముగఁ జేసికొని సాధన చేయువారు ఈ పృథివి మీఁద ననేకు లున్నారు. వారు నడతురు శీతల భావమున; కార్యములను చేయుదురు శీతలభావమున; సాధన నుగించ వలసి వచ్చిన

ముగించుదురు శీతల భావమున. వారు శీతల ప్రదేశమునే అన్వేషింతురు; శీతల ప్రదేశముననే, నాసము చేయుదురు. వారు శీతల యోగమును సాధనఁ జేయఁ జూతురు; శీతల ముక్తిని పొంద నభిలషింతురు. స్వర్గమున కేగి యక్కడఁ గూడ శీతల స్థానమున శీతల భావమున నుండుట కాశపడుదురు. పృథివి మీఁద వారి ముందు అగ్నిని జలమును ఉంచిన యెడల, వారు అగ్నిని వదలి జలమునఁ బ్రవేశింతురు. స్వర్గీయాగ్నిని, జలమును వారికిఁ జూపిన యెడ, ఆశతోను, ఉత్సాహములోను, వారు జలము వైపునకే దృష్టి నిడుదురు. ఎప్పు డాజలము దొరకునా యని యెదురు చూచుచుందురు. శీతలత్వమే ప్రధాన భావమైనయెడ, అది మానవుని స్వభావమును తేజోహీనముఁ జేయును. స్వభావ బంధనములను శిథిలముఁజేయును. ఉన్న తేజము నిస్తేజ మగును; శక్తి హీన మగును; వీర్యోద్యమములు అవసన్నతఁ జెందును. జలము వచ్చి సమస్తాగ్నిని జల్లార్చును; పిఱికితనము వచ్చి సాహసమును మ్రింగివేయును; సహిష్ణుతయు, స్థిరత్వమును వచ్చి, ఉద్యమ మని ఉత్సాహ మని ఏ నాల్గు ఉత్తేజన భావము లున్నవో వాని నన్నిఁటిని గ్రమక్రమమున నిర్వాసితముఁ జేయును. ఎవరు శీతలత్వము వినా మఱి దేనిని గోరరో వారు ధార్మిక క్రియలను బరిత్యజించి శయ్యాశయనులు కాఁ జూతురు. శైత్య ప్రధాన జీవనము నిష్క్రియోపాసన యొక్కయు, విశ్రామము యొక్కయుఁ బక్షపాతియై క్రమక్రమముగ నవసాన దశ నొంద సాగును. దుఃఖ మేదిక్కుననో ఆ దిక్కునకు వారు వెళ్ళరు; ఎక్కడ శాంతియో, నిర్భయమో అక్కడికి వెళ్ళి దాఁగి యుందురు. ఈ సముదయము యొక్క విరుద్ధ భావ మంతయు నగ్ని. ఈ విరుద్ధ భావ మంతయు నగ్ని ప్రధాన జీవనములోఁ జూడనగును. ఈ వ్యక్తి యొక్క

జీవనములో మొదటి నుండి యింత వఱకును, ఈ యుత్సాహాగ్ని క్రమాగతముగ జ్వలించుచున్నది. ఇది తాత్కాలిక వీరత్వ భావము కాదు. మధ్య మధ్యఁ బొడసూపు నదియును గాదు. ఉత్తాప మన జీవన మనియును, ఉత్తాపమునకు వ్యతిరేకము మృత్యువనియు, ధర్మము యొక్క నిఘంటువు నందు వ్రాయఁబడి యున్నది. శరీరము సంపూర్ణముగా శీతల మయ్యెనేని చికిత్సకులు మృత్యు వని సిద్ధాంతము చేయుదురు. ఏ మాత్రమైన నుష్ణముగాని, ఉత్తాపము గాని లేనట్లు చూచిరేని ప్రాణాగ్ని చల్లాఱిన దందురు. ధర్మ జీవనములో సైతము ఉత్తాపము లేనియెడ మృత్యువు. ఇందుచేతనే నేను బాల్యకాలము నుండియు నగ్ని యొక్క పక్షపాతిని; అగ్ని మంత్రముననే నా దీక్ష. కొంచెమేని శీతల భావమును జూచిన హృదయము దడ దడ కొట్టుకొనును. శరీరము మీఁదఁ జేయి నుంచినంతనే, లోపల జీవ మున్నది, లేక మృత్యువు సంభవించినది తెలియ నగును. ఆవిధముగానే చూచిన మాత్రననే, ఆత్మ కూడ జీవించి యున్నది లేక మృత్యువు పాలఁ బడినది తెలియ నగును. నేను పాపి నైనది, కానిది తెలిసి కొనుటకుఁ గొంత కాలము పట్టవచ్చును గాని ప్రాణమున్నది, లేనిది యతి సులభముగానే తెలిసికొనవచ్చును. ఎట్లు? ఉష్ణమున్నదో లేక శైత్యము గ్రమ్మినదో ముందు తేలిన పక్షమునఁ దర్వాత నది తేలును. ఈ కారణము చేతనే ఏ మూలముననైన ఆత్మ ఉత్తాప యుక్తమై సతేజమై యుండుఁ గాక యని సాధన ప్రార్థనలఁ జేయుచుందును. అగ్ని లోపల జీవ ముండునని యేనే నగ్నిని వరింతును; ఆలింగనము చేయుదును; మిక్కిలిగాఁ ప్రేమింతును. ఉత్తాపమును చూడఁగనే యాశ పుట్టును; ఆనంద ముద్భవించును; ఉత్సాహము కలుగును. అగ్ని యొక్క తేజము

తగ్గుచున్నట్లు కాన్పించెనేని, ఈమాటిజీవి గంగలో మునిఁగి ప్రాణనాశము చేసికొనును అని యప్పుడే తెలిసికొందును. ఎవరైనను ఐదు సంవత్సరముల వఱకుఁ గూడ నుత్సాహముగా నుండి తిరిగి చల్లఁ బడుచున్నట్లు కనఁబడిన యెడల నీమాటిజీవి పాపముల పాల్పడుననియు, మృత్యువు వచ్చి కంఠము బంధించుననియు ముందే గ్రహింతును. ఇందువలననే ఉత్తాపము లేని యవస్థ యపవిత్రావస్థ యని యనుకొనువాఁడను. ప్రాతఃకాలమున ముందుగా నగ్నిమంత్రములో దీక్షితుఁడను గాక శయ్యాత్యాగముఁ జేసిన దినమున ఆహా! మృత్యువు పాలఁ బడుదుఁగదా యని పరితపించువాఁడను. నరకమును శీతల భావమును నేను సమానముగాఁ జూచితిని. మనస్సునందును, ముండలి నలుదిక్కులను సంతతము ఉత్సాహాగ్నిని జ్వలింపఁ జేసి యుంచువాఁడను. ఒక దళమునకు సేవఁ జేసితిని, ఇంకొక దళమెప్పుడగునాయని; పది దళములను సిద్ధము జేసితిని, ఇంకను బది దళములనెప్పుడు సిద్ధము జేయుదునా యని; ఆతురముగా నుండువాఁడను. ఒక విభాగమునఁ గార్యముల సమకూర్చితిని, మఱియొక విభాగమున నెప్పుడొనర్తునా యని; కొంతమందితో సల్లాపములను జరపితిని, ఇంకను గొంతమందితో నెప్పుడు జరపుదునాయని; కొన్ని శాస్త్రములను సమ్మేళనము జేసి సత్యమును సంగ్రహించితిని,—ఆ నాలుగు సత్యములతోను తృప్తిపొంది యూరకున్న నవి పురాతనములగునేమో యను భయమున,— ఇంకను మఱికొన్ని శాస్త్రములను జదివి సత్యము నెప్పుడు సంగ్రహింతునా యని, చూచుచుండువాఁడను. ఇదియే ఉత్తాపము యొక్క యవస్థ. ఎల్లపుడును నూతన భావములను సంగ్రహించుటకు, నూతనానందము ననుభవించుటకుఁ, గోరిక. ఈ మనుష్యుఁడు నిరంతరమును నూతన మన్న దిక్కునకే

పెరుగిపోవుచున్నవాఁడు. నూతనమే, ఉత్తాప విశిష్టము; పురాతనమన్ననే శీతలము. ఎంతమంది బ్రహ్మ పరాయణ బ్రాహ్మలను జూచితిని! ఉద్యోగము పాఁతగిలి పోయెను; పఠనము, అధ్యయనము పురాతనము లయ్యెను; మంచి మంచి యువ జనుల మరణ మయ్యెను. ఎట్టి యుత్సాహ పురుషు లుండిరి! పాపము చేసి యెఱుఁగరు, నరహత్య చేసి యెఱుఁగరు; కట్టకడకు నీళ్ళలోఁ బడి మునిఁగి గతించి పోయిరి! ఎంతమంది బ్రాహ్మలు అనేక దినములు వైరాగ్యమును సాధన చేసిరి! తుట్టతుదకు వారి జీవనము శీతలమైనకొలఁదిని సంసారము వారికి మఱింత కాంక్షను పెంచుటకే హేతువయ్యెను. ధన లోభమునఁ జివరకుఁ జావ వలసిన వారైరి! సోత్సాహులైన యువజనులను బల్వురను జూచితిని! వారిప్పుడెక్కడ దాఁగి యున్నారో—ఈ విభాగ మందో ఆ విభాగమందో, ఈదళమందో ఆదళ మందో, ఈ గ్రామ మందో ఆగ్రామ మందో—తెలియరాదు. ఒకప్పు డెట్టి యుత్సాహ వీరుల వలె నుండెడివారు! ఇప్పుడు దగ్గఱగూర్చున్నను వేఁడియనిపించకుండునంత చల్లఁబడినారు. సాధారణపుఁ జల్లఁదనమా యది? దానిచే వారొక్కరే మృతినొందుట కాదు; వారి జీవనము నుండి యితరుల జీవనముల లోనికి జలము ప్రవేశించుచున్నది. అందువలన నెందఱెందఱు మృత్యువు పాలగుచున్నారు! చివరకుఁగాలుసేతుల శీతలము క్రమ్మునేమో యని, చివరకు నేత్రములు చల్లబడునేమో యని, చివరకు హృదయము ఉద్యమ విహీన మగునేమోయని నేను సర్వదా జాగరూకుఁడనై యుందును. కొంచెము శైత్యభావమును గాని, పురాతన భావమును గాని చూచినవాఁడు, "ఓహో! పనిపాటలు పాఁతగిలుచున్నవి! ఉపాసన చప్పఁబడుచున్నది! ఏమి చేయుదును?" అని

పరితపించుచు నీశ్వరుని జేరి, "దయామయా! ఈ విపత్తు నుండి నీ తనయుని రక్షింపుము!" అని ప్రార్థించి, వెంటనే హోమమునకు సామగ్రిల సమకూర్చి, అగ్ని యందు ఘృతమును బోయ నారంభించితిని. అగ్ని స్వరూపుఁడైన యీశ్వరుని యామంత్రణము చేయుచుఁ జేయుచు నట్టె చూడఁగా,— నదీ సముద్రముల మీఁద అగ్ని భాసిల్లుచుండెను; పర్వతము లందు అగ్ని జ్వలించుచుండెను; జీవ శరీరము లందుఁ గూడ నగ్నియే యగపడెను. వెంటనే నూతన నూతన సత్యములు ఈ దిక్కున నుండి ఆ దిక్కున నుండి ప్రకాశమయ్యెను. మిథ్యను వచించినపుడే నేను పాపినా? అపుడే కాదు. ఉపాసనలో శైత్యభావ మగపడిన, నా మాటలు విని శ్రోతలు భీరువులైన, ఉత్సాహ హీనులైన, అపుడు కూడ నేను ఘోర పాపినే. ఏలయన, పృథివి మీఁద శైత్య విషమును జల్లుటకుఁ గాదు నన్నీశ్వరుఁడు పంపినది. అతి మందుఁడను గాని, అతి నిశ్చేష్టితుఁడను గాని అయితినేని కేవలము నా నాశమే కాదు; ఇంకఁ బదిమంది నాశము గూడ నగును. ఉత్తాపము సర్వదా యుండదేని సర్వనాశము కావచ్చును. ఇందుచేతనే ఆశాసమూహములను తేజముతో నుంతును; విశ్వాసమును తేజముతో నుంతును; ఉద్యమమును తేజముతో నింపుదును. శీతల భావము రాఁబోవుచున్నదని తోఁచిన తోడనే కామము, ధూర్తత, కపటము మొదలైన వన్నియు వెంబడించియే వచ్చుచున్నవని తెలిసికొందును; పాపశయ్య మీఁద శయనించితి ననుకొందును. ఉపాసనా కుటీరము నందుఁ బ్రవేశించినపుడు కేవలము శీతల జలమే యని చూచితి నేని, నేఁటి యుపాసన నన్ను మృత్యువు పాలు చేయును గదా యని గ్రహింతును. ధ్యానము చేయుట కిష్టము లేనపుడు, మాటలు ఒకటి తరువాత నొకటి మెల్ల

మెల్లగా వచ్చుచున్నపుడు, దానిని తేజముతో నుడువ లేనపుడు, "ఆహా ! ఉత్తాపము లేదు ! ఇదంతయు మృత్యువు యొక్క పని గదా ! యనుకొందును. కార్యాలయములోఁ గూర్చుండి పని చేయునపుడు ఉత్తాపము ఉండదేని, "నేను ప్రభువు యొక్క కృత్యము చేయుట లేదు ; మృత్యు దేవత యొక్క కృత్యమును జేయుచున్నా" నని తెలిసికోవలయును. అందునకనియే నేను ప్రథమము నుండియు నగ్ని మంత్రము నాదరించుచున్నాను. విశ్వాస పరులందు శాంత భావముండుట వాస్తవమే. కాని దోషము కానిండు, గుణము కానిండు నే నెప్పుడును ఉత్తాప ప్రియుఁడను. నేను నిష్క్రియుఁడ యుండలేను. దళము వదలి యొకమూల నొదిగి యుండుట నా పక్షమున దాదాపుగ నసంభవము. ఆపాదమస్తకము అగ్నితో నింపితిని. ఈ భావముతో సేవఁ జేసితిని ; పరిశ్రమఁ జేసితిని ; ధ్యాన సాధనలఁ జేసితిని. ఏకాంతమున బ్రహ్మదర్శన మెట్టిదో దానిని సహితము అనుభవించితిని ; నానా వ్యవసాయములలోఁ బ్రవృత్తుఁడ నైతిని ; కాని, శీతలత్వమను కూపమునఁ బడి ప్రాణమును పోఁగొట్టుకొనలేదు ; ఈ సౌభాగ్యము నాకున్నట్లు లోలోపల తోఁచుచున్నది. ఎవరు శైత్య ప్రధానులో వారు భీరులు ; పది పదునొకండు వత్సరములు సాధన చేసి పలాయితులగుదురు. శీతలత్వము కడు చెడ్డది ; అది అగ్నిని పూర్తిగాఁ జల్లార్చి వేయును. మీలో నుష్ణమున్నది, కోమలత్వమున్నది, ఉద్యమింప నిచ్ఛయుఁ, గ్రియాశీలురగుట కుత్సాహమును మీలో నున్నది లేనిది, పరీక్షించి చూచికొనుఁడి ! బాగుగ నుద్యమించుటకు నిచ్ఛయుఁ, బని చేయుటకు నేవిధమైన 'యామోదమును, బదిమందితోఁ గలసి సంకీర్తనము చేయుట కుత్సాహమును లేనట్లు తోఁచెనేని, వెంటనే చికిత్సకుని

బిలువుఁడు; మీరు చావ నున్నారని తెలిసికొనుఁడి! మీరు బ్రహ్మభక్తులు! మీ ధ్యానములో నుద్యమోత్సాహము లుండవా! మీ ధర్మకార్యములలో నుత్తాపము ఉండదా? అట్లుండుట సరి కాదు. నిరాశ యొక్క చల్లని మాటల నెపుడును మీనోళ్ళలోనికి రానీయవలదు. కాలుసేతులు వెచ్చగా నుండిన శరీరములోఁ బ్రాణమున్నట్లు ఏలాగున స్థిరమగునో, ఆలాగుననే కార్యము, భావన, ఆశ, విశ్వాసము, మాటలు, వ్రతము—ఈ యన్నిఁటిలోను ఉత్తాపమున్నచో ధర్మజీవనము యొక్క లక్షణము ప్రకాశ మగును. ముట్టుకొన్నంతనే నీ యంగుళి నుండి నా యంగుళి లోనికి వేఁడిమి సంచలితము కాఁ గలిగినంత యుత్తాపము నీ యంగుళియం దుండవలెను. ఎనుఁబది వత్సరముల వృద్ధున కెంత తేజ మనఁగా నాలుక నుండి మాటలు బయటికి వచ్చి రాఁగానే లక్ష లక్ష మంది ఉత్తేజితు లగుచున్నారు. సమీపించుతోడనే,—ఎనుఁబది యేండ్లు వచ్చినవి; ఉత్సాహ మింకను తగ్గలేదే?—యందురు. ఇట్టి తేజము, ఉత్సాహము, ఉత్తాపము, అగ్ని ప్రతివానికిని ఉండునట్లు చూచుకొన వలయును. ఉత్సాహదాత, ప్రాణదాత, ఎవరో ఆయననే ప్రార్థింతును; ఉత్సాహముతో నగ్నిస్వరూపుని బ్రార్థింతును. "అగ్ని, అగ్ని, అగ్ని" యని నాలుక కేవలము దీనినే యుచ్చరించును గాక! హృదయము సర్వదా యీ మంత్రమునే సాధన చేయును గాక!

ఓ దయాసింధూ! ఓ అగ్ని స్వరూప బ్రహ్మమా! ఈ పృథివి మీఁద సంసారము అనేక కూపములను నిర్మించుకొని కూర్చున్నది. దాని సమయము దొరకఁగనే మనుష్యుని పట్టుకొని అందులోఁ బడవేయును; వినాశము జేయును. జననీ! ఆత్మలో నెన్నాళ్ళుత్తాప ముండునో అన్నాళ్ళును మేము నీవారము. సంసారము తన కూప

జలములోఁ బడవేసినయెడల నిఁక నుత్తాప ముండదు; ఇఁక ధర్మ సాధన చేయలేము; శైత్యము వచ్చి నాశము చేయుచుండును. ఓ ప్రేమస్వరూపా! అకాలమున శీతలత్వ రూపమైన మృత్యువు యొక్క నోటఁ బడకుండునట్లు, వాక్కులోను, కార్యములోను, చింతలోను, ఇంకను తేజమిమ్ము. ఇప్పటికిని "అమ్మా!" యని పిలువఁ గలుగుచున్నాను. ఇంకను ఇరు పార్శ్వములను పెద్ద పెద్ద యగ్ని కుండములు జ్వలించు చున్నవి ఇదియే నా పరమ సౌభాగ్యము. ఆ బాల్యమునందు అగ్ని మంత్రమున దీక్షితుఁడ నగుట చేతనే రోగ సంతాపముల యందును, ఆపత్సంకటముల యందును నీ పవిత్ర చరణములను బూజించుచున్నాను; ఇంకను బంధు మిత్రులతోఁ జేరి నృత్యము చేయుచున్నాను; నీ నామ గానము చేయుచున్నాను. ఎంత మంది వచ్చిరి! ఏమేమి మాటలు చెప్పిరి! వారిలో ననేకులు పలాయితులైరి. అగ్ని మంత్రములో నన్ను దీక్షితుని జేసి యుండని యెడల నిన్నుఁ బురాతన మను వాఁడను; నవ విధాన మను వాఁడను గాను. నీవుత్సాహము నిచ్చి బ్రతికించితివి. అంతయుఁ బ్రాఁతగిల్లుచున్నట్లు నీవు చూచినతోడనే నవవిధాన ప్రకాండమును పంపించితివి. సమస్త దీపకాంతియు నిర్వాణ ప్రాయము గావచ్చినప్పుడు మహోజ్జ్వలమైన జ్ఞానదీపమును వెలిఁగించితివి. తోడనే సమస్త సాధక బృందమ్ములును, "ఈశ్వరుఁడు ధన్యుఁడు ధన్యుఁ" డని జేజేలు పెట్టసాగిరి. వారి యాయువు మఱి నూఱు వత్సరములు వృద్ధి యయ్యెను. సమస్త నిరాశయు, భయమును సమసిపోయెను. విధాన నేతవగు నో శ్రీహరి! ఒక వాద్యమునకు బదులు శత వాద్యములకు గూర్చుకొని నీ నామమును గానము చేయుట కారంభించితిమి. దేశము లోని నానా మార్గములు,

ఘట్టములు శాంతము కాఁ జొచ్చెను; యువ సంప్రదాయము నిస్తేజము, నిరుద్యమము, నిస్తబ్ధము కాసాగెను; అనేక సోదర భ్రాతృ బాహ్య బ్రాహ్మికలు విగతోత్సాహులై ధర్మ పథమును విడిచి సంసారములోఁ బడుచుండిరి;— అట్టి సమయము నందు ఓ కరుణాసింధూ! ఉత్సాహదాతా! నీ ధర్మమును రక్షింప నుద్దేశించి, సకల దురవస్థల నడుమ పథములను, ఘట్టములను, సమస్తమును అగ్ని మయములఁ జేసితివి. అణఁగి మణఁగి యున్న రసన నెంత యుత్తేజితము చేసితివి! తత్క్షణమే ఆ యువనన్న రసన అగ్ని వలె సంభాషింపఁ దొడఁగెను గదా! వృక్ష లతల యందుఁ దిరిగి నిన్ను సందర్శించితిని; సంసారము నందు మరల నిన్ను సందర్శించితిని. జలము నందు గ్రమ్మఱ నిన్ను దర్శించితిని. అగ్నిలో మాట చెప్ప నక్కఱయే లేదు. పోయి పోయి నని తిరిగి బ్రతికితిని. నీవు పురాతనను కానియ్యాలేదు. నవీనోద్యమోత్తాపములను పొంది బ్రతికిపోతిని. పాపము చేయకుండినను నాకు మరణము ప్రాపించియే యుండును. నితాంతము మిథ్యావాదని, శఠుఁడను గాక పోయినను, కేవలము సంసారము యొక్క యొడి యందుఁ బడి మృతి నొందియే యుండును. నేఁటివఱకును నగరకీర్తనము అగుచున్న చోట నెల్ల ఎట్టి ప్రమత్త విరాగుల మత్తతను జూచుచున్నాను! ధన్యుఁడవు! నీవు ధన్యుఁడవు! ఎవ్వరి యుత్సాహమును నింక క్షీణింప వీలు లేనట్టి శాశ్వత నవీన ధర్మము నిచ్చినాఁడవు. దీనిని స్వీకరించిన తరువాత నెవ్వరైనను, ఎన్నఁడైనను బలహీనులై, ఉత్సాహ హీనులై గతింప వచ్చునని నమ్మఁ జాలను. నవ విధానములో మరణ మనునది లేదు. శీతలత్వము లేనే లేదు. ఇది నా ప్రజ్ఞ వలనఁ గాదు; భ్రాతృవరుల ప్రజ్ఞ వలనఁ గాదు; నీ ప్రజ్ఞవలన. ఉత్సాహ మిఁక తగ్గదు. మఱి

యెడ తెగని నృత్యమును చేయుదును. నిన్ను, "అమ్మా! అమ్మా!" అని పిలుచుచున్నానే యా పిలుపున కింక నంతము ఉండదు. శరీరము శ్మశానములో తగులఁ బడి పోవును; అగ్ని చల్లారి పోవును; కాని మనస్సు నందలి యగ్ని మాత్రము ఏమి చేసినను చల్లారదు. ఎవరైనను మనశ్శరీరములను బ్రహ్మాగ్నితో నింపఁ గలిగిన యెడల నాయగ్ని చల్లారునది కాదని వారికిఁ దెలియఁ గలదు. హా! ఎట్టి యగ్నిని జ్వలింపఁ జేసినాఁడవు! భక్తి యొక్క అగ్నిని, విశ్వాసము యొక్క అగ్నిని, ప్రేమ యొక్క అగ్నిని, జ్వలింపఁ జేసినాఁడవు! ఈ యగ్నిలో మాత్ర మెవ్వరును మృతి నొందరు. ఈ యగ్నిని సదా చేపట్టియే యుందును. ఈ సుఖములోనే జీవనమును వెళ్ళబుత్తును. ఆశీర్వదింపుము! ఎవ్విధమున నైనను నిర్వాణమును జెందని అక్షయ వ్రతము నిమ్ము! అక్షయోత్సాహము నిమ్ము! అగ్ని భావములో నుత్సాహితులఁ జేయుము! ఆ భావములో నృత్యము జేయనిమ్ము! ఏ నృత్యము ఆఁగునది కాదో యా నృత్యములో నాట్యము చేయనిమ్ము! ఏ యగ్ని నిర్వాణముఁ జెందదో యా యగ్నిని జ్వలింపఁ జేయుము! నీ శ్రీచరణములఁ బ్రార్థన చేయుదుము; ఓ దయామయా! మా కీభిక్ష నిమ్ము.

చతుర్థాధ్యాయము.

అరణ్యావాసము : వైరాగ్యము.

భానువారము ౨౯ శ్రావణము-౧౮౦౮ శకము.

చతుర్థాధ్యాయము, "అరణ్యావాసము : వైరాగ్యము." సంసారమునఁ బ్రవేశించు కాలము నా పక్షమున శ్మశానమునఁ బ్రవేశించు కాల మయ్యెను. సుఖోద్యాన మార్గము నా పక్షమున మృత్యు వని, ఈశ్వరుఁడు స్థిర పఱిచెను; అంతియ ఘటిల్లెను. ఎవ్వఁడు నా చరిత్ర పటమును వ్రాసెనో, ఆ పరమ నిపుణ చిత్రకారుఁడు మొదటఁ గారు రంగు నలుపుతో నలుదిక్కులను అతి ఘోరమైన నల్లని ఛాయ వేసెను; అట్లది అత్యంత కాలవర్ణము కాఁగా దానిమీఁద నానా ప్రకారములైన యుజ్జ్వల వర్ణములు గల రూపములను వ్రాయ నారంభించెను; ఈ దినమును ఆవిధముననే వ్రాయుచున్నవాఁడు. నల్లని ప్రదేశము పైని పటము యొక్క శోభ ప్రకాశమానమై యింకను నుజ్జ్వలమైనది. శోకము, సంతాపము, వైరాగ్యము, నా ధర్మ జీవనమునకు నారంభము లయ్యెను. వైరాగ్యమేఘము ప్రథమము నుండియుఁ గనవచ్చుచుండెనని విధాత యెఱుఁగును. పదునెనిమిదేండ్ల ప్రాయమున ధర్మజీవనము కొంచెము కొంచెము తలయెత్తెను. కాని పదునాల్గవ వత్సరముననే మత్స్యభక్షణమును పరిత్యజించితిని. ఎవరు బోధించిరి? ఆమిషభక్షణము నిషిద్ధమని ఎవరు చెప్పిరి? ఒక్క గురువునే యెఱిఁగియుంటిని; ఆయననే మన్నించి యుంటిని; ఆయనను "వివేక"మంటిని. ఆవివేకము బాలకునితో నొక్క వాణిని బలికెను; బాలకుఁడు పరిత్యజించెను. చతుర్దశ వత్సరముననే వైరాగ్యము

ప్రప్రథమమునఁ బ్రాదుర్భవించెను. ఎప్పుడు ధర్మభావము వృద్ధి కానారంభించెనో, ఉపాసన ఎప్పు డారంభమయ్యెనో, ఈశ్వరుని పదతలమున నెప్పు డాశ్రయించితినో, ధర్మోత్తాప మెప్పు డుద్దీప్తము కాఁ జొచ్చెనో, అప్పుడు ప్రార్థన చేయుట కారంభించితిని; అప్పుడు, ఆ పూర్వ మేఘము,— ఏది తొల్తొల్త నంగుష్ఠ మాత్రమై జీవనాకాశమునఁ బొడకట్టెనో, ఏది కేవలము మత్స్యభక్షణలోనే పరివ్యాప్తముగను, పరిసమాప్తముగ నుండెనో, —ఆ మేఘము ఘనీభవించెను. సామాన్య ఘనీభావము కాదు! దాని మూలమున ముఖము మలిన మయ్యెను; హృదయము విషాద పూర్ణ మయ్యెను; అంతియ కాదు! పగలు శాంతి దొరక కుండెను; రాత్రి శయన సమయమునఁ గూడ నది శాంతి ప్రదము కాదాయె! యౌవనమున నెన్ని విధములైన సుఖభోగము లుండునో, యానముదయముల నన్నింటిని విషతుల్యములుగఁ జూచి పరిత్యజించితిని. "నీవు సైతానవు; నీవు పాప"మని యామోదము నంటిని. "నీవు నరకమవు; నీ యాశ్రయమును గ్రహించిన వాఁడెల్ల మృత్యుగ్రాసమునఁ బడు"నని విలాసము నంటిని. "నీవు నరకమునకుఁ దోవ; నీవు మృత్యుముఖమునఁ బడవేయుదువు; నిన్ను శాసింతు"నని శరీరము నంటిని. అపుడు ధర్మము నెఱుఁగను. సంసారి యగుట పాపమని, కాంతాసక్తుఁడ నగుట పాపమని మాత్ర మెఱుంగుదును. పృథివి మీఁద నెవ్వరు మృత్యు వక్త్రమునఁ బడిరో, వారి విషయము జ్ఞప్తికి వచ్చెను. సంసారము యొక్క విలాసముననే అనేకులు చచ్చిరి. తదనుసారముగానే, "అరే! నీవు సంసారివి కావలదు సుమా! సంసారమునకుఁ దలను విక్రయింపవలదు సుమా! కళంకము, పాపము, ఇవన్నియు భయానక విషయములు. ముస్ముందు ఆమోదమును విష

ర్జింపుము; ఆమోదము యొక్క సూత్రమునఁ బడిరేని యనేకులు నరకమునఁ బ్రవేశింతురు." అని యంతర్వాణి వినవచ్చెను. సంసారమన భయము పుట్టెను; సంసారము మాట జ్ఞప్తికి వచ్చిన తోడనే నరక దూత వచ్చె ననుకొనువాఁడను. సంసారము యొక్క యాకృతి భీషణముగాఁ గనఁబడునది; భార్యయని యే పదార్థమున్నదో దానిని జూచిన భయము. సంసారమును నిక్కమైన విష పాత్రముగా నెంచితిని. బయటికిఁ జూచుటకు సుందరము; లోపల భయానకము. ఎక్కడఁ గాలు పడునో యక్కడనే కంటక మున్నదని, రక్కసి యున్నదని, భయానక జ్వరరోగము దాఁగియున్నదని, తోఁచునది; సర్వదా భయమగునది; సందేహము కలుగునది. నగుమోము కాంతి దప్పెను. "నీవు హసియించినఁ బాపి వగుదువు. హసియింపఁ బాపమగును." అని మనస్సు వకాణించెను. నవ్వు నావద్దనుండి సెలవు పుచ్చుకొనెను. బంధుజనులు కొందఱు కొందఱు చూచిరి గాని గ్రహింప లేక పోయిరి. దేని మూలమున నవ్వు వచ్చునో, దానిని గోరనని, ఏ పుస్తకమును జదివిన, నే స్నేహితుని వద్దకు నెళ్ళిన నవ్వుద్రిక్త మగునన్న భయము కలదో, ఆపుస్తము నుండి, ఆ స్నేహితుని నుండి, దూరదూరమున నుందునని హృదయమున సంకల్పము చేసికొంటిని. క్రమమున మౌని నైతిని; మితభాషి నైతిని. సుఖ సంపదల వైపుఁ గన్నెత్తియైనఁ జూచువాఁడను గాను; వనము లేదు; వనమున కరుగ లేదు. కాషాయ వస్త్రము మాట తలంపలేదు; దానిని ధరింపనులేదు. శరీరమున కేవిధమైన బాధను గలిగించుటకును, అస్వాభావికములైన యే యుపాయములను గాని యవలంబింపలేదు; అవలంబింప నిచ్ఛయును గలుగ లేదు. ఏవిధమైన బాహ్యలక్షణముల మాటయుఁ దలంపునకు రాలేదు. ఏ

యింటియం దుంటినో ఆ యింటిని, ఏ గదియం దుంటినో ఆగదిని, శ్మశానము వలె, వనము వలెఁ జేసితిని. గృహవాస్తవ్యుల యొక్క కోలాహలమే బెబ్బులుల బొబ్బరింత లనుకొంటిని. ఎక్కడెక్కడ నీచమైన యాచార వ్యవహారములను జూచువాఁడనో, అక్కడనెల్ల మృత్యువు చిందులు ద్రొక్కుచున్న దనుకొనువాఁడను. నా వనము నిజమైన వనము కానిమాట వాస్తవమే యైనను సంసారమే నాకు వనమయ్యెను. సంసారము యొక్క యైశ్వర్యము మధ్య నుండికూడ, నేను సామాన్య వస్త్రమును ధరించి పొద్దు పుచ్చువాఁడను. ఏడ్చువాఁడను గాను; కాని హాసవిహీనమైన ముఖముతోనే యుండువాఁడను. ఈ వైఖరినే యుదయమున పడక నుండి లేచువాఁడను; ఈ చందముననే రాత్రులందుఁ బక్కమీఁదఁ బరుండువాఁడను. సూర్యుఁడు నన్ను హసింపఁ జేయఁ జాలకుండెను; చంద్రుఁడును నాకు నవ్వన్నమాట కలిగింప నేరకుండెను. ఆకాలపుఁ బ్రధాన బంధు వెవరో మీ రెఱుంగుదురా? ఇంగ్లీషు కవులలో నెతఁడీ భావమును బాగుగ వర్ణింపఁ గలిగి యుండెనో ఆయన. ఆయన యొక్క "రాత్రి చింతలు" చదువువాఁడను. అపుడు, ఆమోదము నేమాత్రమైనఁ బొందియుంటినేని, దాని నా పుస్తకము చదువుట వల్లనే పొందితిని. ఏ యే యుపాయముల వలన మనసునకు గష్టము తోఁచునో, గాంభీర్యము వృద్ధి యగునో, కుచింతల వైపునకు మనసు తిరుగ కుండునో అట్టి నానా విషయములలో నియుక్తుఁడనై యుండువాఁడను. ఇదంతయు జరగిన దెప్పుడు? పదునెన్మిది, పందొమ్మిది, ఇరువది యవ వత్సరములలో. వివాహము చేసికొని సంసారమునఁ బ్రవేశింప నున్నపుడు, ఎక్కడ సంసారము చేయుదునో ఆ స్థానమే శ్మశాన మయ్యెను. సంసార విషయములను

గూర్చి విశేషముగ తెలిసి యుండనైతిని గాని సంసారము యొక్క భీషణత్వమును మాత్రము బాగుగఁ గుర్తెఱిఁగి యుంటిని. భార్య వచ్చుచున్నది; సంసారము చేయవలెను. "సంసార విలాసములోఁ బడి నీవు సుఖము ననుభవింతువా? ఎప్పుడును భార్యయొద్దనే పడియుందువా? సంసార విషయములను గూర్చి నీవు ముచ్చటింతువా? ఈ సకల విషయములును నీకు సుఖము నిచ్చునా?" అని నా మనసులో నీ మాటల నన్నియు నెవరో చెప్ప నారంభించిరి. "జీవాత్మ ఉత్కృష్ట పదార్థము; దీనిని నేను భార్య యొక్క యధీనమం దుంతునా? సంసారమునకు నధీనము చేయుదునా?" అని తలపోసితిని. ఈ జీవనమున స్త్రైణుఁడను గానని ప్రతిజ్ఞఁ జేసితిని; ఏలయన, భార్య యొక్క యధీనమైన మూలముననే అనేకులు చావఁగాఁ జూచితిని. సంసారము యొక్క వజ్రాఘాతమున ననేకులకు మృత్యువయ్యెను. అందునకనియే, ఈ మానవుని స్పర్శింపకుమని సంసారమునకుఁ జెప్పుదును. అందుచేతనే, ఆదినము నుండి భయము భయముగా సంసారము చేయుదును. ఎప్పుడు సంసారము యొక్క ఆసక్తిచే మృత్యుగ్రాసమునఁ బడుదునోయని, ఎప్పుడు డబ్బు ముట్టుకొని చత్తునో యని, మిక్కిలి భయపడుదును. ఏవిధమునఁ గామక్రోధములను భయానకముగా నెంతునో, ఆవిధముననే భార్యాపుత్త్రులను, సంసారమును విపత్తుగా నెంతును. చివరకు నీసకలమును నీశ్వరునికంటె నెక్కువగాఁ బ్రేమింతునేమో, సంసారమునే ప్రియతరముగా నెంతునేమో యన్న భయముండుటచే సంసారము ఘోరరాక్షసి యనిపించునది. చివరకు భక్తి కలుగదేమోయను భయముచే నమావాస్యను బ్రేమించువాఁడను. ఉద్యానవనమునకు వెళ్ళి యామోదింప నిష్ట ముండునది కాదు.

హృదయమున స్ఫూర్తి లేకుండెను; అంధకార ప్రదేశమునఁ గదలకుండ మెదలకుండ జడము వలెఁ బడి యుండువాఁడను. ఒకటి రెండు మనసు వచ్చిన మాటలు మాత్రము ఈశ్వరునకుఁ దెలుపువాఁడను. ఇంకెవరికిఁ దెలుపను? ఈ విధముగ వైరాగ్యమె జీవనము యొక్క మూలమయ్యెను. జీవన వృక్షము యొక్క ఆకారప్రకారము లన్నియు వైరాగ్య ద్వారముననే యయ్యెను. వైరాగ్య మూలకమైన జీవనములో నేది యగుట యావశ్యకమో యది యయ్యెను. దేవాసురయుద్ధములో దేవతలకు జయమయ్యెను. వివేకము, వైరాగ్య మను నిద్దఱు సోదరులును గలసి పాపజీవనమును శాసింప నారభించిరి; తరువాతఁ జూడ సంసారము దగ్గఱకు రాలేక పోయెను. ఆత్మపీడన, భార్యాపీడనముల మూలమున ధర్మజీవన మారంభమయ్యెను. ఎవరు భయమునకుఁ గారణమైరో వారు చివరకు బంధువులైరి. ఏ శ్మశానములో సంసార మారంభమయ్యెనో, ఆ శ్మశానము ఫల పుష్ప శోభితమైన యుద్యానవనము క్రింద మాఱెను. దాని నడుమ హరిసాన్నిధ్యమును బడయఁ జేయు మాగఁ మేర్పడెను. శ్మశాన మెన్నఁడు నున్నట్లే తోఁపలేదు. ఆరంభము దుఃఖముతోను, నంతము సుఖముతోను నయ్యెను. ఎవరు నవ్వుచు నవ్వుచు ధర్మజీవనము నారంభింతురో, ఎవరు ఆరంభమునుండియు సౌభాగ్యవంతులో, అట్టివారిలో న న్నొకనిగాఁ బరిగణింపను. ఈ తల మీఁదుగా నెన్ని విపత్తులు గడచి పోయినవి! "శవము క్రిందఁ జేసి వేసిననే కాని దేవత్వము నీకు సిద్ధింపదు" అను నీవిధి నీశ్వరుఁడు నా యెడలఁ జెల్లించెను. ఏడ్చుచు నేడ్చుచు విత్తనము నాఁటితిని; ఇపుడు నవ్వుచు నవ్వుచు సస్యసంచయము సేయుచున్నాను. ప్రథమమున నెంత యేడ్చితిని! ఇపుడు హరియొక్క శ్రీపాద

పద్మములను స్పృశించి కేరుచు నవ్వుచున్నాను. ఈవిధి యందఱు విధి యగుటకును వీలు లేదు. ఎవరి పక్షమున నేవిధియో వారు తదనుసారముగనే నడువవలయును. కాని, ఈజీవనము యొక్క-యొక విషయము మాత్రము అందఱు పక్షమునను జెల్లవచ్చును. ఏదేని సత్యమును బ్రతిష్ఠింపవలయునేని, ఏదేని కీర్తిని నిలుపుకోవలయునేని, ఏదేని మహావ్యాపారమును బ్రసరింపఁ జేయవలయునేని, ఈ గర్భయాతనను సహించియే తీఱవలెను. ఎవ్వరైన నెద్దియైన కీర్తిని నిలుపుకొనఁ దలఁచిరేని, ఎవ్వరైన ధర్మప్రచారకులు కానెంచిరేని, ఎవ్వరైన నేదైన వ్రతమును బూని లోకోపకారమును జేయఁ జూతురేని కొన్నాళ్ళు ఒక్క-మాఱు వనమునకు వెళ్ళియే తీఱవలెను. ద్విజులు కాఁ దలఁచిరేని యొకమాఱు దండధారులై చివరకుఁ గొన్ని యడుగులైనను దిగియే రావలయును; హిందువులు చేసియుంచిన యీ యుపనయన సంస్కారవ్యవస్థయొక్క యుపకారమును మనము గ్రహింపవలయును. ద్విజుఁడవు కాఁగోరుదువేని, ఈశ్వరుని కరతలమ్మునఁ దేలియాడఁ జూడ నిచ్చగింతువేని, అంతరంగమున నే పశు వున్నదో దానిని పరిహరింప వలయును; చెడు ప్రవృత్తుల నెల్ల తఱిమివేయవలెను. కొలఁది దినములు దుఃఖాశ్రువులు పడును; పట పట మనుచు నీ హృదయపు టెముకలు బ్రద్దలగును; చివరకు నాశ్చర్యమైన భాగవత తనువు నీకు లభించును. బ్రతికి యుండవలెనని ప్రయాసపడుదువేని యొక మాఱు చావుము; క్రీస్తువలె, బుద్ధునివలె, శ్రీ గౌరాంగునివలె, కష్టబంధనముల మధ్యకుఁ బోయి తిరిగిరమ్ము. కేవలము సామాన్య కార్యమునే చేయఁ జూతువేని, తదనుయాయులగు హిందువులవలె, ముసల్మానులవలె క్రీస్తువాదుల వలె, కొలఁది దినములు వైరాగ్యమును సాధనచేయుము. కష్టమును

సహింపక ముందు, వైరాగ్యమును సాధనచేయకముందు, సంసారమునఁ బ్రవేశింపకుము. సంసారములో నీ విదివఱకే ప్రవేశించితివా ? అట్లయ్యేనేని రెండవ పర్యాయము సంసారము చేయఁ బోవునపుడు వైరాగ్యమును స్వీకరింపుము. ఇహలోకమందు స్వీకరింపవేని, పరలోకము నందైన స్వీకరింపవలసి వచ్చును. ఒకమాఱు ఏడ్వని యొడల నిజమైన నవ్వు నవ్వుటకు వీలు లేదు. అమావాస్యయొక్క యంధకారమునఁ బడకున్నఁ బూర్ణిమ యొక్క మహాలోకమును, శోభను గ్రహింపలేవు. దయామయుఁడు ధన్యుఁడు. జీవనోద్యానములో నిపుడు భక్తియొక్క ఆనందపుష్పములు పుష్పించినవి. ఈజీవనములో నాకుఁ గలిగిన దుఃఖకష్టముల నుండి, శోకములో మునిఁగి యుండుట యుచితము కాదని గ్రహించితిని. వెనుక సౌఖ్యము వచ్చుచున్నదని తెలుపుటకునై దూత భావమున విషాదము ముందే తెంచును. సుఖము నిచ్చును గనుకనే వైరాగ్యము స్వాభావికము. మర్కటవైరాగ్యమును నే నొల్లను. ఏ వైరాగ్యమును బ్రయత్నించి పడయవలయునో దాని కొఱకు నేను బ్రయాసపడను. నేను శరీరము మీఁద భస్మము పూసికొని వైరాగ్యమును సాధనచేయలేదు; సహజముగా నేది యిష్టమైనదో దానినే చేసితిని. స్వాభావిక వైరాగ్యమునే నేను అవలంబింతును. ఆ వైరాగ్యము నుండియే నాకు మంగళము గును. కాలవర్ణమేఘము లగపడిన వృష్టి యగునని తెలియుననను. జీవనములో వైరాగ్యమేఘము పొడసూపినంతనే ఈ విజ్ఞాన సంగత సత్యము అద్భుతము సిద్ధింపఁ గలదని గ్రహియింతును. వచ్చిన నొక నవవిధానము వచ్చును; అయిన నొక నవతత్త్వము ప్రకాశమగును; లేకున్న నొక నూతన సాధన మార్గము తెలియవచ్చును; ఇట్లు కానున్నపుడు

వైరాగ్యభావము ముందుగా హృదయము నధీనముఁ జేసికొనును. ఈ ప్రసవవేదన యెప్పు డగునో అప్పుడు దీని నుండి యొక చక్కని శిశువు జన్మించి తీరునని తెలిసికొనవలయును. స్వయముగా వంటఁ జేసికొనుమని కాని, పాదరక్షలను బరిత్యజింపుమని కాని, లేకున్న రెండు దినములు మఱియొక విశేష స్థానమున వసింపుమని కాని, ఆదేశ మియ్యనేని, ఇవన్నియు శరీరమును దగ్ధము చేయుటకుఁ గాదని గ్రహింపవలయును. శరీరమును దగ్ధముఁ జేసిన లాభమేమి ? ప్రకృత వైరాగ్యమెద్ది? ఎక్కడ వృష్టి లేదో అక్కడ వైరాగ్యమేఘమును లేదు. నలుగురికిని జూపింప నే వైరాగ్యమో, దానిని బరిత్యజింపుము! లోపల వైరాగ్యము నుంచుకొని బయట సమస్తమును తీవిగా నుంచిన యెడల నవనాగరికులు దానిని గపట మందురేసి నావలె జన్మసన్యాసు లెవరో వారు దీనినిఁ గొనియాడుచుందురు. ఈశ్వరాదేశముచే, ధర్మప్రచారార్థము, భద్రత ననుసరించి నేను నవనాగరికులమధ్య వాసము చేయుచున్నాఁడను. మనస్సు విరాగులతో సగోత్ర మైపోయినది. ఆ వంశముయొక్క పితృపితామహులు నాకు లభించిరి. మనలో నే వైరాగ్యమున్నదో యది కష్టము కొఱకుఁ గాదు; అది తనంతనే కలుగుచున్నది. ఇంకను నిలిచి యున్నఁ గొంచెము భద్రభావమును, బాహ్యశోభయు, భద్రతానుకూలముగాను, పరితరక్షణార్థమును ఇంకను ఉంపఁబడినవి. నవవిధానముయొక్క ఆదేశమున మనస్సు వ్యాఘ్రచర్మమును ధరించినది. బయట వ్యాఘ్రచర్మము యొక్క యగత్యము కలుగలేదు; బయట లేకున్ననే మంచిది. ఓయి భ్రాతృగణములారా! హృదయము వైరాగ్యమును ధరియించును గాక! ధర్మమునకుఁ గాను వైరాగ్యమును బాగుగ నాదరింపుఁడీ! ఈ బ్రహ్మసమాజమున

వైరాగ్యమూలమున ననేకుల కుపకారమైనది. నవవిధానములో వైరాగ్యముయొక్క సాధన లనేకము ప్రకాశితమై, అవలంబింపఁబడినవి. ఈ వైరాగ్యములో నాత్మ నవజీవనశోభను ధరించును. ప్రథమమునఁ గష్టము కలిగినను, సుఖము కలుగ మొదలుపెట్టెనేని మఱి తగ్గదు. ఈ దినము ఎంత శోకించితినో రేపు అంతకంటె నెన్నో మడుంగు లధికముగా సుఖము కలుగఁగాఁ జూతును. ఆదిని మ్లాన ముఖ మయ్యెనేని తుదిని హాసము వచ్చి వైరాగ్యమును మహిమాన్వితమును జేయనే చేయును.

ఓ దీనబంధూ! దీనశరణ్యా! ఎవరికి నేవిధిని గల్పించితివో వా రావిధినే పట్టుకొని పోవలయును. ఈ సంసారారంభసమయమున వైరాగ్యమంత్రమున దీక్షితుఁడనైతిని. ఈ జీవనము నెవ్వఁటకు రాలేదు; మధ్య మధ్య విపత్తుల యందుఁ బడవలసి వచ్చునని అప్పుడే గ్రహించితిని. కాని నీవు బాధల పాల్గానియ్యలేదు; నిగ్రహార్థమై యీ మోటి కుండను బ్రద్దలు కొట్టలేదు; రుగ్ణ శరీర మనస్సులను ఒక్కమాఱుగ నాశనము చేయలేదు. తిక్తౌషధమును ద్రాగింతువు, కేవలము ఋగ్రిఖించుటకే! మేఘము గ్రమ్మునది ఆకాశమును చిరాంధకారమునఁ గప్పివేయుటకుఁ గాదు! వైరాగ్యాంధకారము కలిగి కలుగని తోడనే ఆకాశము నృత్యము చేయుచుండును; పృథివి నాట్యమాడుచుండును; సస్య, ఫల, పుష్పములతో మేదిని పూర్ణమగును. ఈజీవనములో నెప్పు డెప్పుడు మనోభారము కలిగెనో, దానివెంటనే సుఫలము ఫలింపఁ జూచితిని. రాత్రియొక్క యంధకారము ఉదయము యొక్క దూతయై వచ్చును. దీనబాంధవా! నీ వేమి చేయుదువో అదియే మంగళము! ఇట్టి దుఃఖకష్టములలో నేదియుఁ జిరకాలము నిల్చియుండలేదే!

విషణ్ణత అట్టెయుండలేదే! దినదినమును, స్వస్థత, పుణ్యము, ధర్మము,— వీని నాస్వాదించుచున్నాను. దర్శనానందమును అనుభవించితిని. ఓయి నాథా! ఈ జీవనములో వైరాగ్యము యొక్క కష్టము నోర్చుటకు నెన్నఁడును వెనుదీయువాఁడను గాకుండుదునుగాక! దీనివలనఁ జిత్తము శుద్ధమగును; ఇంద్రియములు నిగ్రహింపఁబడును. హృదయము పవిత్రధారియగును; జీవనము లభ్యమగును. ఓయి దీననాథా! రమ్ము! విరాగులలో నీవు ప్రధానవిరాగివి! నీవే సర్వత్యాగివి! నేను నీ వెనువెంటఁ దిరుగుదును. లోలోపల సన్యాసినై, విరాగులలోఁ బ్రధానుఁ డెవఁడో, ఆయన ననుసరింతును. ఎంత వైరాగ్యము నిచ్చితివో ఇప్పుడు అంత నృత్యాధిక్యము నిచ్చితివి. ఇదివఱకు ఎంత దుఃఖించితినో, ఇపుడు మిత్రబాంధవులను గౌఁగిలించుకొని అంత హసించుచున్నాను; అంత యానందించుచున్నాను. భార్యాపుత్త్రుల నిదివఱకు భీకరముగా నెంచితిని; వారి నిప్పుడు నలుదిక్కులఁ గూర్చుండఁ బెట్టుకొని భవదీయానందములో నెంత యానందించుచున్నాను! ఈ పృథివిమీఁద స్వర్గమును దర్శించుచున్నట్లున్నది! నా యీ చేయు సంసారము సంసారము కాదే! సంసారములోఁ బ్రవేశింపవలసిన యవసరమే లేకుండెను. ఇదివఱకు నొంటిగా మనోవిషాదముచే అట్టె కూర్చుండువాఁడను; అందువలననే ఈ దినము బ్రహ్మమందిరము బంధుజనపూర్ణము కాఁగాఁ జూచితిని. ఎంత మంది బ్రహ్మపరాయణ బంధువుల నిచ్చితివి! ఇపుడు నృత్య మారంభ మయ్యెనేని వీరు రెండుచేతులును పైకెగురవేసి, ఎంత నృత్యము చేయుదురు! నా సుఖము నితరుల కిచ్చుచున్నాను; అన్యుల నానా సుఖములను నేఁ బుచ్చుకొనుచున్నాను. నా భార్యయు, నాత్మబంధువులును నా

సాయము గుదురని నే నిదివఱకు స్వప్నమందును నెఱుగను. శ్మశానములో నిల్లు కట్టుకొంటిని;' ఆ యిల్లు స్వర్గీయసాధువులతో సిట్టి సమ్మేళనస్థాన మగునని నే నెఱింగి యుంటినా ? ఎంత సుఖము వచ్చినది! ఇంకెంత రానున్నది! వైరాగ్యమునకు నమస్కరింతును! ఓయి సన్యాసధర్మ ప్రవర్తకా! నీకు నమస్కరింతును! ప్రకృతవైరాగ్యపథమున నడపించి మమ్ములను సుఖులను జేయుము! ఇదియే నీ శ్రీచరణములకుఁ బ్రార్థన!

పంచమాధ్యాయము.

స్వాధీనత.

భానువారము ౫ భాద్రము ౧౭౦౮ శకము.

నా యిష్టదేవత నాకు నానా మంత్రముల నిచ్చినపుడు స్వాధీనతా మహా మంత్రము తన్మధ్యమునఁ బ్రవిష్టమై యుండెను. "వత్సా! ఎన్నడు నెవరి యొక్కయు నధీనుఁడవు కాకుము;"— ఇదియే తత్ప్రధాన సత్పరామర్శము ప్రథమము నుండియు మనోవాక్కాయకర్మములతో నీ మంత్రమును శక్త్యనుసారముగఁ బాలించుకొనియే వచ్చుచున్నాను. ఈ పృథివి మీఁద నధీనత విషము; అధీనత బహుళ నరక బంధనములకు హేతువు. మొదటి నుండియు నధీనత మీఁద నేల యింత విరక్తుఁడ నైతినో తెలియదు. మానవుఁడు కామక్రోధములను తఱుముటకై రిపుల నడంచుటకై యత్నించును; ఉత్సాహముతో వాని న్వెంబడించును; కాని అధీనుఁడను కాను, అధీనుఁడను కాను, అనుచు నెవ్వరును ఇట్లు ఉన్మత్తులు గారు. నిశ్చయముగా విధాత కేద్దియో గూఢాభిప్రాయ ముండఁ బట్టియే జీవనము మూలమందు ఈ మంత్రమును ప్రవేశింపఁ జేసెను. అధీనత మీఁద నత్యంతమైన ద్వేషమును పొందుపఱిచెను. అధీనత పాప మనుకొను వాఁడను; దాన నెట్టి ఫలము ఫలించునో భావించువాఁడను గాను. అధీనత పాపము; అధీనత అరిష్టములకు మూలము; అధీనత్వము ఈశ్వరుని మీఁది శత్రుత్వము. మంత్రము యొక్క మాహాత్మ్యమును మొదటి నుండియు స్వీకరింపవలయుఁ గాని, ఫలమును జూడకయే యీ ప్రకారము సిద్ధాంతము చేసితిని. ఇందుచేతనే ఈదినము

వఱకును ఎవరి ముందరను శిరస్సును వంప నేరనైతిని. ఇందుకొఱకై కష్టముల పాలును గావలసి వచ్చినది; అయినను మంత్రమును వదలలేదు; మహీధరమువలె నిశ్చలమైన స్వాధీనతను నేను మెలివేసి పట్టుకొని యున్నాఁడను. ఈ మంత్రము సామాన్య మంత్రము కాదని గ్రహించితిని. "అధీనము కావల" దను నీమంత్రమున నొక్క విశేషార్థ మున్నది. నవవిధానము తరువాత రానై యుండుట చేతను, నానా కుసంస్కార దుర్భ్రములను దూరము చేయవలసి యుండుట చేతను, స్వాధీన భావమున సత్యము యొక్క మహిమను మహత్తరముగఁ జేయవలసి యుండుట చేతను,— ఈ యన్నింటి కొఱకే స్వాధీనత్వ భావము మొదటి నుండియు వర్ధిల్లుచుండెను. స్వాధీనత్వమే యాదిమ శబ్దమయ్యెను. "అధీనుఁడ గా" నన్న యీ సంకల్పము గాక ఈ భావము నుండి యింకేమేమి ఫలములు ఫలింపఁగలవు? ఈ స్వాధీనత నుండియే యనేకములైన మహాకార్యములు ప్రభవించినవి. అధీనతాశృంఖలములో మనశ్శరీరములఁ గట్టుబడనియ్యను; దాసత్వమును స్వీకరింపను; ఎవరి యొక్క పదతల మందును బడను; గురుజనులకు నాత్మను విక్రయింపను; గ్రంథవిశేషమునకును కింకరుఁడనై వందనము సేయను; ఏదో యొక మత సంప్రదాయములోఁ బడి దివారాత్రములు దానియొక్క యశోఘోషణమునే చేయుచుండను. ఈ వైపున నీ సకల ప్రతిజ్ఞలవలెనే, ఆ వైపునను, స్వేచ్ఛాచారమున కధీనము కాననియు, నహంకారమున కధీనము కాననియు, ఈశ్వరుని సమక్షమునఁ బూనవలసిన వ్రతమును బరిత్యజింప ననియు, ప్రతిజ్ఞలఁ జేసితిని. స్వాధీనత్వభావము వృద్ధియైనకొలఁదిని, విగ్రహపూజ, జాతిభేదము మొదలైనవి ప్రభుత్వము చేయుచుండఁ

జూచితిని. చూడఁగనే ఆ సముదయము యొక్క శృంఖలములను ఛేదించుటకై యత్నించితిని. శతాబ్దముపై శతాబ్దము దేశమును విగ్రహపూజ మొదలగు వాని యొక్క దాసిని జేసి యుంచినవి. ఆ సముదయమును ఖండించుటకు ఖడ్గహస్తుఁడ నైతిని. కుసంస్కార దుర్భ్రమలు పితృవర్గమును బాధించి యా వీధి వీధి కంతకు నుపద్రవము కలుగఁజేయుచున్నవని ఎప్పుడు చూచితినో, అప్పుడే యస్త్రమును బయటికిఁ దీసితిని. నేను దాసత్వమును సహింపలేకుండు వాఁడను; ఇప్పుడును సహింపలేను. ఎవరైనను విషయవాసనయొక్క గాని, అరివర్గముయొక్క గాని వశవర్తు లగుచుండఁ జూచితినేని "ఏమి యన్యాయము" అనిపించునది; ఏవిధమునను సహిష్ణుఁడనై యుంట లేకుండువాఁడను. అధీనతను ఛేదించుటకు నా యస్త్ర మెప్పుడు నూఁగాడుచుండెను. అధీనత మూలమున నిన్ని యరిష్టఫలములు ఫలించినవని నేను లెక్కవేసి కనుఁగొనలేదు. నేను చింతించి చింతించి యస్త్రమును హస్తమున ధరింపలేదు. తుట్టతుదకు నీ మహామంత్రముయొక్క, ఈ గురుమంత్రముయొక్క యాశ్చర్య ప్రభావమును దర్శించితిని. ఈ పృథివిమీఁద నేయే విషయములు స్త్రీపురుషులను దాసులనుగఁ జేసి వైచినవో ఆ యన్నింటికిని బ్రతికూలముగా నిలువఁబడవలసివచ్చునని, అధీనతను జూచినంతనే ఉత్తేజితుఁడనై పడునట్లు నాకు నా యిష్టదేవత శిక్షఁ గఱపెను. క్రోధమున కెవరేని దాసులు కాఁగాఁ జూచితినేని క్రోధము మీఁదనే క్రోధము పుట్టునది. తండ్రికి దాసుఁడగుట గాని, లేక చివరకుఁ దనయునకు దాసుఁడగుట గాని నాకు సహ్యమగునది కాదు; ధనమునకు దాసుఁడగుచుండఁ గాని, లేక మానమునకు దాసుఁడగుచుండఁ గాని, తుద కేదేని యొక మతశాఖకు

దాసుఁడగుచుండఁ గాని ఎవ్వనినైనఁ జూచితినేని రక్తము చంచలమై పోవునది. మనుష్యున కీశ్వరుఁడు స్వాధీనత నిచ్చెను : ఆ మనుష్యుఁ డన్ననో యాస్వాధీనతను బృథివి యను సంగడిలో నమ్మివేసి యైహిక పాపములచేఁ బరాజితుఁడై గిఁజెట్టుచున్నవాఁడు. పలుతరగతుల మనుష్యులు పలుతరగతుల మనుష్యులవద్ద వంగి వంగి పాదముల మీఁదఁ బడి దాసత్వమును స్వీకరింతురు. క్రీతదాసులగుటకు ఇంత యిచ్ఛయా ! పది పదునాకఁడు వత్సరముల నుండి దాసత్వమునే చేయుచున్నారు ! ఒక్కొక్క వింత వింత స్త్రీకిఁ జేయు దాసత్వమున కేమందురు ! వ్యభిచార మందురు. మనుష్యునకు దాస్యము చేయువాని నేమందురు ? దాసజనులమధ్య గణింతురు. ధనమునకు దాసుఁడైన, లోభియందురు. ఈ సమస్తము పాపము ; దాసుఁడగుటయే పాపము. ఆసక్తి సంసారమునకు రాజైన మునిఁగి పోవలసినదే. ఏ గ్రామమునకు వెళ్ళినను, ఏ గృహమునఁ బ్రవేశించినను— చూడుము ! నా దాసు లెంతమందిరో ! అని క్రోధ మనును ; చూడుము ! నా కెంతమంది బంట్లో ! నే నెట్టి రాజాధిరాజులను సైతము పట్టి పరిహరించుచున్నానో ! యని లోభ మనును. దాసత్వవిధి నలుగురి మధ్యను బ్రవేశించి కేవలము కాల్చుకొని తినుచున్నది. హా ! విధాతా ! స్వాధీనతయే ముక్తియు, అధీనతయే నరకమును గదా ! స్వాధీనతయొక్క జయపతాకను లేవనెత్తి అధీనతయొక్క దుర్గమును చూర్ణచూర్ణము చేయవలయును. ఎవ్విధమైన మతాంతర్భాగ భావములోను బడను. కొందఱు గురువును పాటింపుమందురు ; మనసు భయమగుచున్నదనును : తల్లిదండ్రులను పాటింపుమందురు ; భయమగును: బంధుమిత్రు

లెవరో, ధర్మములో నెవరితో నేకమై పోతినో వారిని మన్నింపుమందురు; మహాభయ మాగుచున్న దని యాత్మ యనును: ఎవరు అత్యంతానుగతులో, ధర్మములోను సత్కర్మములోను అనుకూలురో ఆదరముతో వారి యధీనతను స్వీకరింపుమందురు; అధీనమగుటకు నాకు భయమని మానసము వచించెను. ఏమిత్రునియొక్క మాయలోను నేను బద్ధుఁడనుగాను. నేను ప్రేమించుమాట వాస్తవమే యైనను, మాయలో మాత్రము బద్ధుఁడఁ గాలేదని నా యాప్తమిత్రు లొక్కరు చూచి గ్రహించిరి. ఇందులకనియే, "ఈతఁడు మమ్ములను ఒడలుమఱచి ప్రేమించునని చెప్పుటకు వీలులేదు. మధ్య మధ్య మఱలఁ దనబుద్ధిని బ్రదర్శింపఁ జేయుచుండును. మేము చెప్పిన దానిని చేయఁ"డని నా మిత్రు లందురు. మిత్రులు దేనిని జేయుమందురో దానిని నేను చేయుటలేదు. ఇతరుల యొక్క మాటమీఁద నేను మంచిపని నైనను జేయఁజాలను; ఈశ్వరుని మాటమీఁదఁ జేయుదును. అన్యుల మాటమీఁద దేనిని చేయ నైతినో, ఈశ్వరుని మాటమీఁద దానిని ఆత్రముతోఁ జేయుదును. ఈశ్వర వాణి యంతవఱకు వినఁబడదో అంతవఱకు నేను ఏకార్యమును ఆరంభింపను. ఇట్టి ప్రతిజ్ఞచే అన్యులకు నష్టము కలుగవచ్చును; కాని నేను సౌభాగ్యశాలిని; నాకు దీని మూలమున నష్టమునకు మాఱు లాభమే కలిగినది. మిత్రులను గష్టపెట్టితిని; గాని స్త్రీ కధీనము కాలేదు; బిడ్డల మాయచేఁ గాని దేశముయొక్క మాయచేఁ గాని బద్ధుడఁను గాలేదు; ఇఁకను గాఁబోవుటయు లేదు. సజీవులై యున్న వారియొక్క గాని, మృతులైనవారియొక్కగాని, ఎవరియొక్కగాని అధీనతాశృంఖలమున నేను బద్ధుఁడ నైనట్టు గాని, అధమపక్షము, వారి మాయచేఁ గట్టువడి పోయినట్టు గాని ఎవరును ప్రమాణము

చేయలేరు. స్వాధీనతనే ఎల్లపుడు నేను ఆదరింతును; కాని భక్తివిహీనమైన స్వాధీనత 'నా కాదరణీయము' గాదు. పృథివియొక్క యంగడిని, అహంకారమూలకమైన స్వేచ్ఛాచారమును నేను దచ్చిచ్చి కొనలేదు. గొప్పవాఁడ నగుటకును, ఉన్నతపదవిని బొందుటకును నేను స్వాధీనతను క్రయింపలేదు; అట్టి స్వాధీనత నరకముయొక్క స్వేచ్ఛాచారము; నేను దానిని స్వాధీనత యనను. నేను ప్రేమించితిని; కాని మాయాబద్ధుఁడను కాలేదు. ఇదియే యథార్థప్రేమ. మిమ్మెల్లను ప్రేమించితిని; కాని, అధీనుఁడను గాలేదు. అధీనుఁడనై లోకుల నాహ్వానము చేసియుంటినేని నేఁడు నా దళమున శతసహస్రములుండెడివారు. మాయలో నందఱను మఱపించి యుంటినేని, దాసశ్రేణిలోఁ జేర్ప నాశ యుండెనేని, నాదళము జనులతోఁ బూర్ణమై యుండునది. స్వాధీనతను దళపతిని జేసితిని. ఇందుచేత, సదా నాతో నెవరు వర్తిల్లుచున్నారో వారిని నేను మిత్రులందును; నన్ను వారి గురువుగ భావింపను. స్వాధీనత్వమునకే జయము కలుగును. ఇందుచేతనే "సత్యము జయించును గాక! సత్యము జయించును గాక!! సత్యము జయించును గాక!!!" యందును. స్వాధీనతయే జనము నాకర్షించును; ఇందుచే లోకులు వచ్చిన రానిండు; అంతియ కాని, గురుత్వము, గిరుత్వము నెన్నఁడును జేయనొల్లను. అధీనమగుటను మిక్కిలి యసహ్యింతును. నాలో నసహ్యించుకొనుదానిని ఇతరులలో నసహ్యింపనా? దళములోని ఏసామాన్యుఁడును గూడ నధీనుఁడై యుండ నేను జూడలేను. ఎవరును ఇతరుల యధీనులగుటను నేను జూడఁజాలను; నా యధీనులెవరైన నైరేని యదియును నా కత్యంతాసహ్యమే. మఱియొక

మనుష్యుఁడు నా యొక్క అధీనము కానా? ఈశ్వరున కేమి సమాధానము చెప్పుదును? నా మతమును మఱియొకని మెడలమీఁద మోప నగునా? నా శాసనముచే నితరులను శాసింపఁ దగ వగునా? మాయ యొక్క మోహినీ మూర్తిని జూపి, ఈ నా దళములోనికి లాగ యత్నింపఁ గూడునా? పరుని నా యధీనము చేసి యుంచుకొన ధర్మమా! నరకము నన్నపుడే నోరు తెఱచికొని హుమ్మని మ్రింగివేయును. స్వర్గముగూడ దండప్రయోగము చేసి వెడలఁగొట్టును. నాకు సంఘము ఏర్పడకున్నను, ఒక్క మనుష్యుఁడైనను దగ్గఱకు రాకున్నను నేను దాసుఁడ నెప్పుడు గానో, అప్పుడు ఇతరులను దాసులఁ జేయను. నే నెప్పుడైన దాసత్వము చేసినట్లు మీలో నెవ్వరైన నెఱుంగుదురా? నే నెవరియొక్క దాసత్వమును జేయనపుడు, మీ రేల దాసత్వము చేయుదురు? తను నెన్నఁడును ఎవరి యొక్కయు దాసుఁడుగాఁ జేసికొనని వాఁడు, ఇతరులను దాసులఁగాఁ జేయ యత్నించెనేని, కనీసము దాసులై యుండఁ జూచి సంతసించెనేని. వాని వంటి పాపియుఁ గపటవర్తనుఁడును మఱెవరు? గురువును నేను గాను; ఇతరులను దాసులను జేయ నేను యత్నింపలేదు. ఎల్లప్పుడు నన్ను నేనె, శిక్షించితి; అనఁగా నేను శిక్షార్థిని; ఎల్లప్పుడును శిక్షింప సిద్ధుఁడనై యున్నాఁడను. నా దళమునందు ఏఁబది మంది యున్న నా యేఁబది మందియు నేఁబది ప్రకారములు. సత్యము సాక్షి; సూర్యచంద్రులు సాక్షులు; అధీనత్వ మిక్కడ లేదు. నూఱుమంది ఇక్కడకు వచ్చుచుందురేని, వారిలో నెవరికి వారే ప్రధానులు. ఎల్లవారును నా సమక్షమందు దీనిని స్వీకరించి తీఱవలయును, నేను గతించిపోయినను ఈ విషయము నెల్లవారును స్వీకరింతురు. దళములో నెల్లవాఁడును

స్వాధీనతలోనే జీవించుచున్నవాఁడు గాని, ఎవ్వఁడును అధీనతలో జీవించుటలేదు. నేను ఎవనిని గాని ఏదో యొక దానిలో వేసి మర్దింపఁ గోరను. ఎల్లవారిని స్వాధీనులనుగాఁ జూడ నిచ్ఛగింతును. ఎవరినైనను గురువుగఁ గాని, శాసనకర్తగఁ గాని గణింపుమని చెప్పను; కేవల మీశ్వరుఁడే గురువనియు, శాసనకర్త యనియు నే నెఱుఁగుదును. అధీనతాప్రియులగు వంచకు లెవ్వరైనను ఇక్కడఁ జాటుగఁ బ్రవేశించి యుండిరేని ఆ వంచకులను బయటికిఁ ద్రోలివేయుదును: త్రోలి తీఱుదును. అధీనుల దళ మిక్కడ లేదు. ఎవని మీఁద దళము యొక్క భార మున్నదో, ఆయన తానే యధీనుఁడు గానపుడు, తానే అధీనతను అసహ్యించునపుడు, దళమందలి యెవ్వరును అధీనులగుట సంభవింపదు. అందఱకు నొక్కక విశేష భారమున్నది: వ్రతమున్నది. ఏదేని సుమతము నైనను గ్రుడ్డిగా ననుసరించుట నా కిష్టములేదు. నే నంధుఁడనై యంధులను నడుపను. స్వాధీనత్వము మహామంత్రము. స్వాధీనత్వ మింత దనుక వచ్చిన నది దాదాపు స్వేచ్ఛాచార మైనదందురా? స్వాధీనత పూర్ణతఁ జెందును; స్వేచ్ఛాచారము కాదు; ఎట్లన, నొకతల్లి నొకతండ్రిని మన్నించుట చేతనే, తల్లి దండ్రుల యధీనుఁడను గానైతిని. అందుచేతనే ధర్మములో సైతము స్వాధీనతా వ్రతమునే యవలంబించితిని. సంసారము యొక్క మాయను గోసి వేసికొని, కొందఱు తిరిగి బ్రాహ్మసమాజమందలి బంధువర్గమునకు దాసత్వముఁ జేసిరి. ఐహిక కీటకములు కాలేదు; కాని, ధర్మసమాజమునఁ జేరి యీ చిన్ని పుస్తకమును అభ్రాంతముగ భావించి దానికే కొంచె మించు మించుగ సంపూర్ణ దాసులైరి. ఈ నానా మాయల నుండి నేను నన్ను దూరమం దుంచుకొన్నాఁడను. `ఒక పుస్తకమును

అభ్రాంతముగ నే నేల తలంపవలయును? ఒక మనుష్యుని నే నేల యనుసరింపవలయును? మహామాన్యుఁ డగు క్రీస్తు మహా మహిమాన్వితుఁ డగుఁ గాక! శ్రీ గౌరాంగునకును నా యావద్భక్తిని జూపుదును. కాని, వారిని జీవనాదర్శములుగఁ జేయను. అహంకారి వందువేని అనుము. దురాచారి వందువేని అదియును అనుము. కాని, ఏ మనుష్యు నైన జీవనాదర్శమని ఎన్నఁడును అనుకొనలేదు; ఇంక ననుకోను అనుకొనను. మనుష్యుఁడు పూర్ణాదర్శము కానేరఁడు. క్రీస్తుయొక్క ఆలోకనము ఎక్కడను వచ్చి చేరలేదో, ఈశ్వరుఁడు తానే ఆదర్శమై నిజాలోకనముచే నాస్థానమును ప్రకాశింపఁ జేయును. పూర్ణజ్ఞానము నిచ్చునట్టి పుస్తక మేదియును లేదు; ఇందుచేఁ బుస్తకమును ఆదర్శముగా స్వీకరింపలేదు. ఈశ్వర పుత్త్రులను నాకంటె నధికముగఁ బ్రేమించువా రెవ్వరున్నారు? అయినను, వారిని జీవనము యొక్క యాదర్శముగా భావించి ఈశ్వరుని అవమానింప నని నేనే యుందును. బైబిలును, పురాణములను ప్రేమింపఁ బోయి నే నీశ్వరుని నవమానింపను. ఈశ్వరసాన్నిధ్యమునందె నే నుందును. స్వర్గములోఁ గాని, పృథివిమీఁదఁ గాని ఎవరియొక్క దాసుఁడను గాను. వ్యాఘ్రచర్మము నాకుఁ బ్రియము. "ఏకతంత్రి"* నాకుఁ బ్రియము. కాని, ఈ రెంటిమీఁద నాకు ఆసక్తి కలిగెనేని, వీనికి నేను దేవతాస్థానము నొసఁగినవాఁడ నగుదును. వీని నీదినమున, ఈదినముయొక్క ప్రయోజనము నిమిత్తమే గ్రహింతును. రేపు వానిని విసర్జింతును. ఈదిన ముపాసనా సమయము నందు వ్యాఘ్రచర్మము నాదరించితిని: రెండు ఘంటల తరువాత దానిని

---

* ఒకే తంతి గల వాద్యవిశేషము దీనిని సాధారణముగ బైరాగులు వాడుచుందురు.

ద్యజించితిని: అటు మీఁద దాన్ని తలఁపే లేదు. బాహ్యవ్రత సాధనలయొక్కయు దాసుఁడను గాను. ఎంతమంది ధనమాయను వదలి వ్యాఘ్రచర్మపు మాయలోఁ బడిరో ఎవరికిఁ దెలియని విషయము? ఇందునకనియే యాత్మ సతతము జాగరూకమై యున్నది; ఎన్నఁడును ఏవస్తువుయొక్క నధీనము కాదు; ఏవస్తువు మీఁదను ఆసక్తి నుంపదు; పుష్పముల మీఁద నాసక్తి నుంపదు; కాషాయవస్త్రముమీఁద నాసక్తి నుంపదు; వ్యాఘ్రచర్మము మీఁద నాసక్తి నుంపదు. నాకు ఎప్పుడు దేనితోఁ బనియున్నదో, నే నప్పుడాపనిని దానిమూలముగా ముగించుకొని, కడపట మృదంగమా! సెలవిమ్ము; కాషాయవస్త్రమా! సెలవిమ్ము; వ్యాఘ్రచర్మమా! సెలవిమ్ము;— అందును. నాపని ముగిసిపోయినది; ఇంకను దాని నేల పెట్టుకొని కూర్చుందును? నన్నది యేమాత్రమును దాసుని జేయుటకు రాలేదు. అవసరము నాది; దానిది కాదు: అభీష్టమును సిద్ధింపఁజేసికొందును; సిద్ధించెనేని అది యిఁక నుండదు. దేనిమీఁదనైన నాసక్తి యున్నయెడల, వ్రతాదుల మీఁద రవ్వంతైన నాసక్తి యున్నయెడల, నేపరిమాణమున నాసక్తి యుండునో, ఆపరిమాణమున నరకాగ్ని జ్వలించును. నవవిధానములోఁ బ్రతివానికిని సంపూర్ణస్వాధీనతయే. గురువెవరు? బ్రహ్మసమాజమెవరు? నా బ్రహ్మదళమేది? దేనిమీఁదను ఆసక్తి లేదు. వస్తు వేదో దానిని గ్రహింతును. అవసరము వచ్చినయెడలఁ బేరును సహితము పరిత్యజింపఁగలను; కాని వస్తువును మాత్రము ఎవ్విధమునను బరిత్యజింపఁ జాలను; తక్కిన యేపనినైనను జేయఁ గలుగుదును. ఇందుచేత నెవరితోను నాకుఁ గలయలేదు. దుఃఖముల పాలైతిని; కాని సుఖమును సైతము కావలసినంత యనుభవించితిని. గురుత్వము

గిరుత్సాహము చేసితినేని సభ్యుల సంఖ్యను వృద్ధి చేయఁగలను. కాని యీపనిని జేయఁ జాలను. నాయందును, నా భ్రాతృవరుల యందును స్వాధీనతను సంపూర్ణ రూపమున స్థాపింపఁ గలుగునట్లు పరమేశ్వరుఁ డాశీర్వదించును గాక! ఇందువల్లను సభ్యుల సంఖ్య వృద్ధి యగును. కావలసిన దంతయు దీనివల్లనే సమకూడును. స్వర్గము నుండి స్వాధీన జీవగణముల మీఁదఁ బుష్పవర్షము కురియుచుండును; జనకుని సన్నిధానమున నందఱు వసింతురు; స్వేచ్ఛాచారులు కారు. ఒకవైపున నెంతపాపమును, ఎన్ని కుసంస్కార దుర్భ్రమలను అగపడుతువో, రెండవవైపునను ఎన్నిప్రకారము లైన స్వేచ్ఛాచారములు, దంభములు, అహంకారము లున్నవో వాని నన్నిటిని కనుపఱుపుము. చివరకు నీ రెంటిమీఁదను స్వాధీనతాస్త్రమును బ్రయోగింపుము. మనము ఈశ్వరునకు అధీనులము: అందుచేతనే సంపూర్ణస్వాధీనులము.

ఓ దయామయా! ఓ స్వాధీనపురుషా! స్వాధీనత మహామంత్రము. ఎట్టి యాశ్చర్యకర మంత్రము! దయ యుంచి నన్ను మంత్రమున దీక్షితుని జేయుదువేని నా యొక్కయు నా సోదరుల యొక్కయు శుభమునకుఁ గాను మా యందఱిలోను స్వాధీనత్వ భావమును వృద్ధిఁ జెందింపుము! ఒకమూల పాప జ్వాలలోఁ బడిపోవుచుండ, దానిమీఁద దేశాచారము, కురుచి, భ్రమ—ఇవన్నియు నీ తనయుని బంధించి పడవైచెను; అందుపై మఱల నానా ప్రకారములైన యాసక్తులను మెడల మీఁద మోపినవి. హా! ఈశ్వరా! అవి నన్ను గొనిపైచు నేమో యని, క్రీతదాసుని జేసి యుంచుకొను నేమో యని దురపిల్లుచున్నాను! అమ్మా! నేను నీ దాసత్వము చేయవలసియుండె! అందుకు మాఱు మఱియొకనిని సేవించుచున్నాను!

సంసారప్రభువును సేవించి సేవించి చచ్చిపోవుచున్నాను. మూఁపు మీఁద, మనస్సుమీఁద దుర్భరమైన దాసత్వ భార మున్నది. అధీనత్వము మనుష్యుని జితుకఁ గొట్టుచున్నది. హా! స్వాధీనతా ప్రదాతా! ఏడ నున్నాఁడవోయి! మనుష్యుఁడు ఇంత కష్టపడుచున్నాఁ డేల? అధీనత్వ భావముతో నాక్రమాలు యుద్ధ మారంభ మగుఁ గాక! అమ్మా! శక్తిస్వరూపా! హుంకార రవముతో శత్రువులను దఱుమఁ గొట్టుము. ఇఁకఁ బరుని దాసత్వమును జేయను. అమ్మా! ఆనందమయీ! ఇఁకఁ బాప మున్న దిక్కునకు వెళ్ళను; రిపువరతంత్రుఁడ నిఁకఁ గాను. ఏది చేయుమందువో దానినే చేయుదును; ఎక్కడికి వెళ్ళుమందువో, అక్కడికే వెళ్ళుదును; దేనిని భుజింపుమందువో దానినే భుజింతును; దేనిని నిషేధింతువో దాని నెన్నఁడును దినను. ఎట్టి దురభ్యాసమునకును దాసత్వమును జేయను. "ఇంత ప్రేమించు నట్టి యా తల్లి యాదేశమును బాలింప లేదుగా? ఆమె మాటను ద్రోసి వైచితివిగా? ఆమె నవమానించుచున్నావు గా?" అని వివేకము మనస్సును బ్రబోధించునపుడు అతి బాధగా నుండును. అమ్మా! ఇప్పు డిప్పుడు గ్రహించుచున్నాను. అధీనతా దాసత్వము మహానరకము! నీ యీ పాలికి యగు తనయు నుద్ధరింపుము. ఇనుప గొలుసులను ద్రెంపివేయుము. బంధుమిత్రులను గలుపుకొని స్వాధీనపక్షినై యెగిరిపోదును. స్వర్గమునందలి వనములో స్వాధీనభావమున విహార మొనర్తును. స్వర్గఫలములను భక్షింతును. ఇఁక నధీనతాపంజరములో నుండకుందును గాక! ఆకాశవిహారి యగు స్వాధీనపక్షి ఆకాశమున నెగురుఁ గాక! దయామయీ! దయ దలయింపుము. ఆశీర్వదింపుము. నీవు ప్రసాదించిన స్వాధీనతను సద్వినియోగము చేసికొని సుఖింతును గాక! తండ్రీ! నీ సన్నిధి నిదియ నా ప్రార్థన.

షష్ఠాధ్యాయము.

వివేకము.

భానువారము ౧౯ భాద్రము ౧౮౦౮ శకము.

అంతరంగమున నెద్దియైనను మాటాడెనేని సాధారణముగ లోకులు దానిని భూతముగ భావింతురు. ఏ పురుషుఁడు ప్రేతగ్రస్తుఁడయ్యెనో, ఆ పురుషుఁడు లోపలను వెలుపలను వాణిని వినుచుండును. ధర్మ జీవనము యొక్క యారంభము నుండి, అంతర్బాహ్యములయం దిట్టి వాణిని, ఇట్టి సంభాషణములను, అనేక పర్యాయములు వింటిని; అయినను దానిని ప్రేతవాణి యని యెన్నండును అనుకోలేదు; ఇఁక ముం దనుకొనఁ బోవుటయును లేదు; ఈ జీవనము నందు ఇది మఱియొక విశేషము. ఒకనిలో మఱియొకఁ డుండుననియు, ఒక జిహ్వలో రెండు జిహ్వ లుండుననియు, భిన్న భిన్నములగు స్వరములను విస్పష్టముగ విననగు ననియు, అనేక పర్యాయములు, అనేక సమయములందు, ధ్రువపడెను. మనుష్యుఁడు ముందు సంభాషించి, యనంతరము విచారమునకుఁ దొడంగును; విచారము చేసి ధర్మజ్ఞానముఁ బడసినవాఁడగును. నేను ముందు భావన చేసిచేసి ధర్మమార్గమునకు వచ్చియుండలేదని మొట్టమొదటినుండియు వక్కాణించుచునే యున్నాను. కాని, "నేను" "నేను" అను వాని మధ్యమున "నీవు" "నీవు" అని సంబోధించు వాఁడు, నేను గానివాఁడు మఱియొకఁ డున్నాఁడని స్పష్టముగా గ్రహించువాఁడను; అతని మాట మీఁదనే ధర్మకార్యముల ననుష్ఠింపఁ జూతును; మఱియొకఁడు లోలోపల మాటాడుచుండు నను నీ పరీక్షిత సత్యము పలుమాఱు అనుభవమునకు వచ్చినది. కొందఱు కొంద ఱీయంతర్వాణిని వినరని

రొబ్బుంగుదును. దీనిని వినఁగ వినఁగ. కుసంస్కారము కలుగుననియు, ఇది ప్రేతవాణి యనియు, దీనిఁ బట్టి పోయిన నమంగళమగుననియు, అనేకు లనుకొనుచుందురు. ఇట్టి వాణిని వినువారిని ఉన్మత్తులలో గణింప వలయు ననువారును గొందఱున్నారు. కేవలమీ దేశములోనే గాక సకల దేశములలోను లోకులకీయభిప్రాయము కలదు. నేను గాక మఱియొకఁడు నాలో నున్నాఁడని యెవ్వఁడైనను అనెనేని పదిమంది కలసి సభచేసి అతనిని ఉన్మత్తులలో జతచేయుదురు. ఇది యున్మత్తుని వ్యాపారమైన నేనిట్టి యున్మాద గ్రస్తుఁడ నగుట కెంతయు నభిలషింతును. ఇది ధర్మోన్మత్తత;— పరిత్రాణోన్మత్తత. ఏలయన, దీనిని నేను భూతవాణి యనక బ్రహ్మవాణి యందును. ఈ వాణి విషయమై యొక యిసుమంత యవిశ్వాసమైన నాకు లేదు. ఈ శబ్దమును విననపుడెల్ల, ఈ యదృశ్య ప్రాణవిశిష్టపురుషుని పలుకులును, స్పష్టములైన స్వరములును, శ్రుతిగోచరమైనపుడెల్ల, ఈ శబ్దము మిత్రుల యొక్క శబ్దము కాదనియు, తల్లిదండ్రుల యొక్క శబ్దము కాదనియు, దారపుత్రుల యొక్క శబ్దము కాదనియు, నాది కాదనియు, పుస్తకములో నేర్చిన సత్యము కాదనియు, వెనుకటి మాట యేదియో స్మరణకు వచ్చుటయుఁ గాదనియు, కల్పనాదేవి సొగసైన రంగులతో మనోమధ్యమునఁ జిత్రించె ననుటయుఁ గాదనియు, గ్రహించితిని. ఏదో పాపము నుండి నివృత్తుఁడ నగుటకుఁ గాని, లేక, ఏదో సదనుష్ఠానము ననుష్ఠించుటకుఁ గాని ఆయనయే వక్కాణించుచున్నాఁడు. ఏదో నూతన కార్యభారమును వహించుటకుఁ గాని, లేక ఏదో నూతన ప్రదేశమునకు వెళ్ళుటకుఁ గాని, ఆయనయే యాదేశించుచున్నాఁడు. ఏదో పాపమును

వినాశముఁ జేయుమనియు, నేదో దురాచారము మీఁద ఖడ్గహస్తుఁడవు కమ్మనియు, నాయునరయే వచించుచున్నాఁడు. ఈ యన్నివిషయముల నాలోచన మీఁద నిరూపణ చేయుచున్నానని కాని, నేను స్వయముగ నీ సకల కార్యములను జేయ యత్నించుచున్నానని కాని, నే నొకర్త మాఱు ననుకొనను. తమలో నిట్టి శబ్దము వినఁబడిన లోకుల కేమని తోఁచునో స్వభావమున కిట్టి స్వభావము నిచ్చిన వాఁడే చెప్పఁ గలఁడు. బుద్ధి ప్రయత్నించి, ఎన్నో యుపాయముల నవలంబించి కూడ నీ వాణిని తరుమలేకపోయెను. "నే నొక ప్రధాన వ్యక్తిని; నేను దెలిసికొనుచున్నాను; నేను జేయుచున్నాను; నేను గ్రహించుచున్నాను. కష్టమున్న మార్గమును నేను వదలుచున్నాను; నా సత్కీర్తిని బది వేల మంది చెప్పుకొందురు." అను నిట్టి యాశలును, ఉద్దేశములును, అనేకులకుఁ గలుగుచుండును. కాని "నా విద్యాబుద్ధుల ననుసరించి యనేక కార్యములను జేసితిని; అయిన నీ కార్యములు నా కార్యములు కావు; ఈ భావములు నా భావములు కావు; మనసులో నింకెవరి మాటలో వినఁబడుచున్నవి." అనియు ననేకులు స్వీకరింతురు. నాకు ఏ విధముగా నొక ప్రకృతియును, కొన్ని భావములును, ఉన్నవో, అలాగుననే ఆయనకును ఉన్నవి. నా కేప్రకారమునఁ గొన్ని సిద్ధాంతము లున్నవో, అదేప్రకారమున నాయనకును ఉన్నవి. ఒకటి జీవాత్మ; ఇంకొకటి పరమాత్మ. రెండును వేర్వేఱు. విశేష్యము ఒకటి; విశేషణములు రెండు. ఆత్మపదార్థములో రెండువిశేషణములును మిళితమైనవి. ఒకటి జీవము; ఇంకొకటి పరమము. ఆత్మలో జీవుఁడు మాటాడును; పరమమైనవాఁడు కూడ

నాత్మలోనె మాటాడును. ఇద్దఱి యొక్క రసనయు రసము నాస్వాదించును. ఇట్టిద్ద అన్యోన్యను సంగతి యనేకులకు సాధన మీఁదఁ గాని తెలియదు. సద్భావములన్నియు నీశ్వరునివి ; ఇఁక మంద వచనములు, కుబుద్ధి, అసత్యపరామర్శ, అవిద్య — ఇవన్నియు నావి. బాగుగ యోచించి చూచినఁ గల్యాణ మంతయు నీశ్వరుని దనియు, అమంగళ మంతయు నా దనియును, సుఖస్వస్థతలు ఆయన ప్రసాదములనియు, అసుఖదౌర్బల్యములు నావనియుఁ దేలును. మనోవిజ్ఞానప్రణాళి ననుసరించి యీవిధముగ స్థిరము చేసికొని, సాధనఁ జేసితి నేని, అసత్కార్యములకుఁ గాను లజ్జితుఁడ నగుదును ; సత్కార్యములకుఁ గా నీశ్వరునకు యశోగౌరవముల నర్పింతును. కొందఱి పక్షమున నిది ఉపార్జిత భావము ; ఉపార్జిత జ్ఞానము ; మఱికొందఱి కిట్టి ప్రకృతి స్వాభావికము. రెండు పక్షులు సదా యొక చెట్టు కొమ్మమీఁదఁ గూర్చుండి యున్నవి. రెండు పక్షుల యొక్క శరీరచ్ఛాయయు దాదాపుగ నొకటియే ; కంఠస్వరమును దగ్గఱ దగ్గఱ సమానమే. సాదృశ్యము నున్నది ; విభిన్నతయు నున్నది. స్వభావసిద్ధముగ నెవరి కీభావము తలఁపునకు వచ్చునో, ఎవరి కిట్టి స్వభావసిద్ధ జ్ఞానమున్నదో వారికి దైవవాణి యధికముగ వినఁబడును. ఇపు డేవిధమున వజ్రధ్వని యగుచున్నదో, ఇట్టి గంభీర రవములో బ్రహ్మవాణి హృదయమునఁ జిందులు ద్రొక్కును. అనేకుల మనస్సు దుర్బలము ; అందుచే వారి సిద్ధాంతములును దుర్బలములు. ఈ సత్యమును ప్రార్థన చేసినమీఁదఁ బొందితిమని యొకప్పు డనుకొందురు ; పుస్తకములను జదివి, బుద్ధిని వినియోగించి యుపార్జించితి మని మఱియొకప్పు డనుకొందురు. ప్రార్థన చేసినందుచే భగవంతుఁడు

ప్రసాదించె నని యొకప్పు డందురు; దేవుఁడు లేఁడు, జీవుఁడు లేఁడని యింకొకప్పు డందురు. వినయము సాధన మూలమున సంపన్నమై నపుడు, శ్రేష్ఠములైన సత్యములన్నియును బుద్ధివలన నుపార్జితమైనవి కావనియు, ఉత్కృష్టభావము లన్నియును కల్పనాఫలములు కావనియును గ్రహింప నసమర్థుఁడగును. ఎక్కడ విశ్వాస ముజ్జ్వలమై యున్నదో, ఎక్కడ పురుషద్వయము యొక్క స్వరము విస్పష్టమై యున్నదో, అక్కడనే శుభ ఫలము లభింపనగును. "ఇది ఆయనది; ఇది నాది." యని స్పష్టముగాఁ దెలిసికొనుచున్నాను. "మద్యపానము చేయుము; సుఖవిలాసము లనుభవింపుము" అని నా యిచ్ఛ చెప్పుచున్నది; "నా పథము నవలంబింపుము; ఇందులో నీకు ఛిన్నవస్త్రములను ధరింపవలసిన కష్టమును గలుగవచ్చును; లేక సర్వత్యాగివై యుండవలసిన యవసరమును రావచ్చును; కాని నామాటను నమ్ముము; దీనివలననే నీకు మంగళ మగును," అని యింకొకవాణి చెప్పుచున్నది. "వైరాగ్యమున నాకారకష్ట మున్న" దని నా యుక్తి చెప్పుచున్నది. "నీబుద్ధికిఁ దోఁచినటు వెళ్ళుటకు వీలులేదు. నేను ఎప్పుడు చెప్పుచున్నానో అప్పుడు అంధకార మార్గమే శ్రేయము. సహస్ర యమదూత లున్నను ఆమార్గముననే వెళ్ళవలె" నని ఇంకొకయుక్తి చెప్పుచున్నది. ఈ యధముని జీవనములో నిట్టి పరీక్షావ్యాపారములు అనేకము లైనవి. ఎక్కడ నాబుద్ధి నిక్కి చూచుచున్నదో, అక్కడ —దైన్యము, నస్వస్థత, తిరస్కారము, అవమానమును; రెండవవైపుననో "ఏమియు భయము లే" దని కేవల మొక్క పురుషుఁ డనుచున్నాఁడు. మనస్సిఁక నేమాటను వినలేదు. మనుష్యుని బుద్ధి భవిష్యదంధకారమునఁ బ్రవేశించి "ఇది నాకు శ్రేయోమార్గ" మని ఎట్లు చెప్పఁగలుగును? "నానా బాధలు

అప్పుడే ఆరంభమైనవి. ఇంకను నలుఁబది వత్సరములు బ్రతికి యుండవలయును గాఁబోలు! ఇన్నాళ్ళును 'బ్రతికి అంధకారమార్గమునఁ బ్రేతవాణిని విని నడతునా?'' అని నే నేమాత్రమును సందేహింపలేనైతిని. ఎవఁడో యొక సత్పురుషుని యొక్క మాటలు అతి మధురముగను, విశ్వాసయోగ్యముగను అగపడుటచే ఆయననే అనుసరించితిని. నా మాటలను గుమంత్రణములుగఁ దలఁచితిని; సన్మిత్రుల వచనములను గూడఁ ద్రోసివేసితిని. లోపలి మెల్ల మెల్లని వాక్కులను విశ్వసించి "ప్రాణమున్నను, ప్రాణముపోయినను, ఆ నీ పదాశ్రయమునే పొందుదు'' నంటిని. పలుమాఱు ఇందువల్లనే నా కుటుంబమును బరిత్యజింపవలసి వచ్చెను; బహుకష్టముల ముఖమునఁ బడవలసి వచ్చెను; ఆత్మీయులను సహా వదలవలసియు వచ్చెను. ఒకమాఱు ఆలోకమగును; అంధకారములోనికి వెళ్ళుమని తిరిగి యీశ్వరుఁ డనును. "ఎప్పుడు భూతపు వాణి యందువో, అప్పుడే నీకు మృత్యు'' వని యీశ్వరుఁడు భయపెట్టెను; అందుచే, "ఇది ప్రేతవాణి కాదు; ఇవి యదృశ్య భగవానుని వాక్కులు: ఎవఁడు జీవాత్మతో ఏకమై పోయెనో ఆయన మాట'' లని విశ్వసించితిని. యోగసాధన చేసినకొలఁదిని, మనోవిజ్ఞానము నాలోచన చేసినకొలఁదిని, జీవుని ప్రాసాదము రెండంతస్తులదని గ్రహించితిని; క్రింద జీవుఁడు; పైన బ్రహ్మము. జీవవృక్షమున రెండు పక్షు లున్నవి. చిన్న పక్షి యొకటి, జీవాత్మ; పెద్ద పక్షి యింకొకటి, పరమాత్మ. చిన్నతనము నుండియు దేనిని విశ్వసించుచు వచ్చితినో, అది యథార్త్తికము కాదనియు, దేనిని జీవుని జిహ్వ యందురో దానిని గోసి చూచిన 'నందు రెండంశములఁ గందుననియు నాకు

ఘుష్వమురయ్యెను. ఒకటి వేదవేదాంతములను జెప్పును; ఇంకొకటి చావుమాటలను జెప్పును. ఒకటి స్థూలరసన అసారవచనములఁ బలుకును; మఱియొకటి సూక్ష్మరసన "హరి, హరి" యనును. కర్ణమునకు బాధిర్యము గలిగిన "హరి, హరి" యని వినఁబడక "డబ్బు, డబ్బు" అని వినఁబడును. ప్రయత్నము చేయుము; సూక్ష్మరసన యొక్క మధుర వాణిని వింతువు. ఎవరింకను వినలేదో, వారికి విశ్వాస మేమాత్ర మున్నదో చెప్పఁ జాలను. ఈ పథమునఁ గష్టము నొందుచున్న వారికి, కష్టము దూరమగును. నా యీ విశ్వాసము నిప్పుడు హాస్యము చేసి చెదరఁ గొట్ట నెవ్వరి తరమును గాదు; ఇరువది సంవత్సరముల విశ్వాసమును గదల్చు సామర్థ్య మెవరికేని యుండునని యనుకొనను. ఇద్దఱు పురుషుల స్వరమును మనమునుండి తోసివేయ వీలులేదు. "నేను విద్య నభ్యసింతును; నేను ధనము నార్జింతును; నేను ధర్మసిద్ధాంతములు చేయుదును", అని యిట్లనుకొని శ్రేష్ఠులుగా నేరికిఁ గోరిక యుండదు! కాని లోపల నింకొకఁ డున్నాఁడు; ఆయన యొద్దకు వెళ్ళఁగనే నేను దాసుఁడ నైపోదును; భృత్యుఁడ నైపోదును; ఒక మహాసాగరము ముందు ఒక చిన్ని జలాశయము వలె, ఒక చిన్ని గుంట వలె నైపోదును; ప్రచండ మార్తాండుని ముందు ఒక చిన్న దీపము నైపోదును; ఒక సువిస్తృతమైన ప్రాసాదము ముందు ఒక చిన్ని కుటీరము నైపోదును; నేను శ్రేష్ఠుఁడ నని యెట్లనుకొందును? "నేను గొంచెము ధనార్జనమునకు వెళ్ళుదును" అని ఇట్లనియు ననక ముందే "జాగ్రత్త! వెళ్ళవలదు సుమా!" యని మఱియొకఁ డనెను. "ఈపని చేయవలదు; మంచివాండ్రు సైతము నిన్నుఁ బరిత్యజింతురు; నీకు నవమానమునకు హద్దుండదు." అని వేయిమంది చెప్పుచుండిరి.

కాని లోపలి నిశ్శబ్దశాకున్ఁలు వారి సదోధను ఒక్కపెట్టున ఖండింపసాగెను. నలుదిక్కుల నుండియు నలుగురును మోహజాలమును విస్తరింపసాగిరి; ఉపరామక్రమ యను శిలచే మూఁతవెట్టఁ జూచిరి; కాని, అందువల్లనను, ఆ గుడగుడ శబ్దము ఆఁగలేదు. పగలా శబ్దము వినఁబడసాగెను; రాత్రియందును ఆశబ్దము ఉత్తేజనము కలిగింప సాగెను. లోపలి గంభీర భావము ఇంకను వృద్ధి కాసాగెను. దురవస్థ కడు వృద్ధి యయ్యెను. నేను 'ఎడమ వైపుగా వెళ్ళుద మనుకొన్న నది కుడివైపుగా వెళ్ళుమనును. సుఖసంపదలకొఱకు నేనుఁ జూచుచున్న "అటు వల్లగా"దని యది యనును. నే నాలోకము నిమ్మన్న, నది యంధకారమును జూపును. మాటిమాటికీ లోపలి పురుషుఁడు మాట్లాడుచుండును. అప్పీలు చేయఁ దగు నున్నత న్యాయస్థానము తెఱచియే యున్నది; కొంచెమైనను సెలవు లేదు. "లోలోపల దీనినే స్వీకరింప వలయును; లేదేని సప్తశత భూతములచేఁ జిక్కి నానా జ్వాలల ననుభవింపవలసి వచ్చును," అని భగవానుఁడు పలుకుచున్నాఁడు. సుఖము శాంతియు నా కెక్కడ దొరకనట్లు తోఁచుచున్నది; భూతములు నలువైపులఁ జేరి పీఁకికొని తినుచున్నంత యమబాధగా నున్నది. ఇట్టి విద్వాంసుఁడనై లోపలి యీ యొక్కని మాటమీఁద నడవనా? ఇట్టి శాస్త్రకారుని మాట వదలిపెట్టి, ఈయన మాట విననా? అంత మహాపండితుఁ డైన సాక్రెటీసు * ఈ భూతము మాట వినువాఁడు. ఆయన వంటి సువిద్వాంసుఁడు తన యాలోచనము వదలివేసి, ఈయన మాటమీఁద నడచుచుండెను. దైవవాణిని స్వబుద్ధివచనము లనుకొనుటకు

---

* ఈయన గ్రీస్సుదేశమందలి యాదిమతత్వశాస్త్రజ్ఞుఁడు. క్రీ. శకమునకుఁ బూర్వము నాల్గవశతాబ్దమున నివశించెను.

వీలు లేదు. ఎవరైన నందురేని మోసమునc బడుదురు. ఈ విషయమున నా విచారణనిష్పత్తులు ఇంకొక ప్రకారమున నైనవి. సమస్త బ్రహ్మాండము రసాతలము మీcద వచ్చి పడినను, ఈ విశ్వాసమును వదలను. ఫలాఫలములను విచారించి విశ్వసింపలేదు; ఫలాఫలముల మీcద విశ్వాసము ఆధారపడి యుండదు. పదిమంది ఇట్టి మార్గమునc బ్రవేశించి దుష్కార్యములc జేసిరని నే నీ పథమును వదలc జాలను. పదిమంది మోసముc జేసిరని నేను ధనమును వదలుదునా? అదెప్పుడు సంభవింపదు. అర్థాన్వేషణము చేయువారు చేయనే చేయుదురు. ఎవరో మృతి నొందిరని బ్రతికియున్న వా రందఱుc గూడ నిcక బ్రతుకc బోరా యేమి? ఒకని మాటలలో అవిద్యయు, దుర్నీతియు, నింకొకని మాటలలో నానా శాస్త్రములును —ఇట్లు ప్రకాశిత మగుచున్నప్పుడు, "నేను" "భగవానుcడు" అను ఇద్దఱు పురుషులను జూచుచున్నప్పుడు, ఆయిద్దఱును ఒకcడని ఏల భావింతును? ఈశ్వరుని కీర్తిని నే నేల హరింతును? నా దోషము నీశ్వరుని మీcద నేల యారోపింతును? వీనిచే మనుష్యుcడు తన వచనములనే ఈశ్వరవాక్యములుగాc బ్రచురము చేయునని నీ వనవచ్చును. ఓయి మిత్రమా! "నీకుc గడుపార భుజింప నిచ్చ యుండెనేని నీ వీశ్వరముఖము నుండి యట్టి మాటలను వింటినని చాటుదువు. నీ దుష్కార్యములకును, నీ కోరికలకును సరిపోవునట్టుగ నానా వాక్యముల నీశ్వర ముఖమునుండి తెప్పింతువు." అని నీ వనవచ్చును. కాని ఎవcడో వంచకుcడు కావచ్చునని నేను ధర్మమును వదలcజాలను; ఈ ఇరువది వత్సరములలోను ఎన్నిమాఱు లీ వాక్యములం వింటిని? ఎన్ని వాక్యములను వింటిని! ఒకమాఱును నాకు మోసము కలుగలేదు.

ఈ యిరువది వత్సరములలోను అనుతాపముఁ జెందవలసిన యవసరము నా కొక్కమాఱును గలుగలేదు. జీవాత్మయును, బరమాత్మయును ఒక్క పాత్రములో కలగలుపైనట్లు నేను బ్రత్యక్షముగాఁ జూచుచున్నాను. స్రష్టయొక్కఁడును ఆకాశమందనియు, నేను మాత్రము ఒంటరిగాఁ బృథివి మీఁదఁ బడియున్నాననియు, ఎన్నఁడును దలంపను. నా హస్తము లోపల ఆయన హస్తమును, నా రసన లోపలను ఆయన రసనను, నా ప్రాణమధ్యమున అనంత ప్రాణవాయువును దర్శించుచున్నాను. నా విశ్వాస మీప్రకార మైన దగుటచేత, జిహ్వ కదలఁగనే రెండు జిహ్వలు కలసి పోవుచున్నది లేనిది చూతును. పాపుని జిహ్వ కదలుచుండెనేని కోసివేయ నిశ్చయింతును. "ఈశ్వర రసనా! నీవు చెప్పునది చెప్పు" మందును. దీనిని కల్పన యనువారి వచనములను పాటింపను. నాకు లేశమాత్రమును సందేహము లేదు; ఏమాత్రము సందేహ మున్నను వేదినుండి, చెప్పువాఁడను గాను. రెండుజిహ్వలు స్పష్టముగాఁ గనఁబడుచున్నపుడు నీ వేమందువు? నీవు జీవుఁడే బ్రహ్మ మందువా? రెండు న్యాయస్థానములును స్పష్టముగ నగుపడుచున్నవి. ఒక న్యాయస్థానపు నిష్పత్తి యడుగడునకు రెండవ న్యాయస్థానమునఁ జూణ మగుచున్నది. నీవు క్రింది న్యాయస్థానపు వాక్కులను బలుకుచున్నపుడే, ఉన్నత న్యాయస్థానముయొక్క నిష్పత్తి నీ మాటలను జూణము చేయుచున్నది. కావున నేను ద్వైతవాదిని; న్యాయమూర్తుల నిద్దఱఁ జూచుచున్నాను. ఒక యాత్మ మఱియొక యాత్మను నడపుచున్నది. నేను మాటలాడినపుడు నామాటలు ఆత్మిక భావమున ఉచ్చారితము గును: జిహ్వా మాంసఖండమున లేదు. అట్లుగనే, ఆయన

మాటలాడినపుడు ఆయన మాటలును ఆత్మికభావమున ఉచ్చారితములగును; జిహ్వా మాంసఖండమున లేదు. ఆత్మయొక్క వాణి, ఇనుపతీఁగయొక్క గాని, ఇత్తడితీఁగయొక్క గాని ధ్వనివంటిది కాదు; నదియొక్క దడదడశబ్దము వంటిదియును గాదు; పక్షియొక్క సుస్వరమువంటిదియును గాదు; అయినను, అది యాశ్చర్యకరమును, అత్యంత మధురస్వరమును. ఏకర్ణమునకు నీశ్వరుఁడు శక్తి నిచ్చునో, ఆకర్ణము దానిని గుర్తింపఁ గలదు. నాకు బ్రహ్మవాణిలో నింకను విశ్వాసము కుదురునుగాక! మీరును ఈ విశ్వాసమార్గము నవలంబించి మీ మీ పారత్రిక మంగళమునకై పాటుపడుదురు గాక!

ఓయి దీనబంధూ! ఓ యంతరాత్మా! నా జీవనముయొక్క ఏ భాగమున నీవు దాఁగియున్నావో నాకుఁ దెలియదు. లోపల నాక వేదము పఠింపఁ బడుచున్నట్లు, ఒక నూతన శాస్త్రపాఠము జరుగుచున్నట్లు చెవికి వినఁబడుచున్నది. చదువుచున్న వా రెవరో నాకుఁ దెలియదు. ఒక న్యాయపతి సర్వప్రధానుఁడై విచారించుచున్నవాఁడు; ఆయన న్యాయస్థాన మెక్కడనో నాకుఁ దెలియదు. నా యస్థులలో వసియించి కేవలము స్వరమూలమునఁ బరిచయము నిచ్చుచున్నావు. అంధకారమయమైన నా యాత్మలోపల నివసించి నీవు శబ్దముచేయుచున్నావు. పాడుపడ్డ యింటిలోఁ జప్పుఁడైన జనులు ఏవిధముగ భీతిల్లుదురో, అనేకసమయములందుఁ బ్రాణమధ్యమున నీ శబ్దమును విని అట్లే భీతిల్లవలసి వచ్చెను హృదయము యొక్క యొక చీఁకటి సందునందు శబ్దము కాసాగెను; వినినంతనె యది ఏమై యుండునని భావించితిని. రుచి నేను నరించి పోవ నన్ను నిషేధించుచున్న వా రెవరంటిని. “ఓహో! నా

భగవానుఁడే! ఇంక నెవరును కా'' రంటిని. మదీయేశ్వరా! నీవు తరుమధ్యమున, సూర్యచంద్రులమధ్యమున దర్శనము నిచ్చితివి; తిరిగి నీతి విజ్ఞానమునందు దర్శనము నిచ్చియుంటివి. జగత్కౌశలమందు నీ వొక్క పురుషుఁడ వున్నావనియు, నీతివిధులందు నీ వుండి సదా మనుష్యుని జాగ్రదవస్థలో నుంపుదువనియుఁ, జెప్పెడు మనోవిజ్ఞానమును నేను మన్నింతును. ప్రాపంచికవిషయములలోఁ దిన్నఁగఁ బరిశీలింపక యున్నఁడైన నుదాసీనుఁడ నైతినేని, లోపలి వాణి ఇఁక నిదురఁ బోనియ్యదు. ఏదేని యొక యన్యాయ కర్మములోనికి దిగఁ జూచుచున్నంతనే, ఎవరో వచ్చి యొక్క పెట్టునఁ జఱతురు. గృహములో నున్నను, విహరింపవెళ్ళినను, ఎక్కడకు వెళ్ళినను దైవవాణి చెవి నంటుకొనియే యున్నది. చెవి మూడఁ బెఱికి వేసినను ఆశబ్దము వినఁబడును. తనువు భస్మమైనను ఆయగ్ని జ్వలించుచునే యుండును. ఏమి, నీవాణి! వేయి నదుల ధారాప్రకాండములు ఏకధారలై యొక పర్వతముమీఁదఁ బడుచున్నట్లున్నయది! ఎవ్విధమునను ఆశబ్దమును మఱువఁజాలను. నీవాణిని నావాణిని ఒకటిచేయ నాకేమాత్రమును చేతఁగాదు. నీవాక్యము లెంత మధురములు! నీమాటలు విని నేనెప్పుడును గష్టములపాలు కాలేదే! ఎన్నఁడైనను కుమంత్రణముల బోధించి దానిచే నసత్కార్యమును జేయించియుంటివని నే నేమాత్రము ననలేను. ఎన్ని వాక్కులను వినఁగలిగితినో అందఱి పవిత్రదియును అభ్రాంతసత్యదైవవాణియే. బ్రహ్మవాణిని గల్పనముఁ జేసికొని నే నెన్నఁడును భ్రమపడలేదు. ఒక్క దినమైనను అనుతాపము నొందు నవసరము రాలేదు. పట్టినపుడే నిన్ను సరిగాఁ

బట్టితిని; బ్రాహ్మణుఁడ నై నిన్నుఁ బొందినపుడు, నీ దర్శనానందమున లోకుల భయ మెక్కడ నున్నది? కల్పనా భయ మెక్కడ? ఇరువది వత్సరములు గా నీ వ్యవసాయమును నడపుచున్నాను; ఈ దాసుఁ డెప్పుడును క్షతిగ్రస్తుఁడు గాలేదు. ప్రతిపర్యాయమును లాభమే కలిగినది. శుభక్షణమున బ్రహ్మవాణిని పాటించితిని; అందువలన నిన్నినాళ్ళలో నింత సంచయము చేయఁ గలిగితిని. తల్లీ! ఎంతమంది నీయాశ్రయమును బొందిరో వారందఱును బ్రహ్మవాణి నాశ్రయించునటుల ఆశీర్వదింపుము. అందఱును వదలివేసినను నీవాక్కుల ననుసరించిన నెంత సుఖము కలుగునో, ఎట్టి శాంతిధారలు వక్షమునఁ బడునో, దాని ననుభవించితిని. కాన, నా కుభావమును బరుల కుమంత్రణమును విసర్జించి, తల్లీ! నీవు వచించు వాక్కులను విందునుగాక యని హస్తములను జోడించి ప్రార్థన చేయుచున్నాను. జననీ! నీ వేమి వచించుచున్నా వనియే, అందఱును జిజ్ఞాస చేయుదురు గాక! పృథివియొక్క వేద నిశ్శబ్ద మగుఁ గాక! తల్లీ! నా యంతర్బాహ్యములఁ జేరి గుడగుడఁ బలుకుచుండుము: నీమాటలు నాకుఁ జక్కని యమృతము వలె నుండును; అన్యుల మాటలు విషమువలె నుండును. అడుగడుగునకు మాట్లాడుము. కృపామయీ! నీమాటల ననుసరించి పాపమును వధించునట్లును, శాంతిపుణ్యముల సంచయము చేయునట్లును, దీనుల మగు మ మ్మొకమా ఱాశీర్వదింపుము!

సప్తమాధ్యాయము.

భక్తిసంచారము.

భానువారము ౨౬ భాద్రము. ౧౮౦౪ శకము.

ఓయిపాఠకా! ఈ జీవనవేదము ఆశావేదము. ఓయి శ్రోతా! ఈ జీవనము యొక్క యనేక విషయములు ఆశా ప్రదములును, ఉత్సాహోత్తేజనములును. ఏలయన, నే నన్నియుఁ జేతఁ బట్టుకొని యొక్క మాఱుగఁ బృథివిమీఁదికి రాలేదు గదా! సాధనోపార్జితసత్యముల విషయమై వినిన, హరినామము యొక్క గుణముచే నాయాస లబ్ధ సత్యసంబంధములోని పరీక్షిత వ్యాపారములను దెలిసికొనిన, నెవరి హృదయమున నాశ ఉద్దీపనము గాదు? ఈ జీవనముయొక్క దుర్బలవిభాగమును, అభావాంధకారములయొక్క విభాగములును ఉన్నవి; దానిని వినిన, నతి నిరాశతోఁ గూడిన మనుజుని యంతఃకరణమందుఁ గూడ నాశ సంచరింప సాగును. సావధానచిత్తుఁడవై వినుము. ఈ జీవనము నందుఁ బ్రథమమున భక్తి యుండినది గాదు; ప్రేమభావమును విశేషముగా నుండినది గాదు; అనురాగము మాత్రము కొంచె ముండెను. విశ్వాస ముండినది; వివేక ముండినది; వైరాగ్య ముండినది. మూఁటియొక్కయుఁ బ్రథమాక్షరము "వ": జ్ఞప్తియుంచుకొనుట యతి సులభము, మూఁటిని జేతఁ బట్టుకొని యీ సాధకుఁడు ధర్మక్షేత్రమునఁ జరింప సాగెను. ఇంకను ఏ వేవి ప్రయోజనములో అవన్నియును గ్రమక్రమముగ రా సాగెను, తగిన కాలము నందు ఆనందములో సస్యము సంగ్రహము చేయఁ బడెను. విశ్వాసము, వివేకము, వైరాగ్యము మూఁడును శుష్క కఠోరములు. మూఁడును మంచి పదార్థము లైనమాట వాస్తవమే; ధర్మపు బజారులో నీ

మూఁటి యొక్క చెలువును తక్కువ కాదు; అవస్థావిశేషమున నివృత్తియు దుష్ప్రాప్యములు. భాగ్యవశమున నీమూఁదను నాకు మొదటనే యుండెను. సత్ప్రవర్తనుఁడ నగుదును; దృఢమైన విశ్వాసమును గలిగియుందును; కఠోరుఁడనై యింద్రియముల నిగ్రహింతును; ఈశ్వరుని కొఱకై సమస్తమును బరిత్యజింతును; అను నీ సకల భావములును మనోమధ్యమున స్ఫురించుచుండెను. వివేకవైరాగ్యములు చాల ప్రాయముగ నుండెను. వివేకవైరాగ్యములు రెండును సాధనలో ప్రాయము లనుమాట మొదటి నుండియు గ్రహించితిని. ఏ జీవనము యొక్క యారంభ మింత కఠోరమో అక్కడ భక్తిరస మేలాగునఁ బొడకట్టును? అపుడు దాని ప్రత్యాశయు లేకుండెను; భక్తి యత్యంతావశ్యక మనియును అపుడు నాకు తోఁప లేదు. మాతృచరణకమలము లన నేమో నాకుఁ దెలియునది కాదు. వివేకముయొక్క జేని సన్నిధిని బ్రార్థన చేయువాఁడను. బందులకును, అపరాధులకును, విరాగులకును, తపస్వులకును, ప్రభువగు నీశ్వరుని యొద్ద కాలము గడుపుద మనుకొంటిని. ఒక విశ్వాసి పరబ్రహ్మము మీఁదనే తన యావద్విశ్వాసమును స్థాపించె నను నీ క్రీడనే చూచువాఁడను. భక్తుని కేళిని జూడలేను. అపు డాకసమున సూర్య కిరణములే కాని, చంద్ర జ్యోత్స్న కనఁబడ లేదు. వివేక మప్పుడు హృదయమును దగ్ధము చేయుచుండెను. కడుఁ బ్రకాశింపఁ జేయుచుండెను. “పాప మెట్టిదో రానిమ్ము! చూతము” అని పాపము ననువాఁడను. హృదయ మధ్యమునఁ గేవలము ప్రజ్వలితాగ్నియే ప్రకాశించునది. ప్రలోభనమును గూడఁ దృణీకరించువాఁడను. కాని, ఏ యానందము భక్తివల్ల నుత్పన్నమగునో, ఆయానందము హృదయమున నుండినది

కాదు. పుణ్యవంతుఁడనైన, జితేంద్రియుఁడనైన నైట్లుండునో అట్లుండెను. అది సంతోషము, అది తృప్తి, అది ఆనందము కాదు. ఆనందమయియొక్క పూజఁ జేయనిదే యానందము కలుగదు. వివేకముయొక్క రాజునకు భయభయములోఁ బ్రణామము లాచరించిన, సంతోషము కలుగును; భక్తితో నానందమయియగు జననియొక్క పూజ చేసిన నానందము కలుగును. ఇట్టి యవస్థ ఎవనికేని తటస్థించిన, "సోదరా! నిరాశ పడకుము; నిరాశపడకుము" అని ఆతని నుత్సాహపఱతును. ధర్మము భయముతో నారంభమైన, భక్తిలోను, ఆనందములోను పరిణతమగును. ఈదినము కఠోర పరిశ్రమ చేసి జీవనమును జక్కఁబఱుచుకొనిన యెడ, రేపక్కడ భక్తి కుసుమము పుట్టఁగఁ జూతువు. ఆనందవాదుల మధ్య నే నొకఁడ నగుదు నను నాశ నా కుండినది గాదు. ఒకొక్క చోట మాననీయులగు బంధువరుల యొద్ద "బ్రహ్మానందుఁ" డను నామమును బడసితిని గాని, అంతఃకరణము దాని నామోదించునది గాదు; "నీవు దీనికిఁ దగినవాఁడవు గా"వని యంతఃకరణ మనునది. కఠోరభావములోఁ బడి," దీని విసర్జింపుము; దాని విసర్జింపుము; విసర్జింపుము; విసర్జింపుము; విసర్జింపుము; కేవలము నింద్రియములను నిగ్రహింపుము; కేవలము పరాక్రమమును ప్రకాశింపఁ జేయుము; విగ్రహార్చన శూన్యమైన ధర్మమును వెల్లడి జేయుము." అనియే నాకు నేను జెప్పుకొనువాఁడను. శాంతిరసముయొక్క కాని, భక్తిరసముయొక్క కాని యాశ పుట్టలేదు; తల్లివంక నేవిధముగఁ జూడనగునో తెలియునది కాదు. కేవలము తండ్రి పేరుఁ పెట్టి పిలుచువాఁడను; తల్లియొక్క యంతఃపురద్వార మప్పటికిఁ దెరువఁ బడి యుండలేదు. ఏమార్గమున

వెళ్ళినఁ దల్లిని సందర్శింప నగునో, ఎవరును జెప్పను లేదు. "జననీ సమాన కరెన పాలన *" అనుదానిని కేవలు రూపక జ్ఞానముననే వినువాఁడను. భక్తి యొక్క వికాసము కాలేదు. జననీ యనఁగనే ప్రాణ మప్పు డొక్కమాఱుగ లేచిపోవునది గాదు; కొంచెమే యేడ్చువాఁడను. హృదయమున నప్పుడు కవిత్వధోరణి లేకుండెను. తుట్టతుదకు మాతృమందిరము నేలాగున స్థాపించితినో యాశ్చర్యము. అపుడు వివేక ప్రధానుఁడనే యైయుంటిని. ఆ కాలమున బ్రాహ్మ లందఱును దాదాపు వివేక ప్రధానులే. ఒకని చరిత్రము పునరుత్పన్నమై తక్కిన యందఱి చరిత్రములోను ప్రకాశిత మయ్యెను. అయిదుగురు, పదుగురు, నూఱుమంది యువజనులలో విస్తృతమై పోయెను. శ్రీమృదంగము నామము వినఁబడలేదు; శ్రీహరి యని పిల్వ నేర్వలేదు; శ్రీమతి యానందమయిని దర్శింపలేదు. బ్రాహ్మ లప్పటికిని, శ్రీనాథుఁడు, శ్రీపతి యను పేర్ల నీశ్వరున కిడలేదు. అపుడు బ్రహ్మ పితయై యుండెడి వాఁడు; ఆనందమయి యొక్క మందిరము కట్టఁబడలేదు. మృదంగము శబ్దింప లేదు; ఒక్క సంకీర్తనమును అల్లఁబడలేదు. అంతరంగమున నుండిన యీ యభావమునకుఁ దగ్గట్టుగనే బాహ్యమందును ఏదియు సాయము దొరకలేదు. అంతర్బాహ్యములను గేవలము వివేక విశ్వాస వైరాగ్య సాధనలే మెఱయుచుండెను; ప్రేమ అల్ప పరిమాణముగ నుండెను. మరుభూమి యందలి యిసుక రేణువులు ఎగురసాగెను; ఇట్లెన్నాళ్ళని గడువఁగలదు? "ఇది సరి కాదు; అనేక దినము లిట్లు గడుపఁబడినవి. ఇఁకఁ గడువ" దని యపుడు తెలిసికొంటిని.

---

* ఇది యొక చిన్న కీర్తన. "తల్లిసమానముగఁ బాలించు" నని దీని యర్థము.

మృదంగమును గొనవలయునని తోఁచెను. అంతరంగమున వైష్ణవ భావ మంతగా నుండ నన్ని దినములును, ఈశ్వరుఁడు కేవలము వివేక ద్వారముననే పరిచయము నిచ్చువాఁడు. భక్తి భావ మగపడి యగపడక ముందే ఎవఁడో కాని యంతరము నుండి యత్యాశ్చర్యకరమగు గుప్తభావమున రసవను భక్తిదేవత వైపునకు లాగివేసెను. పరివర్తన మయ్యెను; ఏది యుండదో దానిని సహా పొంద నగునని గ్రహించితిని. ఇపుడు భక్తి యధికముగ నున్నదో, వివేక మధికముగ నున్నదో, ఆనంద మధికముగ నున్నదో తప స్సధికముగ నున్నదో, సుఖ మధికముగ నున్నదో, ధర్మసాధన యధికముగ నున్నదో, చెప్ప వీలు లేనంత భక్తి పొడమినది. నేను బ్రహ్మ సమాజమం దుండి నన్నుఁ గఠోరునిఁ, శుష్కునిఁ జేసికొనలేదు; శాంతిని, ఆనందమును దెచ్చి వివేకము యొక్క పార్శ్వమున నుంచితిని. ఇపుడు తారతమ్యమును నిర్ణయింప నా కశక్యము. భక్తి నాకు స్వాభావిక మనుపించునంత భక్తి నాకిపుడు లభించినది. ప్రథమమున శుష్కభావమునఁ గేవలము పుణ్యసాధననే యారంభించితిని. ఎట్లు సచ్చరిత్రుఁడ నగుదునాయని, ఎట్లు చక్కఁగఁ బ్రవర్తింతునా యని, ఎట్లు సర్వత్యాగినై బడుగు సన్యాసి నగుదునాయనియే భావించువాఁడను. భగవానునితో నామోదంప నిచ్ఛ యుండునది కాదు. మౌనావలంబినై కూడ నుండవలసి వచ్చె ననియును ఇందునకుఁ బూర్వము చెప్పఁబడెను. "స్వభావమున మున్నదిదియె పరిణమిల్లును; ఏది యుండదో యది కలుగ వీలు లే"దని యనేక పండితులమతము. "ఉపార్జిత ధర్మము కలలోని వార్త. ఎవరికి భక్తి లేదో వారికి భక్తి కలుగదు. ఎవరికి విశ్వాసము లేదో వారికి విశ్వాసము కలుగదు. ఎవరికి భక్తి స్వాభావికమో వారికే భక్తి

యధికమగును. ఎవరి ధర్మము భయముతోనే యారంభ మగునో భయములోనే వారి ధర్మము పర్యవసన్నమగును." అని అనేకు లందురు. కాని నావిషయమున, "నేను వణఁకుచు వణఁకుచు ధర్మము నారంభించితిని; ఇపు డానందములో మగ్నుఁడనై యున్నా"నని చెప్పవలసి వచ్చినఁ జెప్పుదును. నా విషయమున నెట్లయ్యెనో, ఇట్లందఱ విషయమునను నగును. ప్రథమమున బ్రహ్మమును విశ్వసించి బ్రహ్మజ్ఞాని యను పేరు నందితిని; ఇపుడు లోలోపల సుఖభోగము ననుభవించుచున్నాను. ప్రథమమునఁ గఠోరము; పిమ్మట సుకోమలము. ప్రథమమున పిత; పిమ్మట మాత. బ్రహ్మము యొక్క ప్రస్ఫుటిత భావమును జీవనమందుఁ జూచితిని. నా జీవనములో బ్రహ్మ క్రీడింప సాగెను. మొదట బ్రహ్మనామ మొక్క నామమై యుండెను; ఇపుడు వస్తువు రూపాంతరమును జెంది ఎన్ని నామములను పొందినది! నే నెట్లు నా బ్రహ్మమును సందర్శించితినో, అటులే అందఱును సందర్శింతురు గాత మని కోరుదును. ఒకని విషయమున నసాధ్యము సాధ్యమైన నందఱ విషయమునను నగును గదా! శుష్క కఠోర భావ మధ్యమునఁ బడి ఏడ్చుచున్న నాఁ డిపుడు హసించుచున్నాఁడను సంవాదము నందఱు ఎఱిఁగియుండుట శ్రేయము. అల్పముగ నుండిన యీశ్వరజ్ఞానము అధిక మయ్యెను. హస్తములను జోడించి యీశ్వరు నాహ్వానము చేయుచుండ, నాయనే యాకర్షింప సాగెను. తల్లీ యని పిలుచుట నేర్చితిని. అంతియ కాక, ఆ "తల్లీ" యను పేరులో నెన్ని రూపములను దర్శించితిని! ఎన్ని భావములఁ దల్లి న్నాహ్వానముఁ జేసితిని. ఒకప్పుడు శక్తితో సహ అనంతమును సంయుక్తముఁ జేసితిని; ఒకప్పుడు జ్ఞానముతోఁ గూడఁ బ్రేమ యొక్క యోగమును

దర్శించితిని. జననీరూపములను నానా భావముల జననియే చూపుచున్నది. ఇంకను ఎన్ని భావముల రూపములు మునుముందునకు వచ్చుచున్నవి! జననియొక్క సర్వరూపములను దర్శించితి నని ఎవరును అనకుందురు గాక! ఈ భక్తిశాస్త్రము నిపుడె మనము జూడ నారంభించితిమి. ఎంత భక్తుల మగుదుమో, ఆనంద మయి యొక్క రూపములను అంతగఁ జూడఁ గలుగుదుము. మనము స్వాభావికముగ దుర్బలుల మే యైనను నానా రూపములను దర్శించుటకు సమర్థుల మగుదుము. ఇవి ఉపార్జన దినములు. మనకు నిదివఱ కుండినది ఇపు డధికమయ్యెను; ఏది లేదో ఈ పట్టున దానిని గూడ సాధింపవలయును. ఈ దినము నాఁటి యుపదేశ మీ విషయముననే ఫలప్రద మగుఁగాక! నాకు లేకుండినది ఇపుడు వచ్చినది. ఒకప్పుడు భక్తి భావము లేకుండెను; గానము చేయుట యొకప్పుడు నా యెడ సంపూర్ణాసంభవ మైయుండెను. పది మంది సమక్షమున నేను గానము చేయుదు నని యొకప్పుడును అనుకొన లేదు; ఎన్నఁడైన నీశ్వరుని "అమ్మా" యని పిలుతు ననియును ఎఱుఁగను. జననిని జూచి యిపుడు ఉన్మాదినై పోదునని తోఁచుచున్నది. ఎవరు నా జననిని "జననీ" యని పిలువ లేకున్నారో వారికి బ్రహ్మదర్శనము బాగుగఁ గాలేదు. ఎవరు నా జననిని దర్శింప లేదో వారి కింక నేమియును నొనఁగూడ లేదు. అందఱ గృహములకు నీ జనని వెళ్లును. భారతము నందలి లక్ష లక్ష లోకుల గృహములకు జనని నిశ్చయముగ వెళ్లు నని నే నిపుడు నొక్కి చెప్పఁగలను. ఒకచోట ఘటించినది అన్నిచోట్లను ఘటించియే తీఱును. ప్రేమ లేదా? ఇంగ్లీషు పుస్తకములను జదువుటచే నందఱ మనస్సులును శుష్కములై పోయినవా? ప్రేమ

పుట్టదా? అట్లెప్పటికిని గాదు; నా దుర్దినములు పోయినపుడు మీ దుర్దినములును పోవును. సుదినములు రానే వచ్చును; అభక్తులకును ఆశ యున్నది. నా యాశయు భక్తియు నింకను వృద్ధిఁ జెందును గాక! నేను గొంచెము ఉన్మాది నైతిని; ఇంకను ఉన్మాది నగుదును గాక! పృథివికి అత్యసహ్యమని తోఁచునంత యున్మత్తతయు, భక్తిభావమును నాకుఁ గలుగును గాక! పృథివి యింకను నిందించునట్లు నానాశ్చర్యభావములును నా యందతి శీఘ్రముగ వర్ధితములగుఁ గాక! వాని నన్నిటి తోను జీవనమును గడపఁ గలిగిన బ్రతుకుదును. ఇట్టి శుష్కత్వమునకుఁ బరివర్తనముగా భక్తి పొడసూపెనా? ఇట్టి జననిని నేను సందర్శించితినా? నా మనసులో భక్తి భావము పుట్టనపుడే, తమ మనసులలో భక్తి పొడకట్టినట్టి భక్తు లుండిరి. కాని వారు మృదంగము నేల తేలేదు? వారు ప్రథమముననే సంకీర్తనము నేల చేయలేదు? జననీ మందిరమును వారేల యలంకరింపలేదు? ఒక యభక్తుఁడు జననిని జూచి నృత్యము చేసిన, గానము చేసిన, లోకుల హృదయములలో శుభబుద్ధియు, జ్ఞానమును చటుక్కున తోఁచును. "ఏమి! ఈయన భక్తిమాట చెప్పుచున్నాఁడా? ఈయన వివేకమును చేతఁ బుచ్చుకొని దేశ దేశములు తిరుగువాఁడు గాని, భక్తిమార్గమును నెన్నఁడును బట్టలేదే! ఈయన ఏల మృదంగమును సహా వాయించుచున్నాఁడు? అట్లయిన హరియె యవతరించును గాఁబోలు! 'బ్రహ్మకృపాహి కేవల' మను మాట ప్రమాణ మగును గాఁబోలు" నని లోకు లందురు. ఈ ప్రకార మందఱును భక్తి మార్గమునకుఁ దిరుగుదు రనియో యిట్లయ్యెను. అంతయు నీశ్వర కేళియని భక్తిలో మునిఁగి చూచితిని. ప్రాచీనభక్తులు కొంచెము సహాయమును జేయఁ గలిగి యుండు వారు

నా కెవరును ఏమియును చెప్పలేదు. ఓ యీశ్వరా! రక్షింపుము; రక్షింపుము. “ఓ భగవానుఁడా! బ్రతికింపు” మనుచుండఁగనే దినములు గడచుచుండెను గాని, శీఘ్రముగ భక్తిభాగ్యము నావిష్కరింపుమని మాత్రము నా కెవరును జెప్పలేదు. కేవల మొకఁడు మాత్రము చెప్పెను. ఎవరు చెప్పవలయునో ఆయనయే చెప్పెను. “సాహారా *” మధ్యఁ గమల ముద్భవించెను. రాతినేలమీఁదఁ బ్రేమపుష్పము ప్రస్ఫుటితమయ్యెను. ప్రార్థనాబలమున సకలమును కాఁగలదు. అభావమంతయు ముక్తమగును. ఇపుడు నాకు జలము స్థలము నుభయమును నున్నవి. విశ్వాస హిమాలయము నున్నది; భక్తిసరోవరము నున్నది. వైరాగ్యమున్నట్లే ప్రేమయును నున్నది. జనని నన్నొక చేతితో వైరాగ్యమును దినిపించును; ఇంకొక చేతితోఁ బ్రేమను దినిపించును. రెండుహస్తములతోను ఊరక తినిపించుచున్నది; శ్రీహరి మహాత్ముఁడయ్యెను; భక్తిసరోవరమును విస్తీర్ణము చేసి సుఖమును ఆనందమును వృద్ధిచేసెను.

ఓ దీనశరణ్యా! ఓ కృపాసింధూ! నీప్రేమ యపారము. నీ కారుణ్య లీల లద్భుతములు. ప్రథమమున నిన్నే విధముగఁ గంటిని! అప్పు డెట్టి భయానక రూపమును దర్శించితిని! ఇప్పు డన్నో సుఖపుష్పములు హృదయసరోవరమునఁ దేలి యాడుచున్నవి! ఎట్లు నీ విట్టి సుందర రూపమును గనుపఱచితివి? ఈ రూప మెక్కడ దాఁగియుండెను? ఏమార్గముఁ బట్టి వచ్చెను? మిత్రులకు ఆశాసంవాదమును దెలిపితిని. ఇప్పుడు వా రెవ్విధమున నైన నీ

---

* ఆఫ్రికాఖండమ్మున భూమధ్యరేఖకు (Equator) పైగా నుండు నొక విస్తీర్ణ మరుభూమి.

యానందమును బొందునట్లు చూడుము. ఏమార్గమును బట్టుకొని, ఏ శుష్కసికతాప్రదేశముల మధ్యగుండ, ఏ కొండయంచుననే ప్రయాణము చేసిచేసి, తుదకీభక్తి సరోవరతీరమునకు వచ్చిచేరితినో సరిగ నిర్ణయించి చెప్పలేను; గ్రామములను గుర్తించుచురాలేదు. అందువలననే, "ఈమార్గమున వెళ్ళిన భక్తి యుద్భవించును; మృదంగమును వాయింపుము; లేక ఆమార్గమును బట్టుకొనుము; లేక నృత్యముచేసిన బాగగు"నని ఇవ్విధమున నెవ్వరికిని జెప్పలేకున్నాను. ఏమియును స్మరణలో లేదు; అజ్ఞానమే లేదు. ఒకప్పుడున్నది కాదు; ఇప్పుడు వచ్చినదని మాత్రమే స్మరణ యున్నది. ఒకప్పుడు నిన్ను అమ్మా యని పిల్వలేకుండువాఁడను; ఇప్పుడో ఇట్టి తల్లివి నీ వెచ్చట దాగియున్నావనుచున్నాను. బ్రాహ్మలలో నెవరికేని అశాంతి కలుగుచున్న నది నా తల్లివైన నిన్ను దర్శింపకుండుటచేతనే కలుగుచున్నది. నిన్ను దర్శించిన యెడల దుఃఖరజని యంతము నొందెను. ఆనందమయియగు నాతల్లిని ఎవరెవరు చూచిరి? ఎవరు చూచిరో వారిని నా సఖులందును; ఆలింగనముఁ జేయుదును; నాకు వారు బంధువులగుదురు; వారు నా కందఱకంటె శ్రేష్ఠులు. అమ్మా! ఇట్టి మిత్రులను నాకిమ్ము! బ్రహ్మ బ్రహ్మయని పెద్దపెట్టున నఱచిన నేమగును? ఇప్పుడొక ముగ్గురకైనఁ గలియుదు; అయిదుగురిలోను మిళనము లేదు. ఇట్టి జననిని అందఱును స్వీకరించిన గభీరప్రేమ యొక్క మిళన మగును. ఇఁక మతశాఖోపశాఖలయొక్క భేదముగాని, వర్ణభేదముగాని యుండదు. ఒక్క తల్లిని దర్శించిన వివాదము లెన్నఁడును కలుగవు; విచ్ఛేద మెప్పుడును గలుగదు. నే నెవరిని "తల్లీ" యందునో మఱియొక్క రట్లనరు; నే నెవరిని "పరిత్రాతా" యందునో మఱియొకరాయన యొద్ద పరిత్రాణము

నన్వేషింతురు ; ఇందుచేతనే ఇంతవివాదము ఇంతకష్టము, ఇంతక్లేశము. ఓయీ హరీ! నీ వెపుడును వివాదములఁ బుట్టింపవు. నృత్యము చేయువారిమధ్య వివాదము ఉండదు. తల్లి యుండఁగ వివాదములు ఘటిల్లుచునా? కరుణామయీ! ఏరాజ్యములో నృత్యమున్నదో, ఆరాజ్యమున వివాదము లుండునా? ఎప్పు డీనృత్యపుదినములు వచ్చును? ఆశావార్తను దెలిపితిని; బంధుజనులు దీని సాధనచేయుదురో లేదో తెలియదు. తల్లీ! నిన్ను దర్శింపనవ్వారు, నాలుగు, ఆఱు, పది శాఖలు కానేయగును. కాని లక్షలక్ష వత్సరముల తరువాత శాఖోపశాఖ లుండనట్టి దినము వచ్చునని యెఱుఁగుదును. ఏమికఠోరము! అన్నాళ్ళు నిరీక్షించి యుండవలయునా? తల్లీ! ఆనందమయీ! ఏకొలఁదిమంది సోదరిసోదరులము ఈనవవిధానమున నిన్నుఁ బూజింప నుద్యమించితిమో, మేము నిన్నే పూజించునట్లును, ఇంకెవరిని బూజింపనట్లును, దయయుంచి గతిహీనులమైన మా కీవరము నిత్తువు గదా! నే నెండాకులను బోగుచేయుచు పడియుండువాఁడను. నా కెట్టియాశ గలిగినది! ఆహా! జననీ! భక్తిలో మున్గఁడ నెతిని. ఇరకను మన్నని జేయుము. భారతము మగ్నమగును గాక! పృథివి మగ్నమగును గాక! భక్తిలో దేశము ఓలలాడుచుండఁ జూచి చత్తును. విగ్రహపూజ పోవుచుండఁ గాని, లేక బ్రహ్మజ్ఞానుల సంఖ్య వృద్ధియగుచుండఁగాని, చూచిన నంత సుఖము నాకుఁ గలుగదు. "అదిగో! జననిని పిలుచుచున్నా"రని వినిన మహాసుఖమగును. జననిని దర్శించి యందఱును నవనృత్యములో నృత్యము చేయుదురని ఆశయగుచున్నది. మేము కొలఁదిమంది సోదరులము ఎట్లుంటిమి? ఏట్లయితిమి? లోకులు పరిహసింతురను లజ్జను విసర్జించితిమి;

ఈదినము కంపితభక్తి— ప్రగల్భభక్తి— మేరలేనిభక్తి— పిచ్చెత్తించుభక్తి— కలిగినది! ప్రేమమునో యెఱుఁగను. నృత్యము ననుసరించిరో నాటకము. తరువాత నేమగునో ఎవరును జెప్పలేరు. తల్లీ! ఒకరినివైపునకే యందఱి దృష్టియు మరలునుగాక! పంచహారులు మాకవసరము లేదు. అనేక మత దేవతలను, నలుఁబదివేల బ్రహ్మలను బూజించిన జగత్తునకు సుఖము కలుగదు. ఏకజననివైన నీవు మధ్య నిలఁబడుము. సమస్తభారతమును నీనలువైపుల నాట్యము చేయునుగాక! దయాసింధూ! మేము ప్రతిభాన్వితమగు భక్తితో నాట్యము చేసి చేసి ప్రమత్తుల మగుదుముగాక! ఓయి యనాథనాథా! దయనుంచి మాకొకమాఱీ యాశీర్వాదము నిమ్మీ!

అష్టమాధ్యాయము.

లజ్జ : భయము.

భానువారము ౨ ఆశ్వియుజము ౧౮౦౪ శకము.

దుర్బలత్వము యొక్క పరిచయము నిచ్చినపుడు, జీవనముయొక్క పరస్పరవిరోధ భావముల మాటయును చెప్పుటుచితము. ఈజీవనములోనుండిన యభావమును గుఱించి చెప్పితిని ; ఆయభావ మీశ్వరప్రసాదమువలనఁ దిరోహితమైన సంగతియును మీరువింటిరి. ఈజీవనములో రెండు భావముల యొక్క విరోధముగపడెను. ఆకర్ణింపుఁడు. ఆవిరోధము యొక్క సమన్వయశాంతిని యథాసమయముగా జీవనమున ననుభవించుచున్నానని తెలిసికొనుఁడు. ఈజీవనమున ననేకదినములనుండి లజ్జాభయములకు దాసుఁడనై యుండవలసి వచ్చినది. తక్కినరిపువులవలెనే లజ్జయుభయమును నుపద్రవమును గలిగించుచున్నవి ; ఇంకను నాయుపద్రవము పోలేదు. కావలయునని ఆదరించి నేను లజ్జాభయములను బ్రభువులుగా స్వీకరింపలేదు. లజ్జాభయములు సాధుసజ్జనులకు శత్రువులు. సకలపాశములు ఛిన్నములైనట్టే, ఈపాశములును ఛిన్నములగును. సాధనయొక్క యభావముచేతఁ గానిమ్ము, లేక స్వాభావిక దౌర్బల్యమువలనఁ గానిమ్ము, లజ్జయును భయమును ఇప్పటికిని నాయందున్నవి. ప్రయత్నించికూడ నీరెంటిని వదలలేకున్నాను. అడుగడుగునకు నీరెండును బ్రత్యక్షమగును ; వీనియొక్క యధికారములోఁ బడియున్నానని తోఁచుచున్నది. లజ్జా భయములయొక్క క్షేత్రము వేఱు. శ్రీహరి లజ్జాభయములను ధర్మభూమినుండి సెలవిచ్చిపంపించి, వానిని సంసారమునందుంచెను. క్రమముగ

ధర్మప్రతాపమును విస్తరింపఁజేసినకాలఁదిని, వివేకము ప్రబలమైన కాలఁదిని, ఉపాసనాప్రార్థనలవలన హరిభక్తి వృద్ధియైనకాలఁదిని, విశ్వాసతేజములు అధికమైనకాలఁదిని. ధర్మరాజ్యములో నన్ను భయపెట్టఁగలిగిన తావులే నట్లు తోఁచెను. మనుష్యుఁడు వ్యర్థుఁడని ఈశ్వరప్రసాదమువలన జీవనముయొక్క ప్రాతఃకాలముననె గ్రహించితిని. విశ్వాసము వృద్ధియైనకాలఁదిని ధర్మసంబంధమున లజ్జాభయములు, తగ్గెను. జనములో నిప్పుడును లజ్జాభయములున్నవి; కాని అవియున్నది పృథివీతలమున. ఎక్కడ నీశ్వరాదేశము వినఁబడదో, ఎక్కడ నిదినాకర్తవ్యమని గ్రహింపలేనో, అక్కడ పురాతనులైన యీయిద్దఱుప్రభువులును జీవనమును తమవైపునకు లాగివేసి తీసికొనిపోదురు. అట్టి యవస్థయందుఁ బడిన ముఖకాంతి తప్పును; పదిమందిమధ్యకు వెళ్ళుటకుఁగాని, లేక వారితో సంభాషించుటకుఁగాని సిగ్గనిపించును; భయమగును. అనేకసమయములయం దీమస్తకము సాహసముతో ఉత్థితమై యీశ్వరునినామమును గీర్తనచేయును; కాని యదియె మఱల నతిసామాన్యులగు మనుష్యులముందు వంగిపోవును. పృథివిమీఁదికి స్వాభావికదౌర్బల్యముతోను, లజ్జాస్వభావముతోను వచ్చితినిగాఁబోలును. లజ్జాభయములు పొడకట్టినన్నిమాఱులును లోలోపలఁ గష్టముతోఁచును. ఎవరినిజూచిన నాకుభయము? ఎవరిని హీనులని మూర్ఖులని యందురో, అట్టి త్రోవనుబోవు సామాన్యపుఁ గూలివాండ్రను జూచినను నాకుభయమే. గొప్పగొప్ప విద్వాంసులను జూచిన వారిమధ్యఁ బ్రవేశించుటకు సాహసమురాదు. "విద్వజ్జనులు సన్మానము నందునట్టి, ఇట్టి పెద్దదర్బారులోనికి నీవు రావీలులేదు. ఇక్కడ జ్ఞానముయొక్క విక్రమము. అంధకార మిక్కడకు

రావలనుపడ" దని మనస్సనును. లోపల నేదేని యిట్టియాదేశమును వినుచుండుటలేదు; కాని విద్వాంసులసభలో వెనువెనుకనె యుండుటకై స్వభావము తనంతనెకోరును. ఎవరు ధనాఢ్యులో, ఎవరు లోకమునఁ గడునాదరము నందుదురో, ఎవరు సంపచ్ఛిఖరమున వసియింతురో, వారిమధ్యఁ బడినను సరిగ నిట్లే యగును. ధనమానములయొక్క యుజ్జ్వలపరిచ్ఛదము నెక్కడఁ జూతునో, అక్కడ స్వభావము తనంతనె సంకుచితమునొందును. ఈ యందఱను జూడ నిచ్ఛగలుగదు. ధనికులును, అభిమానులును, విద్వాంసులును, అగునీ మూఁడు తరగతులవారి యొద్దకును, మనస్సు సహజముగనే వెళ్ళలేదు; సహజముగనే వెళ్ళనిచ్ఛగింపదు. వెళ్ళుమని కర్తవ్యమనును; అందుచే వెళ్ళుదును. ఉపన్యాసము నిమ్మని కర్తవ్యము చెప్పును; అందుచే నిత్తును. ధర్మ మాదేశించునుగానఁ జేయఁగలుగుదును. ఆదేశ మెక్కడ వినరాదో యక్కడ నెంత యాలోచింతును! హస్తములు దుర్బలములగును; పాదములు నిస్తేజములగును; చక్షువులు తమంతనే మూసికొనిపోవును. అట్టివారి మధ్యఁ బడిన, "అహో! ఎక్కడికి వచ్చితిని! నేనీవీరినడుమ నుండుటకుఁ బనికిరానే!" యనిపించును. మాట్లాడఁబోయిన వ్యాకరణపుదోషములు కలుగునని తోఁచును. శక్తిలేదు; ఎట్లుపోదును? శరీరము కాంతిఁదప్పును; ముఖము మలినమగును; తల వంగిపోవును. "ఎప్పుడు సభముగియునా; ఎప్పుడు సామాన్యమిత్రులయొద్దకు వెళ్ళికూర్చుందునా; ఎప్పుడు నామండలిలోనికి వెళ్ళిపడుదునా; ఎప్పుడు నిజగృహమునకు వెళ్ళి స్వభావముయొక్క స్వచ్ఛందతను పొందుదునా;" యనియే తోఁచుచుండును. లజ్జ కష్టముకలుగఁజేయును. "వీరును మనుష్యులే; నేనును మనుష్యుఁడనే;

దోషములు వచ్చినప్పటికిని, ధనము, మానము, విద్య యున్న వన్నింత మాత్రమున క్షమింపరా? ప్రాణమును దీయఁగలుగుదురా? అవమానింతురా? మెడమీఁదఁ జేయివేసి యెవరైన నెట్టుదురా?” యని తలపోయుచుండును ఎవరైనఁ దరిమివేసినను వేయవచ్చును. “నీకుఁ జనువంతగా రాదు; విద్వాంసుల సహవాసము చేయుటకు నీవు తగవు. నీవు ధర్మోపదేశము నీయఁగలిగి యుండవచ్చును, గాని, ఎక్కడఁ బాండిత్యమునకుఁ దక్క మఱియొకదానికి నాదరము లేదో, అక్కడికి రా నీకధికారములే” దని. విద్వాంసు లనిన నననునమ్మును. ఇట్టి సకలస్థానములకును వెళ్ళలేదనిగాని, లేక తక్కువ వెళ్లితినని కాని కాదు. పదిపర్యాయములు వెళ్ళియుంటిని; పదిపర్యాయములును గౌరవమునందితిని; అయినను ఈ మాఱు ఏదేని దోషము కలుగవచ్చునుగదా! మహాలజ్జ! మహాభయము! జీవము నిలిచియుండుటకూడ సంశయమేమోయని తోఁచునంతటి భయము. ఎవరేని తోడనుండకుండ నొంటరిగ నింటిలోఁగూడఁ గూర్చుండుటకు సాహసము రాదు. ఒంటరిగ దేశభ్రమణములోఁ బ్రవృత్తుఁడనగుదునను చింత యుచితమని తోఁపదు. ఏదేని కార్యమును జేసిన నలుగురితోఁ గలసి చేయఁగోరుదును. ఎక్కడికేని వెళ్లవలసివచ్చినఁ బదిమందితోఁ గలసి వెళ్లఁగోరుదును. “సంసారములో నేకాకివై వెళ్ళవలదు; ధనికులయు, మాన్యులయు, మధ్యకు నొంటరిగ వెళ్ళకుము.” ఎవరామాటను జెప్పువారు? ఎవరునాదు? బ్రహ్మవాణియా? కాదు; స్వభావము. “ఇట్టిప్రకృతిఁగల మనుజుఁడు ఏకాకియై ఎక్కడికిని వెళ్ళఁగూడదు; ఇట్టివానవుఁడు ఒంటరిగ నెక్కడికిని వెళ్ళుటుచితము కాదు.” అని స్వభావమనును. స్వభావమునకది పనికిరాదు; తనవారెక్కడనో అక్కడనే

యుండఁజాలదను. విదేశమందుఁగాని, స్వదేశమందుఁగాని, ఏకాకియై పోవుట తటస్థించెనేని, తాను అసహాయుఁడను, నిరాశ్రయుఁడను నైపోతినని యనుకొనును. బంధుమిత్రులు ఏకాకులుగ నెన్నిచోట్లకు వెళ్ళఁగఁజూచితిని ; అంధకారములోనికిని వెళ్ళుదురు ; కాని, ఈవ్యక్తి యింతధర్మసాహసము కలవాఁడైకూడఁ గొన్నికొన్ని విపత్తులమధ్యఁ బడిన భయపడును. ఏకాకియై వెళ్ళలేఁడు. ఏవ్యక్తి బ్రహ్మను విశ్వసించునో, అతనికి భయమేమి ? ఇది పృథివియొక్క శూన్యభాగముగదా ! ఈసకలస్థానములందును వ్యాఘ్రముముందు క్షుద్రశిశువులువలె భీతిల్లవలయును. ఇక్కడ నాక్రమణకారులగు శత్రువులు నలుదిక్కులనున్నారు, మనస్సందుచే భీతిల్లును. ఎక్కడి విషయములలో ధర్మకథ లేదో, ధర్మసంబంధము లేదో, అక్కడనే, లజ్జయు ; అక్కడనే భయమును. ఉపాసనతో నెక్కడ సంబంధమున్నదో, అక్కడ పదిరెట్లధికముగ భయకారణములున్నను, భయము పరుగెత్తిపోవును ; కాని, మఱియొకచోట "దూరమగుము, లజ్జా !" "దూరమగుము, భయమా !" యనినను పోవు. పదిమంది చూడవచ్చుచున్నట్లు కనఁబడఁగనే పలాయనమగుటకుఁ గోరిక పుట్టును. ఎట్లువారినికూడ నడుగలేను ; వారిముఖముపైపునకుఁ జూడనులేను. వారు ముందుగ మాటాడరేని, భయమెక్కువగును. తక్షణమే పరుగెత్తిపోయి, ఏపర్వతపుగుహలోనో దాఁగికొనఁజూతును. ఎంతెంతమంది గొప్పగొప్పవారు వత్తురు ; ఇక్కడనుండి లేచిపోలేనా యని చింతింతును. ఇంటికి ధర్మాసక్తులు వచ్చినఁగూడ మర్యాద చేయలేను. కొందఱుకొందఱు అహంకారి యనుకొని లేచిపోదురు ; ధార్మికుఁడ వైతివని సభ్యతనముచే నుబ్బిపోతివందురు ; కటూక్తుల వచింతురు వెనుదీయరు. నన్ను నేను సమర్థించుకొన్న నన్యాయ

మగును; కాని స్వభావమును ఘాతము చేసినను నేమియుఁ గాదు. ఈస్వాభావిక దౌర్బల్యము పోఁదనుకొనియెద. కొంచెము తగ్గినను, ఒక్కమాఱుగాఁ బోవుననుకొనను. "సోయినమాత్రము వచ్చిన దేమి? విషయాసక్తులతో నుండలేనుగదా! వారితోఁ గలయుదుగదా! ధర్మసంబంధము గాక యన్యసంబంధమును గోరనుగదా!" యని మధ్యమధ్య యనిపించుచుండును. గర్వితుఁడు, దాంభికుఁడు, అహంకారి, అను పేర్లను బొంద వడియున్నాను. ఏమి సేయను? పదమందిలోఁ గూర్చున్నపుడు, ముఖవైఖరిఁ జూచితిరేని వీఁడు పరుగెత్తిపోవఁ జూచుచున్నాఁడని తెలిసికొందురు. బజారుపేరు చెప్పఁగనే పలాయనముగా నిచ్ఛపుట్టును. సంసారము నాముఖము వైపునకుఁ జూచెనేని దేహచ్ఛాయ పరివర్తితమగును. ఓసంసారమా! నీవు దృష్టినిడితివేని నాలోపలిరంగుసహా మాఱిపోవును. నీవు నాలుగు మాటలఁ జెప్పము. ఇఁక నేను నేనుగాను. కేవలము దేహమునుండి ఘర్మము నిర్గతమగును. శరీరము అవసన్నతఁ జెందును. అపుడు, ఇట్లొక్కింత సేపైనచోఁ జచ్చిపోదు ననుకొందును. కూర్చుండినవారు లేచిపోయిన బాగుండునని యనిపించిన యవస్థలలోను బడితిని. ఇఁకఁ జెప్పలేను. లోకులు మధ్యమధ్య నెన్నెన్ని కఠినపుమాటల ననిరి; నేను బాలకునివలెఁ గూర్చుండియున్నాను. నలుగురు దొరలు బంగాళీయునితో మాటాడవచ్చినపుడు దగ్గఱ నెవరైన నుండిన బాగు ఎవనికి లజ్జాభయము లింత యధికమో, అతఁడు పృథివియొక్క పథమున నొంటరిగఁ దిరుగఁగూడదు. ఇందుచే విశ్వసనీయుఁడైన మిత్రుఁడొకఁడు సర్వదా యవసరము; ధాత్రివలె దగ్గఱనుండుట శ్రేయము. ధర్మరాజ్యమున నీశ్వరక్రోడమందును, సంసారమున ధాత్రియొక్క కాని, లేక మిత్రునియొక్క కాని క్రోడమందుండును

ఉండవనియెడ జరగదని యీవ్యక్తి బాగుగ గ్రహించెను. ఎవ్వఁడైన నొక క్రిమితుల్యుఁడు సంసారములో నావాఁడై మాట్లాడుచుండిన బాగుండునని యనిపించును. ఒకవైపున నీలజ్జయు, నీభయమును; కాని ఎక్కడధర్మమో యక్కడ సింహమువలెఁ దర్జనగర్జనములు. అక్కడ మనుష్యున కేమాత్రమును భయపడను. ఎన్నఁడును, ఏమనుష్యుని గౌరవమును నిలుపలేదు; నిలుపనులేను. నాధర్మమెక్కడ నిర్లజ్జితునిగాఁ జెప్పుచున్నదో, అక్కడ నృత్యము చేయఁగలను; తక్కినచోట్లఁ జేయఁబోయినఁ బదివత్సరములు యత్నించికూడఁ జేయలేనని తోఁచుచున్నది. ఎక్కడ నీశ్వరుఁడో, యక్కడఁ బదిమందియును హీనుఁడు, నీచుఁడు అనునట్లు నాట్యము చేయఁగలను. అననిమ్ము; అందుకు సిద్ధము. కడునిర్లజ్జభావముతో ననేక కార్యములను జేసితిని. ఒకటితరువాత నొకటిచొప్పున ననేకములు చేయఁబడినవి. రాజబాటల, ఘట్టముల, సకలస్థలములయందును జేయఁబడెను. జనని ఆజ్ఞయిచ్చినపుడు, లజ్జయేమి? భయమేమి? ఇక్కడ లజ్జాభయములను శత్రువులుగా నెంచి ఖండఖండములుగాఁ జేయవలయును. పదిమందిముందు విశుద్ధసత్యమతమును బ్రచారము చేయవలసివచ్చిన నిర్లజ్జితుఁడనగుదును; భయమును ద్యజింతును. గొప్పగొప్పరాజులును, పెద్దయధికారులును ఉన్నప్పటికిని సత్యప్రచారముచేయుదును. కాని, మఱియొకవిషయమున నేల భయమగునో తెలియదు. ఒకస్థానమున నేదిసింహమో అది మఱియొక స్థానమున మేషశిశువు. సమయవిశేషముచే, స్థానవిశేషముచే భయానకమైన లజ్జయు, అత్యంతమైనభయమును గలుగును; అట్లుగనే మఱల సమయవిశేషముచే, స్థానవిశేషముచే భయానకమైన నిర్లజ్జయు అతిసాహసమును గలుగును.

ఓదీనబంధూ ! ఓయపారకరుణాసింధూ ! నీ వెవనితో క్రీడల సలుపుదువో, అతని చరిత్రమును అన్యులు గ్రహింపలేరు ; అతఁడు తానే గ్రహింపలేఁడు. నేను లజ్జాభయములమధ్యఁ బడి యొకమాటీదిక్కునకు, నొకమాటాదిక్కునకుఁ జూచుచున్నాను. నేను పృథివినిఁ జూచి యింతభయపడుదునేల ? ఎంతోమంది నిందించుచున్నారు ; దోషారోపణఁ జేయుచున్నారు ! లోకులవలన నీవ్యక్తి దురహంకారియని పరిగణింపఁబడెను. . నీయాశ్రితులకు మానసంభ్రమము నుంపవా ? నిన్ను విశ్వసించినవాఁడు అహంకారియయ్యెనా ? నీయం దహంకారాభిమానములు లేవని నీవు చూపుచునేయున్నావు ; అది లజ్జాశీలము ! పృథివియొక్క లోకులమధ్యఁ బడినపుడు నేనెట్లు సంకటములపా లగుదునో నీ వెఱుఁగుదువు ! హృదయమున నెట్టి జడభావము కలుగునో నీ వెఱుఁగుదువు ! ఆయవస్థ వర్ణనాతీతము ! ఏమాత్రమును సంభాషణ చేయలేను ; లజ్జాభయములు పొడిచిపొడిచి చంపుచున్నవి. ఈజీవనములో నీ రెండుదుర్బలత్వములు నున్నవని బంధుమిత్రులు గ్రహించిరి. నేను నాపక్షమును సమర్థించుకొనఁబోవుటలేదు. నన్ను మంచివాఁడననిమ్ము ; చెడ్డవాఁడననిమ్ము. ఆవైపు లక్ష్యముంచి జీవనవేదమును జెప్పుటలేదు. నాకు భయమునున్నది ; లజ్జయునున్నది. కాని, నీయందాసక్తిగలిగిన హరిభక్తులెవరో, వారిముందు లజ్జయుండదు ; ఏమాత్రము భయముకలుగదు. కొంచెముకలిగినను, అక్కడ నంతగాఁ బరిచయము కాలేదనియే. నావాండ్రముందు నేను సాహసినైన సింహమును. వారిముందు మనసువిప్పఁ గోరికపుట్టును. బయటివారు వచ్చినంతనే జిహ్వ జడమువలె యగును. తల్లీ ! నా చరిత్రమును నీ వెఱుఁగుదువు. నాకు

సుఖ్యాతియుఁ, ప్రశంసయు నావశ్యకములు కావు. ఇందుచే నాకరిష్టమగుచున్నదని విశ్వసింపను. పృథివి భయానకస్థానము; పృథివియొక్క బాజారులోను, దుకాణములలోను, నేనెట్లు కార్యముల నానర్తును? కర్తవ్యముగానున్నయెడల నాయన్నిస్థానములకుఁ బోను. సంసారముయొక్క అగ్నియందు నన్నుఁ బడఁద్రోయకుము. నీపాదపద్మములు నాకు బాగుగనుండును; మఱియు నీయనుగతులగు కొలఁదిమందిబంధుమిత్రులును బాగుగనుందురు. ప్రచారకునిఁజేసితివి; వేలవేలమందితో వర్తకసరణిని నడుపవలయును. వెళ్ళవలసినచోట్లకెల్ల బలియివ్వఁబడనున్న మేకవలె వణఁకుచు వణఁకుచు వెళ్ళుదును. వీఁడు దక్షుఁడుగాఁడని, నిపుణుఁడుగాఁడని నీవెఱుఁగుదువు. ప్రతాపము నీదిగా, మహిమ నీదియు. ఇట్టిలజ్జాశీలుని నృత్యములోఁ బ్రవృత్తునిఁజేసితివి; ధర్మములో సాహసునిఁజేసితివి. ఎవనిస్వభావము లజ్జాభయములతోఁ గూడినదో, అతఁడుగూడ భీమరవముతో బ్రహ్మనామముఁ గీర్తనచేయుచున్నాఁడు. తల్లీ! నీవు లజ్జాహీనునకు లజ్జఁబుట్టింపఁగలవు; మఱియు, ఎవనికి లజ్జయున్నదో, అతని లజ్జను దూరముచేయఁగలవు; పృథివియొక్క బలవంతుని నీవు దుర్బలునిగఁ జేయఁగలవు; దుర్బలుని సబలునిఁజేసి యాంతసిహుంకారముతో నితరులను భీతిల్లఁజేయఁగలవు. ఈదీను నెట్లుచేసితివి? లజ్జాశీలునకుఁగూడ ధర్మములో లజ్జపోరాదనునది ఒకయాశయొక్క మాటగదా! అందుచే హస్తములను జోడించి, అందఱసాహసము వృద్ధియగుఁగాకని ప్రార్థింతును. ధర్మమునకుఁగాను లజ్జ కలుగకుండునుగాక! ధర్మమునకై మొండివాఁడుకావలయును. కాలమైనది. మహిమాన్వితమగు భక్తియొక్క గౌరవార్థమై, త్రోవత్రోవను సంపూర్ణముగ లజ్జాహీనుఁడనై తిరుగుదును. ఇపుడు

శుభసమయము వచ్చినది; ఇపుడు భయపడితినేని సకలవిధానములకు ముప్పు వాటిల్లును. మృత్యువుచేయు సిద్ధుఁడనైతిని; ఇపుడు తలమీఁదిమునుగును దిగలాగను. లజ్జకుఁ బోను ఆదేశమును పాలింపమాన లేను. మానావమానముల మధ్య సంపూర్ణముగ స్థిరుఁడనై శ్రీపాదపద్మములను సాధింపయత్నింతును. లోకులు లజ్జాశూన్యుఁడ వందురు; హీనుఁడవని యసహ్యించుకొందురు. నేనిపుడు కడుసౌఖ్యము ననుభవించుచున్నాను; అందుచే నిఁక మనుష్యముఖమును జూచి భీతిల్లుదననుకొనను. పృథివిమీఁద బాలకునివలె నసహాయుఁడనై యుండవచ్చునుగాని ధర్మరాజ్యములో సింహమువలె నగుదును. ఓతల్లీ! ఓజననీ! ధర్మరాజ్యములోఁ గిరీటమునిమ్ము. ప్రాణమున్నను, ప్రాణముపోయినను నీనామమును జయపెట్టవలయును. ఆశీర్వదింపుము. భక్తిలో నిర్లజ్జుఁడనగుదును. విశ్వాసములో సాహసికుఁడనగుదును. మఱియొక విషయమున లజ్జాభయములుండిన నంత చింత లేదు. కరుణామయీ! భక్తిలోను, విశ్వాసములోను నిర్లజ్జుఁడనై, సాహసినై, శుద్ధుఁడను, సుఖిని నగునట్లు కరుణయుంచి యాశీర్వదింపుము. తల్లీ! దయనుంచి యీప్రార్థన సఫలముఁ జేయుము.

నవమాధ్యాయము.

యోగసంచారము.

భానువారము — ఆశ్వయుజము ౧౮౦౮ శకము.

భక్తి నాపక్షమున నెట్లుప్రాప్తించెనో, యోగమును అటులే. ధర్మజీవనముయొక్క ఆరంభకాలమున యోగినై యుండలేదు; యోగముయొక్క నామమును వినువాఁడనుగాను; యోగముసంగతి నెఱిఁగియుండలేదు; యోగముయొక్క లక్షణములను నిష్పన్నముచేయఁగలవాఁడను గాను; యోగపథమున నెప్పటికైన నడువవలసివచ్చునేమో యను నాలోచన కలుగలేదు. కడుఁబుణ్యవంతుఁడ నగుదును; సచ్చరిత్రుఁడ నగుదును; ఈశ్వరునియొక్క వాంఛితకార్యముల నెరవేర్తును;—ఇదియే ధర్మమనుకొంటిని; ఇదియే నాకర్తవ్య మనుకొంటిని. యోగినేలకావలయునో యోగియెవఁడో, యనునీ సకలచింతలయందును ప్రవృత్తుఁడ నగువాఁడను గాను; ఆవైపునకే వెళ్లువాఁడను గాను. యోగనుమాట యప్పుడు బ్రహ్మసమాజములోఁ బుట్టలేదు; యోగసాధనము బ్రాహ్మ్యనికిఁ గర్తవ్యమని, ఏపుస్తకములోను గనవైతిని. పదిపదునైదుసంవత్సరములు, సత్యమును, ప్రేమను, వైరాగ్యమును సాధనచేయుచుంటిని; ఇందులోనె చాలఁగాల మతివాహితమయ్యెను. ఈశ్వరప్రసాదమువలనఁ దుదకు నాహృదయమున భక్తిసంచరింపసాగెను. క్రమమున భక్తి ప్రమత్తతలోనికిఁ బరిణతమయ్యెను. భక్తి వృద్ధిగాసాగినపుడు, భక్తిని స్థిరపఱుచుటకుఁగాను యోగమావశ్యకమని గ్రహించితిని.

క్షణస్థాయియగు ప్రమత్తత జనింపవచ్చునుగాని యోగమువినా అది చిరకాలముండదు. ఈశ్వరునియందు విశ్వాసముదిరెనేని, ఈశ్వరునిలో నైక్యమగుట యావశ్యకము. రెండుండునేల ? హృదయమెట్లు భక్తునిహృదయమో, నయనమట్లు యోగినయనము కావలయును. భక్తిమీఁదను, యోగముమీఁదను, ఈ యుభయము మీఁదను నాదృష్టి పడెను; సాధనమీఁద నిచ్ఛపుట్టెను. భక్తియోగములువినా బ్రాహ్మనిజీవనము ఎందునకును గొఱగానిదని తోఁచెను. భక్తియొక్క రంగు పొడకట్టఁగనే శతసహస్రలోకులు ఆరంగులో అనురంజితులైరి; బ్రాహ్మసమాజమున భక్తియొక్క రంగు విస్తృతమయ్యెను. భక్తియొక్క యెఱుపురంగు ఎప్పుడు నాదయ్యెనో, అప్పుడు బంధుమిత్రులును మృదంగమును వాయించి, సంకీర్తనము చేసి ప్రేమాశ్రువులను విసర్జించుచు విసర్జించుచు, భావమున గద్గదులైరి. వారికి భక్తి అత్యంతముగఁ గలిగెను. యోగ మంత శీఘ్రముగఁ గాలేదు. యోగము కొంచెము కఠినము; సాధన కఠినము; మంత్రము కఠినము; స్వయముగ గ్రహించుటయుఁ గఠినము. ఈదినమువఱకును ఇది దుర్లభముగనేయున్నది. ఎవరీదుర్లభయోగమును సాధించిరో, వారు దీని నితరుల కీయలేరు. భక్తి యొక్కనిదైన దేని, ఇఁకఁ బదిమందిదగును. యోగ మింతశీఘ్రముగ వ్యాపింపదు. ఒక్క శతాబ్దములో కేవలము ఇద్దఱుముగ్గురుయోగులు మాత్రము కనఁబడుదురు. నేను యోగముయొక్క పక్షపాతి నైతినిగాని, మనవారందఱును యోగముయొక్క పక్షపాతులు కాలేదు. నాజీవనములోఁ గొంతలోపము కనఁబడినపుడు, యోగములేకుండ విశ్వాసము నిష్ఫలమనియు, భక్తిప్రేమవైరాగ్యములు ఎందునకుఁ

గా ఉఁగానివనియుఁ గ్రహించితిని. బ్రహ్మముతో ఏకమైపోలేనిరోజుల, మానవజన్మమునకు సఫలత్వము సిద్ధింపదు. ఈసత్యమును గ్రహించి యోగమార్గమును ద్రొక్కితిని. శాస్త్రములను జదివి ఈమార్గమునకు వచ్చితినా? లేదు. పుస్తకములను జదివియా? లోకుల యుపదేశములను వినియా? కాదు. దేనివలనను గాదు. ఏపుస్తకములలోను నేనప్పుడు యోగముమాటను జూడలేదు. మృదంగాకారమున భక్తిశాస్త్రము నానికటమునకు వచ్చినప్పుడు, మనుష్యులమాటలచే నేను భక్తిలో దీక్షితుఁడను గాలేదు. ఈశ్వరునియొక్క ప్రసాదవారి భక్త్యాకారమున వచ్చెను. అట్లుగనే ఎక్కడినుండియో ఒక్కమహావాయువు వీచుచు, వీచుచు వచ్చి యోగమును నానికటమునకుఁ దెచ్చెను. ఒక్కదిక్కువాయువు భక్తినిచ్చెను; ఇంకొకదిక్కువాయువు యోగమును దెచ్చెను. ఇవ్విధమున స్వర్గముయొక్క యిరుప్రాంతములనుండి రెండువాయువులు ప్రసరించినవై, రెండుధనములను దెచ్చెను. హస్తగతమైనపిమ్మట దీనిని భక్తియందురనియు, దీనిని యోగమందురనియు గ్రహింపఁగలిగితిని. భక్తి యోగమును సుమిష్టముఁ జేయును; యోగము భక్తిని శుద్ధముఁ జేయును. ఒకఁడు సోదరుఁడు; ఇంకొకతె సోదరి. ఒకఁడు పరిచర్యఁ జేసి భక్తిని విశ్వాసభూమిమీఁద దృఢముగఁ బ్రతిష్ఠించెను; ఇంకొకతె పరిచారికయై యోగమును రసయుక్తముగఁ జేసెను. ఒక్కయోగమేయైన నద్వైతవాదములోనికి దింపివేయునది; ఒక్కభక్తియేయైనఁ గుసంస్కారముల నుత్పన్నముఁ జేయునది. కాని యోగమను పర్వతముమీఁద భక్తియను సుధ్యానవన మేర్పడెను. ఆవనము స్వప్నవనము గాదు; కల్పనావనము గాదు; ఏలయన నది,

సుదృఢముగ పర్వతముమీఁదఁ బ్రతిష్ఠింపఁబడియున్నది. యోగము భక్తియోగము ననురెండుయోగములును గలియుటచే మహాయోగమయ్యెను; ఆమహాయోగము ఫలించెను. ఈదేశమున నేను భాగ్యవంతుఁడ ననుకొంటిని; ఏలయన ననేకులు కఠోరయోగమధ్యమునఁ బడి, భయానకమైన యద్వైతవాదసాగరమునందు మునింగిపోయిరి. భక్తియొక్క యజ్ఞానమున మత్తులై యనేకులు కుసంస్కారములపాలైరి. నేను రెండుదిక్కులను బంధించితిని. నాభక్తి యోగమునవలంబించి యుండునది. యోగముచే నయనములు పరిష్కృతములయ్యెను; భక్తిచే హృదయ ముప్పొంగెను. ఒకచక్షువు యోగము; మఱియొకచక్షువు భక్తి. ఈశ్వరుఁడు నన్ను భాగ్యవంతునిఁ జేసెను. రెండుచక్షువులను సంపూర్ణముగాఁ దెఱచి ఒకచక్షువుతో యోగీశ్వరునిఁ జూచితిని; మఱియొకచక్షువుతో భక్తియొక్క యీశ్వరుని దర్శించితిని. కాష్ఠములలోను ఫలములలోను బుష్పములలోను సూర్యచంద్రులలోను వాయ్వగ్నులలోను, జలములలోను సారబ్రహ్మవస్తువును దర్శించితిని; మఱియొకచక్షువుతోఁ గాష్ఠాగ్నులమధ్య నెవ్వనిదర్శించితినో, ఆయనయే హరిగదాయని, ఆయనయే యత్యంతసుందరాకారుగదాయని ప్రత్యక్షముగ ననుభవించితిని. ఎవనియొక్క యారంభము సత్యమో, ఆయనయే సుందరుఁడు. సత్యశివసుందరుఁ డెవఁడో, ఆయనను జూచిన నానందమగునది; ఈదర్శనమువలన జీవనమునఁ బవిత్రత సంచరించునది. రెండును గలసియుండుటచే ననేకములగు పాపములనుండియు, నపరాధములనుండియుఁ దప్పించుకొనఁగలిగితిని. ఇదివఱకుఁ గాష్ఠమూర్తికలను జూచినచోట నిపుడిఁకఁ గేవలము అంతియచూచుటలేదు. అధికసాధన చేయలేదు.

కన్నులు తెఱచికొని సాధనఁ జేసితిని. నలుదిక్కులను జూడఁ బ్రతివస్తువుమధ్యమునను ఈశ్వరుఁడు ప్రవిష్టుఁడై వసించుచుండఁగఁ గంటిని; జలములోపల బ్రహ్మ, పర్వతములోపల బ్రహ్మ, శిలలో బ్రహ్మ. జలమువంకఁ జూడ బ్రహ్మ ప్రత్యక్షముగఁ దేలియాడుచుండెను; మినుకులు వేయుచుండెను. పుష్పము యొక్క రేకులమధ్య బ్రహ్మ మెదలకుండఁగఁ గూర్చుండెను. పుష్పములలోను, ఫలములలోను బ్రహ్మను జూడఁగంటిని. గుల్మములపై పునకుఁ జూచిచూడకముందే శరీరము కంపించిపోయెను. బ్రహ్మ నేనున్నదిక్కునకుఁ జూచుచుండెను; నన్నుఁ బిలుచుచుండెను. నికటమునకు వెళ్ళితిని; "రావోయి! దగ్గఱకురావోయి!" యని మఱల ననెను. అతినికటమునకుఁ బోతిని; బ్రహ్మ దొరకెనంటిని. యోగమయ్యెను. యోగ మన నేమి? అంతరాత్మతోఁ బ్రగాఢసంయోగము; ప్రతివస్తువును జూడఁగనే తక్షణము ఆచూపుతోడనే యగు బ్రహ్మదర్శనము. కాష్ఠమికఁ గాష్ఠమనిపింపదు, ఆకాశమికఁ నాకాశముగ నుండదు. ఆకాశములోఁ జిదాకాశ మగపడును. సర్వత్ర ఒక్క జ్ఞానము చకచకలాడుచున్నట్లు, ఒకశక్తి టమటమలాడుచున్నట్లు, అనుభవమగును. జ్ఞానము యొక్క ఉజ్జ్వలప్రభ ఆకాశమంతయు విస్తృతమైయున్నది; ప్రేమానందములు వ్యాప్తమై నలుదిక్కులను శీతలముఁ జేయుచున్నవి; జీవునకు శాంతినిచ్చుచున్నవి. ఈసకలభావములును పాండిత్యముచే, బుద్ధిచేఁ గలుగవు. ఇదంతయు నాజ్ఞాపించిన సిద్ధించునా? సాధనవలన సిద్ధించును; ఈశ్వరకృపవలన సిద్ధించును. ఇది నాకిదివఱ కుండినది కాదు. ఉపాసన జేయువాఁడను; ప్రార్థన చేయువాఁడను; పాపమునుండి విముక్తుఁడనగుటకై, పాపశృంఖలమునుండి

యుద్ధారమునందుట్కై పతితపావనుని శరణముగొను వాఁడను. యోగమును సాధన చేయువాఁడనుగాను. జ్వలించునగ్నివలె నలుదిక్కుల బ్రహ్మాగ్ని ఛటఫటలాడుచున్నట్లు, మహావాయువువలె హూహూయనుచు బ్రహ్మవచ్చి శరీరమును దాఁకుచున్నట్లిదంతయు ననుభవమునకు రానికాలముండెను; క్రమముగ ననుభవమునకు వచ్చెను. ఎప్పుడు అనుభవమునకు వచ్చెనో అప్పుడెఁక వదలిపోవుటేల? ఇదిగో! నికటముననే బ్రహ్మ; ఇంకను నికటమునకు వెళ్ళుదును. ఒక మూరెఁడుదూరముననుండి ఆయనను దర్శింపవలెను. ఆయన యొక్క నికటముననే కూర్చుండియున్నట్లు చూచుకొందును. ఈ ప్రకారమున యోగము గాఢతరమయ్యెను. యోగములోను పరిమాణములున్నవి. అయిదునిమిషములలో యోగము, ఒక్క నిమేషములో యోగము, ఘంటలో యోగము, ఎన్ని మాఱులు కావలయునో అన్ని మాఱులును యోగము. ఈ యోగమునకై గురువినా, ఉపదేశము వినా, యత్నింపనారంభించితిని వదలిపెట్టుటయనునది లేదు; చక్షువులున్న యన్నినాళ్ళును, బ్రహ్మను దర్శింపవలయును; ఎన్ని శబ్దములు విందునో, వానియన్నిటిమధ్యను బ్రహ్మయొక్క శబ్దమును విందును. ఆంతియసిద్ధించెను; ఇదివఱకు నయోగినై యెట్లుంటినా యని యిపుడాశ్చర్యమగును. బ్రహ్మవిద్యుత్తు ఛటాలుమని సమ్ముఖమునఁ బ్రకాశించుచున్నది; లోపల మెఱయుచున్నది. కోరిక పుట్టఁగ, బ్రహ్మను జూడనగును. చకుముకిని గొట్టినపుడు అగ్ని రాలువిధముగనే, ఒక్క నిమేషమున శరీరములోను, హస్తములోను, అంగుళిలోను, రసనలోను బ్రహ్మ ప్రకాశితుఁడగును. బ్రహ్మమా! రమ్ము. ఈ హస్తముయొక్క యంగుళినిఁ బ్రకాశింపుమనఁగనే

బ్రహ్మజ్యోతి ప్రకాశితమయ్యెను. ఒకఁడికి రమ్మనఁగ వచ్చెను. పరీక్షించి బ్రహ్మ నెన్నివిధములుగఁజూచితిని. బ్రహ్మ యుత్కృష్టుఁడై దర్శనమిచ్చెను. ఈయోగము భక్తివినా కాఁగలదా? భక్తిపూర్ణయోగము; మిశ్రయోగము; నదలివేయ నిచ్ఛగలుగదు. "ఏకతంత్రి"ఁ బుచ్చుకొని సాధనఁజేసితిని; యోగములో మగ్నుఁడనై గానముచేసితిని; ఆగానములో భక్తి ప్రబలమై సుఖమునిచ్చెను. సుఖములో హరిపాదపద్మములను బట్టికొంటిని. కేవలము భక్తులయొక్క బ్రహ్మయే కాఁదు; యోగుల యొక్క బ్రహ్మయు, భక్తులయొక్క బ్రహ్మయు. భక్తిని యోగమును సంపూర్ణముగ మిలనముఁజేసి సాధనచేసితిని. జీవనయంత్రములో నాకనుతి ధ్వనింపసాగెను. ఇది భక్తియొక్క స్తుతి; ఇది యోగముయొక్క నుతియు. ఈరెండును ఒక్కటైన నానందస్వరూపబ్రహ్మమును బొందనగును. చూడుము! ఎట్లుంటిని, ఎట్లయితిని! పర్వతములకు వెళ్ళి గురువునన్వేషింప లేదు! ఇందునిమిత్తమై పుస్తకములను జదువలేదు; నిశ్వాసమును అవరోధింపలేదు. యోగినగుదునని, భక్తుఁడనగుదునని, యౌవనమునఁ బ్రతిజ్ఞచేసితిని. ఈశ్వరునిమీఁద నేవిశ్వాసముండెనో, దానియొక్క అంకురమునుండియే యోగమంకురించెను; ఏయల్పప్రేమభావము జీవనమునందుండెనో, అదియె ప్రగల్భమగు భక్తియొక్క యాకారమును ధరించెను. మొదట శుష్కభావముతో నుంటిని. ఇదివఱకు నానాకార్యములను జేయుచు, నానానుష్ఠానములను ఆచరించుచు దినమునుబుచ్చువాఁడను; క్రమమున యోగతత్త్వమును శిక్షించితిని. ఇదివఱకుఁ గన్నులుమూసికొనిన సంస్కారమును జూచువాఁడను; నిర్ధనుఁడను సజనుఁడను గావచ్చుననియు,

అంధకారములోను వెలుఁగును జూడనగునని యు గ్రహించితిని. కాష్ఠములోపలినుండి బ్రహ్మను బయటికి లాగవచ్చును; జలమునందును, ఆకాశమునందును ఆయనను జూడవచ్చును. రమ్మనిపిలిచి ప్రార్థనచేయుఁగనే బ్రహ్మాయగపడును. నేను బూర్వము కష్టపడినటిప్పుడు కష్టపడుచున్న బ్రాహ్మలనేకు లుండవచ్చును. "జలమునందును, అగ్నియందును బ్రహ్మము నెట్లు చూతుము ? ఇది యద్వైతవాద మైనదిగదా!" యనువారును అనేకులుండవచ్చును. బ్రహ్మను "ఇయూ*" రనుకొని "హాఫీజు*" వలె "ఓ హూ! ఎంతనికటమందున్నావు ! పుష్పములలోనున్నావు ! హృదయమం దున్నావు" వని యీప్రకారమనుటకు వీలున్నదా ? వీలుండుటయే కాదు, ప్రత్యక్షముగ నిటులు చూడఁబడినది. నేనిపుడున్నది లేనిది పదిమందికి సందేహము కలుగవచ్చునుగాని, ఈశ్వరవిశ్వాసములో సందేహము కలుగవీలులేదు. నాతో నీశ్వరుఁడిప్పుడొకటిగా నల్లుకొనిపోయినాఁడు. ఈశ్వరునిఁ జూడలేదా ? ఇఁకఁ బ్రమాణము నీయనవసరములేదు. నన్నుఁ జూచిననే చాలును. ఒకపదార్థములో రెండుపదార్థములు కలసిపోయినవి. ఒకదాని నస్వీకరించి యింకొక దానిని స్వీకరింపవీలులేదు. మీరును యోగమును శిక్షింతురు. ఆశావిశేషమునిచ్చితిని. బ్రహ్మను స్పష్టమగువస్తువవలెఁ జూతురు. పుస్తకములయొక్క యీశ్వరునితో మనకవసరము లేదు; చక్షువులలోఁ జూచినప్పుడే పాటింతుము. మిత్రబాంధవులారా ! కల్పనయొక్క యీశ్వరుని, ప్రాణములేనియీశ్వరుని,

---

* "హాఫీజు" అను నాయన యొక్క పారసీక మహాకవి మహాభక్తుఁడు: ఈయన ఈశ్వరుని "ఇయూ"రను ముద్దుపేరునఁ బిలుచుచుండెను. ఇయూరనఁగాఁ బ్రాణప్రియుఁడని యర్థము.

మన్నింపకుఁడు. యోగులరగుఁడు; భక్తులరగుఁడు; అభావమ్మునకు మోచనమగును. నేను మహాకర్మాసక్తుఁడనై యుంటిని; ఇపుడు యోగపర్వతముమీఁద కెక్కి యుద్యానవనములో విహరించుచున్నాను. నాజీవనములో యోగమధికమో, కర్మమధికమో; వివేకప్రభావమధికమో, కేవలమ్మృదంగమును వాయించి భక్తిలో నానందించుట యధికమో; ఇపుడు నాకుఁ దెలియకున్నది. పదునాఱువీసములు నాకు భక్తియున్నఁ, బదునాఱువీసములు యోగమున్నది. రెండువీసములు యోగమున్న రెండువీసములు కర్మమున్నది. భక్తుఁడనైతినని యోగసాధనలో నశ్రద్ధఁ జేయఁజాలను. ఈజీవనమున యోగమును భక్తియు నేకమైనవి. ఇంతనీచబ్రాహ్మణుఁడు యోగశిఖరమునందున్న భక్త్యుద్యానవనములో విహరించుచున్నవాఁడు. ఓబ్రాహ్మణులారా! మీరింతనికృష్టజీవనము కాను. నేను నీచుఁడనైకూడ, భక్తియోగములయొక్క యానందము లభించుననుట, యొకవిచిత్రము కాదు. ఆశనిచ్చుచున్నాను. ఉత్సాహము నిచ్చుచున్నాను. బ్రహ్మపాదపద్మములను బట్టుకొని యోగులరగుఁడు; భక్తులరగుఁడు.

ఓదీనబంధూ! ఓయోగేశ్వరా! అభావముండుట వాస్తవమే యైనను, అది విముక్తమగునని యీజీవనమునఁ గంటిని. ఇంగ్లీషువిద్యాలయములోఁ జదివి, ఆంగ్లేయమతములను నేర్చుకొని, యోగికావలసియున్నవాఁడని యెవ్వరెఱుఁగుదురు. కాని, నాథా! నీమార్గముఁ బట్టుటచే యోగినిఁ గావలసివచ్చెను. నేను స్వప్నములోను యోగమనుమాట తలఁచువాఁడనుగాను; యోగముసంగతియే నాకుఁ దెలియనదికాదు. బ్రాహ్మసమాజములోనికి వచ్చినపుడు "హామ్మ్మ, హరితో యోగమును స్థాపించుకొను"మని యెవరో ఒకఁడు చెప్పఁ దలఁచి

చెప్పిరి. ఓపరమపితా! పలుమాఱు ఇట్టిదెబ్బలను దిని, సంసారముచేఁ బరిత్యక్తుఁడనై, అంతరములోనికిఁ బ్రవేశించితిని. ప్రవేశించి యెట్టి యాశ్చర్యకరరాజ్యమును జూచితిని? బాహ్యమునఁ బురములను, గృహములను, కుటీరములను జూచినట్లే అంతరముననుజూచితిని. ఇక్కడఁగూడ గడు నానందమే! అట్లయిన మనుష్యుఁడేల యోగి కాఁడు? లోకులయుపదేశములను వినియుంటినేని, నిశ్వాసమును అవరోధింపుమని చెప్పెడివారు; కృత్రిమయోగపథమును బట్టుకొనువాఁడను. కాని, తల్లీ! నీవు సుఖినిఁ జేయఁదలంచుకొంటివి; అందుచే భ్రమములనుండి బ్రతికించితివి. బ్రతికితిని; సులభముగ యోగమార్గమును బట్టుకొంటిని. ఉచ్ఛ్వాసనిశ్వాసము లెట్లు సహజమో, నిన్ను దర్శించుటయు నట్లేయని గ్రహించితిని; పర్వతప్రకాండములలో, అసీమమైన సువిస్తృతాకాశములో, పదార్థమువలె నిన్ను స్పష్టముగా దర్శించి కృతార్థుఁడనైతిని. "చక్షువులారా! బ్రహ్మను జూడక నాస్తికులు గాకుఁడి; కర్ణములారా! "నేనున్నాను; నేనున్నా"నను నీశబ్దమును వినుఁడి. బ్రహ్మయొక్క నానావిచిత్రకథలను ఆకర్ణింపుఁడి;" యంటిని. ఇట్లంతయు సిద్ధము చేసికొని సాధన నారంభించితిని. సాధనమాత్ర మెన్నాళ్ళు చేసితిని? శీఘ్రముగనే నిన్ను సకలవస్తువులందుఁ గంటిని. భారతమున నింగ్లీషు నభ్యసించిన యొకయువజనుఁడు యోగి యయ్యెననిన నమ్మకము గలుగదు; కాని సభ్యతలో యోగము జన్మించెను. ప్రేమభక్తుల మధ్య యోగమయ్యెను. న్యాయశాస్త్రము యొక్క విచారణచే నేహరినిఁ జూడనగునో, ఆయనను సిద్ధాంతము చేసితిని; మనోవిజ్ఞానము యొక్క సహాయముచే నాహరినిఁ బరీక్షించితిని. హరీ, నీవన్ని పరీక్షలందును

ఉత్తీర్ణుఁడవైతివి. ఆత్మన్ ! జయధ్వనులఁజేయుము ! రసనా ! జయపెట్టుము !! నా బ్రహ్మ పరీక్షోత్తీర్ణుఁడయ్యెను !!! వృక్షాకాశములను జూచిచూచి ఎవఁడాస్తికుఁడయ్యెనో, అతఁడు నాస్తికుఁడు కావచ్చును ; కాని, నా బ్రహ్మ, "నన్నన్ని ప్రకారముల పరీక్షింతువో పరీక్షింపుము ; నేను నీవాఁడను ; నీవు నావాఁడవు ; నన్ను నీహస్తమునఁ బడవేసికొంటిని, నీకుఁ దోఁచినట్లు జేయుము ; నన్నుఁ బెద్ద బాజారులోనికిఁ దీసికొనిపొమ్ము ; అగ్నిలోఁ బడవేయుము ; జలములోఁ బడవేసియుంపుము ; పుస్తకములతో సరిజూడుము ; నన్ను బరీక్షింపుము ;" అనుచు నాకు వరమునిచ్చెను. పరీక్షఁజేసిచూడ, హరి నా సకలపరీక్షలయందును ఉత్తీర్ణుఁడయ్యెను. హరీ ! నీవెన్నఁడును మిథ్యగావని యప్పుడుగ్రహించితిని. విద్యుత్తువలె చకచకలాడుచున్నావు ; తళుక్కు—తళుక్కు— మనుచున్నావు. బ్రహ్మవస్తువు నెవరుచూచిరి ? హిమాలయమా ! నీవు నా బ్రహ్మయొక్క సాక్షివగుము ; ఆకాశమా , నీవు పుష్పములను వర్షింపుము. ఓసత్యమా ! జ్వలనమానుఁడవగు నోయీశ్వరా ! నేను నిన్ను దర్శించితిని ; నీవు మాట్లాడుము, మాట్లాడుము. నేను యాత్రికుఁడగు నీశ్వరుని మన్నింపను. బాల్యకాలమునుండి నేను నిన్నుఁ బాటించుచున్నాను. నిన్నగ్నివలెఁ జూడనగును. పసిఫిక్ మహాసముద్రమును దాఁటవచ్చునుగాని నిన్నెవఁడును అతిక్రమింప నేరఁడు. బ్రహ్మమా ! బ్రహ్మమా !! బ్రహ్మమా !!! బ్రహ్మమా!!! నేను యోగిని !!! నేను నిన్ను దర్శించుచున్నాను !!! ఇపుడు నాప్రాణము నీలో మునిఁగిపోయినది. మాట్లాడుము ; ఎల్లహానిని నిన్నుఁ బట్టనిమ్ము. నాస్తికులయొక్క యీశ్వరా ! దూరమునకుఁ బొమ్ము ; కల్పనయొక్క యీశ్వరా ! దూరముగుము ;

స్వప్నముయొక్క యీశ్వరా! దూరముగనుము. నిన్నుఁ బాటింపను. కల్పనయొక్క యీశ్వరుఁడు ఫూ యన్న నెగిరిపోవును. పరీక్షను నాఁగ లేఁడు. నా యీశ్వరా! రమ్ము! భగవానుఁడా! నీవు రమ్ము! ప్రకాశించుచున్న యగ్ని రమ్ము! రమ్ము! ధగధగమండుచుండుము. ఒక్క నిమేషములో భారతవర్షముయొక్క కోటి కోటి ప్రజలను విశ్వాసులను జేయుము. బంధుమిత్రులు శోకించుచున్నారు; కనఁబడుము. నిరాకారపూజను బట్టించినందుకుఁ ద్వరితముగ దర్శనమిమ్ము. చూచి యందఱును ఆస్తికులగుదురు. ఆస్తికుని నేను మహిమాన్వితునిఁ జేయుదును; ఆస్తికుని బ్రహ్మపుత్రుఁడనందును. ఈశ్వరదర్శన మెంత సహజము! ఇటువంటి విశ్వాసము కలుగకున్న మాటిలా! ఇట్లు కాదేని, ఇరువది వత్సరము లేమిచేసితిని! ఏ సాధనలో "ఈశ్వరుఁడెక్కడ, ఈశ్వరుఁడెక్కడ" ననుచుఁ బాఠమును వల్లెవేసినట్లు లీశ్వరుని నిర్ధారణచేయవలయునో, ఆ సాధన ఎట్టిపనికిమాలిన సాధన? "అమ్మా!" యని నిన్నతిసులభముగఁ బట్టనగును. ఓయి నిర్ధననిధీ! నిన్ను నేను సులభముగఁ బొందితిని. ఇదివఱకు నాకేమియు లేకుండెను; ఇపుడు సాధనాగారములోను, నా పుస్తకాలయములోను, నా వక్షములోపలను బ్రహ్మధనమున్నది. జమీదారునికంటె, రాజుకంటె నేనధికుఁడనైతిని. నీపుత్రుఁడనైన నేను బ్రహ్మాండముయొక్క యుత్తరాధికారినైతిని. యోగములో సూర్యచంద్రనక్షత్రములను, సమస్తమును వక్షస్థలమునందుంచుకొంటిని. సాలెపురుగే విధముగఁ దనగూటియందుఁ బడిన పురుగును బట్టుకొనునో, అవ్విధమున నిన్నుఁ బట్టికొంటిని. బ్రహ్మయు బ్రహ్మాండమును, బ్రహ్మాండమును బ్రహ్మయు, నాలోనున్నవి. నేను ధన్యుఁడను! నా పూర్వపురుషులు ధన్యులు!! ఈ మాటలనన్నింటిని

ఎవరు వినుచున్నారో వారు ధన్యులు !! ధన్యుఁడ వీశ్వరా !! నీవు ధన్యుఁడవు !!! నీవు అయోగిని యోగిగఁ జేయఁగలవు. ఓ కృపాసింధూ ! సచ్చిదానందుని విశ్వసించి యోగము యొక్క-సుఫలము నీ జీవనములోనే యాస్వాదింపఁగలుగునట్లు ఆశీర్వదింపుము !! జగజ్జననీ !! ముక్తిదాయినీ !! కృపఁజేసి నీవు మాకీయాశీర్వాదము నిమ్ము !!!

దశమాధ్యాయము.

ఆశ్చర్యగణితము.

భానువారము ౧౬ ఆశ్వయుజము. ౧౮౦౪ శకము.

నాజీవనముయొక్క గణిత మత్యంతాశ్చర్యకరము. ఏయంకశాస్త్రముద్వారమునఁ బ్రపంచము నడిపింపఁబడుచున్నదో నాకందు విశ్వాసములేదు. నాయంకశాస్త్రమునకును దానికిని విరోధము గాన్పించుచున్నది. మూలతత్వములలోనే వివాదము; అయినప్పటికిని నాకును గణితమున్నది; దానిశాస్త్రార్థమును గ్రహింపనగును; భక్తులును గ్రహింపఁగలుగుదురు. దానినియమాదులన్నియును సరిగనేయున్నవి; జనసామాన్యులదిపాటింపరు; శతాబ్దములు గడచిపోయినను పాటింపరు. నేనేదేశమునుండి వచ్చితినో యక్కడి యాచారవ్యవహారము లిక్కడి యాచారవ్యవహారములవంటివి గావు. ఈదేశపుఁబ్రజలిక్కడిరీతినీతులయొక్క పక్షపాతులైనట్లే, నాదేశపుఁబ్రజలును అక్కడిరీతినీతులయొక్క పక్షపాతులు. తమదేశముమీఁదను, దమయిండ్లమీఁదను, అనురాగ మందఱకు నున్నది. తమదేశమును మహిమాన్వితముఁజేసికొనఁగ నెవరికిఁ గోరికయుండదు? ఓమానవజాతీ! ఈదేశపురీతినీతులను, ఆచారవ్యవహారములను, నీవు చక్కఁబఱచియుంటివేని, దాని నితరులకుఁ జెప్పిమెప్పింప నెట్లుచూతువో, అట్లుగనేచేయ సమానాధికారమును, ఉత్సాహమును, నాకును నిమ్ము. నేను మాదేశపుసంగతులను జెప్పుదును. మాదేశమును నేను దక్కువచేయను. మాదేశపుఁబ్రజ లేశాస్త్రమును మన్నింతురో,

అది తక్కువలోనిది కాదు; పైఁగ నెక్కువది. అక్కడ శాస్త్రిప్రసంగతులనుగూర్చి రెండునిమిషములు వినుటయుఁ, గొంచెమాలోచించుటయు నుచితమనియైనఁ జివఱకు నమ్మము. ఆయంకశాస్త్రము లోకులను విస్మయాపన్నులఁ జేయును. సాధారణు లందులో నసత్యమును జూతురు. ఆయసత్యమును సాధనఁజేసినవారిని మూఢులనియుఁ, బిచ్చివాండ్రనియుఁ బిలుతురు. అయినను నానోరాఁగదు; అందుచే నీయంకశాస్త్ర మత్యంతాశ్చర్యకరమైనదని ధైర్యముతోడఁ జెప్పుదును; ఏలయన, దానిప్రకారము మూఁటినుండి యైదును దీసివేసినఁ బదునేడు మిగులును. ఈసాంగతత్త్వమును బట్టికొని, ఈనియమానుసారముగా, ధర్మసాధనలను జేసిన, లాభమే యగునుగాని నష్టమురాదు. ఇట్టిసాధన చేయుటవలననే బహుశత్రుసమక్షమందును జయపతాక స్థాపింపఁబడినది. ఈయంకముమీఁదనే ధర్మజీవనము స్థాపింపఁబడినది; ఏజయముకలిగెనో, అది యిందుమూలముననే కలిగినది. అయిదు మూఁడు గలసిన నెనిమిదగునన్నచోటనే, అపజయమైనది. చిన్నసంఖ్యలోనుండి పెద్దసంఖ్యను దీసివేసినఁ జాలశేషముండునని చెప్పినచోటనే జయమునందితిని. గృహము నిర్మాణించుటుచితమనుకొంటిని, వెంటనే నిర్మాణించితిని. గోడలు పైకిలేచెను; గృహము నిర్మాణమయ్యెను; గదిలో పటములుసహా వ్రేలాడఁదీయఁబడెను; అందుమీఁద పునాదులు వేసితిని. ఈదేశముయొక్క విధి ఇది, శాస్త్రమిది. ఎవరు పునాదులువేసి గృహనిర్మాణము నారంభింతురో వారిని మేము మూఢులందుము. జయముకలుగదని నిర్ధారణఁజేయుదుము. ధర్మమందిర మెట్లునిర్మితమగునని, , గోడ లెట్లులేచునని, ముందర ధనముపోఁగుకానియెడల సమాపనమెట్లగునని, ఎవరైన ననుచుండఁ

జూచితిమేని, ఇతనికి జయసంభవము లేదని వెంటనే తెలిసికొందుము. మేమన్ననో, "ఈశ్వరా! నీకిల్లి కావలయునా?" యందుము. ఆయన, అవునన్న రోజల నాకాశముపైని నాల్గంతస్థుల మేడ యప్పుడే నిర్మితమైనదని గ్రహింతుము. గృహము నిర్మాణమయ్యెను; డబ్బును రాసాగెను; అప్పుడు పునాదులుపడెను. ముందర భావించి చేయవలదు; ముందుచేసి తరువాతను భావింపవలదు; మొదటను వలదు; మధ్యను వలదు; తరువాతను వలదు; ఎన్నడును భావింపకుము. ఈశ్వరాదేశముమీఁదఁ గార్యముల ననుష్ఠింపుము; భావింతువేల? పిల్లలవివాహము తలపెట్టెను; అయిదువందలరూప్యముల యగత్యముండెను; అయిదువేలరూప్యములు కావలసివచ్చెను; అప్పుడు, డబ్బెక్కడని, డబ్బెట్లువచ్చునాయని ఈపృథివియందలిమూర్ఖుఁడు భావించును. వివేచనతరువాత నాలోచన, ఆలోచనతరువాత వివేచన, చేయఁగఁ జేయఁగఁ దలదిమ్మెక్కెను. అయిదువత్సరము లైపోయెను; వివాహము కానేలేదు. భావింప మొదలుపెట్టినవారికి నన్నివిషయములలోను భావనరోగ ప్రత్యక్షమగును. మాదేశస్థులు కుమార్తెకు వివాహముచేయవలసియున్నఁ గేవలము నాకాశమువంకఁ జూతురు; "హరీ! నీయీకన్యకు వివాహము చేయవలయునా?" యందురు. "అవును, ఆశ్వయుజశుద్ధపంచమి నాఁడు స్థిరమయ్యె"నని ప్రత్యుత్తరమునందుదురు. వివేకవైరాగ్యాస్త్రములను చేతఁబట్టికొని, సాధకుఁడు బయలువెడలెను. శుభముహూర్తమున వివాహమయ్యెను; ఏయాటంకములును రాలేదు. వరుఁడు లేఁడు; డబ్బు లేదు; ఇట్టియవస్థలో సాధకుఁడు కార్యమును సాధించెను. ఈపృథివియందలిలోకులు, ఇట్టియవస్థలో నెట్లగునాయని చింతింతురు.

ఈశ్వరుఁడెఱుఁగును ; అయిపోవును. ఈశ్వరుఁడు చెప్పినప్పుడగునని భక్తుఁడనును. భక్తున కొక్కదమ్మిడీ కనఁబడలేదు ; కాని మైదువందలమందిని పిలిచి చక్కఁగా విందుచేయవలయునని యీశ్వరుఁడు నుడివెను. భక్తుఁడుపాసనలోఁ గూర్చుండెను. ఈవైపున వివాహమునకు వాద్యములన్నియు సిద్ధము ; వేయిమందికి నేర్పాట్లును జరిగెను వివాహమైపోయెను. ఎట్లయ్యెను ? ఎట్లగునో ఈదేశపులోకు లాలోచింపరు ; ఎట్లయ్యెనాయనియే యాలోచింతురు. లెక్కఁబెట్టి పదురూపాయలరొక్కమును, బదిమందిమనుష్యులును గావలసియున్నచోట, సరిగా సమయమునకు నంతియే సిద్ధించెను. ప్రయోజనమైనదెల్ల తటస్థించెను. ఏసూత్రమును బట్టి ఎట్లయ్యెనో, ఎవరు చెప్పఁగలరు ? స్వర్గమెఱుఁగును ; మర్త్యము చెప్పలేదు ఇవన్నియు సిద్ధింపఁగా, నేప్రకారముగా నయ్యెనని గృహస్థుఁడు తిరిగి జిజ్ఞాసచేసెను ; సమస్తమును సిద్ధించినవిధమిది ; మనుష్యులువచ్చి చేరినదియు నీప్రకారముగనే. ఈకార్యము నందఱుఁ బ్రశంసింతురనియు, నీకార్య మనుష్ఠింపఁబడినయెడ లోకులందఱును యశస్సును గీర్తింతురనియు, నెప్పుడు తెలిసెనో, ఇదిదుష్కార్యమనియు, దీనివలన సర్వనాశనమగుననియు సాధకుఁడు వెంటనేగ్రహించెను. విద్వాంసులు గణుతింతురు ; పండితులు ఆదరింతురు ; సాధారణులు కీర్తింతురు ; కావున నీకార్య మనుష్ఠింపఁబడదు. ఇక్కార్యమును జేయుమని మనస్సనెను ; ఆకాశమువంకకుఁ జూడఁగా, నది కొంచెము మంచికార్యమని తేలెను ; కడుసజ్జనులును, ధనాఢ్యులును, పండితులును పిచ్చవాఁడనుచున్నారు ; అందఱును విపక్షులైరి ; అందుచే దీనిని జేసియే తీఱవలెనని స్థిరగురయ్యెను. ఈకార్యమును జేసిన నందఱును నిందింతురు ; ఘోరావమానము కలుగును ;

ఉపన్యాసము నీయఁబోవుచోటున కెవ్వరును వినుటకు రారు; అత్యంతాప్తమిత్రులు సహ పరిత్యజింతురు; మనశ్శరీరములును బుద్ధియు క్షీణించి, అవసన్నావస్థను జెందును. ఇట్లుకానున్నప్పుడు, "కావలసినట్లయినది; ఎవరును సాయము చేయరు; కావున నీకార్యానుష్ఠాన ముచిత" మని మనసు వచించెను. ఏలయన, పృథివి శత్రువైనపుడే ఈశ్వరుఁడు మిత్రుఁ డగునుగదా! పృథివి దేనిచే విముఖ మగునో, ఈశ్వరుఁడు దానిచే ననుకూలుఁడగునుగదా! ఏపనిలోనైన లక్షమంది యవసరమున్నప్పుడు, సాధకుఁడును భక్తుఁడును నైన గృహస్థుఁడు ముగ్గురిచే నది యనాయాసముగ సాధింపఁబడునని పలుకును. ఈపని నైదువేలమంది లేకుండ సమాప్తము కాదని పృథివి యనును. అయిదుగురికంటె నెక్కువైన నీకార్యము చెడునని భక్తుఁడనును. చాలధన మావశ్యకము; చాలమంది ప్రచారకులుండవలెను; అనేకులుపదేష్టలు కావలయును; ప్రచారమప్పుడగును; ఇది పృథివిమాట. "కాదు. అయిదుగురున్న నెక్కువ; పంద్రెండుగురొక్కచోఁ గలసిన నప్పటికే హెచ్చుసంఖ్య వచ్చినదనుకొనుము; పంద్రెండుగురు చేయఁగలిగినది, పంద్రెండులక్షలమంది చేయలేరు. పదుముగ్గురు చేయఁబోఁగానే చెడును." అని భక్తుఁడనును. అయిదువందలమంది చేయలేనిదానిని అయిదుగురు చేయఁగలుగుదురు. అంతయేకాక, అయిదుగురు చేయవలసినదానిలో, నార్గురు ప్రవేశించిన సంగతియంతయుఁ జెడును. ఇందునకై ఏలాగుననైనఁ దక్కువమందే యుండుటకై యత్నింతును. సంఖ్యను వృద్ధిచేయుట ఈశ్వరాజ్ఞకు విరుద్ధము. "చూడు; చూడు! అయిదుగురు విశ్వాసపరులు కూర్చున్నారు.", ఇంతలో నింతమంది యెట్లయిరి? ఏమి యాశ్చర్యము! ఏఁబది వత్సరములలో నింతమంది

రొట్లుచేరిరి? ఇంతమంది నీశ్వరుఁడు కుదిర్చెనా? కొలఁదిమందిరో స్తంభస్వరూపులై ధర్మసమాజమును దమతలలమీఁద నుంచుకొని కాపాడుదురు. దుర్జయులగు పండ్రెండుగురును ధరాతలమున జయమునందిరి. అందుచే మా దేశమునుండి వచ్చినవారెల్లఁ దక్కువమందికై యత్నింతురు. చాలమంది వచ్చుచున్నట్లు కనఁబడినతోడనే, సంగీతకారుఁడు సా, రీ, గా, మా యనుచు స్వరముల నాక్రమించినట్లుగానే, ఆచార్యుఁడు సాధనమాత్రల పైపైకెక్కించును. అసంఖ్యమగుజనము, ఒకశతమునకువచ్చెను. ఇప్పటికైనను ఇంతమందయా? అసలుపథమున నింతమందియా? ఇంకను గఠినసాధన ప్రవర్తితమయ్యెను. కొంతమంది విరక్తులైరి. మఱికొంతమంది నిందించుచుఁ బలాయనమైరి. రెండువందలమంది రైదుగురైనపుడు, స్వర్గమునుండి పుష్పవర్షము కురియసాగును. ఇంతకొలఁదిదినములలో నింతమంది రైరాయని, యాచార్యుఁడు తలపోయును. అయిదువందలమందిని గత్తిరింపఁగాఁ, గత్తిరింపఁగాఁ దరువాత నంతరాళమున నుండునైదుగురిలోపల సమస్తధర్మసమాజముయొక్కబలమును ఘనీభూతమయ్యెను. ఏయేకార్యములలోఁ బృథివికిఁ గడుతలఁపోయు టావశ్యకమో, ఆయాకార్యములలో నిక్కడ భావనయే పనికిరాదు. గణితశాస్త్రములో నూహగొక్కువని యనేకులనుకొందురు; అదిసరికాదు. ఒకజనునిజీవనములో నిరువదిరైదువత్సరములు సప్తాహముతరువాత సప్తాహము, మాసముతరువాత మాసము పరీక్షితమై ప్రమాణమైనది. ఈజీవనములో నేకొంచెము జయము కలిగినదో, యది చింతచేయకుండుటవలననే కలిగినది. పట్టుపోకుండ చేసికొని కార్యారంభణముచేయుట విఫలము.

ఎక్కడ డబ్బు లేదో, చింత లేనో, అక్కడనే జయము కలిగెడి. నేను స్వదక్షువులతో దర్శించినట్టియది సత్యమయ్యెనేని, అందఱు నీగణితముయొక్క ప్రశంస నేల చేయరు? అనలుసంగతిఁ జెప్పుచున్నాను; భావనచే విషయసంపత్తి దక్కదు; శరీరము సుస్థితిలో నుండదు; ధర్మము మాట చెప్పనే యక్కఱలేదు. బౌద్ధశాస్త్రముయొక్క నిర్వాణమును జేతఁబట్టుకొని, ఎక్కడికి వెళ్ళినను జయమగును. అగాధము లెక్కడ మ్రింగివేయఁబోవునట్లు యెదుటనే నోరుతెఱచుకొనియున్నవో, ఎక్కడ నిలుచుండినఁ బదస్ఖలనమగునో, అట్టి నిశితమగు క్షురధారవంటి స్థానమున నిలువఁబడి ధర్మమును స్థాపింపుము. నీవు లక్షరూప్యములను ముందుండఁజూచుకొని, పిమ్మట దయావ్రతమును బూనుదువా? అట్లైనట్టికిని వలదు. దయావ్రతమును బూనుము; కట్టువస్త్రమును చింపి, యొక్క పోఁగును చేతఁబట్టుకొని, "రా! రా! ధనమా! రా!" యనుము. మఱునాఁడుదయమున సూర్యుఁడుదయించినట్టుగనే, నీకుఁగావలసినదంతయు నీశ్వరుఁడిచ్చును. ఈశ్వరుని ధనమునకు నాయన జ్యేష్ఠపుత్త్రులును నధికారులే, ఆయన కనిష్ఠపుత్త్రులును నధికారులే. బిడ్డలు కలిగిన ధనభావనయేల? నాటకమాడవలెను; వితంతువుల దుఃఖమోచనము చేయవలయును; దేశమున విద్యాలయములను స్థాపింపవలయును; గృహమునఁ జూడఁగ ధనముండెను; దయాపథమున కంటకముగదా యనుకొంటిని. రెండుమూఁడుదినములు గడచెను; చూడఁగా నింట రాగిదమ్మిడి లేకుండెను; ఇప్పుడు ధర్మమును నడిపింపవలయుననుకొంటిని. భవిష్యద్వక్షమున ధనమున్నదని ప్రవర్తకుఁడు ధైర్యమును పురికొల్పెను. పృథివిమీఁద ధనమున్నఁ జాలునని

భక్తులు కార్యముల నారంభించిరి. రెండులక్షల రూప్యములున్నవాఁడు రెండురూప్యములను ఖర్చు చేయలేకపోయెను. ఎవని కేమియు లేదో వాఁడే పని చేయును. నేను ధనికుఁడనని ఎవరెఱుఁగరు ? నా చేతిలో నొక్క కోటియున్నదని ఎందుకనుకొనఁగూడదు ? ఏలయన. నావద్ద నొక్క రూప్యమునయితము లేదని నేనెఱుఁగుదును. నా కేమియు లేదు ; నేను కేవలము బ్రహ్మధనములో ధనికుఁడను. దీనిచే నేను సర్వకార్యముల ననుష్ఠింపఁగలను. అన్యులకుఁ జెక్కిలిమీఁదఁ జేయియున్నపుడు, నాకు నడుముమీఁదఁ జేయియుండును. అన్యులకెక్కడ పాహసమో నాకక్కడ వెఱపు. విస్తారధనమెక్కడనో, రెండుపాఠశాలలు, రెండుబ్రహ్మమందిరములు ప్రతిష్ఠింపఁబడఁగలిగినంతధనమెక్కడనో, అక్కడ విషమున్నదని యెంతును. డబ్బున్నదని లోకులు గర్వముచే మదించియున్నారు. సైతానుయొక్క ధనమును స్పర్శించి హరిసమాజమును స్థాపింపఁజూడను. హరియొసంగినధనమని తెలిసినపుడు, దానినినెత్తిమీఁదఁ బెట్టికొందును. హరియొక్క ఒక్క రూప్యము లక్షరూప్యములు. హరియే స్వయముగా ధనమునీయనియెడల సాహసము రాదు. ఈప్రణాలినవలంబింప నాదిష్టులైనవారు అవలంబింపుఁడి. ఈప్రణాల్యవనంబులోఁ గడుభారమున్నది. దీనిలో ననేకులకు నరిష్టముగలిగినఁ గలుగవచ్చును. ఈశ్వరునిసూచనలనుబట్టి యీప్రణాలిని గార్యముల ననుష్ఠింపవలయును. అనేకులు ఆలోచింపక కార్యములను చేయఁబోయి ఋణజాలమున బద్ధులగుదురు. "డబ్బునకింతచ్చింతయేల? అనుకున్నట్టయిన, నొక్కచీటిముక్కవ్రాసి లక్షరూప్యములను దెప్పింపఁగల" నని

చెప్పుచు ననేకులెగిరిరి; ఎగిరి, పడిరి; పడి, మునిఁగిరి. మే మెగిరితిమిగాని పడలేదు. పూర్వముండిన సాహసముకంటె నిప్పుడు సాహసమెక్కువైనది. డబ్బులేనప్పుడు ప్రచారకుల సంఖ్య పదిరెట్లెక్కువగునేని, రెండువందల మందివచ్చి ప్రచారకులమధ్యఁ జేరుదురేని, అందఱకును ఆశ్రయమునీయ సంభవముకావచ్చును ? ఏలయన, డబ్బులేదుగదా! డబ్బునకు గుంజులాటగానున్నదని యెఱుఁగుదును. ఇట్టిసమయమందు రెండువందలమందివచ్చిన, ముహూర్తమధ్యమునఁ గుబేరునిధనమువచ్చును. ఒక్కమాటాడ్చినఁ జాలును. ఈపత్రికార మిరువది, యిరువదియైదువేలరూప్యములను వత్సరవత్సరమును ఖర్చుఁజేయుచువచ్చుచున్నాను. లేమిడి యొన్నఁడును లేదు. పూరిగుడిసెలో దుకాణము, తృణములను దంతమధ్యముననుంచుకొని * వ్యవసాయము; కాని యభావ మెన్నఁడును లేదు. ఒక్కయుపాసనఁజేసి యైదుగడ్డిపోఁచలను దంతమధ్యమున నుంచుకొని, "ఒకవిద్యాలయమును స్థాపింతును; అందులోఁ బ్రతిమాసము నైదువందలరూప్యము లావశ్యక" మని ఎవరైన ననిరేని అతనిముఖముఁజూచి సిద్ధించునని చెప్పఁగలను. ఒక్క తృణమును దంతమధ్యమందుంచుకొని యీవ్యక్తి యెంతధనమును దేఁగలఁడు! ధనమున్నవారిద్వారమున నేదికాదో, అది ధనములేనివారిద్వారమున నగును. ఈయాశ్చర్యకరవిషయము నెవరుగ్రహింతురు? భక్తుఁడు గ్రహింపఁగలిగినది, విద్వాంసుఁ డెట్లుగ్రహించును; భావింపకయే కార్యములననుష్ఠింపుము; వ్యవసాయముచేయుము; వాణిజ్యముఁజేయుము; పిల్లలకుఁ

* వంగదేశమున నిది వినయమునకుఁ జిహ్నము.

జదువుఁజెప్పింపుము; అన్నియు నగును. సరస్వతియు, లక్ష్మియు, విద్యయు, ధనమును, నీవగును. మీ రాలోచించి చేయుదురు; మేమాలోచింపక చేయుదుము. మా "నవవిధానము" వారు డబ్బు చేతఁబుచ్చుకొనకయే బహుకీర్తిని స్థాపింపఁగలరు. "నవవిధానమునకు జయ" మని యననేయందును. మీరొక్కొక్క కుటుంబమును సంరక్షింపలేరు; కాని యాలోచనలేకయే బహుపరివారములు పరిపాలితమగును. ఏఁబదిమంది పిల్లలకు వివాహములు చేయవలయును; రోగులకు నౌషధములు గొనవలయును; ఇదెట్లగునాయని, వైద్యుఁడెట్లువచ్చునాయని భావింపకుము. భావించి యెవరును ఏమియుఁ జేయఁగలిగియుండలేదు. మనుష్యుఁడు చింతలో మగ్నుఁడయ్యెను; అప్పటికిని కుమార్తె వివాహము కాలేదు; కుమారునికి నుద్యోగము దొరకలేదు. చివరకుఁ బిల్లలన్నములేక చచ్చిపోయిరి. పృథివియొక్క పాండిత్యమునకు ధిక్కారముగుఁగాక! ఉపాసనవలనఁ గాఁగలిగినది, చింతవలనను, పాండిత్యమువలనను గాదు. ధనాఢ్యులును, పండితులును దేనినిఁ జేయలేరో, భక్తవత్సలుఁ డాదేశించెనేని మా దేశభక్తుఁడొకఁడు దాని ననాయాసముగఁ జేయఁగలఁడు. ఈగణితము అభ్యాసితమని నేనింకను జూపింతును. నాదళములో విశ్వాసపరులున్న, వారును జూపింతురు. భావింపక, భీతిఁజెందక, ఎవఁడగ్నిముఖమున నిలుచుండునో, వానికే జయమగును. ఎవరికి నేమియు లేదో, వానికే జయము. అగ్నికణములమధ్యను దక్షిణహస్తమును, అగ్నిపైని ప్రజ్వలించు జ్వాలలందు వామహస్తమును ఉంపుము! సాహసముతో నిండియుండుము!! ఓసాధకా! ముఖముందే దృణములతో నిలువఁబడినవాఁడవై స్వర్గరాజ్యమున వసియింపుము!!!

ఓదయాసింధూ! ఓకరుణామయా! నీమతానుసారముగా నడచిన, నీవుసత్యమనియు, నీయంకశాస్త్రము సత్యమనియుఁ జూపింపనగును. ఈపృథివియొక్క మనుష్యులవిద్య యది విద్యకాదు; అవిద్య. నీమార్గమననుసరించిన నేదిసత్యమో, అప్పటికది యసత్యమని తోఁచును. కాని, ఈశ్వరా! అటుకాదు; అటుకాదు. వెళ్ళఁగా, వెళ్ళఁగా నెట్టిమహాశ్చర్యములను జూచితిని! గొప్పగొప్పవీరులు వచ్చి ప్రవేశింపలేనిరాజ్యములోనికి మేమువచ్చి ప్రవేశించితిమి. అరకానితో మేముచేయఁగలిగినది లోకులు లక్షరూప్యములతోఁ జేయఁజాలరు; మేము బాగుగ నుపాసనను జేయము, అందుచే మాకు లేమిడికలుగుచుండును. కౌపీనధారులమైతిమేని, శ్రీగౌరాంగుఁడు, క్రీస్తు, మోశా వలె సర్వత్యాగులమైతిమేని, ఒకరొట్టెముక్కతో బ్రహ్మమందిని తినిపింపనగునని చూపింపఁగలుగుదుము. యావన్మనస్సుతో దీనినివిశ్వసింతుము. ధనాభావమువలన సత్యస్థాపన యాఁగుననుసంశయము మాకుఁగలుగునా! ఆనందమయా! సాహసమునిమ్ము సత్యస్థాపనయేలకాదు! నీదాసులిప్పుడే నడుముబిగింతురు. ఒకభారతవర్షమెంత? అయిదార్గురము నిలఁబడితిమి; భారతమును జయింపనేజయింతుము. అయిదువందలమంది నిలఁబడిన, "దైవమా! ఇంతమంది యేలవచ్చిరి? ధర్మముయొక్క ప్రథమావస్థలో వంద్రెండుగురే యుందురు. శిక్షకులును ఉపదేష్టకులును, పదివంద్రెదుమందికంటె నెన్నఁడును నెక్కువగ నుండలేదే! దృశ్యమునుచూచుటకా వీరు? పుష్టిగలుగను పాయముఁ జూడుము; సమస్తబలమును ఘనీభూతముచేసి కొలఁదిమందిలో నుంపు" మని, మొఱఁబెట్టుదుము. ఇపుడు భయపడుదుమేల! ఇఁకను

భయకారణము లేదుగదా! మేమిదివఱకుఁ బరీక్షించి చూచినయుపాయముననే యిఁకఁ దిగ్విజయులమగుదుము. జయలాభమందిన భక్తులందఱును ప్రార్థనోపాసనలవలననే యుండిరి. ప్రార్థనోపాసనలఁజేసియే, వారు పారత్రికధనమును సంచయము చేసిరి. పృథివియొక్క ధనమసారము; మాకు "నీ" వను ధనముగావలయును; నీవారిని మేమాదరింపఁజూతుము. సుబుద్ధినిమ్ము; ఈధర్మసమాజములో నీవారెంతమందియున్నారో, వారందఱకును సుబుద్ధినిమ్ము; భావనాశూన్యమైన యాకాశవిహారియగు పక్షిచందమున, వారు నీయాదిష్టకార్యములను జేయఁగలుగుదురుగాక! లోకభయమున నేమిభయము? ఈవిధమునఁ గార్యములననుష్ఠించినఁ బృథివి క్రయమగును. క్షత్రియబలము సిగ్గుచే దాఁగికొనుఁగాక! పృథివియొక్క రాజ్యబలము, బాహుబలము, ధనబలము, అన్నిటికిని లజ్జవచ్చునుగాక! ఏబ్రహ్మబలమును పొందితిమో, అదియే దుర్జయబలము. ఈబలములో బలుఁడనై "జయమగుఁగాక! జయమగుఁగాక!! బ్రహ్మకు జయమగుఁగాక!" యందును; వెంటనే యాకాశము పాతాళము కంపించును. అయిదార్గురులోనే పృథివి జయింపఁబడును. దయామయా! పంచవింశతివత్సరసఖా! నీవు దయయుంచి ఏసమస్తసత్యములను దెలిపితివో, ఆసముదయమును ఇప్పుడిక్కడనున్న మిత్రులందఱకును దెల్పుము. ఈసత్యమును బట్టుకొని ఎవరు నుపహసింపకుందురుగాక! మేమీసత్యము నవలంబనము చేసికొని సంసారాసక్తినుండి తప్పించుకొనెదము. నీమీఁద భారము వేసి కార్యముల ననుష్ఠింతుము. మామనస్సులలో నిఁక సందేహములు లేవు; మాకిఁక లేమిడియేమి? నీవు మావాఁడవు; మేము నీవారలము; మాకు సర్వధనమైన

నీవుసాయపడిన, ధనము సహాయమగును ; జగత్తు సాయమగును. నీవు సాయముకానియెడల నెవరును సహాయము లేరు. మాకుఁ గావలయుసర్వమును నీలోన దొరకునుగాకయని కోరుదుము. దయామయా! దయనుంచి మమ్ముల నాశీర్వదింపుము! మేము పృథివియొక్క కుటిలజటిలాంకశాస్త్రమును వదలి, నీచరణములఁ బ్రార్థించినవారమై మహాకీర్తిని స్థాపనఁజేసిపోదుముగాక!! కృపఁజేసి దుఃఖులగు నీతనయుల కీదినమున నీయాశీర్వాదము నిమ్ము!!!

ఏకాదశాధ్యాయము.

జయలాభము.

భానువారము ౨౩ ఆశ్వయుజము ౧౮౦౪ శకము.

భగవానునియొక్క యానందపు బాటాటులలోఁ బ్రథమమున దుకాణ మెప్పుడు తెఱవఁబడినదో అప్పుడే, ఋణముమీఁద నేదియుఁ గొనఁబడదనియు, అప్పుమీఁద నేదియు విక్రయింపఁబడదనియు నొక నియమము చేయఁబడెను. సంగతిసందర్భములనుబట్టి కొనుటయు, ఖరీదుపుచ్చుకొని వస్తువులను విక్రయించుటయుఁ బ్రథమమునుండియు నియమమైయుండెను. ఈనియమమునుండి మనస్సెన్నఁడును, ఈవైపునకుఁగాని, ఆవైపునకుఁగాని చెదరలేదు. ఇతరులమాటలను విని యీవ్యవసాయమందు దిగలేదు; నాది కాని వానిని నాది యనలేదు. ఏకొంచెమధికారముండెనో, దానికిమించినవిషయములను ముట్టలేదు. నాకు దొరకినకొంచెమును, నాఘటమునందుండిన కొంచెము ప్రేమరసమును, నాకబ్బినయల్పవిద్యను, నేనుపాటించిననాల్గువిషయములను మాత్రమే కార్యములో పరిణతిఁజెందించితిని. ఈప్రకారమెంతో జాగరూకతతో వాణిజ్యము నడిపింపవలసివచ్చెను; క్రమముగ వర్తకము పెద్దదయ్యెను; అనేకులు కొనవచ్చిరి, ఈమాత్రము నియమముండుటచేతనే వ్యవసాయ మింతలక్ష్మీప్రదమయ్యెను. శాస్త్రములో నుండినదనిగాని, లేక యల్ల యామనుష్యుఁడు నుడివెననిగాని, వివేచనచేయువాఁడనుగాను. అదేదియుఁజేయఁబోయినంతనే గోలలోఁ బడుదునని యెఱిఁగియుంటిని. ఇతరులనాలుకతో రుచిచూచిన విపత్తునందుఁ బడుదునను భయముండినది; ఇప్పుడును ఉన్నది.

న్యాయముగ గ్రహింతును; తరువాతఁ జేయుదును. మొదటినుండియు నిదియె నా ప్రతిజ్ఞ. వైరాగ్యమును గానిమ్ము, యోగమును గానిమ్ము, ఇతరుల మాటమీఁద స్వీకరింపను. లోపల నేమియున్నదో, చివర కేమగునో యెవరికిఁ దెలియును? అంధకారములోనికిఁ బ్రవేశింప నుచితము గాదు. నేత్రములున్నవి; కర్ణములున్నవి; హస్తములున్నవి. పరీక్షింతును; చక్కఁగాఁ బరిశీలింతును; పిమ్మట సిద్ధాంతముఁ జేయుదును. తల్లి యింటనే యున్నది; ఆమె నడుగుదును, గురువు గృహమందే యున్నవాఁడు; ఆయన నడిగి యర్థము తెలిసికొందును. ఆప్తమిత్రుఁడు కుడిచేయి ప్రక్కనే యున్నాఁడు; "హరీ! నాకు సాయము చేయు" మని ఆయన నడుగుదును. గృహమున ధనము సంచయమైయున్నది; అందుచే ఖర్చు చేయుదును. ఎక్కువగాఁ గావలసియున్న భగవానుఁడిచ్చును. ధనవంతుఁడనైతినేని నెమ్మదిమీఁద నప్పుడు వృద్ధిసేయుదును; ఇట్లనుకొనుచు నా పనిలో నేనుంటిని. బజారులో మిగుల బాగుగ వర్తకము సాగించితిని; అప్పు కాలేదు. మూలధనమల్పముగాఁ గలిగిన నల్పవ్యవసాయమును భగవానుఁడు మహైశ్వర్యమునకుఁ గారణముగాఁ జేసెను. కొనవచ్చువారికి నప్పుమీఁద నిచ్చువాఁడను గాను; ఈశ్వరునితో నే వ్యవసాయమును నడిపితినో, అదియును రొక్కము మీఁదనే. రొక్కము కొఱకే ఆశ. రొక్కము పుచ్చుకొనక విక్రయింపనను నియమము ఈశ్వరదత్తము. లోభము కలుగఁజేసిన సందేహమువలనఁ గాని, అవిశ్వాసము మూలమునఁ గాని యీవ్రతమును బూనలేదు. తాను రొక్కపు డబ్బునిత్తును గాని, అప్పు నియ్యననియు, అతిశయమైన నగదు విలువ కలిగిన రాజైశ్వర్యమును దానర్పింతుననియు, విధాత

జీవనారంభముననే తెలియఁజెప్పెను. అందుచే నగత్యమైనకొంచెమును, మానవుఁడు పొందఁగలిగిన సమస్తమును, నాకు లభించునను విశ్వాసము కుదిరెను. సాధనఁ జేసితిని; భవిష్యదనిశ్చితధనముకొఱకై యాశపడకుంటచే లాభమే యయ్యెను. రాత్రిగడపితిని; మరునటినాఁడుదయమున నభిలషించిన ధనమును బొందితిని. తరువాత నొరకునుగదా యని యూరకుండిన సాగదు. అందుచే నాయనకుఁ బ్రణమిల్లి, "ప్రభూ! రొక్కపుసొమ్ము నిత్తునంటివిగదా! యిమ్ము; అగత్యమైన వేచియుందును; కాని నీవద్దనుండి పుచ్చుకొని కదలుదును" అని వక్కాణించితిని. నావిషయమునను, పృథివివిషయమునను, దేశవిషయమునను, మానవజాతివిషయమునను, ఏదేదికోరితినో, అదంతయుఁ గ్రమముగ లభింపఁగంటిని. "లభింపనాలస్యమగును; లభ్యముకాదు; కా నసంభవ" మను నీమాటలనన్నిటి వింటిని. "పరలోకమందు ఫలలాభముకలుగును; కీర్తిస్థాపితమగును; ఇక్కడఁ గేవలము బీజవపనమే" యను జనులువిశ్వసించు వాక్యములకుఁ బ్రమాణములును, నానాశాస్త్రములలోఁ గంటిని. దేనినిఁబొందుటకై వేచియుండ వేచియుండ ననేకులశరీరములు క్షీణించిపోవునో, రాత్రింబవళ్ళు గడచిపోవునో, మాసామాన్యబలముచే, సామాన్యయత్నముచే నది లభ్యమయ్యెను. అనేకులు ధర్మసంస్కారకులు, మహామతులగుపండితులు సత్యమునువిస్తరించుటకై కష్టములను సహించి, ఎంతోపరిశ్రమచేసి, చివరకు భవవ్యవసాయములో వంచితులై పరలోకమునకు వెళ్ళిపోయిరి. వారు బీజవపనముఁ జేసి వెళ్ళిన సహస్రవత్సరములకుఁ దరువాత మేము ఫలము ననుభవించుచున్నాము; మాకీకాల మనుకూలమయ్యెను;

గాఢమగుప్రేమ గాఢతరమై సమస్తమును మార్చివేసెను. పంచవింశతివత్సరముల పరిశ్రమచేఁ బంచశతవత్సరముల ఫలము లభింపఁగ నిప్పుడు చూచుచున్నాను; ఒక్కనాఁటిపని ఒక్కఘంటలో నగుచున్నది. ఏబీజమునుండి వృక్షముత్పన్నముగా ననేకవత్సరములు పట్టునో, ఫలములు ఫలింప బహుకాలము వేచియుండవలయునో యిప్పుడది త్వరలోనే యగును. బ్రహ్మనామోచ్చారణ పూర్వకముగాఁ గార్యమారంభమయ్యెను; రెండువత్సరములు గడచిగడవకముందే కావలసినంత ఫలించెను. సమస్తము లోకారణ్యమయ్యెను. దుర్వహభారమును వహించుటకై దేశదేశాంతరములనుండి జనులువచ్చుచున్నారు. పంచవింశతివత్సరములకుఁ బూర్వ మెట్లుండెను! పంచవింశతి వత్సరములకుఁ బరమం దెట్లయ్యెను! ఇదంతయు నెవరికిఁ దెలిసియుండెను! కల్పనలోను నెవరు ననుకొనలేదు! ధర్మమునకు నధర్మమునకు నెట్టివివాదము లుండెను! అధర్మముమీఁద లోకుల కెట్టియాసక్తియుండెను! బ్రాహ్మధర్మమెట్టిక్షీణావస్థలోనుండెను! భక్తిప్రేమ లెంతకొఱఁతగా నుండెను! దుర్బలబంగాళీయునకు నుత్సాహ మెంతతక్కువగానుండెను! పది, యిరువది వత్సరము లెడతెగకుండఁగఁ గృషిచేయుటచే, సత్యవిస్తారముయొక్కయు, సత్యరక్షణయొక్కయు సంభవము వృద్ధియయ్యెను. ఏదేశములో ననేకములగుసద్విషయములును మంటిపాలగునో, ఆదేశములో బ్రాహ్మధర్మము నవవిధానములోనికిఁ బరిణతమయ్యెను. ఏవత్సరమునందున్నతికలుగలేదో, అట్టివత్సర మింతవఱకు రాలేదు. ఈశ్వరుఁడు నిద్రించినట్టిమాసముగాని, సప్తాహముగాని యెక్కడ? జనులకుఁ బరమువిషయమై వినిపింపని దెప్పుడు? సింహమెదిగెను; కేవలవంగదేశమేల? భారతవర్ష

మంతయుఁ గంపించుచున్నది ; ఇటునటు కదలుచున్నది. నవవిధానపక్షమునఁ జేయఁబడిన కార్యములలోఁ బూర్ణముగాని దేది? ఫలింపక పోయిన దేది ? మహత్తరముగు కీర్తి ప్రతిష్ఠితమయ్యెను ; భక్తుఁడు హరినామమును చ్చరించుట మొదలుపెట్టిన చిన్నచిన్న కార్యములును సఫలమయ్యెను. ఇప్పుడు సత్యసూర్యుని వైపునకుఁ దిరిగి, సత్యాగ్ని మధ్యహస్తమునుంచి, పొందవలసినది పొందితినని, దర్శింప వలసినది దర్శించితినని, చెప్పనగును. ఆనందపు బజారులో నెవరు దుకాణమును దెఱచిరో, వారికే విస్తారముగ లాభముదొరకెను. వర్తకముఁ జేసినకొలఁదిని కేవలలాభ మేకలిగెను ; నష్టము రాలేదు. ఇఁక నేదియు నన్ను భయమునందింపలేదు ; ఏదియు నన్నుఁ గట్టిపెట్టలేదు. ఏయాదాయవ్యయముల పట్టికఁ దెఱచిచూచినను, అయిదురూపాయలతో నారంభమును, అయిదులక్షలరూపాయలలాభమును గనఁబడును. పూరిగుడిసెలో దుకాణము పెట్టికొనినవాని కమితధనము. ఎవరివిషయమున నీశ్వరుఁడు, జన్మింపఁగనే అవినశ్వరాక్షరములతో “ జయలాభ ” మని వ్రాసెనో, అతని జయలాభము నెవరాఁపివేయఁగలరు ? “ వీండ్రు జయులగుదురు ; వీరు ధూళిముష్టినిఁ బట్టుదురు ; అది స్వర్ణముష్టియగు ” నని ఈశ్వరుఁడు నుడివెను. హరినామోచ్చారణపూర్వకముగాఁ జేసినదానివలననే పృథివికి మంగళమగును. స్వార్థపరుఁడనై కార్యములను సాధింపలేదు ; రెండురూకలలోభమునుచే నుపార్జించుటకై రాలేదు ; దేశముయొక్క దుఃఖముచే దుఃఖితుఁడనై వచ్చితిని. “ వర మడిగిపుచ్చుకొ ” మ్మని యీశ్వరుఁ డారంభముననే చెప్పెను. భక్తుఁ డేవరమునడిగెను ? జయినగునట్లు వరమిమ్మనెను. “ భక్తునకు జయము నిస్సంశయ ” మని వెంటనే యీశ్వరుఁడు స్వహస్తముతో

వ్రాసియిచ్చెను. భక్తితోఁ జేసినదెల్ల జయమగునని యిప్పుడు కనుచున్నాను. ఈవిషయమునే నిపుడు గణించుటకు వీలులేనన్ని ప్రమాణములు దొరకుచున్నవి. ఓశత్రుగణములారా! భారతవర్షీయ బ్రాహ్మమందిర విషయములోను, భారతవర్షీయబ్రాహ్మసమాజ సంబంధములోను, నవవిధానవిషయములోను, ఆరంభింపఁబడిన కార్యములలో నేది పూర్ణమును సఫలమును గాలేదో చెప్పుఁడు! దేశమందు హరినామముయొక్క కోలాహలధ్వని మ్రోసాగెను. ఎట్టి మార్పో, చూడుఁడి! ఏదేశములో మద్యపానము ప్రబలమగుచుండెనో ఆదేశము గౌరాంగునియొక్క మధుమయమైన హరినామమున నున్మత్తమయ్యెను. దేశీయు లింగ్లీషువిద్యను నేర్చికొని, మృదంగమును వాయించుకొనుచు, నక్కలవలెఁ గీర్తనముఁ జేయుచుఁ దిరుగుదురని ఎవరెఱిఁగియుండిరి! అవిశ్వాసము, నాస్తికత్వము పొడసూపుచుండెను; అవిశ్వాసభావ మడవివలెఁ బెరుఁగుచుండెను; ఇట్టిసమయమున వంగదేశముయొక్క యువజనులు నిమీలితనేత్రులై, "ఇదిగో! బ్రహ్మదొరకె; ఇదిగో! బ్రహ్మదొరకె; ఇదిగో! సర్వేశ్వరుఁడును, మహేశ్వరుఁడును నైనహృదయేశ్వరునిఁ బట్టికొంటి"మనుచు నందురని ఎవరెఱుఁగుదురు? ఈసకలము నిపుడు స్వచక్షువులతోఁ జూచితిని; ఇతరులకుఁ జూపించితిని. ఇపుడు శాక్తవైష్ణవులలో మిలనమయ్యెను. కాళీకృష్ణు లేకాసనమున నాసీనులైరి. భక్తుఁడు కాళియందుఁగృష్ణుని, కృష్ణునందుఁ గాళినిఁ జూచుచున్నాఁడు. శక్తికి భక్తిభావమునను, భక్తికి శక్తిభావమునను బూజజరగుచున్నది. వంగదేశమున శాక్తభక్తులును, భక్తశాక్తులును, ఒకటియగుచున్నారు. శాక్తునిమందిరమును, భక్తునిమందిరమును, రెండు నొకటిగఁ గలసిపోయి యీమాఱు సువర్ణమందిరమగును. జననికిఁ జూపఁబడుభక్తియే హరికినిఁ

జూపఁబడినది ; హరిభక్తులు హరికి నేభక్తి నర్పించువారలో, జనులకు నాభక్తినే యర్పింపమొదలుపెట్టిరి. ఈశ్వరేచ్ఛచే నవవిధానమున రెండు నేకమయ్యెను. పంచవింశతివత్సరములయొక్క పరిశ్రమ సఫలమగుచున్నది. దేశమందు జాతిభేదము మొదలగునట్టి యెన్నికుసంస్కారముల ప్రభావము చెల్లుచుండెను! అందుకొఱకై యీమనస్సెంతయేడ్చెను. "గౌరాంగుఁడెక్కడ! శ్రీచైతన్యుని జాతినిర్విశేషప్రేమ యెక్కడ?" అనుచుఁ బ్రాణ మెంతయేడ్చెను? ఒక్కొక్క కన్నీటిబిందువు పడినట్లుగనే, లక్షలక్షయకరముల భూమి పండసాగెను. ఇదంతయు సిద్ధించినది నిజగుణమువలనఁగాదు ; హరిపదములను బట్టుకొనుటవలననే సర్వము నయ్యెను. ఒక్క పిడికెఁడుదుమ్మును చేతఁబట్టిన నది పిడికెఁడుసువర్ణ మగునని తిరిగిచెప్పుచున్నాను. హరినామము విద్వాంసులమధ్యను నాగరికులమధ్యను బ్రవేశించినది ; వంగదేశపుయువజనులలోనికి మునులును, ఋషులును వచ్చి ప్రవేశించుచున్నారు. మే మెంతప్రార్థనఁజేసియుంటిమి! అట్లు ప్రార్థించుటచేతనే, అట్లు భిక్షమెత్తుటచేతనే, హరి యిదంతయు నొనగూర్చెను. ఇందుచేతనే మాకు రొక్కరొక్కముగా లాభమువచ్చుచున్నదని చెప్పుచున్నాను. దేశమున కెద్దియో సేవచేయవలసియున్నది. అపుడు పదివేలమంది కార్యమునుబూనిరేని, చివరకు నసలు చెడుననియెంచి వెంటనే భక్తదళ మల్పమై పుష్టిఁజెందునట్లు చూచితిని. నానాదిక్కులను నాకు శుభమే కాన్పించుచున్నది. హరినామ మెట్లల్లుకొనిపోయినది! ఇరువదియైదువత్సరములలో దేశముయొక్క వైఖరి భిన్నలక్షణమును దాల్చినది. ఇపుడు శత్రుసంఖ్య వృద్ధియైనను, విరోధానలము ప్రజ్వలితమైనను, విపత్తులువచ్చి మమ్ములను ముంచివేయ

యత్నించినను, భయములేదు. ఏలయన మేము జయులమగుటకే జన్మించితిమిగదా! ఏయుద్ధమందు హారిలేదు? ఏయేమహా యుద్ధములలోనికి దిగితిమో, ఎన్ని ప్రతికూలానుకూలావస్థలలోఁ బడితిమో, సర్వత్ర జయమయ్యెను. ఈశ్వరుఁడు తనచేతితో మమ్ములను స్పర్శించెను; అందుచే మేము దుర్జయులమైతిమి. ఆయనప్రేమయొక్క నిదర్శనము లనేకములు చూచితిమి! మా నలుదిక్కుల నొకవంద రెండువందలకీర్తిస్తంభములు స్థాపితములయ్యెను. "ఎంత పరిశ్రమఁజేసితిరి! మీశ్రమ కొకటికిఁ బదింతలుగా ఫలము నిచ్చితి" ననుచు హరి యుత్సహింపఁజేయును. ఇట్లుగాకున్న సాగునా? లాభమును చేతులతో దోచుకొనుచున్నాము! మేమను దినమును సంపాదించుకొని తిందుము. లేదేని ప్రాణపతిమాటలు రుచింపవు. అనుదినమును లభింపదేని మేము నిలిచియుండలేమని యెఱిఁగియుండియే, ఈశ్వరుఁ డీయేర్పాటుఁజేసెను. ఇపు డింతకుఁబదింతలుగాఁ బరిశ్రమఫలమును బొందితిని. వార్ధక్యములోఁ దిరిగి బాలకుఁడ నగుదునని తోఁచుచున్నది; తిరిగి మహాపరిశ్రమఁజేసి వంగదేశమును గంపింపఁజేయఁ గోరికయగుచున్నది. కోటిబాలురువచ్చి దేహమధ్యమునఁ బ్రవేశించుచున్నట్లున్నది. యావనకాలము తిరిగివచ్చి నేత్రముల నగ్నిమయోత్సాహములో, జ్వలమానాగ్నిసమముఁ జేయుచున్నది. ఈశ్వరకైంకర్యములో జీవనమును సమర్పింపకుందునా? కడుదుఃఖితుఁడనైతిని; ఉత్పీడితుఁడనైతిని; అనేకులచేఁ బదమర్దితుఁడనైతిని; అయినను నాకేమియుఁ గొఱంత కలుగలేదనే నేననుకొందును. హరిధన్యుఁడు, హరిధన్యుఁడు, హరిధన్యుఁడు; నాకుఁ గేవలము లాభమేకలుగుచున్నది. నే నే

కార్యములను జేసితినో, ఆకార్యములే వేలవేలజనులను బరమాత్మ దిక్కునకు నాకర్షించుచున్నవి. గృహమునందు గాఁగియున్నను బదివేలమందిజనులు "హరి, హరి" యనఁగఁగందును. ఓయి, హరీ! యెందుకొఱకై నేను దుఃఖించియుండలేదా? యంటిని. హరి వెంటనే కలకత్తాలో బృందావనమును జూపెను; ఆయమునను, ఆప్రేమ వ్యాపారములను జూపెను. ధనధాన్యములు దొరకలేదని నాకు దుఃఖమగుచున్నదియా? అగ్రహారములు లభ్యముకాలేదను మనస్తాపమున్నదా? నేను హరిదాసుఁడను; ప్రభువునకున్నది దాసునకునున్నది. బ్రహ్మాండము నాహస్తగతమైనది. నేనపజయము నొందుటకు జన్మించితినా? రసనయందు హరినామముచ్చరించు సామర్థ్య ముండెనేని, ఈరసన యెన్నడు నపజయమనుమాట నుచ్చరింపదు. అన్యవిషయములలో హీనుఁడనయినను, ధనము లేకుండినను, మానములేకుండినను, అధికసాధనభజనలు లేకుండినను, నామీఁదను, నాదశమీఁదను, హరినామముయొక్క బలమున్నది. ఇదిగో! శ్రీగౌరాంగుఁడు మాదశమునందు వచ్చి ప్రవేశించి నాట్యము చేయుచున్నాఁడు. సమస్తమును స్వచక్షువులతోఁ జూచితిని! విశ్వసింపకుందు వెట్లు? ఈభక్తుఁడు నష్టపడలేదు; దేనిమూలమునను నష్టపడలేదు; కేవలము జయలాభమునే పొందెను. ఇంకెట్టి సంవాదమును గోరుదువు? జయిస్నై మార్గమార్గమునను హరినామముయొక్క పతాకనెత్తితిని. అహంకారముచే నుబ్బిపోలేదు. హరినామముయొక్క బలిమిచే మీవంటి నావంటివారందఱు సమస్తమ్మును జేయఁగలరు. హరినామముయొక్క బలిమిచే మనము పృథివి నొక కుండపెంకువలె విసరి వైకుంఠమునఁ బారవేయుదము. మనము నరాధములమగుటచే నిప్పటికి నిట్టిదుర్దశ యున్నది; కాని,

తూడా దుర్దశలోఁ గూడఁ బనికిమాలినవస్తువులను జేతిలోఁబట్టికొని "హరి" యనఁగనే స్వర్ణముగాఁ జూచితిని. బయలుమీఁద గృహ నిర్మాణమయ్యెను. విరోధులయొక్క ప్రాణమధ్యమునను నవవిధానము ప్రవేశించుచున్నది. హిందూక్రిస్టియనులలో నన్యోన్యానురాగము కలుగుచున్నది. కృష్ణక్రిస్తులలో సమ్మేళనమగుచున్నది. యువ వృద్ధులుకలసి ప్రణయములో బద్ధులగుచున్నారు. సహస్రోన్నతి ద్వారములు తెఱవఁబడినవి. వంగవాసులార్యా! శీఘ్రముగ లేచిరండు! దక్షిణవాయువులు వీచుచున్నవి, లేచిరండు! భక్తిఘట్టమునకు రండు!! తెరచాప నెత్తుఁడు!!! నౌకను వదలుఁడు!!! ఒక్కపాపిష్టునిజీవన మింతకీర్తి నిస్థాపించెనేని, మీరలు, సహస్ర శ్రోత్రవరులు ఏకమైరేని, హరినామముయొక్క మహిమను ఎంత విస్తరింపఁజేయఁగలరు! దేశములో నెంతకీర్తి స్థాపనము చేయఁ గలుగుదురు! ఒక్కపాపి యింత చేయఁగలిగెను! మీరలు సహస్ర సాధువులు పరిశ్రమఁజేసి యింకను ననేకచిత్రములను జూపుఁడి! దేశము నీమెట్టుమీఁద నాఁపుటకు వీలులేదు. కల్యాణముయొక్క రథము, పుణ్యముయొక్క రథము వచ్చినది; నరనారులకు సంవాదమునిండు! మనమస్తకములను ఖండఖండములుగఁ జేయుట కెవరిసాధ్యము! ఈ సకలామరాత్మలమీఁద జేయివేయుట కెవరిసాధ్యము!! దుర్జయులరై యీ వంగదేశమును దీసికొనివెళ్ళి స్వర్గములోఁ బారవేయుఁడి!!!

ఓదీనశరణ్యా! భారతపరిత్రాణకర్తా!! మేమెట్టిసుఖమును పొందితిమి! సంసారము విఘ్నమయమని లోకులందురు; బీజమును వపనముచేసిన వానరాక, ఎండచే నెండిపోవునందురు. మేము దుఃఖపువాక్యములను చాలఁగవింటిమి. అష్టప్రహారములను

నీప్రసంగమునే చేయువారుగూడ, భయభయపుమాటలను జాలఁ వినిపించిరి. కాని, నీప్రసాదముచే 'మే మెన్నఁడైన, క్షతిగ్రస్తుల మగుదుమని కాని, ఓడిపోతిమని ఎవరిముందరనైన చెప్పుకొందుమని కాని యనుకొనలేదు. హరినామము యొక్క బలముండుటచేఁ ప్రాణమున్నను సరే, పోయినను సరే, యనుకొని యుద్ధమున దిగితిని. అభేద్యకవచమును ధరించుకొని, సైతానుతో యుద్ధము చేయువానికి శరణమెక్కడిది? అట్లేయయ్యోనేని వ్యాఘ్రము ధ్రువుని హతముచేయునదియేకదా! అట్లెన్నఁడును గాలేదు; అట్లెన్నఁడును అగుటకు వీలులేదు; అందుచే విపత్సమయములలో "హరి, హరి" యని ఎంతకొట్టుకొంటిని! తల్లీ! చూడుము! నేఁడు నేను జయిష్ణునై యెంతరాజ్యమునకు రాజునైతినో చూడుము! అస్పృశ్యుఁడని ఎవరు నన్ను బరిత్యజించువారలో వారలీదినము అతిథులైవచ్చిరి. తల్లీ! చూడుము! ఎవరు మనుష్యులమీఁద రాళ్ళురువ్వువారలో, కపాలమును భేదించి రక్తపాతమును జేయువారలో, వారు నేఁడు దాపునకువచ్చి, "ఎక్కడ మీజననిఎక్కడ? మేమామెను బూజింతుము. మేము నవవిధానమునకు విపక్షులమైయుంటిమి; కాని యిపుడు, ఈశ్వర తనయులయొక్కరక్తమును గనఁగంటిమి; ఈమాఱు మీజనని మన్నింతు"మని యనుచున్నారు. తల్లీ! మాకిఁక నేమియిచ్చినను, ఇయ్యకున్నను జయమునిచ్చితివి. జయపతాక లేచినది; జయవృష్టి గాయినది; ఇందులకని నీకు మేము ధన్యవాదముల నర్పింతుము. దుఃఖదుఃఖితులకు ఇంతసుఖమునిచ్చితివి! ఋణముమీఁద ధర్మమును నడపింప నగత్యము లేకపోయెను. నిర్జనకాననమందు అనిశ్చితజయమును లక్షించుచుఁ గాలయాపనముచేయు నవసరము రాలేదు. ఎంతమంది

జనులు జయమునకై అనిశ్చయో మార్గమునందుఁ బ్రతీక్షించుచున్నారు! మేమా మార్గమును బట్టికొనిపోవలసిరాలేదు; అందుచే మాకుఁ గడు నాహ్లాదమగుచున్నది. మేము పృథివిమీఁదనే వైకుంఠమును జూచితిమి. సమ్ముఖమునందును, బాహ్యమందును వైకుంఠధామమే వంగదేశ మూఁగులాడుచున్నది; హరినామము యొక్క ప్రభావ ముండినది కాదు; మృదంగసహకారముతో హరినామము గీర్తింపఁ బడెను. ఎవరు బాగుగ నృత్యము చేయఁగలమా యని యిపుడు యువ వృద్ధులలోఁ బోరాటమగుచున్నది. ఎవరి హరిభక్తి యెక్కువదని వంగదేశీయులు కోలాహలము చేయుచున్నారు. హరీ! ఎట్టి విచిత్రములను జూచితిని! ఇంకెట్టి విచిత్రములను జూచుచున్నాను! మేము నిన్నుఁ బూజించి కడులాభము నందితిమి! ఈధనము యొక్క గుణమును ఒక్కనోరు వర్ణింపలేదు. వైకుంఠములో నేమి లభ్యమగునో అది తరువాత మాట; ఈదినము లభ్యమైనదానికే పరమానందము. హరిపాదపద్మములు చేతఁజిక్కినవి. ఈ దేశములో నిపుడు కడు సంశోధనయగుచున్నది. ఎన్ని కక్షప్రతికక్షులు ఎగిరిపోవుచున్నవో, జాతిభేదములు, మతోపశాఖల భేదములు, కాలభేదములు, ఎట్లు నాశనమగుచున్నవో, ఎవరు చెప్పఁగలరు? హరీ! విశ్వాసము యొక్క యాలోకమును బంపుము; లోహమయ భారతము సువర్ణభారతమగును; కలియుగ భారతము సత్యయుగ భారతమగును. పూర్ణచంద్రుని యొక్క యాలోకము భారతముపైఁ బడెను; ఆహా! భారతమాతకు దుఃఖ నివృత్తి యయ్యెఁగదా! మాతృభూమి ధన్యమయ్యెను. కృపాసింధూ! అపజయము నొందమని నమ్మి, ప్రాణముమీఁద మోహమును విడిచి, యుత్సాహముతో నీనవవిధానమును సర్వత్ర ప్రచారము చేయున ట్లాశీర్వదింపుము! దయామయీ! జననీ!! కృపఁజేసి నీసంతానమున కీదిన మీయాశీర్వాదము నిమ్ము!!!

ద్వాదశాధ్యాయము.

వియోగము: సంయోగము.

భానువారము ౩౦ ఆశ్వయుజము ౧౮౦౪ శకము.

మనస్సు పూర్ణవస్తువును ఖండఖండములను చేయును. ఆమనస్సే యాఖండఖండములను దిరిగి దగ్గఱఁజేర్చి సంయోజితము జేయును. ఆధ్యాత్మికవిషయములలోను, వియోగ సంయోగములు సర్వదా తటస్థించుచునే యున్నవి. జడ జగత్తుయొక్క వస్తువులన్నియు వియుక్తములై పరమాణువులక్రింద మాఱిపోయి, తిరిగి యాపరమాణువులన్నియు సంయుక్తములై పూర్వపువస్తు వేర్పడునట్లుగనే, మనస్సును ధర్మరాజ్యములోఁ గూర్చుండి సర్వదా వియోగసంయోగ క్రియల సంపాదించుచున్నది. కొందఱమనస్సులలో నీవియోగ భావము ప్రబలము; మఱికొందఱిమనస్సులలో సంయోగస్పృహ యెక్కువ. కేవలమొక్కవస్తువును మనమున ఖండఖండముఁ జేయుట, ఒక్కభావమును ఖండఖండముగ భావించి వాని నధ్యయనముఁ జేయుట, ఒక్కవస్తువుయొక్క గుణములను ఒక్కొక్కటిగ భావించుట, కొందఱయభ్యాసము. మఱికొందఱు వియోగముదిక్కునకే తొంగి చూడనిచ్ఛగింపరు; అఖండవస్తువును దర్శింపఁదలఁతురు. "ఒక్కొక్క గుణమును ఇంకెంత సేపని భావింపను, పూర్ణవస్తువు నింకెంతని విచ్ఛిన్నము చేసిచేసి చూడను;" అనునభిప్రాయమును గొందఱు కొందఱమనములందుఁ బ్రబలముగ గాననగును. నాస్వభావములో రెంటిని 'సామంజస్యముగానుంపు యత్నములు జరుగుచున్నవి. ఏదో యొకప్పు డీరెండుభావములయొక్క సామంజస్య మైపోయినదని చెప్పుటకు వీలులేదు. సామాన్యమానవులవలెనే నేనును ప్రథమమున

వ్యాంశిక దర్శనపక్షపాతినై యుంటిని. ప్రతివిషయమును సూక్ష్మరూపమున విచ్ఛిన్నముగా దర్శించుటకే యత్నించువాఁడను. ఒక్కొక్కటిగాఁ జాతమనునిచ్ఛయే ప్రబలమైయుండెను. పాపమెట్లుపోవునాయనియే ప్రథమమునఁ దలపోయువాఁడను; మనస్సెట్లు కుప్రవృత్తులలోనికి దిగకుండునాయనియే చింతించువాఁడను. పరసేవఁ జేయుచు జన్మ మెట్లుసార్థకము చేసికొందునాయను నీభావమే కొన్నిమాసములవఱకు స్థాయిరైయుండునది. స్వార్థపరత్వ మెట్లుపోవునా, దయలోమునిఁగి యెట్లుందునా యనునీచింత యొకొక్కప్పుడు ప్రబలమైయుండునది. ఒకప్పుడు చదువుమీఁద నానక్తికలుగునది, మఱియొకప్పుడు విరక్తి పుట్టునది. ఒకప్పుడు పుస్తకములు లేనియెడలఁ దృప్తికలుగునదికాదు, మఱియొకప్పుడు పుస్తకములు బాగుండునవిగావు. రెండుభావములును మనస్సునందుండెను; కాని యొకటితరువాత నొకటిచొప్పున సాధనఁజేసితిని. ఒకప్పుడు వైరాగ్యమును, మఱియొకప్పుడు పుణ్యమును ఇంకొకప్పుడు ప్రేమను ఒకొక్కటిగా సాధనఁజేసితిని. ఈశ్వరుని యొకొక్కస్వరూపములలోఁ బ్రథమమున న్యాయభావమే హృదయమందుఁ బ్రబలమైప్రకాశించుచుండెను. బాహ్యమందుండు న్యాయభావమును జూచినమీఁద నంతరంగమునందుండిన యన్యాయ భావమునకై గడుతీవ్రముగ ననుశోచన కలుగనారంభించెను. అనేకదినములకుఁ బిమ్మట న్యాయమునకు మాఱుగా దయాభావమును, అనుతాపమునకుఁ బరివర్తనముగా భక్తిప్రేమభావములును సంచరించెను. యావత్స్వరూపమును ఏకత్రగ్రహించుటకు ఆసక్తి యుండినదిగాదు; ఎప్పుడేదిప్రయోజనమగునో, అప్పుడు దానినిఁ జేయుటకయియే యత్నించువాఁడను. వియోగస్పృహలోనే దినములు గడచుచుండెను; ఏకాంచెమూవశ్యకమో ఆకాంచెమును

జేయుటకే యిచ్ఛయుండెను. అఖండముమీఁద అనురాగము కలుగు నదిగాదు; అఖండమును పట్టుకొనలేనగియు, పట్టినను అంతలాభము లేదనియుఁ దోఁచునది. సమ్ముఖమున నౌషధాలయమును జూచితిని గాని సమగ్రశోభమీఁద దృష్టిలేకుండెను. రోగి కేయౌషధము ప్రయోజనమో తన్నిమిత్తమయే హస్తము ప్రసారితమగును. నవవిధానభావ మావిర్భవింపకుంటచే సౌందర్యజ్ఞాన మంకురింపలేదు. రోగమును ముందుశాంతింపఁజేసికొని పక్షపాతినై నదిలేనిది తరువాతఁ జూచుకొందమనియే లోలోపల ననుకొనువాఁడను. భయానకరోగమును; అత్యంతాభావమును కలదు; కావున వియోగస్పృహ హృదయమునఁ బ్రాబల్యముతో నుదయించెను. ఒకొక్కయభావము విముక్తమైన కొలఁదిని ప్రకృతియొక్కయాశ్చర్యకౌశలమును గనఁగంటిని. ప్రకృతియొక్క క్రియాకలాపములు గద్యరూపమున వ్రాయఁ బడుచున్నను, తరువాతఁ దన్మధ్యమునఁ బద్యములనేకముఁ జూచితిని. ప్రకృతియొక్క కౌశలము ఒకదానితరువాతనొకటిని దెచ్చి నిర్ధారితనియమానుసారముగా నానకలమును సంయోగించుచుండఁ గంటిని. మందారముయొక్క యవసరము కలిగినపుడు, భక్తితో మందారమును గ్రహించితిని. తులసి యావశ్యకమైనపుడు భక్తితోఁ దులసిని గ్రహించితిని. తరువాతఁ జూడ నెవరో సమస్తమును సంయోగించి పుష్పమాలగ గుచ్చుచుండెను నవవిధానమందు సమస్తమును దండగఁ గుచ్చుదమనునిచ్ఛ మొదటఁ గలుగలేదు; కాని ప్రకృతిమధ్యమున నెవఁడో యదియ చేయుచుండెను. క్రీస్తుని మన్నింపవలయునని ఎవరెఱుఁగుదురు? శ్రీగౌరాంగుని నాదరింపకుండిన నాకు జరుగుటలేదని యెప్పుడు గ్రహించితినో, అప్పుడే నవద్వీపమునకు వెళ్ళితిని; నవద్వీపమునుండి శ్రీగౌరాంగునిఁ

దోఁచితెచ్చి హృదయమునందుంచుకొంటిని. బుద్ధునియొక్క యావశ్యకత కలుగఁగనే, వృక్షతలమునుండి బుద్ధుని ప్రాణ మధ్యమునకుఁ దోడ్తెచ్చితిని. ముగ్గుర నొక్కచోటికిఁ దేవలయునని ఎవరెఱిఁగియుండిరి? భగవానుఁ డీవిధమున నొక్కొక్కనినిఁ దెచ్చి భక్తమండలిని గూర్చునని యెవరెఱుఁగుదురు? లోలోపల నిట్టి కౌశలము నెవరో యవలంబించుచున్నారని నేనెఱిఁగియుండలేదు. సమయముయొక్క గత్యనుసారముగను, అంతరముయొక్క రుచ్యనుసారముగను, ఎప్పుడేది ప్రయోజనమని తోఁచునదో దానినెల్ల ఖండముగ గ్రహించువాఁడను. కాని హృదయములోపల సంయోగ వియోగములు సామంజస్యము కాఁగలుగుమూల ముండెను. ఏ భాగములోను మనస్సు విశేషకాల మాబద్ధమై యుండవీలులేదు. నేఁటివఱకు నీతలంపే ప్రబలముగానున్నది. ఏదోయొక్కగుణములో నధిక కాలము బద్ధుఁడనై యుండలేనైతిని. పాపనాశమునకుఁగాను న్యాయచింతనుఁ జేసితిని; కాని యిట్లేయున్న సాంశిక సాధనయగునని కొన్నిదినములతరువాత గ్రహించితిని. వెంటనే ప్రేమచింతలోనికిఁ బ్రవృత్తుఁడనైతిని. సదా ప్రేమనే భావనఁ జేసితిని; రాత్రిందివములు సహాస్యవదనముతో నుంటిని. "అంతపరుగిడుట మంచిదికాదు; ఈమాఱు విపరీతదిక్కునకుఁ జాలదూరము వెళ్ళుటయైనది." అని మనస్సుతిరిగివచించెను. తిరిగి న్యాయపుదిక్కునకు వెళ్ళితిని. ఆనొక ఒక్కవైపుస్రోతస్సుమీఁదనే పరుగిడిపోవుచున్నదని చూచినవెంటనే తిరిగి లాగిపట్టితిని; ఈవిధముగా హృదయమును బ్రకృతిస్థముఁ జేయుటకు సర్వదా యత్నించుచున్నాను. ఎంతోసేపు చదివితిని; అందుమీఁద మనస్సు బుద్ధిచేతిలోఁబడి చావనున్నదని యెప్పుడు గ్రహించితినో, ఆవెంటనే బాలకభావ మేమూలమునఁ

గలుగునాయని, సరళత్వ మెట్లుసిద్ధించునాయని, నితాంతముఁ బ్రియత్నము చేయనారంభించితిని. ఒకవైపున విపత్తునుఁజూడఁగనే రెండవవైపునకుఁ బరుగెత్తుదును. కేవలము సామంజస్యముయొక్క చేష్టయే క్రమాగతముగ జరుగుచున్నది. నావిషయమున నెట్లో యితరులవిషయముననను నట్లే. బాహ్యమండలిలోఁ బరిశ్రమమును, కర్మోత్సాహమును, అధికమగుచున్నదని చూచితినేని, దీనినుండి వీరిమనస్సులను, ద్రిప్పి యాధ్యాత్మిక భావములోనికిఁ దీసికొని వెళ్ళుటుచితమని తోఁచును. నాలుగువారములలోఁ గర్మశీలురు, ధ్యానశీలురుకాఁగఁ జూతును. కర్మమునుండి నివృత్తులై ధ్యానముయొక్క గభీరానందమును, బ్రహ్మానందమును, ఉపభోగించుచుండఁగందును. తిరిగి ధ్యానము చేయఁబోయి యెవరును బరసేవ చేయుట లేదని చూచితినేని వెంటనే వివేకము నామంత్రితము చేసితెచ్చి ధర్మమండలిలో స్థాపింతును. అన్యునిమనస్సు నామనస్సువంటిదే కాన, ఒక భావమునుండి తద్విపరీత భావమునకుఁ బోవుచుందుము. దినము లిట్లేగడచినమాట వాస్తవమే; కాని సామంజస్యపుదిక్కునకే పోవుచున్నాము; నవవిధానమున్నదిక్కునకే పోవుచున్నాము. ఆంశికధర్మమును వదలి హృదయమిపుడు పూర్ణత్వమున్నదిక్కునకే వెళ్లిపోయినది. ఇపుడిఁకను, ఆంశికోన్నతిని సాధన చేయలేను. స్వదేశమందు, మాతృభూమియొక్క కల్యాణార్థమై, ఈశ్వరుఁడు ఏనవవిధానమునిచ్చెనో, దానియర్థము కేవలము పూర్ణత్వమే. ఈపూర్ణత్వము మనోమధ్యముననుండెను. క్రీస్తుమహర్షి యీశ్వరునివలె పూర్ణము కమ్మని చెప్పెను. బహుదినములనుండి యీయుపదేశము మనస్సునందు స్వర్ణాక్షరములతో వ్రాయఁబడియుండెను. ఖండఖండభావములను బట్టుకొనియుండఁగూడ దనుకొనువాఁడను. ఈశ్వరునిగుణములు

ఘూర్ణములు; ఆయనదయ పదునాల్గువీసములు. నాకట్లు లేదు. ఆయనకు వైరాగ్యమెట్లో యానందమునట్లే. నాకు వైరాగ్యములభ్యమైన నానందము తగ్గును. ఆనందములో మగ్నమైన వైరాగ్యము తగ్గును. నేను బ్రహ్మను స్థలమందు దర్శింపఁగలిగినంతగా, జలమందు దర్శింపలేకపోవచ్చును. నేనొక్కఖండమందు నీశ్వరుని దర్శింతును గాని, రెండవఖండమందుఁ గనలేను; పుణ్యాత్ములలో నాయనను దర్శింపఁగలుగుదును; గాని పాపాత్ములలో దర్శింపలేను. పాపియైనవాఁడును నీశ్వరతనయుఁడే, పుణ్యవంతుఁడును నీశ్వరతనయుఁడే. నేను పాపిముఖములో నీశ్వరుని దర్శింపలేను. నేను క్రీస్తుయొక్క యీశ్వరునిముట్టుకుఁ జూచి, బుద్ధునియొక్క యీశ్వరునిఁ జూడకుందువా? నీవు కావలెనని యొకనినుండనిచ్చి, మఱియొకనిని గృహమునుండి నడువనడతువా? శ్రీగౌరాంగునియొక్క ప్రేమ నీహృదయము నానందింపఁజేయుననియు, క్రీస్తుయొక్క వివేకము నిన్ను సౌఖ్యవంతునిఁ జేయలేదనియు నీవనుకొనుచుంటివా? నీవు హృదయమునందు గుప్తపాపమును దాఁతువు కాఁబోలును? అందులకనియే కాఁబోలును క్రీస్తును సాగనంపుదువు? కేవలము శ్రీగౌరాంగునినే మహోన్నతునిఁ జేయుచున్నావు. పాపమును జూడ నిచ్ఛలేదా? ఆత్మవిస్మృతుఁడవై కృత్రిమసుఖమును గోరుచున్నావు; అందులకనియేనా నీకిట్టిభావము? ఆంశములో నింక మనస్సు తృప్తి పొందలేదు. ఒకరిని బాగుగఁ బ్రేమించి, మఱియొకరిని తక్కువగఁ బ్రేమించిన నాయన యేమనుకొనునోయని తోఁచును. బుద్ధుని నాదరించి శ్రీగౌరాంగునే హృదయమునఁ బెట్టుకొనుటచే బుద్ధుఁ డెంతయనుకొనుచున్నాఁడు? గౌరాంగు నాదరించి క్రీస్తుని దూరదూరము చేసితినా? నేను బంగాళీహిందువును; అందుచేఁ

గాంబోలును గౌరాంగునిఁ బ్రేమించుచున్నాను! క్రీస్తు పరదేశీయుఁడు; అందుచేతఁ గాంబోలును ప్రేమింపను! ప్రాచీనఋషులు వ్యాఘ్ర చర్మముమీఁదఁ గూర్చుండెడివారు; కాషాయవస్త్రములను ధరించువారు; చివరకు వారిని ద్వేషముతోఁ జూతునే మోయని వెంటనే ఋషులగృహములకు వెళ్లితిని. వ్యాఘ్రచర్మమును స్వీకరించితిని, గైరికవస్త్రమును ధరించితిని. ఋషిగణములారా! ఆశ్రమవాసులారా! నవనాగరికతయొక్క గౌరవార్థమై వేషభాషలను బూనఁజాలను. ఏకోనవింశతిశతాబ్దములో మిమ్ములను ప్రేమింతును; రండు! మిమ్ముల నాదరింతును. ఇట్లనుచు ఋషుల నాదరించి సన్మానించితిని. ఒక్క సాధువును స్వీకరించినతోడనే, ఇంకొక సాధువు దగ్గఱకుఁ జేరును. భగవంతుఁడు హృదయమధ్యమందలి నారదునకు శిక్షఁ గఱపెను. ఒకనిని నిమంత్రణము చేసినతోడనే, ఒక్క సత్యము నాహ్వానము చేసినతోడనే, నారదుఁడు వెంటనే వెళ్ళి తిరిగితిరిగి, సమస్త సాధువులను సమస్తసత్యములను పిల్చివచ్చును. నేనొక్కనిని నిమంత్రణము చేసి, ఒక్కటిని గ్రహింతు ననుకొందును గాని నారదుఁ డట్లు చేయనియ్యఁడు. ఒకదానినిఁ దేఁబోఁగానే యన్నిటినిఁ దేవలయును. మోశాక్రీస్తులు ఒండొరుల హస్తములను బట్టుకొని నృత్యము చేయుచున్నారు. దీనినిఁ జూచిరే నవబ్రాహ్మధర్మమును, నవవిధాననామముచే నాఖ్యాతముఁ జేసితిని. అన్యులు ఆంశికభావమునుంచుకొనినను నుంచుకొనవచ్చును గాని, నవవిధానములో నట్లు జరుగుట కెన్నఁడును వీలు లేదు. ఒక్కొకటి పుచ్చుకొనిన నపరాధముగునని నాజీవనములో నెపుడు చూచితినో, అపుడే నూతననామముతో బ్రాహ్మధర్మము నాఖ్యానము చేయుట ఆవశ్యకము. వయసు ముదిరెను; పూర్వోపార్జితాంశిక

భావములను గుచ్ఛవలెఁగట్టితిని. పువ్వులకుచ్ఛవలె సాధువులు మిళితమైరి. సత్యములన్నియుఁ గుచ్ఛగఁగట్టఁబడినవి. ఒకొక్కనాఁడు ఋషులేతెంచిరి; ఇంకొకనాఁడు పంజాబుదేశపు నానకువచ్చెను; మఱియొకనాఁడు అయోధ్యదేశపుఁగబీరువచ్చెను. క్రమక్రమముగ నందఱురాసాగిరి; క్రీస్తు, గౌరాంగుఁడు, అందఱును వచ్చిరి. ఎవ్వఁడు లోపలఁ గార్యములను జేయుచుండెనో, ఆయన "అందఱను గూర్చుండుఁ"డనెను. ఒకప్పుడనుతాపము, మఱియొకప్పుడు సదనుష్ఠానము, ఒకప్పుడువైరాగ్యము మఱియొకప్పుడు ఆనందము, ఒకప్పుడువృద్ధభావము, మఱియొకప్పుడు బాల్యభావము, ఒకొక్కపుడు యువజనునియుత్సాహము, ఒకొక్కటిగా సమస్తమును రాసాగెను. ఎవ్వాఁడు జీవనముయొక్క మూలమందుండెనో, ఆయన సకలరత్నములనుదీసికొని, మాలగఁజేసి మెడయందువేసెను. ఒకప్పు డిహలోకముయొక్క సౌందర్యమును మఱియొకప్పుడు పరలోకముయొక్కసౌందర్యమును వేంచేసెను. ఇహలోకపరలోకములు, ఒక్కటయ్యెను. ఇంటఁగూర్చుండి స్వర్గసుఖమును అందుకొంటిని! రెండు వాద్యయంత్రములు మ్రోగుచుండెను; ఒకటితరువాతనొకటివచ్చి ఇక్కడ సముదయమును మిలనమయ్యెను. నానాయంత్రములును మిలనమై యొక్క యంత్రమయ్యెను. విభిన్నవాద్యయంత్రములయొక్కస్వరము మిళనమై ఒక్కసుమిష్టస్వర ముత్పన్నమయ్యెను. ఇపుడు పూర్ణత్వము కావలెను. పూర్ణత్వముదిక్కునకే ఇపుడు వెళ్ళుచున్నాను; క్రమముగఁ బోవుచున్నాను. బంధుమిత్రు లెవరు.. పరమాత్మ నిచ్చగింతురో, వారు మార్గమధ్యమున నాఁగిపోయిరి. సౌభాగ్యవంతుఁడగునీవ్యక్తి ఎప్పుడును నాఁగలేదు ; క్రమముగఁ బోవుచునే

యున్నాఁడు. "పాంథుఁ" డను నామమిడి భగవానుఁడు నన్నుఁ బృథివిమీఁదికిఁ బంపెను; పాంథశాల దొరకదని చెప్పియే పంపించెను; అందుచేఁ గ్రమముగ సాగియేపోవుచున్నాను. వర్షాకాలమునఁ బరుగిడితిని; శీతకాలమునఁ బరుగిడితిని; ఋతువులను లెక్కచేయ లేదు. బాల్యమునఁ బరుగిడితిని; యౌవనమునఁ బరుగిడితిని; మృత్యువుతరువాతను బరుగిడవలెను. నవవిధానము పూర్ణత చెందనేచెందును. ఈపథికునితో నెవరు సాగివచ్చెదరో, వారు సిద్ధముగనుండుదురుగాక! ఇప్పటికిని అభావములు చాలనున్నవి. మిత్రబాంధవులారా! ఈశ్వరుని యొక్క పూర్ణత్వమును లక్షించి సాగిపోవలెను! అంశమును చేతఁబట్టుకొని ఇఁక నీశ్వరావమానమును జేయకుఁడి!! నవవిధానము యొక్క వక్షము నిఁక విదారితముఁ జేయకుఁడీ!!!

ఓదీనబంధూ! ఓయిపూర్ణబ్రహ్మమా! మేమేవిధమున ధర్మమును అంశములక్రింద ఖండఖండములుగఁ జేసితిమో, సమస్త పృథివియు నట్టిదోషమును ఎల్లకాలమును జేయుచున్నది. విభిన్న సంప్రదాయములు భిన్నభిన్న భావములను సాధనచేసెను; అందుచేతనే యింతవిరోధము. హిందూసమాజమున నున్నపుడు, అవిశ్వాస మధ్యమున నున్నపుడు, మేమును కేవలాంశిక సాధననే చేయుచుంటిమి. ఒక్కొక్కటిచొప్పన సకలమును గ్రహించి పూర్ణతఁ జెందవలెనని యిపుడు గ్రహించితిమి నవవిధానము మనోమధ్యమున నావిష్కృతమైనప్పటినుండియు, "ఆహా! క్రీస్తునిస్వీకరించి ప్రాణబంధువైన గౌరాంగుని నడువనడచితినా! భక్తిదుఃఖించుచున్నటు లున్నది; న్యాయము యొక్క పక్షపాతినిఁ గాఁబోయి భక్తి నడిచితిని గాఁబోలు! ఒకసోదరుని హృదయమునకు రాజును జేసి,

మఱియొకసోదరుని బహిష్కరించితినా? ఒకసోదరికి స్వర్ణాలంకారములిచ్చి మఱియొకసోదరిని దూరీకరించితినా? ఇఁక నట్లుచేయఁజాలను!" అనియే కేవలమనిపించును. అందఱి ననాదరణచేసి క్రీస్తునాదరించినయెడల నింటిలోనికిఁ బ్రవేశింపఁగనే దుఃఖము కలుగును; క్రీస్తును దుఃఖించును. తక్కినబంధువులందఱు హృదయమునుండి నిర్వాసితులగునంతగా నొక్క క్రీస్తు నాదరించితినా? ఓయి పూర్ణబ్రహ్మమా! నీరాజ్యమున నుదారస్వేచ్ఛ! నీతనయు లొండొరుల భుజములమీఁదఁ జేతులనైచికొని యుండఁగోరుదురు. నీన్యాయముతో నీప్రేమ నృత్యముఁజేయును. నీయనన్తగుణములు మిళితమై యొక్కగుణమగును. పలురంగులును గలసిపోవును. ఏడురంగులునుగలసి యొకరంగు కాఁజూచితిని. నవవిధానముయొక్క శోభ యెంత యాశ్చర్యకరము! నేను పూర్ణబ్రహ్మరూపమును దర్శింపఁగలుగునట్లును, బ్రహ్మయొక్క పూర్ణపరివారమును వీక్షింపఁ గలుగునట్లును, పూర్ణసౌందర్యమును గాంచఁగలుగునట్లును, నన్నాశీర్వదింపుము! అట్లయినంతనే సకలభేదములును సమసిపోవును. నలుదిక్కులందలి లోకులవ్యవహారములను జూచి కడుదుఃఖమగు చున్నది. కొందఱు కేవలము పాపమును జేయుదురు; మఱికొందఱు కేవలము సుఖమునే వెదకుదురు. కొందఱు క్రీస్తును స్వీకరించి గృహమందే యాసీనులైయుందురు; మఱికొందఱు గౌరాంగునితో నున్మత్తులగుదురు. కొందఱు కర్మశీలురై తక్కినసమస్తమును బరిత్యజించిరి; మఱికొందఱు వివేకమును మాత్రమే గ్రహించి యూరకుండిరి. ఇఁక ఖండగుణములను జూడనీకుము. చూచుటకే యత్నించితిమేని, ఈమాఱు అఖండమును జూడఁగల్గునట్లు చేయుము. అఖండభావమును దర్శింపఁగనే అందఱియొక్క భక్తిభావమును బుణ్యా

భావమును ఉప్పొంగిపోఁగాక! నచ్చుదయసాధుమండలిని దర్శించి మనఃప్రాణము లానందితములగుఁగాక! ఒకటిని, రెంటిని, మూఁటినిఁ జూచి తృప్తిఁ జెందియుండలేను. నవవిధానము నిచ్చితివి; నేనిప్పుడు పూర్ణుఁడ నగుదును గాకని, ఎవరు నవవిధానమును విశ్వసింతురో వారు పూర్ణులు కానిచ్చగింతురుగాకని కోరుదును. ఇంక నంశమును జూడనిచ్ఛలేదు; ఇఁక నంశమును గ్రహింపలేను. బ్రహ్మతనయుఁడనై ఖండఖండములను గ్రహింతునా? పూర్ణబ్రహ్మమా! రమ్ము! ఈహృదయము నిన్ను గ్రహించును. రానుంటివేని పూర్ణజ్ఞానమును, పూర్ణపుణ్యమును, పూర్ణప్రేమను, పూర్ణశక్తిని చేతఁ బట్టుకొని రమ్ము!! దీనునిఁకఁ గష్టపెట్టకుము. రెండుహస్తములను జాచెదను; అఖండ సచ్చిదానందపూర్ణభావమున హృదయములోనికి రమ్ము! అంశము కోరువారు అంశమును బొందుదురు; పూర్ణత్వముకోరువారు ఆజననిని పూర్ణభావమునఁ జూఁడగల్గుదురు. ఆంశికధర్మ మిఁకనుండకుండు గాతమని, సమస్తమును మిలనమై యేకమగుగాతమని సమస్తమానవ జాతికొఱకును బ్రార్థింతును. మేమెన్నఁడు నవవిధానమును మనసార నాలింగనముచేసికొందుము? సమస్తగుణములును కోటికోటి సూర్యులవలె హృదయమునఁ బ్రకాశితములగుఁగాక! చూచి మూర్ఛితుఁడనై పోదును! అనంతములో లీనమగుదును!! ఇఁకను జననిని ఖండఖండముగ గ్రహించి గంగాతీరమున నట్టెకూర్చుండి యుండను. పూర్ణబ్రహ్మ, పూర్ణబ్రహ్మ, పూర్ణబ్రహ్మ, పూర్ణబ్రహ్మ — ఈశబ్దము నుచ్చరించుచు నుచ్చరించుచు, బూర్ణత్వమును బొందుదును. పూర్ణతను బొందనియెడల ముక్తి కనఁబడుటలేదు. రూపమును జూచి ముగ్ధుఁడనైనపుడు, "వత్సా! గుణములో నేల ముగ్ధుఁడవుగా" వందువు. కేవలము నీగుణములనే భావించుచుంటినేని, "బాలుఁడు గుణముల

భావింపఁదగునా? రూపమునుజూచి ముగ్ధుఁడవుగాలేకపోతివా?" యందువు. దయామయీ! ఎల్లకాల మీవిధమున లాంఛనమునే పొందితిని; నీనికటమునకు వచ్చిననిన్నిమాఱ్లలో నాకమాటైనను ప్రశంసనుపొందలేదు. "తల్లీ! నీయాభరణములు మిక్కిలి యందముగ నున్న"వంటినా, "నాకట్టుచీర బాగుండలేదా?" యందువు. చీరను ప్రశంసించితినేని, ఆభరణముల నేల యనాదరణము చేయుదు' వందువు. "అమ్మా! నీన్యాయగుణ మెంతయాశ్చర్యకర"మంటిని. వెంటనే నీయసీమప్రేమస్వరూపమును జూపి "నాప్రేమంతయల్పమా?" యందువు. వివేకము నాదరించితినేని, "భక్తి యంత పాఱవేయవలసినదా?" యందువు. తల్లీ! నేనేమిచేయనో చెప్పుము. ఆంశిక సాధనలకు నిఁక ప్రాణము తృప్తి చెందదు. పూర్ణత యెట్లులభ్యమగునో చెప్పుము. మావలె నంశముతో సంతుష్టులెవ్వరో, వారి నొక్కమాఱు శోకింపనిమ్ము! పూర్ణవైకుంఠమెక్కడనో, మాకందఱకును జెప్పివేయుము!! ఓదయాసింధూ! ఓయిపరమేశ్వరా!! పూర్ణధర్మమును స్వీకరించి యభావమునంతను దూరీకృతముఁ జేసికొనునట్లును, పూర్ణపవిత్రత్వముయొక్క యానందములో మగ్నమగునట్లును దయయుంచి యాశీర్వదింపుము!!! దయామయీ! జననీ!! అనుగ్రహించి మాకీయాశీర్వాదము నిమ్ము!!!

త్రయోదశాధ్యాయము.

త్రివిధభావము.

భానువారము ౨౫ ఆగ్రహాయణము ౧౮౦౮ శకము.

సాధకుని జీవనధాతు వొక్కజాతిది కాదు; ఈ విషయ మల్పవివేచన మీఁదనే తెలియఁగలదు. ఇది సంయుక్తధాతువు; త్రివిధధాతువుల యొక్క మిశ్రణము దీనియందుఁ గనఁబడును. దీని నెట్లు తెలియఁగ నయ్యెనని ప్రశ్నించితి రేని నిజజీవనమును జక్కఁగఁ బరిశీలించినంతనే జీవనములో మూఁడు ధాతువులున్నవని గ్రహించితినని చెప్పనగును. వివేచన చేసి, భావత్రయము యొక్క మిశ్రణము నుండఁ జూచుకొని, జీవనారంభము చేసితిన నుటగాదు. అనేక దినములు జీవనప్రవాహము ప్రవహింపఁ దరువాత దృష్టి నిగుడ్చి చూచితిని; ఇది యొక జాతిది కాదని యపుడు సిద్ధాంతము చేసితిని. జీవనధాతువును బరీక్షించి చూచినపుడు ఏయే ధాతువులచే నిది సృష్టమయ్యెనో తెలియఁగంటిని. ఈ జీవనములో ముగ్వురు పురుషులున్నారు. మూఁడు ప్రకృతు లీ జీవనములో విరాజిల్లుచున్నవి. మూఁడు విధములైన స్వభావముల యొక్క సమన్వయమైనది; మూఁడు విధములైన ధాతువు లేకత్ర మిశ్రణ మయ్యెను. ఒకటి బాలకత్వము, ఒకటి యున్మాదము, ఇంకొకటి ప్రాజ్ఞభోక్తృతనము, — ఈ మూఁటి యొక్క ప్రకృతి విభిన్నమని యందఱును దెలిసియున్నదే. ఈ మూఁటి విషయమై తెలిసికొనవలె నన్న నధిక విచారణగాని, శాస్త్రపాఠము గాని చేయ నగత్యము లేదు.

మూఁటిస్వభావమును సులభముగనే గ్రహింపవచ్చును. మూఁడు స్వభావములను దమస్వభావములతో మిళితము చేసికొన్న వారలు ధన్యులు. మూఁడును మిళితమైన నాశ్చర్యకరముగు పవిత్రత్వమును. ముక్తియు నందనగును మూఁటిలో నొకటినిఁ బరిత్యజించిన స్వభావము అపూర్ణమగును. ముద్దినుసులను ఏకత్ర మిళితముగా వేసి ఉన్నతజీవనము, సౌఖ్యకరజీవనము, చక్రనివంశము, సౌఖ్యకర వంశము, ఘటిల్లవని యీశ్వరుఁడే వచించినట్లున్నది. ప్రతిసాధకుని యందు నీముచ్విధమైన సంబారము నిగూఢముగ మిళితమైపోయినది. సాధకుఁ డెంత సాధనఁజేయునో, అంత బాలకుఁడగును; ఎంత యుపాసన చేయునో యంతయున్మాదియగును; ఎంతన్పృశ్యగీతములలోఁ బడి స్వర్గసుఖము నాస్వాదించునో యంత త్రాగుఁబోతగును. ప్రథమావస్థలో సాధకునిజీవనమున బాలకత్వము, ఉన్మాదలక్షణము, త్రాగుఁబోతుస్వభావము, అల్పపరిమాణముగఁ గనఁబడును; సాధనలోఁ బరిపక్వమైనకొలఁదిని, ఈనానాగుణములును వృద్ధిఁ జెందును. బాలకునిస్వభావము సహజస్వభావము. ఈస్వభావమును సులభముగనే ఎఱుఁగనగును. బాలకస్వభావ ముబ్బనేని జనులు వృద్ధులలోఁ గలసియుండ ననమర్థులగుదురు. జీర్ణశీర్ణావస్థలు బాలకునకు ననాదరాభక్తిమూలకవిషయము లగును; బాలురతో నుండుటకే యిచ్ఛకలుగును. ఆటలమీఁదికే బుద్ధిపోవును. సరళత్వము సహజమగుచున్నదని, వృద్ధావస్థ, కుటిలత్వము ప్రవంచనము, కడు నప్రియముగుచున్నవని, మనస్సువిప్ప కోరికయగుచున్నదని, యెంతగ్రహింతునో, అంత నేను బాలకుఁడనైతినని కొందును. ఎంత వృద్ధుఁడనైపోదునో యంత మ్లానవదనుఁడనగుదును. బలమును, వీర్యమును, ఉద్యమమును వయోవృద్ధిలోఁగూడ నడువనడఁచితినేని

క్రమమున నిరుద్యమునిష్క్రియుఁడ నైపోదును; కార్యానుష్ఠానేచ్ఛ క్రమముగ నణఁగిపోవును. ఇట్లనుభవమైనకొలఁదిని బాలకుఁడను గాక వృద్ధుఁడనగుచుంటినని గ్రహింతును. కాని వయోవృద్ధితోఁగూడ బాల్యభావమే వృద్ధిగాయెనదని జీవనవేదపాఠమువలన నవగతుఁడ నైతిని. వయస్సు వృద్ధియగుచున్నదనుకొనను. అసత్యమూలకమైన గణితమునుబట్టి వృద్ధుఁడనైతినని చెప్పవలయునుగాని లోపల మాదేశపుగణితానుసారముగఁ జూచి క్రమముగ బాలకుఁడ నగుచున్నట్లును క్రమమున వయస్సు తగ్గుచున్నట్లును గనుచున్నాను. సరిగ నీమాటను మన్నింపక పోయినను, వయస్సు వృద్ధియగు చుంటలేదనియైనను, చివరకుఁ గొంచెము స్వీకరించుటుచితము. ప్రత్యూషసమయమున నాలుగుగంటలన్నరయైనపుడు, ఇంకొక రెండునిముషములతరువాతనే తెల్లవాఱినదనుకొందునా? ఒక్కనిమిషముతారతమ్యమునకు అంతఁగ నాలోచింతునా? ఏమాత్రమునుగాను. అయిదుకొట్టుటకు నైదు నిమిషములొకచోట, అయిదుకొట్టుటకు నెనిమిదినిమిషములు మఱియొకచోట; ఈవ్యవధానము నెక్కువగాఁ దలంతునా? ముప్పది, నలుఁబది, ఏఁబది, లేక యఱువది వత్సరములు పరలోకముయొక్క లక్షవత్సరములముందు ఒక్కక్షణమాత్రము. ఇఁక క్షణకాలమేపాటిదినిగాదు. బాలకునివయస్సు ఒకటిన్నర వత్సరము; నాలుగుదినములెక్కువైనఁ గావచ్చును; అంతమాత్రమున నేమైనది? ఒకటిన్నరవత్సరపుబాలకుఁడనే నేను. కోటివత్సరము లేకార్యాలయములోఁ బనిచేయవలసియున్నదో, అక్కడ నేనిపుడు సంపూర్ణబాలకుఁడనే. ప్రభవమున కిప్పుడేవచ్చితిని; మృత్యుచింత కింకను సమయమురాలేదు. నిజముగాఁజూచిన నాకజీవనములోని

యొకవత్సరముగాని, యొకశతాబ్దముగాని, గడియారముయొక్క యొకనిమేషమంత. ముప్పది దాఁటినవని, నలుఁబది దాఁటినవని యనుకొనుచు నస్థిరుఁడ నేల యగుదును? ఎనుఁబది వత్సరముల వృద్ధుఁ బోయెనని ఈ దేశమున నందురు. రెండువత్సరముల బాలకుఁడు వెళ్ళిపోయెనని మా దేశపులోకు లందురు. పసగత్తి పోయెనని ఈ దేశముననందురు; ప్రాఁకుచుఁ బ్రాఁకుచుఁ బోయెనని మా దేశముననందురు. జీర్ణకళేబరుఁడైనంతనే ఎవరును వృద్ధులుగారు; మనస్సరళత్వమే బాల్యకాలము. మనస్స్వర్గమే స్వర్గము. ఈశ్వరుఁడీ భావమునే రక్షించును గాక! ఇంక నీ బాల్యకాలమును సహచరులను బట్టియు నెఱుఁగనగును. వృద్ధసంగము నెప్పుడైన వెదకి యుంటినేని నేను మిథ్యావాదినని చెప్పవలయును. బాలక సహవాసమే నాకుఁ గావలయును. బాలకుని నేను చుంబనము చేయుదును; బాలకముఖముతో నా ముఖము నేకము చేయుదును. బాలకుఁడు నా మనోహరమగు పుష్పము; చూచిన స్వర్గము స్మరణకు వచ్చును. బాలకునిపదధూళిని గ్రహించుటకు నిచ్ఛయగును. బాలకులలోనుండుటకే కేవలము మనసిచ్ఛగించును. ఎంతమందివృద్ధులు శ్మశానాభిముఖులై పోవ యత్నించుచున్నారో వారినిఁ జూచిన నేమనితోఁచును? వీరు స్వయముగ యత్నించి వృద్ధులగుచున్నారని తోఁచును. జీవనవేదముయొక్క శ్రోత లెవరైననుండిరేని వినుఁడు. జనని నామంత్రితముచేయఁగఁ జేయఁగ బాలకభావము కలుగును. కేవలము రాజాధిరాజులపూజయే చేసితివేని వృద్ధుఁడవై పోవచ్చును మాతృపూజఁ జేయుటవలన నెన్నఁడును వృద్ధత్వము రాలేదు ఎన్నఁడును వృద్ధుఁడవుగావు. జననీక్రోడమందెన్నాళ్ళుందునో, జననియొక్క స్తన్యపానము నెన్నాళ్ళు చేయుదునో, అన్నాళ్ళును

క్రమమున నిరుద్యమునిష్క్రియుఁడ నైపోదును; కార్యానుష్ఠానేచ్ఛ క్రమముగ నణఁగిపోవును. ఇట్లనుభవమైనకొలఁదిని బాలకుఁడను గాక వృద్ధుఁడనగుచుంటినని గ్రహింతును. కాని వయోవృద్ధితోఁగూడ బాల్యభావమే వృద్ధియైనదని జీవనవేదపాఠమువలన నవగతుఁడ నైతిని. వయస్సు వృద్ధియగుచున్నదనుకొనను. అసత్యమూలకమైన గణితమునుబట్టి వృద్ధుఁడనైతినని చెప్పవలయునుగాని లోపల మాదేశపుగణితానుసారముగఁ జూచి క్రమముగ బాలకుఁడ నగుచున్నట్లును క్రమమున వయస్సు తగ్గుచున్నట్లును గనుచున్నాను. సరిగ నీమాటను మన్నింపక పోయినను, వయస్సు వృద్ధియగు చుంటలేదనియైనను, చివరకుఁ గొంచెము స్వీకరించుటుచితము. ప్రత్యూషసమయమున నాలుగుగంటలన్నరయైనపుడు, ఇంకొక రెండునిముషములతరువాతనే తెల్లవాఱినదనుకొందునా? ఒక్కనిమిషముతారతమ్యమునకు అంతఁగ నాలోచింతునా? ఏమాత్రమునుగాను. అయిదుకొట్టుటకు నైదు నిమిషములొకచోట, అయిదుకొట్టుటకు నేనిమిదినిమిషములు మఱియొకచోట; ఈవ్యవధానము నెక్కువగాఁ దలంతునా? ముప్పది, నలుఁబది, ఏఁబది, లేక యఱువది వత్సరములు పరలోకముయొక్క లక్షవత్సరములముందు ఒక్కక్షణమాత్రము. ఇఁక క్షణకాలమేపాటిదినిగాదు. బాలునివయస్సు ఒకటిన్నర వత్సరము; నాలుగుదినములెక్కువైనఁ గావచ్చును; అంతమాత్రమున నేమైనది? ఒకటిన్నరవత్సరపుబాలకుఁడనే నేను. కోటివత్సరము లేకార్యాలయములోఁ బనిచేయవలసియున్నదో, అక్కడ నేనిపుడు సంపూర్ణబాలకుఁడనే. భవమున కిప్పుడే వచ్చితిని; మృత్యుచింత కింకను సమయమురాలేదు. నిజముగాఁజూచిన నాకజీవనములోని

యొకవత్సరముగాని, యొకశతాబ్దముగాని, గడియారముయొక్క యొకనిమేషమంత నుప్పదిదాఁటినవని, నలుబదిదాటినవని యనుకొనుచు నస్థిరుఁడ నేల యగుదును? ఎనుబది వత్సరముల వృద్ధు పోయెనని ఈ దేశమున నందురు. రెండువత్సరముల బాలకుఁడు వెళ్ళిపోయెనని మా దేశపులోకు లందురు. పసిగత్తిపోయెనని ఈదేశముననందురు; ప్రాకుచుఁ బ్రాకుచుఁబోయెనని మా దేశముననందురు. జీర్ణకళేబరుఁడైనంతనే ఎవరును వృద్ధులుగారు; మనస్సరళత్వమే బాల్యకాలము. మనస్స్వర్గమే స్వర్గము. ఈశ్వరుఁ డీ భావమునే రక్షించును గాక! ఇంక నీ బాల్యకాలమును సహచరులను బట్టియు నెఱుఁగనగును. వృద్ధసంగము నెప్పుడైన పొదకి యుంటినేని నేను మిథ్యావాదినని చెప్పవలయును. బాలక సహవాసమే నాకుఁ గావలయును. బాలకుని నేను చుంబనము చేయుదును; బాలకముఖముతో నాముఖము నేకము చేయుదును. బాలకుఁడు నా మనోహరమగు పుష్పము; చూచిన స్వర్గము స్మరణకు వచ్చును. బాలకునిపదధూళిని గ్రహించుటకు నిచ్ఛయగును. బాలకులలోనుండుటకే కేవలము మనసిచ్ఛగించును. ఎంతమందివృద్ధులు శ్మశానాభిముఖులై పోవ యత్నించుచున్నారో వారినిఁజూచిన నేమనితోఁచును? వీరు స్వయముగ యత్నించి వృద్ధులగుచున్నారని తోఁచును. జీవనవేదముయొక్క శ్రోత లెవరైననుండిరేని వినుఁడు. జనని నామంత్రితముచేయుఁగఁ జేయఁగ బాలకభావము కలుగును. కేవలము రాజాధిరాజులపూజయే చేసితివేని వృద్ధుఁడవై పోవచ్చును. మాతృపూజఁ జేయుటవలన నెన్నఁడును వృద్ధత్వము రాలేదు; ఎన్నఁడును వృద్ధుఁడవు గావు. జననీక్రోడమందెన్నాళ్ళుందునో, జననియొక్క స్తన్యపానము నెన్నాళ్ళు చేయుదునో, అన్నాళ్ళును

బాలుఁడనుగానే యుందును; వృద్ధుఁడ నెఁకఁడగాను. పరలోకమునకు వెళ్లి విద్యాలయమునఁ జేరుదును; జననిని జననియని యాహ్వానము చేయవలయునను నీమంత్రమును, ఈశాస్త్రమును అక్కడఁగూడ శిక్షింతును. ఈ బాలకద్రవ్యము, లోననున్నది; ఉన్మాదద్రవ్యమును దానినంటియేయున్నది. ఉన్మాదితో నెవరికినిఁ గలయదు. పృథివికినుత్తరదిక్కు ఉన్మాదులకుదక్షిణదిక్కు. ఉన్మాదియొక్క సాహిత్యము, మనోవిజ్ఞానము, గణితము, అన్నియు నూతనము; సమస్తమును బృథివికి విపరీతము. సాంసారికులవలెనగుట సరిగాదు. ఇట్టియున్మాదివి కావలయును. పృథివి దేనిమూలమున నివన్నియు బుద్ధిగలవానికార్యములు కావనునో, క్రమముగ నట్టినానా కార్యములును జేయవలయును. విపరీతపుఁగార్యముల నన్నిటినిఁ జూచి లోకులున్మాదియని, ఛాందసుఁడని యుపహాసముచేయుదురు. ఉన్మాదిశాస్త్రము వేరు; పృథివియందలిలోకులు తద్వచనములువిని కేవలము నవ్వుదురు; మా దేశపుఁబ్రజలు అదిచదివినకొలఁదిని తృప్తిమంతులగుదురు. పృథివియొక్క లాభనష్టములను వివేచనచేసి యున్మాది యెన్నఁడును వ్యవహరింపఁడు. సహస్రవిషయములలో నష్టపుదిక్కునకే యున్మాది వెళ్ళును. లోకులు లోకమార్గమున వెళ్ళుదురు. ఉన్మాదులు ఆకాశమునఁ బోఁజూతురు. ఉన్మాదులు కేవలము భావముమీఁదనే గృహమునుగట్టుదురు. లోకులు కోటిరూప్యములు దొరకఁగనే ధనికులనుకొందురు. ఉన్మాదులు ఏమియులేకున్నను తాము ధనికులమనుకొందురు. ఉన్మాదినిఁ జూడఁగనే నవ్వువచ్చును. ఈ జీవనములోఁ గొంచెము చూచినవ్వఁగలిగిన విషయములుండునేని కృతార్థుఁడనగుదును. ఈజీవనములోని పరిహాసవిషయములను పృథివిచూచినది. ఆభావములన్నియు

జీవనము యొక్క సువర్ణభాగములు; ఉన్మాదవిపరీతభావములన్నియు లోహభాగములు. ఉన్మాదివలెఁ బృథివినెంతమఱతునో, అంత సౌఖ్యసంచారమగును. బుద్ధివిచారణ ఆరంభమైనట్లు చూడఁగనే, "అదిగో! పార్థివమానవుఁడనైతినా? ఎవరిదళ్ళములోఁ బడితి"నని భావింతును. కేవల లోకజ్ఞులతోఁ గూర్చుండిన మనస్సులో నెట్లోయుండును. లేవఁగలిగితినేని బ్రదుకుదునని తోఁచును. ఈపృథివియందలి చతురులు నడచుత్రోవను గన్నెత్తి చూచుటకైన భయమగును. ఏ నానాస్థానములలో వారు కూడుచుందురో ఆ నానాతుచ్ఛస్థానములకు వెళ్లఁగోరిక రాదు; కార్యానురోధమున వెళ్ళినను లేచిపోవ నిచ్ఛయగును. పిచ్చివానికిఁ బిచ్చివాఁడు కావలయును; చతురులకుఁ జతురుఁడు కావలయును. పిచ్చివానియొద్దఁ గూర్చుండియున్నంత సేపు వాఁడు వాగుచునేయున్నట్లు చూతువు. ఎవరు రేపటికొఱకై భావించుచుఁ గార్యములను జేయుచున్నారో పిచ్చివానికన్నులు వారివైపునకుఁ బోనిచ్చగింపవు. నేత్రములేదిక్కునకు వెళ్ళును? ఎక్కడఁ బిచ్చివాండ్రసభయో యక్కడికి; ఏదిక్కున నున్మాదాశ్రమమో యాదిక్కునకు. ఎక్కడ నున్మాదులు "ఈశ్వరా! ఈశ్వరా! హరి హరీ!" యని నృత్యము చేయుచున్నారో, పిచ్చివాఁడా దిక్కునకుఁ జూచును; అక్కడకే వెళ్ళఁగోరును. నాలోపల బాలకుఁడు నృత్యము చేసెను; ఈలాగుననే యున్మాదియును వానితో లోలోపల నృత్యముఁ జేసెను. పిచ్చితనము బాగుగఁ బరిపక్వమయ్యెను. బుద్ధిమంతునివలె నుపాసన చేసిన, నీశ్వరునిఁ జూచి యవహసించి, నవ్వితినాయని తోఁచును. బుద్ధిమంతునివలె శాస్త్రపాఠము చేసిన, "ఇదేమి? ఈశ్వరుని మోసపుచ్చవచ్చితినా రయే"యని తలపోయుదును. ఉన్మాదివలె నేదినముపాసన చేయుదునో,

ఉన్మాదివలె నేదినము చదువుదునో, ఉన్మాదివలె నేదినము నృత్యము చేయుటనో, ఏదినము కార్యములన్నియు నున్మత్తుని కార్యములవలె నగునో, ఆదినము మనమునఁ గడు నానందము గలుగును. రెండు ధాతువులు మిళనమయ్యెను. తృతీయ ధాతువు త్రాగుఁబోతు నాసక్తి. సంసారము యొక్క మత్తత పృథివియందున్నది. మన లక్షణములు దానికేల భేదముగానుండును? త్రాగుఁబోతైనఁ బరిమాణము నెక్కువ చేయవలయును; మేము నట్లే చేయుదుము. ఉపాసన ఐదు నిముషముల సేపుండెను; ఇపుడు అయిదు ఘంటలైనది; ఒక్కమాఱీశ్వరుని స్మరించి తృప్తిఁ జెందువాఁడను. ఇపుడు, ఈశ్వరా! ఈశ్వరా! ఈశ్వరా! ఈశ్వరా! యన్నయిపుడు తుష్టి గలుగును; అందువలనను గలుగదు. ఇంకను స్మరింప నిచ్ఛయగును. ఇదివఱకొక్కమాఱు చూడఁగనే యగునది. ఇపుడు చూచుచునే కూర్చుండవలయును. అప్పుడొక మాదిరి మద్యముతో సరిపోవునది. ఇపుడు వేడిఁసారాయిగాని చాలదు. త్రాగుఁబోతులకు నాధులైన శ్రీగౌరాంగక్రిస్తులిపుడు పూర్ణముగ త్రాగిపడినట్లు తోఁచుచున్నది. పృథివిమీఁద నట్టివారు లేరు; అట్టి విలువగల మద్యము నిక్కడ సాధారణముగ నగపడదు. హస్తములను జోడించుకొని ప్రార్థన చేయుదును గాని, అయినను ఇది యొక మాదిరిది. మఱి మోశాక్రిస్తులు చేయునది అదొక మాదిరిది. ఇదంతయు భావించుచు భావించుచునే జ్ఞానశూన్యుఁడనగుదును. కేవలము త్రాగుటకే జీవనము ఇష్టపడును. త్రాగుఁబోతునకింకేమి లక్షణములు? పరిమాణమును వృద్ధిఁజేయ నేవిధమున నిచ్ఛ యంకురించునో, హృదయమున నుత్సాహమెక్కువైనకొలఁదిని త్రాగుఁబోతులవలె సహవాసగాండ్ర సంఖ్య నెక్కువ చేయును

యత్నమగును. చెలికాండ్రు, ఎక్కువమంది కావలయును; దర్శము కావలయును; కీర్తనభూమిని విస్తృతముఁజేయవలయును. ఒక వేయిమందికి నీశ్వరవిషయమై చెప్పఁగలిగిన నిదివఱకు మనస్సు తృప్తిఁజెందునది; ఒక్కవేయిమందితోఁ గలసి కీర్తనఁజేసిన నిదివఱకు మనస్సు ఆనంద మొందునది. ఇప్పుడాఱువేలమంది దొరకినను మనస్సు తృప్తినొందదు. మనస్సింకను గోరును. హరి తనదర్శను నెప్పుడువృద్ధిచేయును ? స్వభావముగనే ఈయిచ్ఛయగును. దర్శములోఁ గ్రమముగ సంగడికాండ్రసంఖ్య. నెక్కువచేయ యత్నము చేయుదును. క్రమముగ నందఱును స్వర్గీయసుధారసపానము చేసినప్పుడే జీవనము సార్థకమయ్యెననితోఁచును. పూర్వపశ్చిమముల కెన్నాళ్ళొక్కమాఱుగాఁ బిచ్చియెత్తిగో స్వర్గీయసురాపానములో నందఱు నెన్నాళ్ళు మత్తులుగారో, అన్నాళ్ళు నీమానవునిరక్తవర్ణ నేత్రము లేమిచేసినను శాంతింపవు. ఒంటిగానున్నన్నాళ్ళు త్రాగుఁ బోతుతనము కలుగలేదు. ఏక వింశతిసహస్రజనులతోఁ ద్రాగుడు తనములోఁ బడ్డను, దృప్తికనుపింపలేదు. లక్షలక్షమందితోఁ, గోటి కోటిమందితోఁ గలసిఁ త్రాగఁగోరుచును. బాలకుఁడు బాలక దర్శమునుగోరును ; పిచ్చివాఁడు పిచ్చివాండ్రచెలిమి నభిలషించును ; త్రాగుఁబోతు త్రాగుఁబోతులకైయే చూచును. హరిలోఁ బిచ్చికొన్నవాండ్రు, హరిలోఁ ద్రాగుఁబోతులు ఎక్కడయని వెదకుచున్నాను. ఇంకను బాలుఁడనగుదును ; ఇంకను నున్మాది నగుదును; ఇంకను ద్రాగుఁబోతునగుదును. స్వదేశస్థు లెవరెక్కడ నున్నారో జాడలు తీయుదును. మూఁడుధాతువులయొక్క ముగ్గురి మనుష్యులను హృదయమున నుంచుకొందును; వరింతును. ఈమూఁడు భావములను శిరోధార్యరత్నములవలె బహుమూల్యముగలవని

గ్రహింతును. ఎన్నాళ్ళు బాలకత్వమున్నదో, ఉన్మాదమున్నదో, ప్రమత్తతయున్నదో అన్నాళ్ళును సౌఖ్యమును, పవిత్రత్వమును. ఏనాఁడు వృద్ధుఁడనగుదునో, పిచ్చితనమును వదలుదునో, ఉన్మాదావస్థ తిరోహితమగునో, ప్రమత్తత వదలిపోవునో, ఆనాఁడే మృత్యువు నాలింగనము చేసికొనవలయును. ఈమూఁటితోను ఎన్నఁడును విచ్ఛేదము కలుగకుండునట్లు భగవానుఁ డాశీర్వదించును గాక!

ఓదీనబంధూ! కరుణారసానంతసముద్రమా! నీక్రోడములో వెళ్ళి కూర్చుండఁగలిగిన నేమి సౌఖ్యముగనుండును. చాల వయస్సు ముదిరినదని, జ్ఞానము కలిగినదని, ధర్మము ననుష్ఠించితినని యనుకొన్న నపరాధమగును. "ఏమియుఁగాలేదు; తల్లియొడిలోనే యుందు" నను నీవిషయము నెంతమనస్సులో నుంచుకొందునో అంత సుఖముగ నుండును. గొప్పవాఁడనగుట యట్లుండఁగా, నీక్రోడమునుండి తమక్రోడములోనికిఁ దీసికొన నింకెవ్వరైనవచ్చిరేని భయమగును. వృద్ధునిఁ జూచిన నాకు భయము. "నేను జననికి భిన్నము నింకేమియు నెఱుఁగను" అను నీజ్ఞానము ముక్తిప్రదజ్ఞానము; సౌఖ్యప్రదజ్ఞానము. ఈజ్ఞానము వృద్ధియగుఁగాకనియే ప్రార్థన. తల్లీ కేవలము నీస్తనదుగ్ధములే త్రాగుదుఁగాక! పృథివిమీఁదికి రాఁగానే నేనన్నమును దినలేనుగదా! కఠినాహారమును నములలేనుగదా! వయసు రాలేదు: కాలూనినిల్చుండలేను. తల్లీ! నీక్రోడమందుండుదును. అఱుగనివస్తువులను దినలేను. దయామయీ! నీపూజను జేయుచుఁ జేయుచు నెంతస్తనదుగ్ధమును పానము చేసితినో, బాల్యావస్థలో నెంతసుఖము పొందితినో అంత నాలోఁ బిచ్చితనమును, త్రాగుడుతనమును వృద్ధికాసాగెను. తల్లియొక్క స్తనదుగ్ధమును పానము చేసినకొలఁదని, శిశువున

కుండుస్ఫూర్తి-హీనత కలుగుచున్నది. అందుచే నిందులో దుత్తూరమో సారాయియో యున్నదనుకొంటిని. తల్లీ! ఎన్ని మాటలు నీదుగ్ధమును బీల్చితినో, అన్ని మాటలును . తెలివితప్పినవాఁడనైతిని. తెల్లని చక్షువులతో నుపన్యాసమిచ్చుటకుఁబోయినఁ దప్పులుపడును. తెల్లని నేత్రములతో సాధనచేతును గాని అది సాగదు. మత్తెక్కిన నివన్నియు బాగుగనగును. దయామయీ! దయామయీ! యని పిల్వఁబిల్వ నీ స్తనదుగ్ధము నోటిలోనికి వచ్చును. దుత్తూరమువంటి దేదో నీవు పాలలోఁగలిపితివి ; అందుచేఁ ద్రాగి యున్మాదినగుదును. ఎంత పిచ్చివాఁగుడు వాఁగుదును! ఎంత త్రాగిపడిపోదును! తల్లీ! ఇందులో నేను సుఖముగనుందును. ఈపిచ్చితనము, త్రాగుడుతనము, మంచిది. పృథివియొక్క జ్ఞానిని కానిచ్చ లేదు. బాలకునిఁ జేసియుంపుము. వృద్ధుఁడ నెన్నఁడును గాకుందును గాక! తలమీఁది వెండ్రుకలు తెల్లనైన నష్టములేదు; ఆత్మకు మాత్రము వార్ధక్యము రాకుండును గాక! హరీ! ప్రభూ! బాలకుఁడైయుండు టెంత సౌఖ్యకరము! ప్రాణములోపల గోల యేమియు లేదు ; ఉపాసనాసమయమున శిశువువలె సహజ వచనములఁబలుక్కుదును. వంకరటింకరమార్గము లక్కఱలేదు ; కుటిలుఁడనైతినేని సుఖముకలుగదు. వృద్ధునివిషమును బాలకుని యంగములోఁ బ్రవేశింపనీకుము. అమ్మా! నీవు నన్నుఁ జేతులలోఁ బెట్టుకొని ఎగురవేయుము ; చెక్కిలిముద్దాడుము ; ఇంతియకోరిక. బ్రహ్మమందిరముయొక్క ప్రార్థననువినుము ; మమ్ముల నొడిలోనికిఁ దీసికొని యాదరింపుము. కృపామయీ! సర్వదా బాలకుఁడనై యుండునట్లును, ఉన్మాదియొక్కయుఁ ద్రాగుఁబోతుయొక్కయుఁ బ్రకృతిలో వసించునట్లును, గృపఁజేసి యాశీర్వదింపుము. ఏకొంచెము వార్ధక్యమును సంచయముచేసితినో దానినిఁ బరిత్యజించి బాలకుఁడ

నగుదునుగ్గాక ! దయామయీ ! నీధర్మరసమును పానముచేసి కడునున్మత్తావస్థను బొందుదునుగాక ! బాలకునివలె, నున్మాదవలెఁ నృత్యముచేయుదును. నృత్యముచేయుచుఁ జేయుచు స్వర్గములో, బ్రవేశింతునని యాశపడుచు, భక్తితో నీపాదపద్మములకుఁ బలుమాఱు నమస్కరింతును.

చతుర్దశాధ్యాయము.

జాతినిర్ణయము.

భానువారము 3 వ పౌష్యము ౧౭౦౮ శకము.

మానవమండలిని ధనికదరిద్రజాతులలోనికి విభజించినయెడల నన్ను నేనే శ్రేణిలోవాఁడ ననుకొందును? ఓయి! ఆత్మా! నీవేజాతివాఁడవు? ధనికవంశసంభూతుఁడవా? లేక దరిద్రవంశసంభూతుఁడవా? ధనవంతులకులములో జన్మగ్రహణముఁ జేసితివా, లేక దరిద్రజాతిలోఁ బరిగణితుఁడవా యని యీజీవనములో నీమాట ననేకమార్లు ఆత్మను జిజ్ఞాసచేయవలసివచ్చెను. దీనిమీమాంస జీవనవేదముయొక్క యొకవిశేషపరిచ్ఛేదము. ఆత్మ ఏజాతిలో జన్మించినది ఎఱుఁగనావశ్యకము. స్వభావమెట్టిదో, రుచులును అభిప్రాయములును ఏజాతివారివంటివో, కార్యప్రణాళి యెవరి ననుసరించియున్నదో, స్వభావముగ దీనినెఱుంగ నిచ్ఛయగును. నేనేజాతిమానవుఁడనో మునుముందే తెలిసికొననిచ్ఛయగును. విశేషానుసంధానమువలనను, బంచవింశతివత్సరములసూక్ష్మాలోచనవలనను, మనఃకామములను, అభిరుచులను తఱచితఱచిచూచుటవలనను, ఆత్మ దరిద్రజాతిదని సిద్ధాంతమగుచున్నది. శరీరముయొక్క రక్తము దుఃఖులరక్తము, శిరస్సులోని మస్తిష్కము దీనజాతిమస్తిష్కము. ఏకొలఁది దైనికాహారవ్యవహారము లున్నవో, ప్రచుర పరిమాణమున వానిలో దరిద్రతయే కన్పడును. అనుమానప్రమాణముమీఁద నీసిద్ధాంతము జేసితినేని అది మిథ్యయగును; వేదినుండి మహాపాపముఁ జేయుటయగును. మనస్సుయొక్క గభీరమైనరుచులనన్నిటిని ననేకవత్సరములనుండి

పర్యావేక్షణ చేసి సిద్ధాంతము చేసితిని; సత్యము సాక్షిగా నిందులో ననృతము లేదని, భ్రాంతి లేదని, అనుమానము లేదని చెప్పఁగలను. బహువిచారణలలోఁ బరీక్షితుఁడనై దీనుఁడనని యాత్మస్వభావమును దెల్పుచున్నాను. ఉచ్చకులోద్భవుఁడనైనను, నానాప్రకారములైన ధనసంపత్తులైశ్వర్యమును సూచించుచున్నను, మనోమధ్యమునఁ దదనురూపభావము కాన్పింపదు ధనమున్నదిగాని ధనముకొఱకైన ప్రయాసలేదు. ఉత్తమభోజ్యపదార్థములున్నవిగాని ఆహారస్పృహ లేదు. మనస్సునకు సామాన్యవస్తువులలోనే సంతోషము. మానమర్యాదలు నలుదిక్కులనున్నవిగాని మనస్సు వానిఁదలపెట్టదు. ఇరుదళములలోకులు వచ్చిన ధనికులనువదలి మనస్సు దరిద్రులను వెదకును; బీదలసహవాసములో మనస్సునకుఁ దృప్తియగును. ఇదంతయుఁజూచిన మనస్సెజాతిదో స్పష్టముగఁదేలుచున్నది. ఈపరీక్ష విచారకుని భ్రాంతిలోదింపలేదు; ఇందులోఁ దప్పు రావీలులేదు ఏలయనఁ బరీక్ష విశేషావస్థలోనైనది. హృదయము దీనమైనను, బాహ్యోపకరణములు ధనాఢ్యులవి. ఈయవస్థలో నాత్మను శీఘ్రముగనే పరీక్షింపవచ్చును. ధనికుల ప్రాసాదములో జన్మించక దరిద్రుల పర్ణకుటీరములో జన్మించియుంటినేని పరీక్షించుట కఠినమగునది. మనస్సులోపల ధనసంపదలయొక్క యుత్తేజముండిన నుండునది. బీదలపథమును కేవలమవసరముచేతనే పట్టువాఁడనేమో! బాహ్యమందున్న ధనికభావము, లోపలనున్నదిలేనిది చూడవలెను. మనస్సు ధనమును బరిత్యజించి, దారిద్ర్యమునన్వేషించునపుడు, దరిద్రత మనస్సుయొక్క స్వాభావికమనియు, మనస్సు దరిద్రజాతిదనియు గ్రహింపవలయును. ధనాఢ్యులగు పితృపితామహులవలనఁ బాలితుఁడ

నై బాహ్యసంపదలచే వేష్టితుఁడనైనప్పటికిని వయోవృద్ధితోఁగూడ మనస్సు స్వాభావికదైన్యపరిచయము నియ్యసాగెను. సామాన్యాహారములో మనస్సునకుఁ దృప్తికనిపించును; దైన్యసాధన దీనికిస్వభావసిద్ధము. దీనతను ,బహుకష్టముచే సాధింపనగత్యము కలుగుటలేదు; శాకాన్నములోనే నేనులోభిని. ఆసక్తియే పదార్థములో నైననున్న నయ్యది శాకము. ఈవిషయము నాజీవనములో నత్యపూర్వతత్త్వమును బ్రకాశము జేయును. దీనిచే నితరులకు మనోరంజనము గాకున్నను నాకిది యతిచమత్కారవిషయము. హృదయము స్వాభావికముగ శాకములో నెట్టితృప్తిఁ జెందునో, ఎట్టిసౌఖ్యమును, సౌలభ్యమును, బొందునో, మనస్సునకెట్టితృప్తియు, నానందము, నీసామాన్యవస్తువులోఁ గాన్పించునో, దానినిఁబట్టి ఈశ్వరునకు నామీఁద మిగులఁగరుణయున్నదని గ్రహించితిని. బాష్పీయశకటములోనెక్కి ఎక్కడికైనవెళ్ళవలసివచ్చిన, మూఁడవ తరగతినివదలి మొదటితరగతిలోనికిఁ బోవుటకు భయమగును. అనధికారకార్యములోనికి దిగుచున్నానేమోయని తోఁచును. ధనికుల రాజ్యములోనికిఁ బ్రవేశించుచున్నానేమోయని భయమగును. యావత్సమయమును భీతిల్లవలసివచ్చును; నానావిజాతీయ భావములలోను, వస్తువులలోను తృప్తియంతరించును; శాంతిరసమునకు భంగముకలుగును. ప్రథమశ్రేణినివదలి ద్వితీయశ్రేణిలోనికిని, ద్వితీయమును వదలి తృతీయశ్రేణిలోనికిని వెళ్ళుట స్వభావసిద్ధమని మనస్సొక్కనిమేషములో సిద్ధాంతముఁ జేయును. సిద్ధాంతములోఁ గాలవిళంబముచేయ వీలులేదు; సౌలభ్యమునకుఁగాను దుఃఖులును, దరిద్రులును నున్నస్థానమునకే మనస్సు వెళ్ళఁగోరును. తృతీయ శ్రేణినివదలి ప్రథమశ్రేణిలోనికివెళ్ళిన • నది కర్తవ్యానురోధమునఁ

గావచ్చును; కాని స్వభావమును జిజ్ఞాసచేసిన, "సుఖమక్కడనే; తృతీయశ్రేణి ఎట్లుద్వేగవిహీనమో, ప్రథమశ్రేణి యిటులనా" దని ప్రకాశించును. నేను ధనికులకొఱకుఁగాదనియు దరిద్రులకొఱకే సృష్టింపఁబడితిననియు నీయుక్తివలననే తెలియవచ్చును. ఎక్కడ దరిద్రులో యక్కడనే నాకుఁ జనవు; జీవనరక్షణ అక్కడనే. ఈ సకలదారిద్ర్యభావములను నేనాయాసపడి శిక్షింపలేదు. తమంతనే అన్నియుఁ జక్కఁగఁబ్రకాశించినవి. బాటను నడచిపోవలసిన దరిద్రులవలెనే పోటును. నగరకీర్తనములో దుఃఖులవలెఁ బోవలయు నని ఎవరుచెప్పిరి? ఈదుఃఖులలక్షణములను ఎవరియొద్ద నేర్చుకొంటిని? ధనికులు దీనినిఁజూచి ఏమందురని యాలోచింపలేదు. వార్తాపత్రికలలో పరిహాససూచకవచనములు బయలువెడలిన వెడలవచ్చుననియు, మానహానియైనఁ గావచ్చుననియుఁ దెలిసియు నిశ్చలచేసితినో చింతింపలేదు; అది చింతనీయవిషయమనియు ననుకొనలేదు. కాని పాదుకావిహీనుఁడనై నేనుమాత్రము సాగిపోతిని. ఓయీఆత్మా! నీకు శిక్షింపలేదు. అయినను దరిద్రతను శిక్షించితివి. కుటీరమందుంపలేదు, హృదయము స్వభావముగనే ధూళిమధ్యనుండి పోఁగోరెను. ఈ విషయమున నింకను అనేకోదాహరణముల నీయవచ్చును. పృథివి గ్రహించినను, గ్రహింపకపోయినను ఆత్మ దీనులయాత్మయని, మనస్సు దుఃఖుల మనస్సని, శరీరము దుఃఖదరిద్రుల శరీరమని, నేను జక్కఁగ గ్రహించితిని. సకలవిషయములలోను దీనదారిద్ర్యలక్షణములు ప్రకాశితములు. మహాధనికులతో సమానాసనముమీఁదఁ గూర్చుందునా? గొప్పవాండ్ర కరస్పర్శమును జేయుదునా? ఇవన్నియుఁ జేసినంత మాత్రముననే స్వభావము పోవునా? చండాలుఁడు బ్రాహ్మణస్పర్శచే బ్రాహ్మణుఁ డగునా? శాకాన్నభోజి

ఒక్కదినము సమ్రాజ్ఞిగృహమున భుజించినంతనే ధనికుఁడగునా ? స్వభావమేమిచేసినను పోదు. ఇందుచే దరిద్రులతోఁ గలసిమెలసియు నిరాపదగా నున్నాను. కావలసినంతజాతి వచ్చినది. ఎవరెవరీజాతియొక్కలక్షణయుక్తులో ఇంగితమువలన గ్రహించితిని ; ఇంగితమువలన నిరూపణచేసితిని. కాని యొకవిషయము నా శాస్త్రములో వ్రాయఁబడియున్నది. అదియును జెప్పుటుచితము. నిర్ధనులగుదీనులతోనే నేనున్నను, ఎవరు ఛిన్నవస్త్రధారులో, ఎవరు కడుబీదలో వారే ప్రాణబంధువులైనను, అల్పమున సంతసించు వారలెవరో వారే నాప్రాణసఖులైనను, నేనానూతన విషయమును శిక్షించితిని. ధనికుని ననహ్యతతోఁజూచి, దీనుని మన్నింపుమనియుఁ, బర్ణాక్రమశాలులను దృణీకరింపుమనియు, ధనికులకుఁ బరిత్రాణము లేదనియు, మానసంపదలు, గౌరవము, నెక్కడనో అక్కడ ధర్మము లేదనియు, కేవలము పర్ణకుటీరములోనే ధర్మము వసించుననియు నొకయుక్తి కలదు కాని యిక్కడిశాస్త్రములో నవవిధానమతమున ధనికులను దుఃఖులను సమానముగా మన్నింపుమని సిద్ధాంతమైనది. స్వర్గపథమున ధనికులు, దుఃఖులు, ఉభయులును పోవుచున్నారు. బాహ్యమందు ధనమున్న నష్టము లేదు; మనస్సు దుఃఖియైననే చాలును. బాహ్యమందు ధనమున్నదన్నంత మాత్రముననే ఎవ్వరైన స్వర్గమార్గమునఁ బోఁజాలరా ? దుఃఖులను దగ్గఱకుఁదీసికొనుము ; ధనికులనుగూడ దగ్గఱకుఁదీసికొనుము. పక్షపాతశూన్యుఁడవై ఇద్దఱకును బ్రీతినిఁజూపుము. ఇది నవవిధానము యొక్క నూతనవిషయము ; నూతనోపదేశము. ధర్మము రాజప్రాసాదములోను, పర్ణకుటీరమందును నున్నది. భక్తి నవాబును ప్రేమచేఁ గౌఁగిలించుకొనును ; సామాన్యచండాలునిఁ గూడఁ

ప్రేమాలింగనములోఁ బద్ధునిఁ జేయును. ప్రేమగలవానికి నరపతియెటులో దుఃఖియైనటులే. అతనిముందు 'ధనికుఁడు ధనికుఁడుగాఁడు; దరిద్రుఁడును దరిద్రుఁడుగాఁడు; అతఁడు మానవుఁడైనంతనే ప్రేమించును. ఇదియే నాహృదయములోఁ బ్రబలమయ్యెను. అగుటకును గారణమున్నది. నేను హీనస్వభావముతోను, దీన మనస్సుతోను, మాతృగర్భమునుండి జన్మించినప్పటికిని, నేను దైన్యుఁడననియు, హీనుఁడననియు, భూమిష్ఠుఁడనైనంతనే గ్రహించినను, నలుదిక్కులఁజూడఁగనే ధనికులమధ్యజన్మించితిననియు, మహా ప్రాసాదములో దాసదాసీజనులమధ్య మహైశ్వర్యములో వాసమనియు గ్రహించితిని. ఉత్తరమందును దక్షిణమందును గేవలైశ్వర్యక్రియాకలాపమునే చూచితిని. అంతర్బాహ్యములలో యుద్ధము కాసాగెను. చండాలునికుటీరమందు ఏలజన్మింపలేదని లోలోపల జిజ్ఞాసచేసితిని. దాసదాసీజనములులేనిచోట, నశ్వ శకటములులేనిచోట, నాకేలజన్మముకలుగలేదు? దుఃఖికి భగవానుఁడు ధనికులసంగమము నేలయిచ్చెను? బాల్యకాలములో భాగ్యవంతుల బాలురతోడను, యౌవనములో శ్రీమంతులయువజనులతోడను, ఏలతిరిగితిని? వయసుముదిరినపుడు ఉన్నతవిద్యాశిక్షార్థమై ఉచ్చ విద్యాలయమున కేల వెళ్ళవలసివచ్చెను? దానిలో గభీరార్థమున్నదని ఈశ్వరుఁడెఱుఁగును. అవన్నియు నేలజరగెనో అపుడు గ్రహింపఁ గలిగియుండలేదు. దీనజాతివాఁడనై, దీనులతోనుండియుంటినేని, దీనముగఁ బ్రవర్తించియుంటినేని, దీనులపక్షపాతినైయుండవచ్చును; ధనికులమస్తకములమీఁదఁ గుఠారాఘాతమును వేయఁగోరియుండ వచ్చును. దీనగృహమందుండిన నుదాసీనుఁడనగువాఁడనని ఎవరు చెప్పఁగలరు? ప్రాణేశ్వరుఁడు ధనికులగృహమందు జన్మమునిచ్చెను;

అంతఃకరణమందు ఘనీభూతమైన దైన్యమును, నేత్రములయందు లక్ష్మీమయసంసారప్రకాండమును ఉంచెను. బాహ్యమందైశ్వర్యమున్నను, నేత్రములను బంధించి నిర్ధనక్రియాకలాపమును చూడఁ గల్గితిని. ఈద్విజాతీయభావమధ్యమునందుండి సహస్రపర్యాయము లీశ్వరునకు నమస్కరించితిని. ధనికులపక్షపాతినైతిని; దుఃఖుల యొక్కయు పక్షపాతినైతిని. సకలప్రభేదములను మఱచితిని; వర్ణభేదజాతిభేదములను మఱచి యందఱకున్ ప్రేమనిచ్చితిని. ఇపుడు రెండుబాహువులను ప్రసారించి నవవిధానములోనికి ధనికులను దెచ్చుచున్నాను; పరివ్రాజకులును, సర్వత్యాగులును నగు దీనులను ఆలింగనముచే బంధించితెచ్చుచున్నాను. ఒకపార్శ్వమున ధనికులను విద్వాంసులను గూర్చుండఁబెట్టుచున్నాను; ఇంకొకవైపున దీనదుఃఖులకు నాసనమునిచ్చుచున్నాను. పండితులను దెచ్చుచున్నాను. అందఱునువిచ్చేసి ప్రేమాలింగనములను గ్రహించుచున్నారు; అందఱునువచ్చి నవవిధానాలయమును నిండించుచున్నారు. నేఁడెట్టి మహాదినము! నాభాగ్యముచే ద్విజాతీయస్వభావమును జూచితిని. ఉచ్చజాతియొక్కయు, నీచజాతియొక్కయు, విద్వజ్జాతియొక్కయు మూర్ఖజాతియొక్కయు, నీద్విజాతులయొక్క సంధిస్థలమున నాభాగ్యమున జన్మించితిని. ఇందుచేతనే, "ఓయిదయాళుఁడా! ధనికుఁడు ధనమున్నదన్నంతమాత్రముచే నిన్నుఁ బొందలేఁడా? పండితుఁడు సంస్కృతమభ్యసించెనని నీగృహమునకు రాఁజాలఁడా? ఎవరేమాత్రమువిద్యనార్జింపలేదో, వారిని నీవు వెళ్ళనడతువా?" యందును. ఈశ్వరబాహువు లందఱకొఱకును బ్రసారితమ్ములై యున్నవని నవవిధానము వక్కాణించును. దుఃఖివికమ్ము. కాని యాకర్షించి యందఱను నీశ్వరగృహమునకుఁదెమ్ము. అంతర

ముందేదీనజాతీయభావమున్నదో, దీనినుండి మహోపకారము కలిగినదని చెప్పఁగోరికయగుచున్నది. ఈదీనతాజలమునందు నహంకారాగ్నినిఁ జల్లార్పితిని; విద్యాధనములగౌరవమును నడువ నడచితిని. ఈజలములో శాంతినిఁబొందితిని. కర్తవ్యానురోధమున గొప్పవారియిండ్లకు వెళ్ళుదును; ధనికులయొద్దకు వెళ్ళుదును; ఆచారవ్యవహారములలో గొప్పకుటుంబములతో నాబద్ధుఁడనగుదును; అయినను, నేను హీనుఁడనని, చిరహీనుఁడనని, నీచుఁడనని, అతి నీచుఁడనని, ఎఱుఁగుదును. నేనుమాత్రముదీనుఁడనై, దుఃఖధనికుల కుభయులకును గౌరవమునుజూపితిని; ప్రేమలో నుభయుల నాలింగనముచేసికొంటిని. స్వయముగ దీనదరిద్రజాతివాఁడ నైయుంటిని; దీనివలననే సుఖమును శాంతియు; దీనాత్మలకే పరిత్రాణము.

ఓయిదీనబంధూ! ఓకరుణామయీ! పృథివియొక్క ఉచ్చపదమునుబొంది మనస్సెన్నిమాఱు లహంకారముతో గర్వితమగును! ధనమానములమధ్యనుండి హృదయ మెన్నిమాఱులు విచలితమగును! కాని, ఓదీనబంధూ! జన్మమునుండి, బాల్య కాలమునుండి, ఎవరిని దీనత్వములో స్థిరపఱచియుంతువో అహంకారము వారియొద్ద కెట్లురాఁగలదు? నేను దీనజాతి వాఁడనగుటచే దీనులదర్శములో నెంతలాభమునుబొందితిని! దీనులతోఁగలసి నగరకీర్తనములో నెంతమత్తుఁడనైతిని! అధిక ధనమానములమధ్యను బ్రచురఫలమునుబొందితిని. గొప్పజాతివాఁడ నైయుంటినేని మహాపాపమునుజేయువాఁడను. సామాన్య శాకాన్నములో నాసక్తిలేకుండెనేని, ఓయిదీనహీనగతీ! నిన్ను నేనెఱుఁగకుండువాఁడను; ఈదినము వేదిమీఁదఁ గూర్చుండువాఁడను

గాను. తనయుని ధనికులజాతిలోఁ జేర్చితినేని, వాఁడు ధనగర్వములోఁ బడి చచ్చిపోవుననియు, వానిని దీనజాతీయునిగాఁ జేయుటుచితమనియు నీవు గ్రహించితివి. ఓదయాసింధూ! మోసమువచ్చుననియెఱిఁగి అహంకారము, మృత్యువు, వినాశముచేయుననిచూచి, "తనయునకు దుఃఖమునన్నునిత్తును; బీదవానియాత్మనిత్తును; రుచులను దుఃఖుల రుచులవలెఁ జేసియిత్తు" నంటివి. దీనజాతివాఁడనై వచ్చినప్పటి నుండియు నెంతసుఖమునుబొందితిని. అన్నిటికినిఁగారణము నీదైన్యమునే కంటిని. దైన్యస్వభావము నాపక్షమున శాపముగాక యాశీర్వాదమయ్యెను. ఇన్ని విపత్తులు తలమీఁదనుండి దాఁటిపోయెనుగాని, దేనివలనను నేమియుఁగాలేదు. ఉచ్చపదములలోనికి నెంతయెక్కుచున్నాను! ఎట్టియున్నతలోకులకరస్పర్శమును జేయుచున్నాను! ధనముయొక్క యుష్ణత ననుభవింపఁగరాలేదు. బ్రాహ్మదశములో నాయొద్ద కెన్ని ప్రలోభనములువచ్చెనో, ఇన్ని యింకెవరియొద్దకును రాలేదు. ఇన్ని పరీక్షలింకెవరికినిఁ గలుగలేదు. నాసంసారములోనికి రాచ సంసారమువచ్చినది; గౌరవము మిక్కిలియెక్కిపోయినది; కాని నాకు జాతిపోలేదు. నీమీఁద బుద్ధియుంటచే ఝంఝామారుతములోను జావలేదు. నేనాచాఁపనే యల్లుచుంటఁబట్టియు, జాతీయభావమున నెల్లమునమ్ముకొనుచు బాటబాట తిరుగుచుంటఁబట్టియు, సామాన్యదీనసాంగత్యమునే వెదకుచుంటఁబట్టియు, బ్రతికి పోతిని; లేదేని ధనసంపదలమధ్యఁబడి చచ్చిపోవువాఁడను. నీవెవరినిబ్రతికింతువో, వాని నెవరును హతునిఁజేయలేరని గ్రహించితిని.

దైవమా! దీనత నావరితాత్రిత! ఇపుడు నీవద్దఁగూర్చుండి యాహ్వానముఁజేయుచున్నాను. ధనికులారా! రండని ధనికుల

నాహ్వానము చేయుచున్నాను. సోదరా! నీవునురమ్మని దరిద్రునిఁ బిలుచుచున్నాను. ధనికుల సంసారములోనుంటిని; ధనికులు నిమంత్రణముఁ జేయుదురు; అక్కడికి వెళ్ళుదును; గొప్పవాండ్రను ప్రేమింతును; రాణులను రాజులను ప్రేమింతును. మహారాజ్ఞికి భక్తిఁ జూపుదును. విద్వాంసులను గౌరవింతును. ఇపుడు ధనికులతోఁ గలసిమెలసి తిరిగినను భయమింకను లేదు. సిద్ధుఁడైన భయమింక నుండదు. ఓయి దీనబంధూ! ధర్మముయొక్క శాంతభావమును, దీనభావమును అందఱకు నిమ్ము! మేము యథార్థముగ దుఃఖులము. మానవవిధానము దుఃఖులవిధానము! మేము దుఃఖులవలె బాటవెంటఁ బోవుదుము; ధూళినై పోదుము. దంతమధ్యమునఁ దృణము నుంచుకొందుము; అపుడు చేతులు చాఁచి స్వర్గము నందుకొందుము. మేమందఱమును దీనాత్ములమై, పృథివిమీఁద నే పవిత్రస్వర్గీయ సుఖమున్నదో, దానినే యనుభవించి కృతార్థులమగునట్లు కృపఁ జేసి యాశీర్వదింపుము!!!

పంచదశాధ్యాయము.

శిష్యప్రకృతి.

భానువారము ౧౦ వ పౌష్యము ౧౮౦౪ శకము.

ఈపృథివి బ్రహ్మవిద్యాలయము. ఈవిద్యాలయములో నుండవలసినన్నాళ్ళును ధర్మోపార్జనమును, జ్ఞానచర్చను జేయుచు బ్రహ్మమును బొందుదును. ఇందువలననే నన్నెన్నఁడును శిక్షకుఁడ, ననుకొనియుండఁగలుగలేదు. నేనెన్నఁడును శిక్షకుఁడనని విశ్వసింపను. శిష్యుఁడనైవచ్చితిని; శిష్యజీవనమును ధారణముచేయుచున్నాను; అనంతకాలమును శిష్యుఁడనైయే యుందును. సిక్కుమతముయొక్క ప్రధానధర్మమగుశిక్షనందుట నాశోణితమందు నిహితమైయున్నది. ఆభావమునుండియే జీవనతరువు దినదినమును సబలమును, సతేజమును నగుచున్నది; శోణితమధ్యమున నాభావము దినదినమును ప్రబలమగుచున్నది. శిక్షనందితిని; శిక్షనందుచున్నాను. ఎల్లకాలమును శిక్షనందుదమని మిక్కిలి కోరికయున్నది. ప్రాతఃకాలమున, మధ్యాహ్నసమయమున, శిక్షింతును; విపత్సంపదలలో ధర్మగ్రంథముయొక్క నానాపరిచ్ఛేదముల నధ్యయనము చేయుదును. ప్రతిప్రాణియు, ప్రతివస్తువును నాకుగురువు. మానవప్రకృతియొద్ద నేననేకవిషయములను శిక్షింతును. నేత్రములను దెఱచిన విద్యాలయమును జూడఁగలను. నేత్రములనుమూసికొనిన నింకను మహత్తరమగువిద్యాలయ మగపడును. నాశిక్షార్థస్పృహకుఁ దగినటులే శిక్షణీయములు నపర్యాప్తములు. వివిధసత్యములును, బరిత్రాణప్రదమగుజ్ఞానమును నలుదిక్కులను విస్తృతమైయున్నవి. గ్రంథాభావము నాకెన్నఁడును గలుగలేదు; శిక్షించుట యేనాఁడైన

నాఁగిపోవుననివిశ్వసించియుండలేదు. శిక్షించుటయే నావ్యవసాయము;
శిక్షలోనే నాజీవనము; సుఖము శిక్షలోనే; పరిత్రాణమును
శిక్షలోనే. శిక్షించిశిక్షించి ఇంతసత్యధనమును పొందితినని శిక్ష
సమాప్తిచేయ వీలులేదు. ఇంకెంత ధనమును దెత్తునని
ఇపుడనిపించుచున్నది. శిక్షసమాప్తమైనదని నాకెన్నఁడును
అనిపించలేదు. ఎంతమంది గురువులయొద్ద సత్యమును శిక్షించుచున్నాను!
ఆకాశము గురువు, పక్షి గురువు, మత్స్యము గురువు, అందఱు
గురువులయొద్దను శిష్యత్వమును స్వీకరించుచున్నాను. ఇది
కర్తవ్యానురోధమునఁ జేసితిననుటగాదు. ధర్మానురోధముననుగాదు.
స్వభావము దీనికై యేర్పడినది. ఇందులోనే నాకు సౌఖ్యముకలుగును.
అమెరికాఖండమును ఆవిష్కరించినపుడు, ఆవిష్కర్తమనమున
నెంతసంతోషముపొడసూపియుండలేదు! ఏదోయొక చమత్కార
వస్తువును దర్శించినపుడు దర్శకునకెంతసౌఖ్యముకలుగదు! ధర్మ
సంబంధమునఁగాని లేక, నీతిసంబంధమునఁగాని ఏదోయొకనూతన
సత్యము లభ్యమైనపుడు నాకంతకంటె గభీరమైన యానందము
కలుగుననుకొనియెద. నాకానందమెప్పుడుకలుగును? నేనేదో యొక
సత్యమును బట్టుకొనఁగలిగినపుడు. నిజబుద్ధితో నేనెన్నఁడును
సత్యము నార్జించియుండలేదు. వివిధశాస్త్రములను మథించి
ఒకొక్కటిచొప్పున సిద్ధాంతముఁ జేయుట నావ్యవసాయముగాదు;
ఈశిక్ష నాదికాదు. ఘోరాంధకారమధ్యమున విద్యుత్ప్రకాశమెటులో
నాలో సత్యప్రకాశము నటులే. ఏదోవస్తువును గనుచున్నానో లేక
ఏదోపనిచేయుచున్నానో, లేక ఏచెట్టువైపునకైనఁ జూచుచున్నానో,
ఇట్టిసమయమున నకస్మాత్తుగా నెవరో నాయొద్దకు సత్యమును దెత్తురు.
మనసులోపలి కొకసత్యమువచ్చుటయు, వెంటనే హృదయము

విద్యుత్ప్రకాశమువలె జ్వలించిపోవును; సమస్తజీవనము నాలోడితమగును. ఒక్కొక సత్యము మనస్సునొక దెబ్బగొట్టుదు వచ్చుచుండును. ఇపుడు ప్రకాశమైన సత్యములను ఇతఃపూర్వమావిష్కృతములైన సత్యములతోఁ బోల్చిచూడఁగా నాసముదయమునుండి యివి నూతనమని కంటిని. నిత్యనూతనసత్యములు లభ్యమైనవి. లభ్యముకాఁగానే మనసులో సంతోషమును, శాంతియు నుదయించెను. ఆనందమయియగుజనని ఆధ్యాత్మరాజ్యములో భక్తుల కీవిధముననే సత్యదానము చేయునని హర్షోత్ఫుల్లహృదయముతోఁ జూచితిని. ఒకఁ సత్యము ప్రకాశితమైనట్లుగనే యది జీవనములో విశేషముగ నుపకారము చేయును. సత్యప్రకాశముచే, బుద్ధి చరితార్థమైనట్లుగనే జీవనము నీతిలో సుశోభితమగును. విశేషమిది; సత్యలాభముచే నాకుఁ బ్రభూతానందమగును. ఆనందముకలుగదేని ఎవరును శాస్త్రివ్యవసాయమును గ్రహింపరు. జ్ఞానలాభముతోఁ గృతార్థుఁడనై నేను శాస్త్రివ్యవసాయము నారంభించితినా? నిర్దిష్టపాఠములలోఁ బరీక్షోత్తీర్ణుఁడనై నేను సిద్ధుఁడనైతిననియు, అధ్యాపకుఁడనైతిననియుఁ జెప్పుదునా? గురువద్ద శిక్షింపవలసినది శిక్షించితినని యీసేవకుఁ డెన్నఁడు ననుకొనలేదు. బ్రహ్మవిద్యాలయములో నుపదేశము నిచ్చినపుడును నీభావము రాలేదు; బ్రహ్మమందిరముయొక్క నవ్యానిశస్థానమును బొందినతరువాత నేఁడును అట్లనిపించుటలేదు. "శిక్షించుట సమాప్తమైనది; ఇపుడు శిక్షఁగఁనుపవలయు" నను నీమాట ఎన్నఁడును మనసులోనికి రాలేదు. చదువుకొనునపుడును నీభావము కలుగలేదు; చదివించినపుడును బుట్టలేదు. నేను శిక్షించినపుడును శిష్యుఁడనే; శిక్షనిచ్చినపుడును శిష్యుఁడనై నలుగురితో సాధనఁజేసి తత్త్వసంచయము చేయుదును;

హృదయమధ్యమున సత్యరత్నము దొరకఁగనే ఆహ్లాదమగును. సౌభాగ్యవశమున మేదినిమీఁది కీవచ్చితిననియు, మనుష్యజీవనము సౌభాగ్యజీవనమనియుఁ దోఁచును. శిక్షఁజేసిన నెంతయానందమగునో ఇచ్చిన నంతయానందమగునా? సత్యలాభమపూర్వానందమునకుఁ గారణము. సత్యముతో నాత్మయొక్క సంబంధమొకటియున్నది. సత్యము దొరకఁగనే నేనొకనూతనజగత్తును జయించితిననియు అధ్యాత్మరాజ్యముయొక్క యొకమహాసంపత్తి నా హస్తగతమయినదనియుఁ దోఁచును. ఎవనికి రాగజ్ఞానమున్నదో అతఁడు తాంబుఱగాని, చితారుగాని, పుచ్చుకొని లేక, ఇంగ్లండుదేశముయొక్కగాని, భారతవర్షముయొక్కగాని ఏదేనిగానయంత్రమును బుచ్చుకొని స్వరానుగుణముగఁ బాడుచుఁ బాడుచు నొకనూతనరాగము నావిష్కరింపఁజేసెనేని అతని యానందమునకు మేరయుండదు. సురసజ్జనిహృదయములో నెట్టి యానందసంచారమగును! "నాగళద్వారమునుండి నూతనరాగము బహిర్గతమైనది! సరస్వతి నాయొద్ద కొకనూతనరాగమును బంపె" నని భావించుచు భావించుచు నావ్యక్తి ఆనందములో విహ్వలుఁడగును. నూతనరత్నములభ్యమైన స్వాభావికముగ హృదయమున నానందమాగదు. సామాన్యధీవరుఁడు నీటిలోఁ జేఁపలఁబట్టుచుండెను. అనుదినము నధ్యవసాయసహకారముతోఁ జేఁపలనుబట్టుచు నాపురాతనపుఁ "జేఁదుపక్కె" లను "బొచ్చె" లను ప్రాప్తించెనేని అతనిజీవనోపాయము జరగును; పరిశ్రమ సార్థకమగును. అంతకుఁదక్క నింకేసుఖమును గలుగదు. కాని యొక్కనాఁడు సోమవారముదయమున జాలమునువైచినట్లుగనే అపురాతనజాతి మత్స్యములకుఁబరివర్తనముగా నెన్నఁడునుగననట్టియు, విననట్టియు

నొకనూతనజాతిమత్స్యమును, జూచెనేని అతనియానందమునకు మితియుండదు. అతనిశరీరముయొక్క యొకవైపునుండి మఱియొక వైపునకు నానందము ప్రవహింపసాగును. చిత్రకారుడు శిక్షకునివద్దశిక్షించిన యాభావభంగులను, నాయాకారప్రకారములను లక్షణములను శిక్షించినట్లుగనే జెక్కుచుండును. కాని చిత్రము వ్రాయుచు వ్రాయుచు నుండగా నూతనవర్ణము బహిర్గతమైన, నొకనూతనభావమువ్యక్తమైన, నొకనూతన లక్షణము చిత్రమునం జిత్రితమైన, "నాసృష్టిధన్యుండగుం గాక ! పృథివి ధన్యమగుంగాక !" యనుచుం, దాను ధన్యుండ నన్నుకొనుచుం, జిత్రకారుండు నిజసౌభాగ్యమును దెలుపసాగును. "దేనినిశిక్షింపలేదో అదెట్లయ్యెను ? అదియెక్కడనుండిపుట్టె" నని భావించుచుం జిత్రకారుండు విస్మయాన్వితుండై కొయ్య బొమ్మవలె నిలువంబడిపోవును. చిరకాలమునుండి గ్రహ నక్షత్రములను జూచుచువచ్చుచున్న జ్యోతిర్విదుం డెప్పు డానందమును బొందును ? ఆపండితుండు, ఆవిజ్ఞానవిదుండు నభోమండలమును జూచుచుంజూచుచు నొకనూతననక్షత్రము నెపుడుకనిపెట్టునో అపుడు తనహృదయముయొక్క యతులానందమును ఘోషించుటకై యత్నించును. కోటిరూప్యములు దొరకినను మనుష్యున కట్టి యానందముకలుగదు ; సమ్రాట్టుయొక్క సింహాసనములభ్యమైన నట్టి యాహ్లాదము సంభవింపదు. "నేండు నేనాకాశమండలములో నూతననక్షత్రమును దర్శించితిని ; నేనొకనక్షత్రము నావిష్కరింపం గలిగితిని ; దీనివలననే నాకుం బరమసుఖ" మనుకొనును. నూతన నక్షత్రమును గనంగలుగుటచే జ్యోతిర్విదునకెంతయానందమో, నూతనసత్యములభ్యమైన నాలో నంతకంటెనధికసుఖమును

నానందమును గలుగును. ఎవరు ధనికులు కాఁగోరుచున్నారు ? నృపతి కావలయునని ఎవనికున్నది ! బ్రహ్మప్రసాదముచే నూతన సత్యము సమాగతమైన నపుడా సత్యమును దొరకొనుటలోనుండు సుఖ మింకెందునుండదు. శిష్యప్రకృతి విశిష్టుఁడనగుట చేతనే నేను ధన్యుఁడననుకొందును. విద్యాలయము యొక్క ఛాత్రవ్రతమును నాలో నింకనుగనుచున్నాను ; నాల్గు వేదముల నెన్నఁడును జదువుట కాలేదు. శిష్యత్వ మింకనంతరింపలేదు. హిమాలయప్రకాండము బ్రహ్మజ్ఞానము యొక్క మహత్వపరిచయము నిచ్చుచున్నది. జ్ఞానము నెంత శిక్షించినను సమాప్తము కాదనునుక్తి యొక్క నిదర్శనమును నలుదిక్కులఁ జూచుచున్నాను. జ్ఞానమునకు సమాప్తిలేదని సాధారణరూపమునను, విశేషరూపమునను, ఉభయరూపమునను, గనుచున్నాను. భక్తిసంబంధమునఁగాని, బ్రహ్మదర్శనసంబంధమునఁ గాని, శిక్షయొక్క యంతము కాలేదు. సమస్తశాస్త్రముల యొక్కయు సమన్వయమే ప్రకారముగ నగునను విషయమును గూర్చియు బ్రహ్మముఖమునుండి యెట్టి యాశ్చర్యపు సంగతులను వింటిని ! అప్పటికినిఁ బూర్తి కాలేదు. జాగ్రజ్జగద్గురు వెవరిగురువో వారిశిక్షకు నభావమేమి ? సామాన్యగురువువద్ద ఛాత్రుఁడనుగాలేను ; నా గురువు జగద్గురువు. ఆయన కేవలము శిక్షించుచున్నాఁడు. ఎంత శిక్ష చేయుదునో యంత యహంకారము చూర్ణమగును. నలుఁబది వత్సరములు గడచిపోయినవి ; అయినను శిక్ష యింకను బూర్తి కాలేదు. ఎన్ని ప్రార్థనాతత్త్వములను శిక్షించితిని ; అయినను శిక్షించుట అయిపోలేదు. దయాళుని నామము నెట్లు కీర్తింపవలయునో నేటికిని చక్కఁగ గ్రహించుటకాలేదు. ప్రేమయొక్క శబ్దార్థమేమో, ప్రేమయననేమో, నెఱుంగుట పరిసమాప్తి

కా లేదు. అందులకనియే నన్ను నేనొక్కఁడమాఱు గదుముకొందును. గదుముకొనినట్లుగనే సత్యమును శిక్షింతును. నేను ధన్యుఁడను. ఈవిధమున ననేక సత్యములను శిక్షించితిని. ధన్యుఁడను నేను; ఆవిధమున నింకను శిక్షించుచున్నాను. ఇంకను శిక్షకుఁడనుగా లేదు: శిక్షకుఁడనుగా లేదని యెల్లకాలము స్వార్థపరుఁడనై యుండనా? జ్ఞానమును సంపాదించుకొనినపుడు దాని నెవరికినీయకుందునా? కృపణునివలె సాధనము నంతలోఁజిరబద్ధమైయుండునా? "గ్రహణ మంత్రము" ను సాధనఁజేసితిని గాని "ప్రదానమంత్రము" ను నేనెన్నఁడును స్వీకరింపలేదు. "దానము" నా మూలమంత్రము గాదు. సత్యము రాఁగానే యది బహిర్గతమగును. ఇదియే స్వభావము యొక్క నియమము. మా దేశపులోకుల యొక్క స్వభావము సత్యము రాఁగానే ప్రకాశితముఁజేయునట్టిది. ఎవరు మా దేశమునుండి వచ్చిరో వారింటికి రెండుద్వారములున్నవి. ఒక ద్వారముగుండ దిగుమతి; ఇంకొక ద్వారముగుండ నెగుమతి. ఒక మార్గమునుండి వచ్చుట; మఱియొక మార్గమునుండి పోవుట. సత్యమే తెంచి జగత్తులోనికిఁ బ్రవహించును; జగత్తులో ద్విగుణమై లోపలఁ బ్రవేశించును, చతుర్గుణమై తిరిగి బహిర్గతమగును; శతగుణమై తిరిగివచ్చును. మనోమధ్యమునకు వచ్చిన వృద్ధియగును. వ్యయమైన నింకను వృద్ధిఁ జెందును. సత్యము లభ్యమైనపుడు మనసులో నానందము జన్మించును; సత్యము ప్రకాశించిన నానందమింకను నధికమగును. సత్యమును లభింపఁజేసికొనుటకే నా యాశయు, నాతురతయు. సత్యము నెట్లిత్తునని యొక్కమాఱును భావింపలేదు. నోరు తెఱచి యేమి చెప్పుదునని యెన్నఁడును జింతింపలేదు. ఎప్పుడు చెప్పవలసివచ్చునో సత్యము తనంతనే తేజములోఁ బ్రకాశితమగును. గురుత్వము సారము;

దాని నెన్నఁడును అవలంబింపలేదు; ప్రాఁతసంగతులను జెప్పలేదు. గతసంవత్సరమేమి చెప్పితినో ఈసంవత్సరము దానినే ఎన్నఁడును జెప్పను. ఇచ్చుటకు రాలేదని గ్రహింపఁగలిగితిని. శిక్షించుటకు వచ్చితిని; శిక్షితవిషయములు తమంతనే ప్రకాశితమగును. గతవత్సరమేమి చెప్పుటకైనదో, ఈవత్సరమును దానినే చెప్పితినేని, నిన్న నే ప్రార్థనఁ జేసితినో నేఁడును అదియే చేసితినేని, నిన్న నేయుపన్యాసము నిచ్చితినో యాయుపన్యాసమునే తిరిగియిచ్చితినేని, అసారమైన గురుత్వమును జేయుచున్నానని, కనుబొమ్మలను ద్రిప్పుచు నలుగురి మనస్సును హరింపయత్నము చేయుచున్నానేమోయని తోఁచును. పుష్కరిణి యెండిపోయినది గాఁబోలును; లోకులకు బురద నిచ్చుచున్నాను గాఁబోలును; బురదయు నిఁక లేనట్లున్నది; ఎండిపోయిన మన్నే కాన్పించుచున్నది. కాని, ఈమాట చెప్పఁగతి నాకుఁబట్టలేదు; ఈమనస్తాపము నానోటినుండి యుచ్చారితము కాలేదు. దీననాథుఁడు తక్కిన నాల్గువిషయములలోను ఎట్లుపకారముఁ జేసెనో ఈవిషయమునను అట్లేయుపకారమొనర్చెను. "ఏమియు లేదు. ఏమి చెప్పుదును? ఏమి వ్రాయుదును?" అని ఈచింతలో నేనాఁడును చింతకుఁడనుగా నవసరము రాలేదు. నిన్నటిదినము నీదినముగాఁ జేయనా? పురాతనేతిహాసమును వర్తమానముదిగఁ జేయనా? నమలిన దానిని దిరిగి నెమరువేయుదునా? ఛీ! ఛీ! నా గురు వీ మాటను వినిన నసంతుష్టుఁడగును. అందుచే నమలినవస్తువు నెన్నఁడును నెమరువేయ నవసరము రాలేదు; నాకు బురదలోఁబడి దొర్లవలసి రాలేదు; "ఏమియిచ్చితిని? ఏమి నేర్పితిని?" అనువైపునకు దృష్టిపోలేదు. ఏమి నేర్చితిననియే కేవలము చూతును. ఇందువల్లనే నేను బ్రతికిపోతిని. సద్విషయములను నలుగురికి వినిపించుచున్నానని యనిపించినతోడనే.

నాలుక ముద్దకట్టుకపోవును; వాక్యరోధమగును; మనశ్శరీరములు సంకోచముఁజెందును. నేనునేర్చినదే, నేర్పుటయైనది. నేనుబొందినదే, ఇంకఁబదిమంది పొందుటయైనది. నా శరీరమునుండి శ్రోతయొక్క శరీరములోనికి సత్యలాభముయొక్క బలమును, ప్రభావమును సంచారితమగును. నాయాత్మలోనికి సత్యమువచ్చినంతనే అది ఇతరులదగును; నాలో సత్యము ఘోషితమైన, నాసత్యము శంఖఘంటానహశారములతో సర్వత్ర నిశ్చయముగా ఘోషితమగును. నేనేదిశిక్షింతునో భారతవర్షము నదియేశిక్షించునని యామెవైపునకుఁ జూచి కనుగొంటిని. ఒకపక్షి సత్యమునుముక్కునఁగఱచుకొని, య్యందఱయిండ్లకును మోసికొనిపోయి, ఇచ్చివచ్చుచున్నట్లున్నది. నాహృదయ మంతఃప్రణాళిద్వారమున భాతృవరులహృదయముతో సంయుక్తము చేయఁబడినట్లున్నది. తన్మూలమున నాహృదయము యొక్క సత్యము సర్వత్ర సర్వహృదయములకును జేరుచున్నట్లున్నది. హాయనమున సూర్యజ్యోతి ప్రకాశితము కాఁగానే, ఆజ్యోతి అందఱను జ్యోతిష్మంతులను జేయును. ధనాఢ్యులప్రాసాదములో నెటులో, దరిద్రులకుటీరములోను నటులే సత్యముసంచరించుచున్నదని వినుచుందును. ధన్యుఁడుజగదీశ్వరుఁడు! ఒకనియొద్దకు సత్యము వెళ్ళి, ఆసత్యము దశసహస్రలోకులమనస్సులోఁ ప్రకాశితమగుచున్నది. మేము కేవలము సత్యమునుశిక్షింతుము; ఎల్లకాలమును శిక్షింతుముగాకనియే కోరిక! ఎట్టివానివద్దనైన శిక్షింపనిచ్ఛయగును. సామాన్యగాయకునిఁజూచిన నతనిపాదములపైఁబడి శిక్షింప నాకిష్టమగును. ఎవరైన బైరాగివచ్చిన లక్షరూప్యము లిరటికివచ్చిన వనుకొని ఆతనిసంగీతమునువిని యెంతనేర్చుకొందును! ఎవఁడైనను మాతనసందేశమును బట్టుకొనివచ్చెనేని ఏదోయొకవిధమున నతని

రియొద్దనుండి కొంచెమాదాయముఁ జేసికొనఁగలిగినఁ జాలు ననుకొందును. ఈజీవనములో నెవరైనను దగ్గఱకు వచ్చి యూరకుండఁగ వెళ్ళిపోలేదు. సాధుసంఘములోఁ గూర్చున్నంత మాత్రముననే గుణము నాకర్షింపఁగలుగునట్లు భగవానుఁడు హృదయమున శక్తి నిచ్చెను. సాధువు నాదగ్గఱ గాఁబోయినప్పుడు తనహృద్గుణములను బడవేసిపోయెనని చక్కఁగ గ్రహింపఁగలను. నేను కొంతయతనివలెనగుదును. నేను జన్మశిష్యుఁడను; జన్మమునుండి శిక్షించుచున్నాను; శిక్ష అయిపోలేదు. అంతఱయొద్దనుండి యెల్లకాలమును శిక్షింతును. సూకరాదపశువులవద్దనుండియు శిక్షనందుదును. శిక్షింపుచు శిక్షించుచుఁ బరలోకమునకుఁ బోదును.

ఓయిసద్గురూ! అనుగ్రహించి యీపృథివిమీఁదఁ జాలఁగ శిక్ష నిచ్చితివి; చాలఁ జూపించితివి. అన్నముఁ బెట్టి యెట్లు శరీరపోషణఁ జేయుచున్నావో, ఆత్మముఖములో నూతననూతనసత్యములను వేసి అట్లె యాత్మపోషణఁ జేయుచున్నావు; ఇందులకై ధన్యవాదముల నిత్తును. నాగోపనవిషయములను ఎట్లువ్యక్తము చేయుదును! ప్రకాశముగాఁ జెప్పలేకున్నానుగదా! నీవద్దఁ గూర్చుండి విశేష సుఖమును భోగించుచున్నాను. సత్యమును శిక్షించినకాలఁదిని ఎంతసుఖముగనున్నది! నూతనసత్యము లభ్యమైనప్పుడు హృదయము పిచ్చెక్కిపోవునంత యానందము కలుగును; పెగ్గఱగ నఱవ బుద్ధిపుట్టును; ప్రాణము తపతపలాడును. ఈనూతనవిషయ మెక్కడనుండివచ్చినది, ఎవరిచ్చిపోయిరనియే భావింతును. దైవమా! గురువవద్ద సత్యమును శిక్షించుట మహాసౌఖ్యప్రదము. నిరాశ్రయిశిశువునకు సుఖము నేయిచ్చుచున్నావు. తల్లీ! నిన్నువదలి యింకేగురుగృహమునకైనఁ బోయియుంటినా? విద్యాలయములోఁ జదివి శిక్షసమాప్తి చేయుట కెన్నఁడైనఁగోరితినా? వేదపాఠశాలలోఁ

జదువుకొని పండితుఁడనగుట కెన్నఁడైనఁ బ్రయాసపడితినా ? నాయాశలన్నియు నీచరణములందు ; నావిద్యాబుద్ధు లాపాదధూళియందు. నేనన్యజ్ఞానములో జ్ఞానినిఁగాలేదు ; అందుచే, తల్లీ! నీవు నాకు వేదవేదాంతములను, సాహిత్యేతిహాసములను, శిక్షించుచున్నావు. జనని యెవరికిసరస్వతియో వారిల్లు బ్రహ్మవిద్యాలయము. వారితల్లి యెన్నఁడును శిక్షింపమఱవదు. నీవు మమ్ము చిరశిక్షార్థులను జేసియుంపుము. మేము కేవలము శిక్షింతుము. సామాన్యలోకుల కింతయభిమానమేల ? అధ్యాపకులసంఖ్య ఇంతవృద్ధియగుచున్నదేల ? అందఱును శిక్షనీయఁగోరువారే కాని ఎవరును శిక్షనొందఁగోరరు. మనుష్యులకు సుమతినిమ్ము. శిక్షించిననే శిక్షనిచ్చుటయగును. ఇఁకను బ్రచారము చేయుటకు వెళ్ళనిచ్చలేదు ; సత్యమువచ్చినంతనే యది తనంతనే బహిర్గతమగును. సత్యము లభ్యమగుట సమాప్తమయ్యెనేని, ఇచ్చుటయు సమాప్తమగును. అనంతవేదములోఁ బండితునిఁజేసితివేని, శిక్షించుటయును సమాప్తము గాదు ; శిక్షనిచ్చుటయును సమాప్తముగాదని యపుడుచెప్పఁగలను. ఈజీవనములో సత్యముయొక్క యభావము నెన్నఁడు ననుభవింప వలసిరాలేదు. సత్యములు రాసులకొలఁది వచ్చుచున్నవి. అవశిష్ట జీవనమును నేర్చుచునేర్చుచునే వెళ్ళఁబుత్తును. శిష్యుఁడనై యెల్లకాలమును నీవేదవిద్యాలయములోఁ జదువుదును. నూతననూతన శతసహస్రవేదములను నీయాయుపానకమండలికి శిక్షింపుము. దంభనాశముఁజేసి యందఱ వినీతులఁజేయుము ; బ్రతికియున్నన్ని దినములు మేము శిష్యవ్రతమును సాధనచేయుచుందుము. ముక్తిప్రదమగు సకలసత్యములును లభింపఁగా జీవనమును సుశోభితముఁజేసికొందుము ; కృపఁజేసి మాకీయాశీర్వాదమునిమ్ము ! నీశ్రీచరణములయందు మాప్రార్థన ఇదియ !!!

షోడశాధ్యాయము.

అనృతఖండనము.

నా జీవనవేదమును బఠింపక, పరిచ్ఛేదసముదయముల నధ్యయనము 'చేయక కొందఱు కొందఱు అన్యాయపుమాటలనన్నియు వచించిరి. అందుచే వారీశ్వరునిముందును, మానవులముందును మిథ్యాకథనముచే నపరాధులైరి. అనేకమిథ్యావచనములను స్పష్టముగా నిర్ధారణచేయుటావశ్యకము. అందుచే నెవరు జీవనవేదముయొక్క విశేషతత్త్వమునెఱుఁగక సిద్ధాంతముచేసిరో, మఱియుఁ దద్ద్వారమున నేనమస్తానృతవచనములచే దోషులైరో, ఆ సిద్ధాంతములను, నాయనృతవచనములను నన్నిటిని ఖండించుట యావశ్యకము. మిథ్యాకథనదోషములో నెవరెవరుదోషులు? ఎవరెవరపరాధులు? ఈ పృథివియందు శ్రద్ధేయులును, భక్తిభాజనులు, నగునీశ్వరప్రేరితులైన మహాపురుషులతోడను, బుణ్యప్రవర్తకుఁడగు క్రీస్తుతోడను, ముక్తికిసహాయుఁడగు గౌరాంగునితోడను, నీనరకకీటకము నెవరు సమానునిఁ జేసిరో, ఈవేద వారిని మిథ్యావాదులనుటకు వెనుదీయదు. నేను వారితో సమానుఁడనా? ఈమాట కేవలమసారము. ఎవరిచరణరేణువులను మస్తకమందు ధరించుటకు నేనుదగనో, వారితో నేనుసమానుఁడనని యెంచుకొందునా? ఎవరిదగ్గఱఁగూర్చుండ నర్హత లేదో, సమస్తపృథివియు నెవరికిభక్తిఁజూపునో, ఎవరియొద్దనుండి యది పరిత్రాణోపాయము నందుకోననిదో, ఆయందఱుసాధువులవద్దకుఁ బాపునివలెఁ బరిత్రాణప్రార్థినైపోదును. 'కాని జీవులకుసహాయుఁడనై వారితోఁ గలసికూర్చుండుటకుమాత్రము యత్నింపను; ఏకాసనముమీఁద

గూర్చుండెను. ఎవరుక్రిందను గూర్చుండియున్నారో, ఎవరు వారిని దృష్టాంతముగ గ్రహించుచున్నారో, ఎవరు వారియుపదేశములను వినుచున్నారో, నేనిట్టివారిలో నంతర్భూతుఁడను. దీనిలోనే నా గౌరవము; నేను వారినామమునుచ్చరించి పవిత్రుఁడనై నృత్యము చేయఁగల్గిన నదియే నాకుసుఖమును శాంతియు. ఈవ్యక్తియొక్క చరిత్రము నిర్మలమనియు, పాపముకనఁబడదనియు, సాధువులలో నీవ్యక్తి శ్రేష్ఠుఁడనియు, నెవరువచించిరో వారి నీవ్యేది మిథ్యాకథనమున నపరాధులని తేల్చివేసినది. చాలపాపములుండినవనియు, భయానకములగుదోషకళంకము లాపాపమూలముతోఁగూడ నీజీవనము నాశ్రయించుకొనియుండినవనియు, నింకనుఁబోలేదనియు నీజీవన వేదములో స్పష్టముగఁజెప్పఁబడియున్నది. ఎవరుసాధువులో, ఎవరి నామముస్మరించిన జీవనము పవిత్రముగునో, నన్నెవరు నందులో వాఁడనుకొనకుందురుగాక! నలుగురును ఏప్రకారముగ గుప్త పాపముతో సంగ్రామముఁజేయుదురో నేను నట్లేయని యందఱును దెలిసికొందురుగాక! వారు తాము బాగుపడుటకై యెట్లు ప్రార్థింతురో నేనును దోషముచేతను, గుణముచేతను మిశ్రుఁడనై అట్లే ప్రార్థింతును. దోషములున్నను నితరులెట్లీశ్వరునివద్దనుండి సత్యమును గ్రహింతురో, లోకుల కుపదేశమునిచ్చుటకు సాహసులగుదురో, నేనును అట్లే సత్యమునులభ్యముచేసికొందును; ఉపదేశమిత్తును. ఆచార్యుఁడనైతినను దానికర్థము పాపవిముక్తుఁడనై యాచార్యుఁడనైతిననిగాదు; ఆచార్యుఁడనైతినను దానికి నర్థము నేను నిర్మలుఁడనైతిననియు, నిపుడితరులను నిర్మలులనుఁ జేయుట బ్రవృత్తుఁడనైతిననియుఁగాదు. నేనాచార్యుఁడనేలనైతిని? కొన్నిరత్నములు దొరికినందుచే వానినితరులకునిచ్చునిమిత్తమై.

కొన్ని భావములు లభ్యమైనతోడనే తక్కిననలుగురకుఁ దత్సముదయను నర్పింతును. పాపాశ్రితుఁడనైయుండఁగాఁ, బరహితసాధనార్థమై ఆచార్యాసనముపైఁగూర్చుండుట నాకులజ్జగా నుండును. నేను ఏకాంచెము నల్పాల్పముగా స్వర్గమునుండిపొందితినో, ఆకాంచెమునిచ్చుటకుఁ గృతసంకల్పుఁడనైతిని. కాని సాధు మహాపురుషులతో సమానుఁడనగుటకుఁ దగినవాఁడనుగాకున్నను, వారిచరణతలమంద్ధుఁగూర్చుండుటకు యోగ్యుఁడనుగాకున్నను, నిర్మలచరిత్రులగుసాధకులతోడను, పవిత్రచరిత్రులగు మహర్షులతోడను సమముగానుండుటకు నర్హుఁడనుగాకున్నను నేను వారియొక్క నామస్మరణముచే రిపుదమనవ్రితములో వ్రితి నైతిననియును, జ్ఞానమును, పుణ్యమును, శాంతియుఁ, ప్రేమయు యీశ్వరునియొద్దనుండి నాయొద్దకువచ్చుచున్నవనియును, దప్పక స్వీకరింపవలయును. ఈజీవనము ఆదేశమయముకాదని, ఈవ్యక్తి యీశ్వరదర్శనముచేయలేదని ఎవరువక్కాణించిరో వారును మిథ్యా వచనములనుబలికిరి. అడుగడుగునకు నీశ్వరదర్శనముఁ జేయుచున్నాను; ఆయనవాణిని వినుచున్నాను. ఇదిసత్యము. ఇదియే వేదవాక్కు. ఈప్రకారమగుటచేతనే నేను బ్రతికియున్నాను. ఈవ్యక్తి యయోగ్యుఁడైనను, ఒకమాఱుగాక, రెండుమాఱులుగాక, శతసహస్రపుమాఱులు: స్వర్గసుధాసిక్తవాణినివిని, జీవనమును బవిత్రముగను సౌఖ్యవంతముగను జేసికొనును. శతసహస్రపర్యాయములు దర్శనమునులభింపఁజేసికొనఁగా, జీవనము పవిత్రమును, దర్శనప్రత్యాసమును నగును. ఎవరీవచనమునుస్వీకరించిరో వారు సత్యమునుబలికిరి. ఈవ్యక్తియొక్కయీశ్వరదర్శనము భ్రాంతి యనియుఁ, గల్పనమనియు వాస్తవముగా నీవ్యక్తి యీశ్వరుని

దర్శింపలేదనియు, ఆయనవాణిని వినలేదనియు నెవరనిరో, పృథివి వారిని ఈదినముగాకున్న రేపైనను మిథ్యావాదులని సిద్ధాంతము చేయును. నేను బాహ్యవస్తువులనన్నిటిని యెట్లు చూచుచున్నానో, భగవానుని నిక్కముగ నట్లే చూచుచున్నాను. భగవానుఁడనుచు నెవనిపూజఁ జేయుదునో, బంధువనుచు నెవనిఁ బ్రేమింతునో, ఆయన వచనముల నెన్నిటి వినుచున్నాను! ఆహార పరిధానాదివ్యాపారము లెట్లు సహజమో, ఈయీశ్వరదర్శనమును, శ్రవణమును నట్లే సహజము. దీనిచే నీవ్యక్తి తక్కిన యందఱకంటె శ్రేష్ఠుఁడగుచున్నాఁడని నెవ్వరైననని రేని వారును మిథ్యావాదులే. నాదర్శనశ్రవణములను స్వీకరింపనివార లెట్లు మిథ్యావాదులో, ఈదర్శనశ్రవణములచే నేను సర్వశ్రేష్ఠుఁడనను వారును మిథ్యావాదులే. ఈశ్వరదర్శన మసాధారణపురుషత్వముయొక్క చిహ్నముకాదు; ఈశ్వరవాక్శ్రవణ మసామాన్యముగాదు. బాహ్యమునందలి నానాజడపదార్థములను జూచుటయెట్లో ఈశ్వరునిజూచుటయు నట్లే. ఆయన యెట్లు భావించునట్లు చేయునో యట్లు భావింతును; ఎట్లు చెప్పించునో అట్లే చెప్పుదును; ఎట్లు పరిచారము చేయుమనునో అట్లే పరిచారముఁ జేయుదును. ఆయనతోయోగము అతిసులభము. ఇంక నేదైన గూఢదర్శనమున్న నది నాకుఁ గాలేదు. జడవస్తువులను జూచునట్లే ఈశ్వరుని జూచితిని; బాహ్యశబ్దమును వినునట్లే ఈశ్వరవాణిని వింటిని. ఈవిషయములో నన్యులగుయోగులకును, భక్తులకును, నాకును భేదములేదు. ఎట్లు బాహ్యవస్తువులను సరిగఁ జూతునో, బాహ్యవాక్యములను సరిగ విందునో, విపరీతము కావీలు లేదో, ఇదియు నట్లే. ఈవ్యక్తి తక్కిననలుగురివలెనే స్వబుద్ధిమీఁద నాధారపడి, నానా విషయములను అనుసంధానము చేసి, చాల జ్ఞానమును లభింపఁ జేసికొని,

పిమ్మట కార్యములోనికిఁ బ్రవృత్తుఁ డగుననియు, లోకుల నాలోచన యడిగి కార్యారంభముఁ జేయుననియు నెవరైనను కొందురేని వారు మిథ్యలోఁ బడుదురు. ఈవ్యక్తి కొన్ని కొన్ని పదవులలో నీశ్వరునిచే నభిషిక్తుఁ డయ్యెననియు, నీశ్వరుఁడు స్వయముగా నీయన సమక్షమున సత్యమును బ్రకాశింపఁ జేయుచున్నాఁ డనియు, ఆయన స్వయముగా నీయన సంసారమును గడుపుచున్నాఁ డనియు, నెవ రెఱుఁగుదురో వారే యథార్థము నెఱుఁగుదురు; మఱి యథార్థము ననువచింతురు. ఈవ్యక్తి బుద్ధిబలముచే సకలధర్మ సమ్మేళనము చేయుచున్నాఁ డనియు, నీతఁడు భయానకాధ్యవసాయముచే హిమాలయమును గూడ స్థానాంతరితముఁ జేయఁగలఁ డనియు నెవ రపవాదములు వేసిరో వారు మిథ్యావాదులు. ఈవిధముగ నాజీవన సంబంధమున లోకు లెన్ని సిద్ధాంతములఁ జేసిరి! ఏవ్యక్తి పసిబాలునివలె విశ్వసించునో, మఱునటిదినమునకై భావింపఁడో, పరుల మంత్రణమును వినఁడో, పదిమంది నధ్యక్షులఁ జేసి నిజజీవనము నడపించుకొనుటకై విధుల స్వీకరింపఁడో, ఆకాశమువైపునకుఁ జూచునో, మఱియు నంధకారము నుండి యేసంకేతము వచ్చునో దానినే చేయునో, ఈవ్యక్తి యతఁడు. ఈయొక్కని జీవనములో నిరువదియైదు వత్సరములలో ననేకము లగు భయంకర సంకటములు తటస్థించినవి. ఈవ్యక్తి యీసముదయమును గేవలము పరాజయము నొందించుటయే కాక, జీవనము యొక్క యంతరమునుండి యాలోకనమును బొంది, ఇపుడు కఠినములగు విపత్తులముందు నిలుచుండుటకు సాహసియయ్యెను. ఈశ్వరుఁడు మనుష్యునే విధమున నడపుకొని వెళ్ళునో, ఈవ్యక్తి యందది అతి స్పష్టముగాఁ బ్రకాశితము. ఈత్రాడు పట్టుకొని యొకఁడు లాగుకొని వెళ్ళఁగా నింకొకఁడు ఈడ్వఁబడినవాఁ డగును; ఒకఁడు భావించును;

అందుచే నింకొకనికి భాషించు నవసరము లేదు. నా జీవన వేదముయొక్క నిగూఢ విషయము నెఱుఁగఁదలఁచితివేని, జీవన వేదమును జదువుము. ఈ వ్యక్తి తన జీవనార్థమై యే యుద్యోగమును జేయలేదు; ఏ వ్యవసాయము నారంభింపలేదు; మొదటినుండియు స్వయముగ నీశ్వరుఁడు నడపెను; ఈ దినమును నడపుకొని వెళ్లుచున్నాఁడు. ఎవరిది అలౌకిక పురుషత్వ చిహ్నమని నిర్దేశము చేయుదురో వారు మిథ్యావాదులు. నేనే విధమున నా జీవనము నీశ్వరుని చేతులలో సమర్పించుకొంటినో, యీ విధమున లక్షలకు భక్తులు, ఈశ్వర విశ్వాసులు ఈశ్వరుని హస్తములోఁ దమ జీవనములను వదలివేసికొనిరి. ఇది అలౌకికము గాదు. ఇట్టి జీవనము లనేక స్థానములఁ జూడనగును. పవిత్రాత్మయగు నీశ్వరుఁడు జీవనతరిని నడపును; ఇందులో నే సంశయమును లేదు. కావున మా యుపదేష్టి జీవనవేదములో నీ మాటను జెప్పఁబట్టి తన జీవన ముచ్చమైనదిగ నిర్దేశించెనని యనకుము. ఒకఁడు మూర్ఖుఁడును, నీచుఁడును గావచ్చును. అయిన నీశ్వరుఁడు దయామయియగు తల్లియై వానిని సత్యమార్గమున, సాంసారిక శ్రీసంపదల మార్గమున నడపును. మిథ్యావాదు లింకెవరు? ఏ వ్యక్తి నేను ధనికుఁడ ననియు, జ్ఞానిననియు, నిర్దేశించెనో ఆ వ్యక్తియు మిథ్యావాదియే. నేను ధనికుఁడను, మాన్యుఁడను, జ్ఞానిని అను జ్ఞానము నాకు లేదు. సత్యమును గౌరవించితివేని నన్ను ధనికుఁడుగా గణింప వీలు లేదు. నాకిల్లు తప్ప నొక్క దమ్మిడీయున్నదని చెప్పలేను. ఎవరైన నన్ను ధనికులలో నొకనిగ గణించియుండిరేని, అది భ్రాంతివశమునఁ జేసిరి; ఎఱుఁగక లోకులు నన్ను ధనికులలోఁ బరిగణింతురు. ఎవరు నా గూఢతత్త్వము నెఱుఁగుదురో, వారు తెల్లవాఱి

యుదయము నిశ్చయముగా నాకాహారము దొరకు నుపాయము లేదని యెఱుఁగుదురు. కాని స్వయమీశ్వరుఁడే యుపాయమై యున్నవాఁడు. నన్ను నేను ధనికుఁడనని యెట్లనుకొననో, అట్లే నిర్ధనుఁడననియు ననుకొనను. ఎవరు నన్ను దరిద్రులమధ్యఁ బరిగణింపఁ జూతురో వారును మిథ్యలోఁ బడుదురు. దరిద్రుఁ డెవఁడు? ఎవఁడు దుఃఖించునో వాఁడు దరిద్రుఁడు; వాఁడే దుఃఖి. దీనబంధువు నన్ను దళములోఁ బడవేయలేదు; నన్ను శ్రేణిలోని వానినిఁ జేయలేదు. ధనము లేకున్నను నెవనినైన ధనవంతుఁడవనఁగలుగుదువేని, ఆవ్యక్తిని నేను. పృథివి యందలి ధనమును నేను తుచ్ఛముగఁ జూతును. రేపటికై యుదాసీనుఁడనై, ఎవనియందు హృదయమును స్థిరముగ నుంతునో, నాకు ఆయనయే ధనము. నేనేల భావింతును? భావింపవలసినవాఁడు భావించును. ధనము నా భాండాగారమున నున్నది; గృహమున లేదు. తండ్రివద్ద నన్నియు నున్నవి; కేవలము ఆయన ఇచ్చుటయు నేను పుచ్చుకొనుటయు మాత్రము అవశిష్టము. ఎవరు బ్యాంకులోఁ జాలగ ధనము నుంచుకొని, తమ కుటుంబరక్షణార్థమై చాల సంపత్తిని గూడఁ బెట్టితిమనియు, భవిష్యద్దారిద్ర్యము నసంభవముఁ జేసితిమనియుఁ, బ్రతినెలయును జాలఁగ ధనము వచ్చుననియు ననుకొందురో వారు మిథ్యను మననముఁ జేయుచున్నారు. నా విద్యయును బృహద్విది కాదు. ఇక్కడి సామాన్యుఁడగు విద్వాంసుఁ డొకఁ డెఱిఁగినదానిని నే నెఱుఁగనని సత్యము సాక్షిగఁ జెప్పుచున్నాను. ఉన్న యల్పజ్ఞానమును విప్పి చెప్పఁగలిగినంత భాషాబోధమును నాకు లేదు. విద్యాలయములో సంపూర్ణ విద్యాశిక్ష కాలేదు. కృతవిద్యులతో నన్నుఁ దుల్యునిఁ జేసినది మిథ్యయని గ్రహింపవలయును. నాకు విద్యలేదు; దేనిని జ్ఞానమందురో అజ్ఞానము నాకు లేదు. ఏదియున్న విద్వాంసుఁడని తెలిపికొనవచ్చునో అది నాకు

లేదు. కాని జ్ఞానములో నాకౌదాసీన్యము లేదు. ఈశ్వర వాణిని నేనెఱుఁగననియు, నుపదేశము నీయలేననియుఁ గాదు. ఒక జ్ఞాని నా గృహమందుండును; నాదృష్టి ఆయనమీఁద నుండును. ఆ శాస్త్రి యొక్క శాస్త్రమును విని విద్యాసంబంధమున నా సమస్తాభావ మోచనముఁ జేసికొందును. లజ్జానివారణుఁడు నాలజ్జను నివారించెనేని చాలును. ఏవియున్న నుపదేశము నీయవచ్చునో హరి నానినన్నింటిని గూర్చును. ఇఁక మాన్యులవిషయమేమి? ఉచ్చపదస్థులు అనుగ్రహించి నాతో సల్లాపముఁ జేయుదురు. నాకేకొంచెము గౌరవము వచ్చినదో యది హరిగుణమువలన. నా గౌరవము హరిగుణమువలనఁ గలిగినది. పృథివియొక్క మాన్యతను నేను బొందలేదు; పొందను; కావునఁ బోఁగొట్టుకొందునను భయమును లేదు. పృథివిదగ్గఱ నేనెట్టి మాన్యతను బొందలేదు. బ్రహ్మసాధనము; బ్రహ్మయే నావిద్యయు జ్ఞానమును; బ్రహ్మయే నామానమును గౌరవమును. ఈవ్యక్తి విషయమున నెవరెవరు మిథ్యనువచించిరో, ఈవ్యక్తిజీవనమున కన్యాయార్థము నెవరు తీసిరో, ఇపుడు సులభముగనే తెలియఁబడును. ఈవ్యక్తిజీవన మెట్లు నడచెనో మా జీవనము నట్లే నడచుఁగాకని ఇపుడందఱకును దోఁచుటుచితము. నామూలమున నేదియుఁగా లేదు; హరిచరణములు గాక వేఱుధనము లేదు; హరిచరణములందుఁ గాక నింకెక్కడను జ్ఞానమును, శాంతియు దొరకవు. హరిచరణములే సర్వస్వమును. ఈజీవనవేదము యొక్క మూలతాత్పర్యమిదియ.

ఓయిదీనబంధూ! ఓయియాశ్రయదాతా! ఈజీవనము యొక్క యిరువదియైదువత్సరములును నీయొక్కసాక్షి. ఈజీవనము నిన్నే జగత్తునందరఁ బ్రకాశము చేయునుఁగాక! అపుడు నేను కృతార్థుఁడ నగుదును. నా జీవనములో నేనేమి చేసితిని? పాపమును జేసితిని.

నీవేమిచేసితివి ? సమస్తమును జేసితివి. సకలవిపత్తులనుండియు నుద్ధరించితివి. నాకు విద్యలేదు ; జ్ఞానములేదు ; కాని, నీవు నాకు ధర్మశాస్త్రమున కథలను చెప్పితివి. ఓయిదీనబంధూ ! ఇపుడొక్కొక్క భక్తునకు స్వయముగదర్శనమిచ్చి కృతార్థులఁజేయుము. నేను పాపమునువినాశముచేసికొన నుపయుక్తుఁడనుగాను ; కాని నీవు నాజీవనములో నేమిచేసితివో, చేయుచున్నావో, దానికిసాక్ష్యమిచ్చుటకు నేను సిద్ధుఁడనైయున్నాను. నాజీవనము బంగరు జీవనమైనది ! పరమేశ్వరా ! నాజీవనమును హిరణ్యముఁజేసితివి !! హృదయమును వజ్రపుందునుకను జేసితివి !!! ఇట్టిహీనున కింత యాధిక్యమునిచ్చితివా? నేను ఆదిని బిపీలికాగర్తమున నుండువాఁడను. ఒక్కొక్కమాఱుమాత్రము బయటికివచ్చి, ఒక్కొక్కతండులమును ముక్కునఁగఱచుకొని, తిరిగి లోపలఁబ్రవేశించువాఁడను. ఈదినము బ్రహ్మమందిరముయొక్క పవిత్రమగువేదిమీఁదఁ గూర్చుండఁజెట్టితివి. ఇట్లేలనైనది ? భగవానుఁడెవనినిసౌఖ్యవంతునిఁజేయునో యతఁడు సౌఖ్యవంతుఁడగును. నీ వెవనిని ధనికుని, మాన్యుని, జ్ఞానినిఁ జేయఁ బ్రతిజ్ఞచేయుదువో ఆతఁడుకృతార్థుఁడగును. ఈజీవనవేదమును జనులు పఠింతురుగాక ! ఆలోచనచేయుదురుగాక ! కానియది నాకు సుఖ్యాతి కలుగఁజేయుటకుఁగాదు. "పరమాత్ముఁడు పూర్వము భక్తులలో నెట్టి యలౌకికక్రియలను జూపువాఁడో, ఇపుడావిధముగ నిఁకఁజేయుటలేదు. ఇపుడీశ్వరుఁడు దూరమయ్యె" నని లోకులనుచున్నారు. ఓయిహరీ ! నాయావచ్ఛక్తిలో నీయనృతమును ఖండించి మడిపోదును. జనులీ క్షుద్రపాపియొక్క జీవనవేదమును బఠింతురుగాక! ఒక్కొక్కశబ్దము నాలోచనచేయుదురుగాక!! వారిమనస్సులలో నీమీఁదవిశ్వాసమును భక్తియు నుప్పొంగిపోవునుగాక!!! నీవు నాకు దబ్బుదగ్గానినిఁ

దెచ్చియిచ్చితివి! నీవేనాకు జ్ఞానమునిచ్చితివి!! నాకెంతనిచేసితివి! ఇపుడీప్రార్థనను సఫలముచేయుము. నేను వేదిమీఁదఁగూర్చుండుట, "ఈవ్యక్తి మందుఁడైయుండెను; ఇపుడెట్లయ్యెను! ఇతని కేమియునుండునది కాదు; ఇపుడెంతవృద్ధికివచ్చెను!" అని లోకులను కొనునట్లుచేయుటకై యుపయోగపడునుగాక! ఎక్కడనో పడియున్న నాజీవనతరి ఇప్పుడిదేఘట్టమునకువచ్చినది! ఇదుగో! వైకుంఠమునకు దగ్గఱదగ్గఱగవచ్చినది!! ఇపుడు నీవు నాచేనేమిపలికింతువో యదియే పలుకుదును; ఏమిచేయింతువో యదిచేయుదును. హరీ! నేనునీవాఁడను! నాజీవనవేదమునుజదివి లోకులు నిన్నుఁబ్రశంసింతురుగాక!! ఈజీవనవేదమునుజదివి పృథివి నీపాదపద్మములయందుఁ బ్రణమిల్లును గాక!!! నీప్రేమలోను, నీయెడలభక్తిలోను బ్రమత్తమగునుగాక!!!! కృపఁజేసి నీవిట్లాశీర్వదింపుము!!!!!

సంపూర్ణము.